www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

ఆదివారం | 7-12-2025 | పేజీలు: 14 + 28 పేజీల ఆదివారం అనుబంధం | వెల (Price) : Rs. 8.00 | సంపుటి (Volume) : 23 సంచిక (Issue) : 249 | శ్రీ విశ్వావసునామసంవత్సరం, దక్షిణాయనం, హేమంతఋతువు, మార్గశిరమాసం, బహుళపక్షం; తిథి: తదియ రా.6.25 తదుపరి చవితి; నక్షత్రం: పునర్వసు తె.4.12 తదుపరి పుష్యమి, వర్జ్యం: సా.5.12-6.40, దుర్ముహూర్తం: సా.4.08-4.52, అమృతఘడియలు: రా.2.00-3.28, రాహుకాలం: సా.4.30-6.00, సూర్యోదయం: 6.36, సూర్యాస్తమయం: 5.36 | వరంగల్

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



అమెరికాలో అగ్నిప్రమాదం..

తెలంగాణ విద్యార్థిని మృతి

అపార్ట్‌మెంటుకు మంటలు అంటుకొని మరణించిన ఉడుముల సహజారెడ్డి

ఎంఎస్ చదివేందుకు 4 ఏళ్ల క్రితం అమెరికాకు..

10

సైన్యానికి త్రీడీ బంకర్లు!

రూపొందించిన హైదరాబాద్ ఐఐటీ స్టార్టప్.. రోబోటిక్ హస్తంతో త్రీడీ ప్రింటింగ్

స్థానికంగా లభించే మెటీరియల్‌తో నిర్మాణం

14





తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సదస్సు మార్గంలో హోర్డింగ్‌లు; (ఇన్‌సెట్) సదస్సు ప్రాంతం విహంగ వీక్షణం

₹ 3,00,000 కోట్లు

తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్‌లో పెట్టుబడులకు 50 కంపెనీలు సిద్ధం

- రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టకపోతే నష్టపోతామన్న భావన పెట్టుబడిదారుల్లో కల్పించేలా సమ్మిట్ నిర్వహణ
- ఇప్పటికే 14 కంపెనీలు.. లక్ష కోట్ల పెట్టుబడులపై అవగాహన
- తాజాగా మరో 36 సంస్థలతో చర్చలు కొలిక్కి
- మొత్తంగా రూ.3 లక్షల కోట్ల వరకు పెట్టుబడులు చేరే చాన్స్
- భూ కేటాయింపులపై మాత్రం డీపీఆర్ ఇచ్చాకే నిర్ణయం
- ఒప్పందాల పూర్తి అనంతరం ఫోర్త్ సిటీ పరుగులు
- వెల్లువెత్తనున్న ఉద్యోగ, ఉపాధి అవకాశాలు!

సమ్మిట్ ప్రాంగణంలో తెలంగాణ తల్లి విగ్రహం

- ఏర్పాటు చేయాలని సీఎం రేవంత్ ఆదేశం
- సదస్సు ఏర్పాట్లను పరిశీలించిన ముఖ్యమంత్రి

13

కార్బన్ క్రెడిట్ వ్యాపారానికి ప్రభుత్వం విజన్ డాక్యుమెంట్

హైదరాబాద్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రైజింగ్ సమ్మిట్‌లో పారిశ్రామిక పెట్టుబడుల ఒప్పందాల విలువ రూ.3లక్షల కోట్లకు చేరింది. సుమారు 50 ప్రతిష్ఠాత్మక సంస్థలు, పలు రంగాల్లో ఈ మేరకు పెట్టుబడులు పెట్టేందుకు ఒప్పందాలు చేసుకోనున్నాయి. ఈ ఒప్పందాలకు సంబంధించిన ప్రకటనలన్నీ కూడా తెలంగాణ రైజింగ్ సమ్మిట్ సందర్భంగా వెలువడనున్నాయి. రైజింగ్ సమ్మిట్‌ను ప్రధానంగా తెలంగాణలో పెట్టుబడుల కోసం ఉన్న అపారమైన అవకాశాల గురించి కంపెనీల ప్రతినిధులకు వివరించేందుకు.. భవిష్యత్తు అభివృద్ధి, సంక్షేమ ప్రణాళిక విజన్ 2047ను ఆవిష్కరించే లక్ష్యాలతో ఏర్పాటుచేశారు. ఒకసారి ఇక్కడున్న అవకాశాలను

మిగతా 2వ పేజీలో...



13

అతిథులకు స్వాగతం పలకనున్న రోబో

500 ఎకరాల్లో సమ్మిట్!

- 2వేల మంది కూర్చునేలా ప్రారంభ వేదిక
- ప్యానల్ చర్చల కోసం 6 సెషన్ హాళ్లు
- సీఎం, ప్రముఖుల కోసం ఎంఐపీ హాల్
- వివిధ పథకాల ప్రదర్శనకు వీడియో టన్నెల్
- 10 వేల మంది పోలీసులతో భద్రత
- అడుగడుగునా సీసీ కెమెరాలతో నిఘా

ప్రపంచం దృష్టిని ఆకర్షించేలా..

- 44 దేశాల నుంచి ప్రతినిధుల రాక
- వివిధ అంశాలపై 27 సెషన్లలో చర్చలు
- రేపు సదస్సును ప్రారంభించనున్న గవర్నర్
- మీడియాతో ఉప ముఖ్యమంత్రి భట్టి

కేసీఆర్‌తో మంచి రోజులు కాదు..

ముంచే రోజులొస్తాయి



దేవరకొండ బహిరంగ సభలో సీఎం రేవంత్ అభివాదం. చిత్రంలో మంత్రులు ఉత్తమ్, కోమటిరెడ్డి, శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి

- తనకు కొడుకే గుదిబండ.. వాళ్లను ప్రజలు పట్టించుకోరు
- పేదలకు ఇళ్లివ్వకుండా సొంతానికి గడీలు కట్టుకున్నారు
- బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఎక్కడైనా సన్నబియ్యం ఇస్తున్నారా?
- సేవాలాల్ పుణ్యక్షేత్రంగా మద్దిమడుగు అభివృద్ధి చేస్తాం
- ఇందిరమ్మ చీర కట్టుకొని కాంగ్రెస్ పార్టీకి ఓటేయండి
- మహిళలకు దేవరకొండ సభలో సీఎం రేవంత్‌రెడ్డి పిలుపు
- మూడేళ్లే కాదు.. మరో ఐదేళ్లూ రేవంతే సీఎం: కోమటిరెడ్డి

నల్లగొండ, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక అనేక రంగాల్లో దేశంలోనే తెలంగాణను నంబర్ వన్‌గా నిలబెట్టామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించారు. వరి పండించడంలో, శాంతి భద్రతలలో, గంజాయి, డ్రగ్స్ నిర్మూలనలో, విద్య, వైద్యరంగాల్లో తెలంగాణ నంబర్ వన్‌గా నిలిచిందని చెప్పారు. తెలంగాణ మోడల్‌ను దేశానికే ఆదర్శంగా నిలబెడతామన్నారు. నల్లగొండ జిల్లా దేవరకొండలో ప్రజాపాలన ప్రజా విజయోత్సవాల్లో భాగంగా పలు అభివృద్ధి పనులకు ముఖ్యమంత్రి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో సీఎం మాట్లాడుతూ, పంచాయతీ ఎన్నికల్లో కాళ్లల్లో కట్టెలు పెట్టే వారిని కాకుండా ఎమ్మెల్యేతో, మంత్రులతో కలిసి గ్రామాలను అభివృద్ధి చేసుకునే వారిని గెలిపించుకోవాలని సూచించారు. మద్యానికి అమ్ముడుపోవద్దని సలహా ఇచ్చారు. ఇందిరమ్మ చీర

మిగతా 12వ పేజీలో...



ఢిల్లీలోని ఇందిరాగాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో ఇండిగో కౌంటర్ వద్ద ప్రయాణికుల పడిగాపులు

విమాన టికెట్ ధరలకు కళ్లెం!

- గరిష్ఠ ధరలపై నియంత్రణ విధించిన కేంద్రం
- 500 కి.మీ.లోపు 7,500; వెయ్యి కి.మీ. లోపు రూ.12వేలు
- ఇండిగో సంక్షోభం నేపథ్యంలో ఇతర సంస్థలు భారీగా చార్జీలు పెంచడంతో చర్యలు
- ప్రయాణికులకు రీఫండ్ ఇవ్వాలని ఇండిగోకు కేంద్రం ఆదేశం
- తాజాగా 800 ఇండిగో సర్వీసుల రద్దు.. రైళ్లకు పెరిగిన రద్దీ
- ఇండిగో సీఈవోకు డీజీసీఏ షోకాజ్ నోటీసుల జారీ

న్యూఢిల్లీ/హైదరాబాద్/బెంగళూరు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఇండిగో సంక్షోభం, వందలాది విమానాల రద్దుతో ఇతర విమానయాన సంస్థలు భారీగా చార్జీలు పెంచేయడంపై కేంద్ర ప్రభుత్వం స్పందించింది. ఎకానమీ తరగతిలో దేశీయ ప్రయాణాలకు దూరాన్ని బట్టి గరిష్ఠ చార్జీలపై నియంత్రణ విధించింది. భారీస్థాయిలో విమానాల రద్దు, ఒక్కసారిగా పెరిగిన చార్జీలతో పెద్ద సంఖ్యలో ప్రయాణికులు ఎక్కడికక్కడ చిక్కుకుపోయారని పేర్కొంది. ఈ క్రమంలో ప్రజా ప్రయోజనం కోసం చార్జీలపై నియంత్రణ నిర్ణయం తీసుకున్నట్టు

మిగతా 14వ పేజీలో...

బాధ్యులెవరో తేలుస్తాం

- కఠిన చర్యలు చేపడతాం
- ఇప్పటికే డీజీసీఏ దర్యాప్తు
- వారంలో నివేదిక
- రెండు సంస్థల ఆధిపత్యం కుదరదు
- 'ఆంధ్రజ్యోతి'తో పౌర విమానయాన మంత్రి రామ్మోహన్‌నాయుడు

14

కార్బన్ క్రెడిట్ వ్యాపారానికి స్వాగతం

విజన్ డాక్యుమెంట్‌లో ప్రభుత్వం ఫ్రేమ్ వర్క్

హైదరాబాద్, డిసెంబరు 6 (ఆంధ్ర జ్యోతి): ప్రపంచ దేశాలతో పోటీ పడతామని చెబుతున్న రాష్ట్రప్రభుత్వం.. భవిష్యత్తులో తెలంగాణ ఏ స్థాయిలో ఉండాలనే దానిపై రూపొందించిన విజన్ డాక్యుమెంట్-2047లో దేశం కూడా ఆలోచన చేయని అనేక అంశాలను పొందుపరిచింది. అందులో కార్బన్ క్రెడిట్ వ్యాపారాన్ని ప్రోత్సహించే దిశగా విధాన రూపకల్పన చేసింది. కార్బన్ క్రెడిట్లు, ఉద్గారాల వ్యాపారం (ఎమిషన్స్ ట్రేడింగ్) కోసం ప్రత్యేక ప్రణాళికను ప్రకటించింది. దాని ప్రకారం రాష్ట్రంలో స్టేట్ కార్బన్ మార్కెట్ ఫ్రేమ్ వర్క్‌ను అమలు చేయనుంది. తద్వారా తక్కువ కార్బన్ పెట్టుబడులను ప్రోత్సహించడం, కార్బన్ ఫైనాన్స్‌కు అవకాశాలు సృష్టించడంపై దృష్టి సారించింది. ఇంధనం, వ్యవసాయం, పరిశ్రమ, వ్యర్థాల నిర్వహణ విభాగాల్లో ఏర్పాటు చేసే ప్రాజెక్టుల రిజిస్ట్రేషన్ కోసం డిజిటల్ తెలంగాణ కార్బన్ రిజిస్ట్రీ(టీసీఆర్)ని నెలకొల్పనున్నట్లు తెలిపింది. ఈ రిజిస్ట్రీ వ్యవస్థ భారత దేశంలోని కార్బన్ క్యాప్చర్, ట్రాన్స్‌పోర్ట్ అండ్ స్టోరేజ్ (సీసీటీఎస్) విధానంతో, అంతర్జాతీయ కార్బన్ మార్కెట్లతో అనుసంధానమై పనిచేస్తుంది. రాష్ట్ర నెట్ జీరో కమిషన్ ఆధ్వర్యంలో కార్బన్ ప్రాజెక్టు ఫెసిలిటేషన్ సెంటర్(సీపీఎఫ్‌సి) ఏర్పాటు చేస్తారు. ఈ కేంద్రం ద్వారా ప్రాజెక్టుల ధ్రువీకరణ, నిర్వహణ, తనిఖీలు నిర్వహిస్తూ వాటి సామర్థ్యాలు పెంచేందుకు దోహదపడతారు. అంతేకాకుండా కార్బన్ ఆధారిత ప్రాజెక్టులను ప్రోత్సహించేందుకు, దీన్ని ఆదాయ వనరుగా మార్చుకునేవారి కోసం ప్రత్యేకంగా ప్రభుత్వమే స్టేట్ కార్బన్ క్రెడిట్ ఫండ్‌ను ఏర్పాటు చేసే ప్రణాళికలను ప్రతిపాదించింది. ముందుకొచ్చే ప్రాజెక్టులకు సీడ్ ఫండ్ కింద ప్రారంభ పెట్టుబడులను అందించనుంది. ఈ నిర్ణయం వల్ల కార్బన్ క్రెడిట్ వ్యాపారం రంగంలో తెలంగాణ ప్రపంచ దేశాల్లో ప్రత్యేక గుర్తింపును పొందే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు.

కార్బన్ క్రెడిట్ అంటే..

ఏదైనా కంపెనీ.. ఒక టన్ను కార్బన్ డై ఆక్సైడ్ (సీవో2) లేదా దానికి సమానమైన గ్రీన్ హౌస్ వాయువులను తగ్గించడం, ఎవరైనా ఒక ప్రాజెక్టు ద్వారా కాలుష్యాన్ని తగ్గిస్తే ఆ తగ్గింపునకు ప్రభుత్వం కార్బన్ క్రెడిట్ ఇస్తుంది. ఒక మునిసిపాలిటీ ఏడాదిలో 100 టన్నుల సీవో2 తగ్గిస్తే దానికి 100 కార్బన్ క్రెడిట్ దక్కుతుంది. దీనిని నగదుగా మార్చుకునే అవకాశాలుంటాయి. కాలుష్యాన్ని ఒకరు తగ్గిస్తే.. తగ్గించలేకపోయినవారు కాలుష్యాన్ని తగ్గించిన వారి నుంచి కార్బన్ క్రెడిట్లు కొనుగోలు చేయాల్సి ఉంటుంది. స్టీలు, సిమెంట్ పరిశ్రమలు కాలుష్యాన్ని పెంచితే.. సౌరవిద్యుత్తు, అడవుల పెంపకం, వ్యర్థాల రీసైక్లింగ్, బయోగ్యాస్ ప్లాంట్లు కాలుష్యాన్ని తగ్గించి కార్బన్ క్రెడిట్లు పొందవచ్చు.



మధ్యప్రదేశ్ సీఎం మోహన్ యాదవ్‌ను గ్లోబల్ సమ్మిట్‌కు ఆహ్వానిస్తున్న తుమ్మల

రాజకీయాలకతీతంగా అభివృద్ధిలో
భాగస్వాములు కావాలి

- గ్లోబల్ సమ్మిట్‌కు రండి
- కేంద్రమంత్రి బండి సంజయ్‌కి మంత్రి పొన్నం ఆహ్వానం
- మధ్యప్రదేశ్ సీఎంకు మంత్రి తుమ్మల.. హరియాణా, హిమాచల్ సీఎంలకు మంత్రి అడ్లూరి ఆహ్వానం

హైదరాబాద్, కరీంనగర్ అర్బన్, న్యూఢిల్లీ, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : రాజకీయాలకు అతీతంగా అన్ని పార్టీలు అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కోరారు. కరీంనగర్‌లో కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కి గ్లోబల్ సమ్మిట్ ఆహ్వాన పత్రికను శనివారం అందజేశారు. అనంతరం మంత్రి పొన్నం ప్రభాకర్ మీడియాతో మాట్లాడారు. తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్‌కి కేంద్రమంత్రి బండి సంజయ్‌ని ఆహ్వానించినట్లు చెప్పారు. కాగా తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ ఘన విజయం సాధించాలని పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ఆకాంక్షించారు. తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్‌కు తనను ఆహ్వానించినందుకు సీఎం రేవంత్ రెడ్డికి ఆమె కృతజ్ఞతలు తెలిపారు. అయితే గ్లోబల్ సమ్మిట్ నిర్వహిస్తున్న తేదీల్లో తనకు ముందుగానే నిర్ణయించిన జిల్లాల పర్యటనలు ఉండటం వల్ల కార్యక్రమానికి హాజరుకాలేకపోతున్నట్టు తెలిపారు. కాగా ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న "తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్"లో పాల్గొనాల్సిందిగా కోరుతూ మధ్యప్రదేశ్ సీఎం మోహన్ యాదవ్‌ను మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆహ్వానించారు. రాష్ట్ర ప్రభుత్వం తరఫున మధ్యప్రదేశ్ సీఎంను మంత్రి తుమ్మల శనివారం మర్యాదపూర్వకంగా కలిసి ఆహ్వానం అందజేశారు. ఈ సందర్భంగా తెలంగాణలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు, పెట్టుబడి అవకాశాలు, వివిధ రంగాల్లో సాధించిన పురోగతిని మంత్రి వివరించారు. తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్‌కు ఆహ్వానాల పరంపరలో భాగంగా మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ శనివారం హరియాణా, పంజాబ్ రాష్ట్రాల్లో పర్యటించారు. హరియాణా సీఎం నాయబ్‌సింగ్ సైనీని కలిసి సమ్మిట్‌కు రావాలని ఆహ్వాన పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా టీఎస్-ఐపాస్ ద్వారా వేగవంతమైన అనుమతులు, ఐటీ, ఫార్మా రంగాల్లో రాష్ట్రం సాధించిన పురోగతిపై చర్చించినట్లు మంత్రి ఒక ప్రకటనలో తెలిపారు. అనంతరం పంజాబ్ ఆర్థిక శాఖ మంత్రి హర్‌పాల్ సింగ్‌ను కలిసి ఆహ్వానం అందించారు. అలాగే గ్లోబల్ సమ్మిట్‌కు హాజరుకావాలని హిమాచల్‌ప్రదేశ్ సీఎం సుఖ్వీందర్ సింగ్ సుఖును కూడా మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ఆహ్వానించారు. శనివారం హిమాచల్‌ప్రదేశ్‌కు వెళ్లి సీఎం సుఖ్వీందర్‌సింగ్‌ను కలిశారు.

రూ.3లక్షల కోట్లు!

(మొదటి పేజీ తరువాయి)

చూశాక ఈ రోజు కాకున్నా భవిష్యత్తులోనైనా పెట్టుబడిదారులు వస్తారన్న భరోసాతో రాష్ట్ర ప్రభుత్వం, సీఎం రేవంత్‌రెడ్డి ఉన్నారు. ఇప్పటికిప్పుడు పెట్టుబడి ఒప్పందాలపై పెద్దగా దృష్టిపెట్టాల్సిన అవసరం లేదని, తెలంగాణలో పెట్టుబడులు పెట్టకపోతే నష్టపోతామన్న భావన పెట్టుబడిదారుల్లో కల్పించేలా మాత్రం సమ్మిట్ నిర్వహించాలన్నదే ప్రథమ లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ క్రమంలో కూడా అనేక కంపెనీలు, సంస్థలు, పారిశ్రామికవేత్తలతో పెట్టుబడులకు సంబంధించిన చర్చలు జరిగాయి. ఎన్నో కంపెనీలు పెట్టుబడులు పెట్టేందుకు ముందుకొచ్చాయి. తొలుత 14 కంపెనీలకు సంబంధించిన చర్చలు.. అవి పెట్టే పెట్టుబడులకు సంబంధించి ఒక అవగాహనకు వచ్చారు. ఇదే సుమారు రూ.లక్ష కోట్లు అయింది. ఆ తర్వాత మరో 36 కంపెనీలకు సంబంధించిన చర్చలను కూడా దాదాపుగా ఒక కొలిక్కి తెచ్చారు. వాటి ప్రతిపాదిత పెట్టుబడులను కూడా చేరిస్తే మొత్తంగా 3లక్షల కోట్ల వరకు ఉంటాయని రాష్ట్ర ప్రభుత్వ ముఖ్యులు తెలిపారు. టీసీఎస్-టీపీజీ హైపర్‌వాల్ట్ డేటా కేంద్రాలు, రిలయన్స్ గ్రూప్‌నకు చెందిన వంతారా వైల్డ్ లైఫ్ కన్జర్వేటరీ ప్రాజెక్టు, అజయ్‌దేవగన్ ఫిల్మ్ స్టూడియో, విన్‌గ్రూప్ (వియత్నాం) సమీకృత పారిశ్రామిక పార్కు, సింగపూర్‌కు చెందిన సెంబ్‌కార్ప్ సంస్థ పారిశ్రామిక పార్కు.. ఇలా అనేక సంస్థలు రాష్ట్రంలో తాము పెట్టనున్న పెట్టుబడులపై ప్రకటన చేయనున్నాయి.

వంతారాకు 200ఎకరాలు... సెంబ్‌కార్ప్‌కు 1000 ఎకరాలు

రిలయన్స్ సంస్థకు చెందిన వంతారా వన్యప్రాణి సంరక్షణ కేంద్రానికి 200ఎకరాలను ఫోర్త్‌సిటీలోని ముచ్చర్లలో కేటాయించనున్నారు. ఇక్కడ వన్యప్రాణి సంరక్షణ కేంద్రం వస్తే వెటర్నరీ వైద్యులు, సిబ్బంది, అనుబంధ ఉద్యోగులకు అవకాశం ఉంటుందని ప్రభుత్వం భావిస్తోంది. మరోవైపు సింగపూర్‌కు చెందిన సెంబ్‌కార్ప్ సంస్థ తమకు వెయ్యి ఎకరాలు కేటాయించాలని కోరింది. ఈ వెయ్యి ఎకరాల్లో అనేక కంపెనీలు పెట్టుబడులు పెట్టే బాధ్యత తీసుకుంటామని ప్రతిపాదించింది. వియత్నాంకు చెందిన విన్ గ్రూప్ కూడా తామే ఒక సమీకృత పారిశ్రామిక పార్కును ఏర్పాటుచేసి అందులో తమ కంపెనీతో పాటు ఇతర సంస్థలు, అనుబంధ సంస్థలను కూడా తీసుకొస్తామని చెప్పింది. ఇతర కంపెనీలు కూడా తమకు ఎంతెంత భూమి కావాలని ప్రాథమికంగా ప్రభుత్వాన్ని అడిగాయి.



గ్లోబల్ సమ్మిట్‌కు సిద్ధమైన వేదిక

డీపీఆర్ తర్వాతే భూ కేటాయింపులు

రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికిప్పుడు ఎవరికీ భూ కేటాయింపులపై స్పష్టంగా చెప్పడం లేదు. ఆయా కంపెనీలు తామేం చేయదల్చుకున్నాం అన్నదానిపై సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్) ఇచ్చిన తర్వాతే.. దాన్ని పూర్తిస్థాయిలో పరిశీలించాకే కేటాయింపులు చేయాలని భావిస్తోంది. ఇదే విషయాన్ని సీఎం రేవంత్‌రెడ్డి కూడా ఉన్నతాధికారులకు స్పష్టం చేసినట్లు తెలిసింది. ఏ కంపెనీల ఆర్థికస్థితిగతులేమిటి? అవి కల్పించే ఉద్యోగ, ఉపాధి అవకాశాలేమిటి? ఆ కంపెనీల అడుగుతున్న భూమి ఎంత? అంత భూమి వాస్తవంగా అవసరమా? అన్న వివరాలన్నింటినీ పరిశీలించిన తర్వాతే తదుపరి ప్రక్రియ ప్రారంభించాలని సీఎం నిర్దేశించారు.

లక్షల్లో ఉద్యోగాలు... ఆ లెక్క తేలేది డీపీఆర్ వచ్చాకే

మరోవైపు రైజింగ్ సమ్మిట్‌లో ప్రకటించే, అవగాహన ఒప్పందం చేసుకునే పెట్టుబడుల వల్ల పెద్దఎత్తున ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కూడా లభిస్తాయని ప్రభుత్వం అంచనా వేస్తోంది. లక్షల సంఖ్యలోనే ఈ ఉద్యోగ, ఉపాధి అవకాశాలు ఉంటాయని చెబుతోంది. అయితే కచ్చితంగా ఎన్ని అనేది ఆయా కంపెనీలు తమ డీపీఆర్‌లు సమర్పించినప్పుడే కచ్చితంగా తెలుస్తుందని ఒక అధికారి తెలిపారు.

భూకేటాయింపులు పూర్తయ్యాక పనుల్లో వేగం

రైజింగ్ సమ్మిట్ సందర్భంగా చేసుకుంటున్న ఎంవోయూలు, ప్రకటనలు కార్యరూపం దాలిస్తే.. ఇప్పటికి ఫోర్త్‌సిటీలో ఉన్న 13,500ఎకరాల భూమిలో చాలాభాగం కేటాయింపులు చేయాల్సి వస్తోందని ప్రభుత్వం అంచనా వేస్తోంది. డీపీఆర్‌ల పరిశీలన.. అనంతరం భూముల కేటాయింపు ప్రక్రియ పూర్తయ్యేందుకు సుమారు ఆరునెలల సమయం పట్టొచ్చునని అంచనా వేస్తోంది. మొత్తంగా చూసుకుంటే ఒక ఏడాదిలో ఈ కంపెనీలకు, అదే సమయంలో భవిష్యత్తులో వచ్చే మరిన్ని కంపెనీలకు కూడా భూ కేటాయింపులు పూర్తయితే.. ఫోర్త్‌సిటీలో పనులు వేగం పుంజుకుంటాయని ప్రభుత్వం చెప్తోంది. ఏడాది తర్వాత అక్కడ భవిష్యత్తు నగరం రూపుదిద్దుకునే ప్రక్రియ వేగంగా నడుస్తుందని అంచనా వేస్తోంది. ప్రస్తుతం అక్కడ మౌలిక సదుపాయాల కల్పనతో పాటు స్కిల్ వర్సిటీ నిర్మాణ పనులు, ఫోర్త్‌సిటీ కమిషనరేట్ కార్యాలయం పనులు జరుగుతున్నాయి. ఓఆర్ఆర్‌నుంచి ఫోర్త్‌సిటీ వరకు వేస్తున్న 330అడుగుల వెడల్పు ఉన్న రహదారికి పనులు ప్రారంభమయ్యాయి. ఓఆర్ఆర్ ఎగ్జిట్ 13...రావిర్యాల నుంచి ఫోర్త్ సిటీ వరకు 42 కి.మీ మేర వేయనున్న ఈ రోడ్డు పనులు వేగంగానే సాగుతున్నాయి. మరోవైపు ఫోర్త్‌సిటీలో అంతర్గతంగా వేయాల్సిన రోడ్లు, మౌలిక సదుపాయాల కల్పన కూడా ఏడాదిలోపు పూర్తవుతుందని, అప్పటికి కంపెనీలకు భూములు కూడా కేటాయింపు పూర్తయితే పనులు ముందుకు సాగుతాయని ప్రభుత్వం భావిస్తోంది.



మోదీ హయాంలో తెలంగాణకు 13 లక్షల కోట్లు

- గ్రామాల అభివృద్ధికి బీఆర్ఎస్, కాంగ్రెస్ వెచ్చించిన నిధుల లెక్కలు చెప్పాలి
- ఓట్ల కోసం వస్తున్న ఆ పార్టీ నాయకులను నిలదీయాలి: కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి



భువనగిరి టౌన్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ప్రధాని మోదీ 12 ఏళ్ల పాలనలో తెలంగాణకు కేంద్రం వివిధ అభివృద్ధి పనుల పేరిట రూ.13లక్షల కోట్లు వెచ్చించిందని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. జాతీయ రహదారులు, రైలు మార్గాలు, మెట్రో తదితర అభివృద్ధి పనులతో తెలంగాణ ముఖచిత్రం మారిందని చెప్పారు. శనివారం యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. గ్రామాల అభివృద్ధికి 12 ఏళ్ల పాలనలో బీఆర్ఎస్, కాంగ్రెస్‌లు వెచ్చించిన నిధుల లెక్కలు చెప్పాలని సవాల్ విసిరారు. ప్రధాని మోదీ కొన్నేళ్లుగా నిధులను నేరుగా పంచాయతీల ఖాతాల్లో జమ చేస్తున్నారని, దీంతో గ్రామాల్లో అభివృద్ధి జరుగుతోందన్నారు. దేశంలోనే అత్యధికంగా పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహించిన హీనచరిత్ర బీఆర్ఎస్, కాంగ్రెస్‌లదని ఆయన ఆరోపించారు. ఓట్ల కోసం వస్తున్న ఆ పార్టీ నాయకులను గ్రామస్తులు నిలదీయాలన్నారు. ఫిరాయింపులపై కోర్టుల ఆదేశాలు, విచారణ పేరిట రాష్ట్ర ప్రభుత్వాలు చేస్తున్న జాప్యంపై ప్రజాక్షేత్రంలో చర్చ జరగాలని చెప్పారు. బీబీనగర్ ఎయిమ్స్‌లో అభివృద్ధి పనులు తుది దశకు వచ్చాయని, మూడు నెలల్లో ప్రధాని మోదీ ఎయిమ్స్ సేవలను జాతికి అంకితం చేయనున్నారన్నారు. వరంగల్ రైల్వే కోచ్ ఫ్యాక్టరీ పనులు 60 శాతం, కొమురవెల్లి రైల్వేస్టేషన్ పనులు 80శాతం పూర్తయ్యాయని చెప్పారు. తెలంగాణను రెండు పార్టీలు కలిసి అప్పుల పాలు చేశాయని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం రెండేళ్లలో మహిళలకు ఉచిత ప్రయాణాలు మినహా ఏ ఒక్క ఎన్నికల హామీని నెరవేర్చలేదని చెప్పారు. కాగా దక్షిణాఫ్రికాలో కిడ్నాప్‌కు గురైన యాదాద్రి జిల్లా బండ సోమారం గ్రామానికి చెందిన ప్రవీణ్ కుటుంబ సభ్యులను భువనగిరిలో కిషన్‌రెడ్డి కలిసి మాట్లాడారు. విదేశాంగ శాఖకు వివరాలు పంపి క్షేమంగా రప్పిస్తానని హామీ ఇచ్చారు.

మాంజాతో మెడకు తీవ్ర గాయం!

- ఓ టెకీ బైక్ మీద వెళుతుండగా ఘటన
- తెగిన రక్తనాళాలు, శస్త్రచికిత్స చేసిన కామినేని వైద్యులు

హైదరాబాద్ సిటీ, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): గతంలో పలువురు ద్విచక్రవాహనదారుల ప్రాణాలు తీసిన మాంజా, తాజాగా మరో బైకర్ ప్రాణాల మీదకు తెచ్చింది. మెడ లోతుగా కోసుకుపోవడంతో బాధితుడికి కామినేని ఆస్పత్రి వైద్యులు శస్త్రచికిత్స చేసి ప్రాణాలు నిలబెట్టారు. ఆస్పత్రి వైద్యులు వివరాలు వెల్లడించారు. గుర్రంగూడకు చెందిన కార్తీక్ ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి.. ఇటీవల ఆయన కాబోయే భార్యతో కలిసి బైక్ మీద నాగోలు వైపు బయలుదేరారు. ఉన్నట్టుండి మెడకు ఏదో బిగుసుకున్నట్లు అనిపించడంతో ఆయన, హెల్మెట్‌లోంచే కుత్తిక వద్ద చేయిపెట్టి చూసుకుంటే తడిగా తగిలింది. రక్తం ధారగా వస్తుండటంతో కంగారుపడి బైక్ ఆపాడు. మెడకు మాంజా చుట్టుకోవడంతో బాధితుడి మెడ కండరాలు, రక్తనాళాలు తెగిపోయాయి. దారిన వెళుతున్న ఓ డాక్టర్ తన బైక్‌ను ఆపి.. ఆయన పరిస్థితిని చూసి వెంటనే కామినేని ఆస్పత్రికి తీసుకెళ్లారు. కార్తీక్‌కు ఆపరేషన్ నిర్వహించి తెగిపోయిన రక్తనాళాలను అతికించి, కండరాలకు కుట్లు వేశామని కన్సల్టెంట్ కార్డియోథొరాసిక్ వాస్క్యులర్ సర్జన్ డాక్టర్ రిషిత్ బత్తిని చెప్పారు.

ఆరు గ్యారెంటీలు గల్లంతు

- కాంగ్రెస్ ప్రజా వంచన పాలనకు రెండేళ్లు
- నేడు ఇందిరా పార్కు వద్ద నిరసన ధర్నా:రాంచందర్‌రావు

హైదరాబాద్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): గత ఎన్నికల ముందు కాంగ్రెస్ అర్భాటంగా ప్రకటించిన ఆరు గ్యారెంటీలు గల్లంతయ్యాయని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు అన్నారు. అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో అమలు చేస్తామన్న గ్యారెంటీలను.. రెండేళ్లు గడచినా ఎందుకు అమలు చేయలేకపోయారో ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. రెండేళ్లు గడచినా హామీలను నెరవేర్చని కాంగ్రెస్‌పై పోరుకు సిద్ధమయ్యామని ప్రకటించారు. నిరుద్యోగులు, రైతులు, మహిళలకు మద్దతుగా ఆదివారం ఇందిరాపార్కు వద్ద మహాధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ మోసపూరిత పాలనను ఎండగట్టేందుకు నిర్వహిస్తున్న ఈ మహాధర్నాకు పెద్ద సంఖ్యలో జనం తరలిరావాలని పిలుపునిచ్చారు. కాగా, మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడును రాంచందర్‌రావు శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు.

బీసీ రిజర్వేషన్లకు బీజేపీనే అడ్డు:మహేశ్‌గౌడ్

భువనగిరిటౌన్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను బీజేపీనే అడ్డుకుంటోందని టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్ మండిపడ్డారు. ఆ రిజర్వేషన్ల బిల్లును బీజేపీనే తొక్కిపట్టిందని, లక్ష్యం సాధించే వరకు కాంగ్రెస్ పోరాడుతూనే ఉంటుందని స్పష్టం చేశారు. బీసీ రిజర్వేషన్ల కోసం ఈశ్వరాచారి ఆత్మహత్య చేసుకోవడం బాధాకరమని, బీసీలు ఎవరూ ఆందోళనకు గురికావద్దన్నారు. యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి దర్శనానికి వెళ్తూ.. భువనగిరిలో ఆయన మాట్లాడారు. బీసీలు తొందరపడవద్దని కోరారు. ఎవరూ ప్రాణత్యాగాలు చేసుకోవద్దని, ప్రాణాలు అత్యంత విలువైనవని పేర్కొన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చామని చెప్పారు. రెండేళ్ల పాలనలో తెలంగాణ సాధించిన అభివృద్ధిని గ్లోబల్ సదస్సులో వెల్లడిస్తామన్నారు. కాగా, తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్‌తో పార్టీ శ్రేణులను, ప్రజా సంబంధిత, పార్టీ కార్యక్రమాలను సమన్వయం చేసేందుకు టీపీసీసీ ప్రధాన కార్యదర్శి కొప్పుల ప్రవీణ్‌కుమార్, టీపీసీసీ ఎన్నారై సెల్ కన్వీనర్ గంప వేణుగోపాల్‌ను పార్టీ ప్రతినిధులుగా నియమిస్తున్నట్లు మహేశ్ గౌడ్ ఓ ప్రకటనలో తెలిపారు.

విద్యార్థిని బడికి పంపాలని ఉపాధ్యాయుల ధర్నా

» విద్యార్థులతో కలిసి బాలుడి ఇంటి ఎదుట నిరసన

» కొత్తగూడెం జిల్లా దుమ్ముగూడెం మండలంలో ఘటన



దుమ్ముగూడెం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థిని సక్రమంగా బడికి పంపాలని కోరుతూ పాఠశాల టీచర్లు, విద్యార్థులు శనివారం బాలుడి ఇంటి ఎదుట ధర్నా చేశారు. ఈ ఘటన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దుమ్ముగూడెం మండలం సింగారం గ్రామపంచాయతీ పరిధిలోని నిమ్మలగూడెంలో శనివారం జరిగింది. గ్రామానికి చెందిన నక్క మనోవరుణ్ నిమ్మలగూడెం గిరిజన పరిషత్ ప్రాథమిక పాఠశాలలో నాలుగో తరగతి చదువుతున్నాడు. అతడు కొద్ది రోజులుగా పాఠశాలకు సరిగా రావడంలేదు. వచ్చినా, ఉపాధ్యాయుల కంట పడకుండా తిరిగి ఇంటికి వెళ్లిపోతున్నాడు. బాలుడిని సక్రమంగా బడికి పంపాలని టీచర్లు పలుమార్లు తల్లిదండ్రులకు సమాచారమిచ్చినా వారు స్పందించలేదు. దీంతో ఉపాధ్యాయులు విద్యార్థి ఇంటి ఎదుట విద్యార్థులతో కలిసి ధర్నా చేశారు. సోమవారం నుంచి తప్పనిసరిగా విద్యార్థిని బడికి పంపుతామని బాలుడి తల్లిదండ్రులు హామీ ఇవ్వడంతో నిరసన విరమించారు. ప్రతి చిన్నారి విద్యా హక్కును పరిరక్షించడం, ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను అందించడం తమ బాధ్యత అని, అది తెలియజేయడం కోసమే ఇలా చేశామని హెచ్ఎం రవి తెలిపారు.

'మీ సేవ'ల్లో రికార్డు స్థాయి రద్దీ

సర్పంచ్ ఎన్నికలతో సర్టిఫికెట్ల కోసం దరఖాస్తుల వెల్లువ

హైదరాబాద్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): సర్పంచ్ ఎన్నికల సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా మీ సేవ కేంద్రాలు రద్దీగా మారాయి. ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రాల (సర్టిఫికెట్ల) కోసం ఎప్పుడూ లేనంతగా పెద్దఎత్తున దరఖాస్తులు వచ్చాయి. గత రెండు వారాల్లో మీ సేవ కేంద్రాలు అత్యధిక దరఖాస్తులను స్వీకరించినట్లు అధికారిక గణాంకాలు వెల్లడించాయి. నవంబరు 24 నుంచి డిసెంబరు 5 వరకు మొత్తం 4,19,219 దరఖాసులను స్వీకరించాయి. వీటిలో 1,67,779 ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, 1,61,601 కుల ధ్రువీకరణ పత్రాల కోసం దరఖాస్తులు వచ్చాయి. భారీ రద్దీ ఉన్నప్పటికీ సేవల్లో పెద్దగా అంతరాయం కలగలేదని, కొన్ని కేంద్రాల్లో తలెత్తిన స్వల్ప సాంకేతిక సమస్యలను టెక్నికల్ టీములు వెంటనే పరిష్కరించాయని అధికారవర్గాలు పేర్కొన్నాయి.

సీఎం సీట్లో కూర్చున్నా బుద్ధి మారలేదు

» సమ్మిట్ పేరిట కొత్త స్కామ్‌లకు తెర : హరీశ్‌రావు



హైదరాబాద్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): సింహాసనంపై కూర్చున్నా సీఎం రేవంత్‌రెడ్డి తన పాత వైఖరిని మార్చుకోలేదని మాజీ మంత్రి హరీశ్‌రావు మండిపడ్డారు. ప్రజలు సమస్యలతో ఇబ్బంది పడుతుంటే, సీఎం మాత్రం ఫుట్‌బాల్ ఆడుతున్నారని ఎద్దేవా చేశారు. తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ పేరుతో ఎవరిని మభ్యపెడుతున్నారని, ఇందులో ఎన్ని కోట్ల స్కామ్‌కు ప్లాన్ చేశారు? ఎవరి వాటా ఎంత? అని నిలదీశారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయలేని చేతగాని సర్కార్ అని ఘాటుగా వ్యాఖ్యానించారు. బీఆర్ఎస్ హయాంలో ఒక్క రేషన్‌కార్డు ఇవ్వలేదనడం పచ్చి అబద్ధమని, తాము 6.47 లక్షల కొత్త రేషన్‌కార్డులిచ్చి బియ్యం కోటాను 6 కిలోలకు పెంచామని గుర్తుచేశారు. హోంగార్డుల వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా శుభాకాంక్షలు తెలిపిన సీఎం, వికృత చేష్టలతో వారిని తీవ్రంగా అవమానించారని మండిపడ్డారు. రెండేళ్ల నుంచి చనిపోయిన హోంగార్డుల కుంటుంబాలకు ఎక్స్‌గ్రేషియా అందించలేదని, కారుణ్య నియామకాలు చేపట్టలేదని ఆరోపించారు. ఈ మేరకు సీఎం తీరును శనివారం నాడు ఓ ప్రకటనలో హరీశ్‌రావు ఎండగట్టారు.

కొత్త లేబర్ కోడ్‌ల అమలు వద్దు: కేటీఆర్



హైదరాబాద్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన లేబర్ కోడ్‌లను రాష్ట్రంలో అమలు చేయవద్దని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. కార్మికులకు వ్యతిరేకంగా ఈ కోడ్‌లను అడ్డుకోవడానికి అసెంబ్లీ, మండలి సమావేశాలను స్తంభింపజేస్తామని చెప్పారు. శనివారం తెలంగాణ భవన్‌లో కార్మిక సంఘాలతో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో కేటీఆర్ పాల్గొని మాట్లాడారు. లేబర్ కోడ్‌లపై పార్లమెంట్‌లో కంటే ఈ రౌండ్‌టేబుల్ సమావేశంలోనే మరింత చర్చ జరిగిందన్నారు. దేశంలో పెరుగుతున్న కార్పొరేట్ ఏకాధిపత్యం వల్ల ఎలాంటి అనర్థాలు జరుగుతాయో ఇండిగో విమానయాన సంస్థ సంక్షోభం ప్రత్యేక ఉదాహరణ అని పేర్కొన్నారు. శ్రమ దోపిడీ వల్లే ఐదు రోజుల్లో వెయ్యి విమానాలు రద్దయ్యాయని, విమానాశ్రయాలు బస్ స్టేషన్లను తలపించాయన్నారు. కాగా, శనివారం అంబేడ్కర్ వర్ధంతిని పురస్కరించుకుని ఆయనకు కేటీఆర్ ఘనంగా నివాళులర్పించారు.

వెంకట్‌రెడ్డిది ఆదినుంచి అవినీతి బాటే?!

» హనుమకొండ, హైదరాబాద్‌లో ఏసీబీ సోదాలు

» ఆధారాల్లేని రూ.30 లక్షల నగదు జప్తు



వరంగల్ క్రైం/ సుబేదారి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): లంచం తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడిన హనుమకొండ జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి కెరీర్ అంతా అవినీతిమయమేనని ఆరోపణలున్నాయి. 1995లో రెవెన్యూశాఖలో డిప్యూటీ తహసీల్దార్‌గా చేరిన వెంకట్‌రెడ్డి అంచెలంచెలుగా అదనపు కలెక్టర్ స్థాయికి ఎదిగినట్లే అవినీతి ద్వారా రూ.కోట్ల విలువైన ఆస్తులు పెంచుకున్నారని తెలుస్తోంది. నల్లగొండ తహసీల్దార్‌గా ఉన్నప్పుడు ఆయన అవినీతి లీలలపై బాధితుల ఫిర్యాదు మేరకు ఏసీబీ నమోదు చేసిన ఆదాయానికి మించిన ఆస్తుల కేసు విచారణ ఇంకా కొనసాగుతోందని అధికారులు చెప్పారు. తర్వాత జనగామ ఆర్డీవోగానూ భూసేకరణలో భారీగా అవినీతికి పాల్పడిన వెంకట్ రెడ్డి.. హనుమకొండ జిల్లా అదనపు కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన తర్వాత భూ సేకరణ, నాలా కన్వర్షన్, రైస్ మిల్లర్లకు చెందిన వ్యవహారాల్లో భారీగా ముడుపులందుకున్నారని సమాచారం. ఇటీవల శాయంపేటలో వెలుగు చూసిన ఐకేపీ ధాన్యం స్కామ్ కేసులో ఆయన భారీగా ముడుపులు డిమాండ్ చేశారని తెలుస్తోంది. నెలన్నర క్రితం జిల్లా ఇన్‌చార్జి డీఈఓ హోదాలో వెంకట్ రెడ్డి.. ప్రైవేటు పాఠశాల పునరుద్ధరణ ఆదేశాలు జారీ చేయడానికి రూ. లక్ష లంచం డిమాండ్ చేసి, చివరకు రూ.60 వేలకు బేరం కుదుర్చుకుని ఏసీబీ అధికారులకు శుక్రవారం రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డాడు. ఒకవైపు హైదరాబాద్‌లోని నాగోల్‌లో ఆయన సొంతిల్లు, హనుమకొండలోని నిట్ కాలేజీ ఎదురుగా ఆయన అద్దెకున్న ఇంటిని సోదా చేసిన ఏసీబీ అధికారులు శనివారం కూడా విచారణ చేపట్టారు. ఆధారాలు చూపని రూ.30 లక్షల నగదును జప్తు చేశామని ఏసీబీ డీఎస్పీ సాంబయ్య తెలిపారు. అయితే, వ్యక్తిగత అవసరాలకు అమెరికాలోని రియాల్టీ వ్యాపారి- తన మిత్రుడు గోపాల్‌రెడ్డి రూ.30 లక్షలు పంపారని చెప్పిన వెంకటరెడ్డి.. ఫోన్ నంబర్ అడిగితే దాటేశారు. అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డితోపాటు ఆయన జూనియర్ అసిస్టెంట్లు గౌస్, మనోజ్‌లను శనివారం కోర్టు ముందు హాజరుపరిచారు. న్యాయమూర్తి ఆదేశాల మేరకు పోలీసుల సహకారంతో ఆ ముగ్గురిని ఖమ్మం జిల్లా జైలుకు తరలించారు.

కలెక్టరేట్ ముందు గ్రీన్‌ఫీల్డ్ రైతుల సంబురాలు

హనుమకొండ జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డిని ఏసీబీ అరెస్టు చేయడంతో శనివారం కలెక్టరేట్ ఎదుట గ్రీన్‌ఫీల్డ్ హైవే బాధిత రైతులు బాణాసంచా పేల్చి ఆనందం వ్యక్తం చేశారు. గ్రీన్ ఫీల్డ్ హైవే వెళ్లే దారిలో దామెర మండలం ఊరుగొండ గ్రామ రైతులు కోల్పోయిన భూములకు న్యాయబద్ధంగా, చట్టబద్ధంగా రావాల్సిన పరిహారం ఇవ్వకుండా ఆయన అడ్డుపడ్డారు. ఆరెపల్లి, వంగపహాడ్ గ్రామాల వాసులకు మార్కెట్ ధర కంటే ఎక్కువ పరిహారమే చెల్లించారు కానీ, ఊరుగొండ రైతులకు పరిహారం చెల్లించే విషయంలో వెంకట్ రెడ్డి ఇబ్బందుల పాల్జేశారు. అదనపు కలెక్టర్‌కు తమ గోస తాకిందని రైతులు అన్నారు.

మూడో విడతకు 27,277 నామినేషన్లు

4,158 సర్పంచ్ స్థానాలు.. బరిలో సగటున ఆరుగురు.. 36,442 వార్డు మెంబర్ స్థానాలకు 89,604 నామినేషన్లు

» ఉపసంహరణకు 9వ తేదీ తుది గడువు

» అదే రోజు తుది జాబితా, 17న పోలింగ్

హైదరాబాద్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి) : మూడో విడతలో జరిగే పంచాయతీ ఎన్నికల్లో సర్పంచ్ స్థానాలకు గట్టిపోటీ నెలకొంది. ఈ విడతలో 4,158 సర్పంచ్ స్థానాలకు 27,277 నామినేషన్లు దాఖలయ్యాయి. నామినేషన్ల సమర్పణకు చివరి రోజైన శనివారం ఒక్కరోజే 17,407 మంది తమ నామినేషన్లు దాఖలు చేశారు. తొలి రోజు 3,155, రెండో రోజు 6,715 నామినేషన్లు దాఖలయ్యాయి. మొత్తంగా ఒక్కో సర్పంచ్ స్థానానికి సగటున 6.56 మంది నామినేషన్లు సమర్పించారు. మొదటి విడత నామినేషన్ల సమయంలో ఒక్కో సర్పంచ్ స్థానానికి ఆరు నామినేషన్లు రాగా ఉపసంహరణ తర్వాత అది నాలుగుకి తగ్గింది. రెండో విడతలో ఒక్కో స్థానానికి సగటున 6.5 మంది అభ్యర్థులు నామినేషన్లు వేశారు. రెండో విడతకు సంబంధించిన నామినేషన్ల ఉపసంహరణకు శనివారం చివరి రోజు. దీంతో రెండో విడత బరిలో ఎంతమంది ఉన్నారనే అంశంపై ఆదివారం పూర్తి స్పష్టత రానుంది. మరోపక్క, మూడో విడత ఎన్నికలు జరిగే 36,442 వార్డు మెంబర్ స్థానాలకు తొలిరోజు 5,424 రెండోరోజు 22,618, చివరి రోజు 61,562 కలిపి మొత్తం 89,604 నామినేషన్లు దాఖలయ్యాయి. సర్పంచ్, వార్డు మెంబర్ స్థానాలకు అభ్యర్థులు దాఖలు చేసిన నామినేషన్లను అధికారులు శనివారం పరిశీలించారు. 7, 8తేదీల్లో అభ్యంతరాల స్వీకరణ/పరిష్కారం, 9న నామినేషన్ల ఉపసంహరణ పూర్తయ్యాక పోటీలో ఉన్న అభ్యర్థుల జాబితాను అదే రోజున ప్రకటిస్తారు. మూడో విడత పంచాయతీ స్థానాలకు ఈనెల 17న పోలింగ్ జరగనుంది.

ఖమ్మంలో 22, ఇందూరులో 37 ఏకగ్రీవాలు



ఖమ్మం, నిజామాబాద్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): రెండో విడతకు సంబంధించిన నామినేషన్ల ఉపసంహరణ అనంతరం ఖమ్మం జిల్లాలో 22 పంచాయతీల్లో సర్పంచ్ స్థానాలు ఏకగ్రీవం అయ్యాయి. ఇందులో 17 స్థానాలను కాంగ్రెస్ దక్కించుకోగా సీపీఐ 3, సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ 1, బీఆర్ఎస్‌కు 1 దక్కాయి. తొలి విడతకు సంబంధించి ఖమ్మం జిల్లాలోని మొత్తం 20 పంచాయతీలు ఏకగ్రీవం అవ్వగా అందులో 19 కాంగ్రెస్‌కే దక్కాయి. ఒకటి సీపీఐకి దక్కింది. రెండు విడతల్లో కలుపుకొని ఖమ్మం జిల్లాల్లో 42 పంచాయతీలు ఏకగ్రీవం అవ్వగా.. కాంగ్రెస్‌కు 36, సీపీఐ 4, మాస్‌లైన్ 1, బీఆర్ఎస్ 1 పంచాయతీని దక్కించుకున్నాయి. మూడో విడతకు సంబంధించిన ఏకగ్రీవాలకు గ్రామస్థాయి నేతలు ప్రయత్నాలు చేస్తున్నారు. నిజామాబాద్ జిల్లాకు సంబంధించి రెండో విడత సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికలు జరుగుతున్న 8 మండలాల్లో 37 సర్పంచ్ స్థానాలు ఏకగ్రీవమయ్యాయి. తొలి విడతకు సంబంధించి 27 సర్పంచ్ స్థానాలు ఏకగ్రీవం అయ్యాయి.

పోటీలో మామా కోడళ్లు

జగిత్యాల జిల్లా రాయికల్ మండలం శ్రీరాంనగర్ సర్పంచ్ స్థానానికి గ్రామానికి చెందిన తాళ్లపెల్లి సత్యనారాయణగౌడ్, అయన కుమారుడు శ్రీరామ్‌గౌడ్, కోడలు రాధిక నామినేషన్లు వేశారు. శ్రీరామ్‌గౌడ్ తన నామినేషన్‌ను ఉపసంహరించుకోగా మరో ఇద్దరితో కలిసి మామాకోడళ్లు ప్రస్తుతం పోటీలో నిలిచారు.

కూతురు సర్పంచ్ తండ్రి ఉప సర్పంచ్





మహబూబాబాద్ జిల్లా పెద్దవంగర మండలంలోని జీపీ బొత్తలతండా సర్పంచ్, ఉపసర్పంచ్‌లుగా తండ్రీకూతుళ్లు ఎన్నికయ్యారు. జీపీ బొత్తలతండాలోని సర్పంచ్, నాలుగు వార్డు సభ్యుల స్థానాలు ఏకగ్రీవం అయ్యాయి. దీంతో సర్పంచ్ స్థానానికి నామినేషన్ వేసిన జాటోతు కల్పన సర్పంచ్‌గా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అనంతరం ఆమె వార్డు సభ్యుల్లో ఒకరైన తన తండ్రి అంగుతో లచ్చిరామ్‌నాయక్‌ను ఇతర సభ్యుల మద్దతులో ఉపసర్పంచ్‌గా ఎన్నుకున్నారు – పెద్దవంగర

సర్పంచ్ పదవి కోసం మతమార్పిడి

సుల్తానాబాద్, రాయికల్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): సర్పంచ్ పదవికి పోటీ చేసేందుకు ఓ మహిళ మతం మారారనే అంశం పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ మండలంలో తీవ్ర చర్చనీయాంశమైంది. స్థానికుల కథనం ప్రకారం.. సుల్తానాబాద్ మండలంలోని తొగర్రాయి సర్పంచ్ పదవి బీసీ మహిళలకు రిజర్వ్ అయ్యింది. దీంతో గ్రామంలో ఎస్సీ వర్గానికి చెందిన అధికార పార్టీ నాయకుడు ఒకరు తన భార్య చిలుక స్రవంతితో మతం మార్పించారు. స్రవంతి క్రైస్తవ మతంలో చేరినట్లు తగిన ఆధారాలతో కూడిన పత్రాలను సుల్తానాబాద్ తహసీల్దార్ కార్యాలయంలో సమర్పించి బీసీ సర్టిఫికెట్ పొందారు. ఆ సర్టిఫికెట్ సాయంతో చిలుక స్రవంతి నామినేషన్ వేయగా అధికారులు ఆమోదించారు. ఈ వ్యవహారంపై ఇతర అభ్యర్థులు, బీసీ నాయకులు అభ్యంతరం వ్యక్తం చేస్తూ తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. చిలుక స్రవంతి నామినేషన్‌ను తిరస్కరించాలని డిమాండ్ చేశారు. ఇన్‌చార్జి తహసీల్దార్ గిరి మాట్లాడుతూ నిబంధనల మేరకే చిలుక స్రవంతికి బీసీ సర్టిఫికెట్ జారీ చేశానని, అభ్యంతరాలు ఉంటే ఎక్కడైనా అప్పీలు చేసుకోవచ్చని స్పష్టం చేశారు.

నన్ను గెలిపిస్తే నా టెంట్ హౌస్ ఇచ్చేస్తా

మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం అర్పనపల్లి గ్రామ సర్పంచ్ స్థానానికి స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తున్న బుడిగబోయిన శృతి ఓటర్లకు బాండ్ పేపర్‌పై రాసిచ్చిన హామీ పత్రమిది. తనను సర్పంచ్‌గా గెలిపిస్తే గ్రామానికి ఏం చేస్తానో ఆమె ఈ పత్రంలో పేర్కొన్నారు. సర్పంచ్‌గా ప్రమాణస్వీకారం చేసిన రోజునే తన టెంట్ హౌస్‌ను పంచాయతీకి ఇచ్చేస్తానని, పేదింటి ఆడపిల్లల పెళ్లికి ఆర్థిక సాయం చేస్తానని, గ్రామంలో ఫలానా అభివృద్ధి పనులు పూర్తి చేస్తానని, లేదంటే పదవి నుంచి తప్పుకుంటానని రాసిచ్చి ఆమె ఓటర్లను ఆకట్టుకునే యత్నం చేస్తున్నారు – కేసముద్రం

పెట్టుబడుల పేరుతో సైబర్ మోసం

» యువ వైద్యులకు రూ.2.15 కోట్ల టోకరా

వరంగల్ మెడికల్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరగాళ్ల మోసాలకు ఇద్దరు వైద్యులు బలయ్యారు. స్టాక్ మార్కెట్‌లో పెట్టుబడుల పేరుతో ఓ నకిలీ యాప్ ద్వారా హనుమకొండ జిల్లా పరకాలకు చెందిన ఇద్దరు యువ వైద్యులు రూ.2 కోట్ల 15 లక్షలు పోగొట్టుకున్నారు. ఈ మేరకు ఈ నెల 3న పోలీసులకు ఫిర్యాదు అందింది. హనుమకొండ జిల్లా పరకాలలో ప్రైవేట్ ప్రాక్టీస్ చేస్తున్న ఇద్దరు యువ వైద్యులతో ఓ మహిళ ఆన్‌లైన్‌లో పరిచయం పెంచుకుంది. ఓ నకిలీ స్టాక్ మార్కెట్ యాప్ గురించి వివరించింది. అందులో పెట్టుబడులు పెడితే అధిక లాభాలు వస్తాయని ఆశచూపింది. అది నమ్మిన ఒక వైద్యుడు రూ.1.14 కోట్లు పంపగా, మరో వైద్యుడు రూ.1.13 కోట్లు పంపించారు. అయితే ఈ నెల 3న పంపిన డబ్బులకు సంబంధించి సైబర్ నేరగాళ్ల నుంచి ఎలాంటి స్పందన రాకపోవడంతో వైద్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

రాష్ట్రంలో ఇక చలిగాలుల తీవ్రత

» సగానికి పైగా జిల్లాలకు ఆరెంజ్ అలెర్ట్

హైదరాబాద్/సిటీ/ఆసిఫాబాద్/ఆదిలాబాద్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో చలి తీవ్రత పెరుగుతోంది. ఆది, సోమవారాల్లో ఉత్తర, పశ్చిమ తెలంగాణలోని కొన్ని ప్రాంతాల్లో చలిగాలులు వీచే అవకాశం ఉందని, రాష్ట్రమంతా కనిష్ఠ ఉష్ణోగ్రతలు 2-3 డిగ్రీలు తక్కువగా నమోదయ్యే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. సోమవారం నుంచి చలి తీవ్రత మరింత పెరుగుతుందని హెచ్చరించింది. రాగల మూడు రోజుల్లో రాష్ట్రంలోని సగానికి పైగా జిల్లాల్లో రాత్రిపూట ఉష్ణోగ్రతలు 7.3 నుంచి 10 డిగ్రీలలోపు నమోదవుతాయని పేర్కొంది. ఈ మేరకు ఆసిఫాబాద్, ఆదిలాబాద్, సంగారెడ్డి, కామారెడ్డి, రంగారెడ్డి, మెదక్, వికారాబాద్, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, పెద్దపల్లి, కరీంనగర్, జయశంకర్ భూపాలపల్లి, మంచిర్యాల, హన్మకొండ, వరంగల్, ములుగు, మహబూబాబాద్ జిల్లాలకు ఆరెంజ్ అలెర్ట్ జారీ చేసింది. మరోవైపు శనివారం రాత్రి ఆసిఫాబాద్ జిల్లా సిర్పూరులో అత్యల్పంగా 8 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదైనట్లు వాతావరణ కేంద్రం వెల్లడించింది. కాగా, రాష్ట్రంలోని ఏజెన్సీ ప్రాంతాల్లో చలిపులి మళ్లీ పంజా విసురుతోంది. మూడు రోజులుగా ఉష్ణోగ్రతలు ఒక్కసారిగా తగ్గుముఖం పట్టాయి. సాయంత్రం 5 గంటల నుంచి ఉదయం 9 గంటల వరకు చలిగాలులు వీస్తున్నాయి.

అనుమతుల సమాచారం లీక్ చేసిందెవరు?

» 'విచ్చలవిడి అనుమతులు'పై మునిసిపల్ అధికారుల ఆరా

» విలీన మునిసిపాలిటీల్లో పర్మిషన్ల దందాపై సర్వత్రా చర్చ

హైదరాబాద్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): జీహెచ్ఎంసీలో విలీనమైన మునిసిపాలిటీలు, కార్పొరేషన్లలో అనుమతుల అక్రమాలపై 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనం సంచలనం సృష్టించింది. నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణ అనుమతులు, నిర్మాణం పూర్తికాని భవనాలకు ఆక్యుపెన్సీ సర్టిఫికెట్(ఓసీ) జారీ చేయడం, అధికారులు రూ.కోట్లు దండుకోవడంపై శనివారం 'విలీనానికి ముందు.. విచ్చలవిడి అనుమతులు' శీర్షికన కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. అయితే గుట్టుచప్పుడు కాకుండా తాము చేసిన ఈ వ్యవహారాన్ని లీక్ చేసిందెవరంటూ ఆయా మునిసిపల్ కమిషనర్లు ఆరా తీశారు. మరోవైపు ఇటీవల భవన నిర్మాణ అనుమతులు, ఓసీలు పొందినవారు తమ పరిస్థితేంటని మునిసిపల్ కార్యాలయ అధికారులను సంప్రదించినట్లు సమాచారం. అయితే ఇంత జరుగుతున్నా.. కొందరు అవినీతి అధికారుల తీరు మాత్రం మారలేదు. ఓవైపు అవినీతి ఎలా బయటకు వచ్చిందని చర్చించుకుంటూనే మరోవైపు 'పాత బకాయి'లను ముక్కుపిండి వసూలు చేశారు. 'బండ్ల'ల్లో అక్రమ సొమ్ము తరలించిన వారు.. ఇటీవల ఇచ్చిన రెండు అనుమతులకు సంబంధించి రూ.లక్షలు శనివారం తీసుకున్నట్లు విశ్వసనీయ సమాచారం. ఇదిలా ఉండగా.. విలీనమైన మునిపాలిటీల్లో అనుమతులు, ఓసీల జారీలో పెద్ద ఎత్తున అవినీతి, అక్రమాలు జరగడంపై ప్రభుత్వం సీరియస్‌గా ఉన్నట్లు తెలిసింది. ఇప్పటికే కొందరు అధికారుల అవినీతి చిట్టా ఏసీబీ, విజిలెన్స్‌కు చేరడంతో అనుమానాస్పద అనుమతుల్ని తాత్కాలికంగా నిలిపి వేయడం, వాటిని పునఃసమీక్షించి అవసరమైతే రద్దు చేసే ఆలోచనలో ఉన్నట్లు సమాచారం.

సమ సమాజ స్థాపనే అంబేడ్కర్ లక్ష్యం

» బాబా సాహెబ్‌కు భట్టి విక్రమార్క నివాళి

» మార్గదర్శి అంబేడ్కర్ : రాంచందర్‌రావు



లోయర్ ట్యాంక్‌బండ్‌లోని అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న భట్టి

కవాడిగూడ/హైదరాబాద్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : అసమానతలు లేని సమాజం కోసం అంబేడ్కర్ నిరంతరం కృషి చేశారని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. సామాన్యుడికి కూడా ఓటు హక్కు కల్పించి మంచి నాయకుడిని ఎన్నుకునే అవకాశాన్ని కల్పించారని తెలిపారు. అంబేడ్కర్ చూపిన మార్గంలో దేశ యువత నడవాలని సూచించారు. అంబేడ్కర్ ఆశయాల సాధనకు కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. అంబేడ్కర్ 69వ వర్ధంతి సందర్భంగా శనివారం లోయర్ ట్యాంక్ బండ్‌లోని ఆయన విగ్రహానికి భట్టి విక్రమార్క నివాళులర్పించారు. కాగా, ఎస్సీ వర్గీకరణ చట్టానికి సవరణలు చేసి అసెంబ్లీలో ప్రవేశపెట్టాలని మాల సంఘాల జేఏసీ, షెడ్యూల్డ్ కులాల హక్కుల పరిరక్షణ సొసైటీ నాయకులు భట్టి విక్రమార్కను కోరారు. ఈ సందర్భంగా వారు నినాదాలు చేయడంతో అంబేడ్కర్ విగ్రహం వద్ద కొద్దిసేపు ఉద్రిక్తత నెలకొంది. దీనిపై ప్రభుత్వంతో చర్చిస్తానని భట్టి హామీ ఇచ్చారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు, మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, సినీ నిర్మాత దిల్‌రాజు, పలువురు దళిత సంఘాల నేతలు, సీపీఎం నాయకులు, అంబేడ్కర్ అభిమానులు పెద్ద సంఖ్యలో వచ్చి బాబాసాహెబ్ విగ్రహానికి పూలమాలలు వేశారు. దేశానికి దిశ నిర్దేశం చేసిన మహోన్నత వ్యక్తి అంబేడ్కర్ అని రాంచందర్‌రావు కొనియాడారు. రాజ్యాంగాన్ని గౌరవించడమే ఆయనకు మనం ఇచ్చే నిజమైన నివాళి అని అన్నారు. అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా శనివారం శాసనసభ ఆవరణలోని ఆయన విగ్రహానికి స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ పూల మాలలు వేసి నివాళులర్పించారు.

రాజధానిలో పల్లెపోరు

హైదరాబాద్‌లో పెద్ద సంఖ్యలో పల్లె ప్రజానీకం.. పంచాయతీ ఎన్నికల్లో వారి ఓట్లు కీలకం

» ఓటర్ల కోసం నగరంలోని ఫంక్షన్ హాళ్లలో ఆత్మీయ సమ్మేళనాలు

హైదరాబాద్ సిటీ, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): భువనగిరి జిల్లా రామన్నపేట మండలంలోని ఓ పంచాయతీలో దాదాపు 2 వేల ఓట్లు ఉన్నాయి. ఈ ఓటర్లలో దాదాపు 400 మంది హైదరాబాద్‌లో నివాసముంటున్నారు. ఆ పంచాయతీ సర్పంచ్‌గా నామినేషన్ వేసిన ఓ అభ్యర్థి ఆ 400 మందిని ప్రసన్నం చేసుకునేందుకు ఎల్‌బీనగర్‌లోని ఓ కన్వెన్షన్ హాల్‌లో ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహిస్తున్నారు.

రంగారెడ్డి జిల్లా ఫారుఖ్‌నగర్ మండల పరిధిలోని ఓ గ్రామ పంచాయతీకి చెందిన 300మందికిపైగా ఓటర్లు హైదరాబాద్‌లో ఉంటున్నారు. సర్పంచ్ ఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థులు ఈ 300 మంది కోసం తమ అనుచరులతో కలిసి హైదరాబాద్‌కు చేరారు. ఓ అభ్యర్థి తమ గ్రామానికి చెందిన 80 మందికి అత్తాపూర్‌లో ఓ హోటల్‌లో గురువారం రాత్రి విందు ఇచ్చారు.

పల్లెల నుంచి హైదరాబాద్‌కు వచ్చి స్థిరపడిన వారిలో చాలామందికి స్వగ్రామంలోనే ఓట్లు ఉంటాయి. ఈ ఓట్లు ప్రస్తుతం పంచాయతీ ఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థులకు కీలకంగా మారాయి. దీంతో అభ్యర్థులు హైదరాబాద్‌లో ఉంటున్న తమ ఊరి ప్రజలను వెతుక్కుంటూ వస్తున్నారు. అభ్యర్థులు లేదా వారి తరఫున ఇతర వ్యక్తులు నగరానికి వచ్చి తమ ఊరి ఓటర్ల ఇంటింటికి వెళ్లి ఓటు కోసం తలుపు తడుతున్నారు. కొందరు అభ్యర్థులు ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహిస్తుండగా, మరికొందరు తమ గ్రామ ఓటర్లను ఏదో ఒక హోటల్‌కి తీసుకెళ్లి చుక్క, ముక్కతో ప్రసన్నం చేసుకుంటున్నారు. కొందరు అభ్యర్థులు ఫోన్లు చేసి ఓటు కోసం అభ్యర్థిస్తున్నారు. సూర్యాపేట జిల్లా కోదాడ మండలంలోని ఓ గ్రామంలో ఒక వార్డులో 150ఓట్లు ఉండగా.. అందులో 41 మంది ఓటర్లు హైదరాబాద్‌లో ఉన్నారు. వారి కోసం సర్పంచ్ అభ్యర్థి, వార్డు మెంబర్ అభ్యర్థి తరఫున కొందరు వ్యక్తులు ప్రచారానికి రాజధానికి వచ్చారు.

చుక్క, ముక్క

ఎల్‌బీనగర్, కొంపల్లి, అల్వాల్, బోడుప్పల్, సంతోష్‌నగర్, జగద్గిరిగుట్ట, అత్తాపూర్, హఫీజ్‌గూడ, కాప్రా తదితర ప్రాంతాల్లోని ఫంక్షన్ హాల్స్‌లో గత ఆదివారం ఆత్మీయ సమ్మేళనాలు జరిగాయి. నేడు కూడా పలు చోట్ల జరగనున్నాయి. సర్పంచ్, వార్డు మెంబర్ అభ్యర్థులు ఈ సమ్మేళనానికి హాజరైన వారిని తమకే ఓటెయ్యాలని కోరుకుంటున్నారు. ఆత్మీయ సమ్మేళనాల్లో మధ్యాహ్నం మాంసాహార భోజనాలనే వడ్డిస్తున్నారు. అనంతరం కుటుంబ యజమానులకు సాయంత్రం అదే ఫంక్షన్‌హాల్‌లో మందు పార్టీలు ఇస్తున్నారు. మరికొందరు అభ్యర్థులు కులాల వారీగా ప్రత్యేకంగా విందులు ఇస్తున్నారు. కొంపల్లిలోని ప్రముఖ హోటల్‌లో సిద్దిపేట జిల్లాలోని ఓ గ్రామానికి చెందిన సామాజిక వర్గం వారికి ఓ అభ్యర్థి విందు ఇచ్చారు. ఆ విందుకు ఓ ఎమ్మెల్యే హాజరైనట్టు తెలిసింది.

వాహనాల్లో తరలించేందుకు ప్లాన్

హైదరాబాద్‌లోని ఓటర్లను పోలింగ్‌కు తరలించేందుకు అభ్యర్థులు ప్రత్యేక వాహనాలను కూడా ఏర్పాటు చేస్తున్నారు. మహబూబాబాద్ జిల్లాలోని ఓ గ్రామ పంచాయతీకి చెందిన దాదాపు 300మంది ఓటర్లు యూసుఫ్‌గూడ ప్రాంతంలో ఉన్నారు. వారందరినీ ఓటింగ్‌కు తరలించేందుకు సర్పంచ్ అభ్యర్థి బస్సులు ఏర్పాటు చేశారు. తమ బస్సులో వచ్చే ఓటరుకు రూ.500తో పాటు టిఫిన్, భోజనం అందిస్తామని హామీ ఇచ్చినట్టు తెలిసింది. కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలంలోని ఓ గ్రామానికి చెందిన 600 మంది ఓటర్లు హైదరాబాద్‌లో ఉన్నారు. సర్పంచ్ అభ్యర్థి తనయుడు వారికి ఫోన్లు చేసి మాట్లాడడమే కాక ఓటుకు రూ.వెయ్యి చొప్పున ఫోన్‌పే, గూగుల్ పే చేస్తున్నారని సమాచారం. ఇక, సొంత వాహనాల్లో వస్తే ఖర్చులు తాము భరిస్తామంటూ ఓటర్లకు మరికొందరు హామీలిస్తున్నారు.



కొత్తపలుకు

▪ఆర్కే RK

దైవసన్నిధిలో నేరాలకు జగన్ వత్తాసు

తిరుమల లడ్డూ పవిత్రత, విశిష్టతను దెబ్బతీసే ప్రయత్నం చేసిన వారినెవరినీ క్షమించకూడదు. ఈ వ్యవహారంపై దర్యాప్తు చేస్తున్నది సుప్రీంకోర్టు నియమించిన దర్యాప్తు కమిటీ అన్న వాస్తవాన్ని విస్మరించి జగన్‌రెడ్డి... సిట్ సభ్యుడైన గోపీనాథ్ జెట్టిని 'వాడూ వీడూ' అని చులకన చేసి మాట్లాడారు. గోపీనాథ్ జెట్టిని రాష్ట్ర ప్రభుత్వం ఎంపిక చేయలేదు. సుప్రీంకోర్టు సూచన మేరకు సీబీఐ ఎంపిక చేసుకుంది. అప్పట్లో టీటీడీ చైర్మన్‌గా ఉన్న వైవీ సుబ్బారెడ్డి వేసిన పిటిషన్ ఆధారంగానే సుప్రీంకోర్టు సిట్‌ను ఏర్పాటు చేసింది. వైవీ సుబ్బారెడ్డి వద్ద పీఏగా పనిచేసిన చిన్న అప్పన్న గురించి జగన్‌రెడ్డి చెప్పిన కథ వింతగా ఉంది. అప్పన్న ప్రస్తుతం తెలుగుదేశం ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర రెడ్డి వద్ద పనిచేసేవారని ఆయన చెప్పుకొచ్చారు. నాసి రకం నెయ్యి సరఫరా జరిగిన సమయంలో ప్రభాకరరెడ్డి వైసీపీ ఎంపీగా ఉన్నారు. అప్పుడు ఆయన తెలుగుదేశం పార్టీలోనే లేరు. సదరు అప్పన్నను ఢిల్లీ ఏపీ భవన్‌లోనూ, ఆ తర్వాత వైవీ సుబ్బారెడ్డి వద్ద పీఏగా నియమించడం కూడా జగన్‌రెడ్డి హయాంలోనే జరిగాయి. వాస్తవం ఇది కాగా, ప్రస్తుతం తెలుగుదేశం ఎంపీగా ఉన్న ప్రభాకర రెడ్డి వద్ద అప్పన్న పనిచేశారని చెప్పే ప్రయత్నం చేయడం ద్వారా జగన్‌రెడ్డి అడ్డంగా దొరికిపోయారు.

ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి రెండు రోజుల క్రితం విలేఖరుల సమావేశంలో చెప్పిన మాటలు, చేసిన ఆరోపణలను బట్టి... రాష్ట్ర ప్రజలు పుట్టెడు కష్టాలలో ఉన్నారని ఎవరైనా నమ్మాల్సిందే! అంతే కాదు, గత ఎన్నికలలో కూటమి నాయకుల మాటలు నమ్మి ప్రజలు ఆయనకు 11 సీట్లే ఇచ్చి అన్యాయం చేశారన్న భావన కూడా కలుగుతుంది. 30 ఏళ్లపాటు ముఖ్యమంత్రిగా కొనసాగాలన్న తన కలలను కూటమి నాయకులు కల్లబొల్లి కబుర్లతో కల్లలు చేశారన్న ఉక్రోషం కూడా ఆయన మాటల్లో కనిపించింది. సుదీర్ఘంగా 2 గంటలా 43 నిమిషాల పాటు సాగిన విలేఖరుల సమావేశంలో జగన్‌రెడ్డి చెప్పిన మాటలన్నీ నిజమా? అన్న అనుమానం కించిత్ కూడా రాకుండా ఆయన తనలోని నటనా కౌశలాన్ని ప్రదర్శించారు. గతంలో కేసీఆర్ ఒక్కరే ఇలా గంటలకొద్దీ విలేఖరుల సమావేశాలు నిర్వహించే వారు. అయితే, ఆయన మధ్య మధ్యలో పిట్ట కథలు చెబుతూ విలేఖరులకు బోర్ కొట్టకుండా ఉత్తేజపరిచేవారు. ఈ చాతుర్యం జగన్‌లో లేనందున సదరు సమావేశానికి హాజరైన విలేఖరులకు కచ్చితంగా బోర్ కొట్టి ఉంటుంది. అయినా ఆయన తాను చెప్పాలనుకున్న వాటిని చిత్ర విచిత్ర హావభావాలతో చెప్పుకొన్నారు. ఒక నార్సిసిస్టిక్ పర్సనాలిటీ నోటి వెంట వెలువడిన అసత్యాలను, అర్ధసత్యాలను పట్టించుకోవడం ఎందుకులే అనుకోకుండా కూటమి ప్రభుత్వంలోని పలువురు మంత్రులు ఆ వెంటనే స్పందించి జగన్‌రెడ్డికి బదులిచ్చారు. ఇంతవరకు జగన్‌రెడ్డి సక్సెస్ అయ్యారు. అయితే, జగన్‌రెడ్డి తనలోని అక్కసును దాచుకోకుండా మధ్య మధ్యలో వెళ్లగక్కారు. రిటైర్డ్ ఐఏఎస్ అధికారి పి.కృష్ణయ్యను, ఆయన బంధువు గోపీనాథ్ జెట్టి అనే ఐజీ స్థాయి అధికారిని 'వాడూ వీడూ' అని సంబోధించడం ద్వారా తనలోని కక్షను ఆయన ప్రదర్శించారు. ఇదే పని చంద్రబాబు నాయుడు, పవన్ కల్యాణ్ చేసి ఉంటే బీసీ వర్గానికి చెందిన, అది కూడా యాదవ కులానికి చెందిన అధికారులను అవమానించారని నీలి మీడియా, కూలి మీడియా గగ్గోలు పెట్టి ఉండేది. గత ప్రభుత్వంలో హద్దులు మీరి ప్రవర్తించడమే కాకుండా అవినీతికి పాల్పడిన ఆరోపణలపై ఒకరిద్దరు అధికారులు విచారణ ఎదుర్కొంటున్న నేపథ్యంలో... 'దళిత అధికారులపై కక్ష ఏమిటి?' అని ఇదే నీలి, కూలి మీడియా వాపోవడం చూశాం. జగన్మోహన్‌రెడ్డి తనలోని నటనా కౌశలాన్ని ఎంతలా బయటకు తీసినా మధ్య మధ్యలో తన నిజ స్వరూపాన్ని దాచుకోలేక పోతున్నారు. ఫలితంగా అవతలి వారిని ఏక వచనంతో 'వాడూ వీడూ' అనీ సంబోధిస్తుంటారు. విలేఖరుల సమావేశంలో జగన్‌రెడ్డి చెప్పిన మాటలను ఎంత మంది నమ్మారో తెలియదుగానీ... విలేఖరులు మాత్రం బాధితులయ్యారు. జగన్మోహన్‌రెడ్డి ఉపన్యాసం మొదలుపెడితే ఎంత తొందరగా వదిలిపెడతారా? అని ఎదురుచూస్తానని ఆయన పార్టీకే చెందిన మాజీ మంత్రి పేర్ని నాని ఎక్కడో చెప్పినట్టు గుర్తు! సొంత పార్టీ వారే భరించలేని ఆయన ఉపన్యాసాలను విలేఖరులు నిర్బంధంగా భరించాల్సి రావడం విషాదమే!

బొక్కలో వేయాల్సింది ఎవరిని?

జగన్ నోటి వెంట వెలువడిన కొన్ని ఆణిముత్యాల గురించి ఇప్పుడు చర్చించుకుందాం! ఎన్నికల హామీలు నెరవేర్చకుండా మోసం చేస్తున్నందుకు చంద్రబాబు నాయుడు, పవన్ కల్యాణ్, లోకేశ్‌లను బొక్కలో వేయాలని జగన్‌రెడ్డి కోరుతున్నారు. నిజంగా అలా చేయవలసి వస్తే ఈ దేశంలో ఒక్క రాజకీయ నాయకుడు కూడా బయట తిరగలేరు. అందరూ జైల్లోనే ఉండాలి. ఐదేళ్లపాటు ముఖ్యమంత్రిగా అధికారం అనుభవించిన జగన్‌రెడ్డి కూడా అమలు చేయలేకపోయిన ఎన్నికల హామీలు ఎన్నో ఉన్నాయి. అందులో ముఖ్యమైనది మద్య నిషేధం! ఎన్నికల సందర్భంగా అధికారంలోకి రావడంకోసం ప్రజలు కోరుకున్నా కోరుకోకపోయినా నోటికొచ్చిన వాగ్దానాలు చేయడం మన దేశంలోని నాయకులకు పరిపాటి అయింది. అధికారం అప్పగిస్తే స్వర్గాన్ని దివి నుంచి భువికి తీసుకువస్తామని చెబుతారు. అందరికీ అన్నీ ఉచితంగా ఇస్తామని చెబుతారు. నిజానికి ప్రజలు అవేవీ నమ్మరు. అప్పటి పరిస్థితులను బట్టి తాము ఎవరికి ఓటు వేయాలో వారికే వేస్తారు. అధికారంలో ఉన్న పార్టీపై కోపం ఉంటే ప్రతిపక్షంలో ఉన్న పార్టీని ఎంచుకుంటారు. 2024 ఎన్నికల్లో ఆంధ్రప్రదేశ్ ప్రజలు ఇదే చేశారు. జగన్‌రెడ్డి పాలనలో దిమ్మ తిరిగి బొమ్మ కనపడటంతో 164 సీట్లలో కూటమిని గెలిపించి, జగన్‌రెడ్డికి 11 సీట్లే ఇచ్చారు. ప్రజల తీర్పు ఈ విధంగా ఉండబోతోందని చంద్రబాబుగానీ, జగన్‌రెడ్డిగానీ ఊహించలేదు. ఎలాగైనా అధికారంలోకి రావాలన్న ఆరాటంతో ప్రజలు కోరుకోకపోయినా చంద్రబాబు అనవసర వాగ్దానాలు చేశారు. అయితే ప్రజలు వాటిని నమ్మి ఆయన పార్టీకి ఓట్లు వేయలేదు. 2019 ఎన్నికల్లో నమ్మి అధికారం కట్టబెడితే జగన్‌రెడ్డి అరాచకంగా పాలించారన్న కోపంతోనే ప్రజలు కూటమికి కనీవినీ ఎరుగని మెజారిటీ ఇచ్చారు. ఈ వాస్తవాన్ని విస్మరించి, హామీలు అమలుచేయనందుకు చంద్రబాబు, పవన్ కల్యాణ్‌లను బొక్కలో వేయాలని జగన్‌రెడ్డి కోరుకోవడం విడ్డూరంగా ఉంది. అవినీతి ఆరోపణలపై కొంత కాలం జైలు జీవితం గడిపిన జగన్‌రెడ్డి తనవలే మిగతా నాయకులు కూడా జైలు జీవితం గడపాలని కోరుకుంటున్నట్టు ఉంది. అందుకే కాబోలు, తాను అధికారంలో ఉన్నప్పుడు చంద్రబాబును తాడూ బొంగరం లేని స్కిల్ కేసులో జైల్లో పెట్టించారు. హామీలు అమలు చేయని వారిని బొక్కలో వేయాలన్న జగన్‌రెడ్డి ఫిలాసఫీ ప్రకారమైతే ఓటర్లను కూడా జైల్లో పెట్టాలి. ఎన్నికల సందర్భంగా చాలామంది అన్ని పార్టీల నుంచీ డబ్బు తీసుకుంటున్నారు. చివరికి ఏదో ఒక పార్టీకే ఓటేస్తున్నారు కదా? డబ్బు తీసుకొని ఓటు వేయకపోవడం నేరమే కదా? తమకు ఇష్టం లేని పార్టీ నుంచి డబ్బు తీసుకోకూడదు కదా? యథా రాజా తథా ప్రజా అన్నట్టుగా ఇప్పుడు అందరూ తప్పు చేస్తున్నారు. అధికారంలోకి రావాలన్న తపనతో నాయకులు అలవికాని హామీలు ఇస్తుండగా, మా ఓటు మీకే అని నమ్మబలికి అన్ని పార్టీల నుంచి ప్రజలు డబ్బు తీసుకుంటున్నారు. ఎవరు ఎవరిని మోసం చేశారంటే ఏం చెప్పగలం? ఈ నేపథ్యంలో చంద్రబాబు, పవన్ కల్యాణ్, లోకేశ్‌ను బొక్కలో వేయాలన్న జగన్ డిమాండ్‌ను సీరియస్‌గా తీసుకోవాల్సిన అవసరం లేదు.

మద్యం పాపం... మీది కాదా?

రాజకీయ నాయకుల మాటలు తాము చేసేది సంసారం, ఇతరులు చేసేది వ్యభిచారం అన్నట్టుగా ఉంటాయి. ఈ విషయంలో జగన్‌రెడ్డి మాత్రం పీహెచ్‌డీ చేశారు. రాజకీయ నాయకుడిగా ఆయనకు ఉన్న అనుభవం తక్కువే. అయినప్పటికీ సుదీర్ఘ అనుభవం ఉన్నవారు కూడా ఆయన ముందు దిగదుడుపే. అధికారంలో ఉన్నప్పుడు అయినదానికీ కానిదానికీ కేసులు కట్టించి గిట్టనివారిని జైళ్లలో కుక్కిన ఆయన... ఇప్పుడు తన వాళ్లను వెనకేసుకురావడానికి విఫల యత్నం చేస్తున్నారు. జగన్‌రెడ్డి అధికారంలో ఉన్నప్పుడు మద్యం సరఫరాలో అవినీతిని వ్యవస్థీకృతం చేసిన విషయం అందరికీ తెలిసిందే! అయినా... 'మద్యం విషయంలో కేసు పెట్టడానికి ఏముంది? ఏమీ జరగని చోట కేసు కట్టి చెవిరెడ్డి భాస్కరరెడ్డి, రాజ్ కసిరెడ్డి వంటి వారిని జైల్లో పెట్టడం ఏమిటి?' అని అమాయకంగా ప్రశ్నించే ప్రయత్నం చేయడమే జగన్‌రెడ్డిలోని గడుసుదనానికి నిదర్శనం. ఈ కేసులో తీగ లాగుతున్న కొద్దీ డొంకలు కదులుతున్నాయి. మద్యం కుంభకోణం మూలాలు తాడేపల్లి ప్యాలెస్‌లో ఉన్నాయని ప్రస్తుతానికి ప్రాథమిక ఆధారాలు లభించాయి. ఈ కేసు లోతుల్లోకి వెళుతున్న కొద్దీ దర్యాప్తు అధికారులకు కళ్లు బైర్లు కమ్ముతున్నాయి. పేద ప్రజలకు నాసిరకం మద్యం సరఫరా చేసి వారి ఆరోగ్యంతో ఆటలాడుకున్న పాలకుల వికృత మనస్తత్వానికి ఈ కేసు ఒక మచ్చు తునక. దేశ చరిత్రలో ఈ స్థాయిలో మద్యం కుంభకోణం జరగలేదని దర్యాప్తు అధికారులు చెబుతున్నారు. పేదల ప్రాణాలతో చెలగాటమాడిన ఈ వికృత క్రీడలో ఎందరినో పావులుగా చేశారు. వేల కోట్లను దోచుకున్నారు. ఈ క్రమంలో కొంత మంది ముఖ్య నాయకుడిని కూడా మోసం చేశారు. ఈ జాబితాలో చెవిరెడ్డి భాస్కరరెడ్డి ఉన్నారని అధికారులు చెబుతున్నారు. జగన్‌రెడ్డికి తెలియకుండా చెవిరెడ్డి కొన్ని వందల కోట్లు నొక్కేశారన్నది అధికారుల సమాచారం. ఈ కారణంగానే ప్రస్తుతం జైల్లో ఉన్న చెవిరెడ్డి భాస్కరరెడ్డిని బెయిలుపై బయటకు తీసుకురావడానికి జగన్‌రెడ్డి ఆసక్తి చూపడం లేదట! జగన్‌రెడ్డి కోసం తాము ఈ పాపం చేస్తే ఆయనే పట్టించుకోవడం లేదని చెవిరెడ్డి కుటుంబసభ్యులు వాపోతున్నారు. ఈ కేసులో మరికొంత మంది ఇతర నిందితులు కూడా జగన్‌రెడ్డి తమను పట్టించుకోవడం లేదని ఆక్రోశం వెళ్లగక్కుతున్నారు. ఈ కేసులో ఇంకెన్ని లోతులు ఉన్నాయో దర్యాప్తు అధికారులకే అంతుపట్టడం లేదు. ఇంతటి భారీ కుంభకోణంలో కూడా అసలు కేసు ఎక్కడుంది? అని జగన్‌రెడ్డి ప్రశ్నించడం అంటే అది గడుసుదనం కాక మరేమిటి? మాచర్ల మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి సోదరులను కూడా జగన్ వెనకేసుకు వచ్చే ప్రయత్నం చేశారు. ముందస్తు బెయిలు ఇవ్వడానికి సుప్రీంకోర్టు సైతం నిరాకరించినప్పటికీ పిన్నెల్లి సోదరులను అన్యాయంగా ఇరికించారని జగన్‌రెడ్డి చెబుతున్నారుగానీ... అధికారంలో ఉన్నప్పుడు వారు సాగించిన అరాచకాలను ప్రజలందరూ చూశారు. అధికారం శాశ్వతం అని నమ్మడం వల్లనే అధికారం పోయాక కేసులు తలకు చుట్టుకుంటున్నాయి. జగన్‌రెడ్డి 30 ఏళ్ల పాటు ముఖ్యమంత్రిగా కొనసాగుతారని ఆయనతో పాటు ఆయన చుట్టూ ఉన్నవారు కూడా నమ్మారు. అందుకే హద్దు మీరి ప్రవర్తించి ఇప్పుడు తిప్పలు పడుతున్నారు. ఇప్పుడు కూటమికి చెందిన కొంతమంది ఎమ్మెల్యేలూ అదే బాటలో పయనిస్తున్నారు. అది వారి ఖర్మ. ఎప్పుడో ఒకప్పుడు పాపం పండుతుంది.



> **పాలకమండలిగానీ, టీటీడీలో పనిచేస్తున్న అధికారులు, ఉద్యోగులుగానీ... 'దేవుడ్ని వాడుకుంటున్నామా? ఆ దేవదేవుడి కోసం పనిచేస్తున్నామా?' అని ఆత్మపరిశీలన చేసుకోవాలి. డబ్బు మాత్రమే సంపాదించాలని అనుకుంటే అందుకు ఎన్నో మార్గాలు ఉంటాయి. కోటానుకోట్ల భక్తుల మనోభావాలతో ముడిపడి ఉన్న అంశాలలో అనైతిక చర్యలకు పాల్పడటమేమిటి?**

'కల్తీ' మాటలు...

విలేకరుల సమావేశంలో జగన్‌రెడ్డి చెప్పిన రెండు అంశాలు తీవ్ర అభ్యంతరకరంగా ఉన్నాయి. కోటానుకోట్ల భక్తుల మనోభావాలకు సంబంధించిన విషయంలో కూడా ఆయన అబద్ధాలను అలవోకగా చెప్పారు. అఖిలాండ కోటి బ్రహ్మాండ నాయకుడికి కూడా అపచారం తలపెట్టిన వారిని వెనుకేసుకొచ్చే ప్రయత్నం చేయడం మహా పాపం. భక్తులకు అత్యంత ప్రీతిపాత్రమైన తిరుమల లడ్డూ తయారీకి నాసిరకం నెయ్యి వాడిన విషయమై జగన్‌రెడ్డి చేస్తున్న వాదన రోతగా ఉంది. నాసిరకం నెయ్యి కొనుగోలులో ఎవరి పాత్ర ఏమిటి? ఎంత? అనేది సుప్రీంకోర్టు నియమించిన సిట్ నిర్ధారిస్తుంది. ఇప్పటి వరకు సిట్ జరిపిన దర్యాప్తు ప్రకారం భోలే బాబా డెయిరీ నుంచి నెయ్యి సేకరించడంలో అవకతవకలు జరిగాయని నిర్ధారణ అయింది. అందుకు ఎవరు బాధ్యులు అన్నది తేలాల్సి ఉంది. తిరుమల లడ్డూ కోసం గతంలో చిత్తూరు డెయిరీతోపాటు ఒకటి రెండు సహకార డెయిరీల నుంచి మాత్రమే నెయ్యిని సేకరించేవారు. ఈ నిబంధనలను జగన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత ఏర్పాటైన పాలకమండలి సవరించింది. ఈ కారణంగానే వందల కిలోమీటర్ల దూరంలో ఉన్న డెయిరీలకు కూడా టెండర్లలో పాల్గొనే అవకాశం లభించింది. ఇక్కడే అవినీతికి బీజం పడింది. భోలే బాబా డెయిరీ రంగప్రవేశం చేయగలిగింది. ఈ నిబంధనల సవరణ కూడా విచిత్రంగా జరిగింది. పాలకమండలి ముందుకు ఈ సవరణలకు సంబంధించిన తీర్మానం రాలేదు. తక్కువ ధరకు నెయ్యి సరఫరా చేయడానికి దాఖలైన టెండర్లను ఆమోదించే తీర్మానం మాత్రమే నాటి పాలకమండలి సమావేశంలో చర్చకు వచ్చింది. తీర్మానం ప్రతులను సభ్యులందరికీ ఇవ్వరు. చైర్మన్, కార్య నిర్వహణాధికారి వద్ద మాత్రమే అవి ఉంటాయి. ఆ రోజు టెండరు ఖరారు చేయాల్సిన తీర్మానాన్ని పక్కన పెట్టి... నెయ్యి సేకరణ విధానంలో మార్పులు చేయడానికి కమిటీని ఏర్పాటు చేస్తూ తీర్మానం చేశారు. ఇందుకోసం ఏర్పాటైన కమిటీలో ప్రస్తుతం బోర్డు సభ్యులుగా ఉన్న వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి, కృష్ణమూర్తి ఉన్నారు. పోటీతత్వం పెరగడానికి వీలుగా నిబంధనలను సడలించాలన్నదే తమ ఉద్దేశమని అప్పటి అధికారులు చెబుతున్నారు. అయితే... బోర్డు ముందుకు వచ్చిన తీర్మానం ఒకటి కాగా, ఆమోదం పొందిన తీర్మానం మరొకటి కావడమే అనుమానాలకు తావిచ్చేలా ఉంది. ప్రస్తుతం కార్యనిర్వహణాధికారిగా ఉన్న అనిల్ సింఘాల్ అప్పుడు కూడా కార్యనిర్వహణాధికారిగానే ఉన్నారు. జరిగిన దానికి ఆయన కూడా సంజాయిషీ ఇవ్వాల్సి ఉంటుంది. భోలే బాబా డెయిరీకి అర్హత లేకపోయినా.... అర్హత కల్పించిన అధికారులు ఎవరు? వారి వెనుక ఎవరున్నారు? అనేది ఇప్పుడు తేలాల్సి ఉంది. తిరుమల లడ్డూ పవిత్రత, విశిష్టతను దెబ్బతీసే ప్రయత్నం చేసిన వారినెవరినీ క్షమించకూడదు. ఈ వ్యవహారంపై దర్యాప్తు చేస్తున్నది సుప్రీంకోర్టు నియమించిన దర్యాప్తు కమిటీ అన్న వాస్తవాన్ని విస్మరించి జగన్‌రెడ్డి... సిట్ సభ్యుడైన గోపీనాథ్ జెట్టిని 'వాడూ వీడూ' అని చులకన చేసి మాట్లాడారు. గోపీనాథ్ జెట్టిని రాష్ట్ర ప్రభుత్వం ఎంపిక చేయలేదు. సుప్రీంకోర్టు సూచన మేరకు సీబీఐ ఎంపిక చేసుకుంది. అప్పట్లో టీటీడీ చైర్మన్‌గా ఉన్న వైవీ సుబ్బారెడ్డి వేసిన పిటిషన్ ఆధారంగానే సుప్రీంకోర్టు సిట్‌ను ఏర్పాటు చేసింది. అప్పట్లో వైవీ సుబ్బారెడ్డి వద్ద పీఏగా పనిచేసిన చిన్న అప్పన్న గురించి జగన్‌రెడ్డి చెప్పిన కథ కూడా వింతగా ఉంది. అప్పన్న ప్రస్తుతం తెలుగుదేశం ఎంపీ వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి వద్ద పనిచేసేవారని ఆయన చెప్పుకొచ్చారు. నాసిరకం నెయ్యి సరఫరా జరిగిన సమయంలో ప్రభాకరరెడ్డి వైసీపీ ఎంపీగా ఉన్నారు. అప్పుడు ఆయన తెలుగుదేశం పార్టీలోనే లేరు. సదరు అప్పన్నను ఢిల్లీ ఏపీ భవన్‌లోనూ, ఆ తర్వాత వైవీ సుబ్బారెడ్డి వద్ద పీఏగా నియమించడం కూడా జగన్‌రెడ్డి హయాంలోనే జరిగాయి. వాస్తవం ఇది కాగా, ప్రస్తుతం తెలుగుదేశం ఎంపీగా ఉన్న ప్రభాకరరెడ్డి వద్ద అప్పన్న పనిచేశారని చెప్పే ప్రయత్నం చేయడం ద్వారా జగన్‌రెడ్డి అడ్డంగా దొరికిపోయారు. నాసి రకం నెయ్యి సరఫరాలో జగన్‌రెడ్డి, వైవీ సుబ్బారెడ్డి హస్తం ఉందని ఇప్పటివరకూ ఎవరూ ఆరోపించలేదు. నాసిరకం నెయ్యి సరఫరా చేయడం మాత్రం నిజం అని ప్రస్తుతానికి రుజువైంది. ఆ పాపానికి ఎవరు కారకులు అన్నది ఇంకా తేలాల్సి ఉంది. ఈ కేసుకు సంబంధించి తాజాగా ఒకరిని అరెస్టు చేశారు. అప్పన్ననూ అరెస్టు చేశారు. మరికొందరినీ అదుపులోకి తీసుకునే అవకాశం ఉందని అంటున్నారు. ఈ పాపానికి ఒడిగట్టిన వాళ్లను ఆ దేవదేవుడు క్షమించడు కూడా! పాపులు ఎవరో త్వరలో తేలుతుంది. ఇందులో ఏమీ జరగలేదని జగన్‌రెడ్డి చెప్పినంత మాత్రాన అఖిలాండ కోటి బ్రహ్మాండ నాయకుడు చూస్తూ ఊరుకోడు కదా? లడ్డూ ప్రసాదాన్ని కల్తీ చేయడం ద్వారా పాపపు కూడు తినడానికి అలవాటుపడిన వారిని వెనుకేసుకు రావడానికి ఎవరు ప్రయత్నించినా... వారు కూడా ఈ పాపంలో పాలుపంచుకున్నవారే అవుతారు.

> **తిరుమల లడ్డూ కోసం గతంలో చిత్తూరు డెయిరీతోపాటు ఒకటి రెండు సహకార డెయిరీల నుంచి మాత్రమే నెయ్యిని సేకరించేవారు. ఈ నిబంధనలను జగన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత ఏర్పాటైన పాలకమండలి సవరించింది. ఈ కారణంగానే వందల కిలోమీటర్ల దూరంలో ఉన్న డెయిరీలకు కూడా టెండర్లలో పాల్గొనే అవకాశం లభించింది. ఇక్కడే అవినీతికి బీజం పడింది. భోలే బాబా డెయిరీ రంగప్రవేశం చేయగలిగింది. ఈ నిబంధనల సవరణ విచిత్రంగా జరిగింది. పాలక మండలి ముందుకు ఈ సవరణలకు సంబంధించిన తీర్మానం రాలేదు. ఆ రోజు టెండరు ఖరారు చేయాల్సిన తీర్మానాన్ని పక్కన పెట్టి... నెయ్యి సేకరణ విధానంలో మార్పులు చేయడానికి కమిటీని ఏర్పాటు చేస్తూ తీర్మానం చేశారు. పోటీతత్వం పెరగడానికి వీలుగా నిబంధనలను సడలించాలన్నదే తమ ఉద్దేశమని అప్పటి అధికారులు చెబుతున్నారు. అయితే... బోర్డు ముందుకు వచ్చిన తీర్మానం ఒకటి కాగా, ఆమోదం పొందిన తీర్మానం మరొకటి కావడమే అనుమానాలకు తావిచ్చేలా ఉంది.**

చోరీపైనా 'చిన్న' మాటలు..

పరకామణి చోరీ వ్యవహారంలో కూడా జగన్‌రెడ్డి అడ్డగోలు వాదనకు తెర లేపారు. పరకామణి లెక్కింపు సందర్భంగా రవి కుమార్ అనే ఉద్యోగి 9 డాలర్లు దొంగిలించగా... ఆయన పద్నాలుగు కోట్ల విలువైన ఆస్తులను టీటీడీకి దఖలుపరచడం ఏమిటి? అన్నట్టుగా జగన్‌రెడ్డి వాదన సాగింది. నిజానికి రవి అనే అతను దొంగిలించింది 900 డాలర్లు. అలా అతను పరకామణి సొమ్ము దొంగిలించడం అదే మొదటిసారి కాదు. పాపం పండి ఆ రోజు దొరికిపోయాడు. దొంగిలించింది 9 డాలర్లా? 900 డాలర్లా? అన్నది ముఖ్యం కాదు. దేవుడి సొమ్ము దొంగిలించడం మహా పాపం! ఆ పాతకానికి ఒడిగట్టిన దొంగను శిక్షించకుండా రాజీ కుదుర్చుకోవడం ఏమిటి? ఆ అవసరం ఎవరికి, ఎందుకు వచ్చింది? దొంగతనానికి పాల్పడిన రవిని బెదిరించి సొమ్ము చేసుకున్న వారిలో కిషోర్, జగన్మోహన్‌రెడ్డి, పరమేశ్వర్‌రెడ్డి అనే పోలీసు అధికారులు ఉన్నట్టుగా అభియోగాలు ఉన్నాయి. వీరితో పాటు తెర వెనుక ఇంకెవరెవరు ఉన్నారో తేలాల్సి ఉంది. హైకోర్టు ఆగ్రహంతో సీఐడీ అధికారులు ఈ కేసు దర్యాప్తును సీరియస్‌గా తీసుకున్నారు. ఈ చోరీ కేసులో లోక్ అదాలత్‌లో రాజీ కుదుర్చుకోవలసిన అవసరం ఏమిటి? ఇదంతా ఎందుకు జరిగింది? ఎవరి ప్రోద్బలంతో అలా జరిగిందో కూడా తేలాల్సి ఉంది. నేరస్తుడు పరకామణిలో చోరీ చేయడం అదే మొదటిసారి కూడా కాదు. కోటానుకోట్ల మంది ఆరాధించే ఆ దేవదేవుడి సన్నిధిలో ఇలాంటి ఘోరాలు జరగడం ఏమిటి? కల్తీ నెయ్యి సరఫరా చెయ్యడమైనా, పరకామణి చోరీ కేసైనా... దేవుడంటే భయం లేనట్టే కదా? దేవుడిని నిజంగా నమ్మేవాళ్లు, పూజించే వాళ్లు ఇలాంటి నీచపు పనులకు పాల్పడరు కదా! తిరుమలలో జరుగుతున్న కొన్ని సంఘటనలను గమనిస్తే టీటీడీలో పనిచేస్తున్న కొందరికి ఆ దేవుడిపైన నమ్మకం, భయం లేనట్టే ఉంది. దేవుడిగా ఆ వెంకటేశ్వరుడిని నమ్మక పోతే నమ్మకపోయారు, ఆ దేవుడి పుణ్యానే కదా వారికి అక్కడ భృతి లభిస్తున్నది? అందుకైనా వారికి ఆ దేవదేవుడిపై భక్తి ఉండాలి కదా? పాలకమండలిగానీ, టీటీడీలో పనిచేస్తున్న అధికారులు, ఉద్యోగులుగానీ... 'దేవుడ్ని వాడుకుంటున్నామా? ఆ దేవదేవుడి కోసం పనిచేస్తున్నామా?' అని ఆత్మపరిశీలన చేసుకోవాలి. డబ్బు మాత్రమే సంపాదించాలని అనుకుంటే అందుకు ఎన్నో మార్గాలు ఉంటాయి. కోటానుకోట్ల భక్తుల మనోభావాలతో ముడిపడి ఉన్న అంశాలలో అనైతిక చర్యలకు పాల్పడటమేమిటి? పాపానికి ఒడిగట్టిన వారి విషయం అలా ఉంచితే, సదరు పాపాన్ని చిన్నదిగా చూపించే ప్రయత్నం చేస్తున్న జగన్మోహన్‌రెడ్డిని ఏమనాలి? క్రైస్తవ మతస్థుడైన జగన్‌రెడ్డికి కోనేటి రాయుడిపై నమ్మకం లేకపోవచ్చు. ఆ ఏడుకొండల వాడిని కోట్లాది మంది ఆరాధిస్తారు కదా? వారి మనోభావాలనైనా ఆయన గుర్తించి గౌరవించాలి కదా? జీసస్ సన్నిధిలో ఇలా జరిగితే జగన్‌రెడ్డి సహిస్తారా? అని బీజేపీ నాయకుడు భానుప్రకాశ్‌రెడ్డి ప్రశ్నించారు కానీ, జగన్‌రెడ్డి వంటి వారికి అవేవీ పట్టవు. వారు తమ స్వార్థం కోసం దేవుళ్లను కూడా వాడుకుంటారు. జగన్‌రెడ్డి ఇందుకు మినహాయింపు కాదు. అందుకే తిరుమలలో జరుగుతున్న అపచారాలు ఆయనకు స్వల్పమైనవిగా కనిపిస్తున్నాయి. తన వాళ్లను రక్షించుకొనే క్రమంలో దేవుడైనా ఆయనకు లెక్క ఉండదు. అయినా అలాంటి వాళ్ల సంగతి ఇక ఆ దేవుడే చూసుకుంటాడు!

క్రీమీలేయర్‌ను కాదంటే, రిజర్వేషన్లు వద్దన్నట్టే!

దేశంలో కులవ్యవస్థ, పేదరికం ఉన్నంతవరకు రిజర్వేషన్ల మీద, రిజర్వేషన్లలో క్రీమీలేయర్ మీద వాదనలు వినపడుతూనే ఉంటాయి. బీసీ, ఎస్సీ, ఎస్టీలలో ధనవంతులు, ఎగువ మధ్య తరగతి వాళ్లను 'క్రీమీలేయర్' అంటాం. వాళ్ల పిల్లలకు రిజర్వేషన్లు ఇవ్వకూడదు అనేది క్రీమీలేయర్ సిద్ధాంతం. ముందుగా మనం రిజర్వేషన్లు లేకుంటే పరిస్థితి ఎలా ఉండేదో మాట్లాడుకుందాం.

1951–52 ఎన్నికల్లో 80శాతం మంది ఎన్నికైన ముఖ్యమంత్రులు ఒకే కులానికి చెందిన వాళ్ళు. మొదటి ముప్పై సంవత్సరాలు ఎంపికైన ఐఏఎస్ ఆఫీసర్లు (ఎస్సీ/ ఎస్టీ తప్ప) 80శాతం మంది ఒకటే కులానికి చెందినవారు. రిజర్వేషన్లు లేని హైకోర్టులో సుప్రీంకోర్టులో జడ్జీలు ఏ కులం వాళ్లు మాత్రమే ఉంటారో చూస్తున్నాం. 60శాతం బీసీలు ఉన్న దేశంలో రెండు శాతం బీసీలు మాత్రమే గత 75 సంవత్సరాలలో జడ్జీలుగా ఎంపిక అయ్యారు. సోకాల్డ్ ఉన్నత కులాల నుంచి వచ్చిన జడ్జీలు అవినీతి చేయకుండా చకచకా జడ్జిమెంట్లు ఏమైనా ఇచ్చారా అంటే అలాంటిది ఏమీ కనపడటం లేదు. పోనీ ఉన్నత వర్గాల నుంచి వచ్చిన ఐఏఎస్‌లు గొప్ప పరిపాలన చేసి దేశంలో పేదరికం పారద్రోలారా అంటే అదీ లేదు. దేశంలో మరో వందేళ్ళ తరవాత కూడా కులం ఉంటుంది. 'నాకు రోటీ లేకున్నా పర్లేదు, విద్య లేకున్నా పర్లేదు, ఉద్యోగం లేకున్నా పర్లేదు, కానీ మందిర్ కావాలి' అనే మూర్ఖులను తయారు చేస్తున్న రాజకీయ పార్టీలు ఉన్నంతవరకు కులాలు వర్ధిల్లుతాయి. మన దేశం మానవ అభివృద్ధి సూచికలో వెనక్కి వెళ్తూనే ఉంటుంది.

అందరికీ తెలియాల్సింది ఏమిటంటే జీడీపీ పెరిగితే మానవ అభివృద్ధి సూచిక పెరగదు, సగటు తలసరి ఆదాయం పెరిగితే మానవ అభివృద్ధి సూచిక పెద్దగా పెరగదు. అందరికీ న్యాయమైన ఉన్నత విద్య, నాణ్యమైన ఆరోగ్య సేవలు, అందరికీ కల్తీ లేని పౌష్టికాహారం, అందరికీ కొనుగోలు శక్తి, లింగ సమానత్వం, స్వచ్ఛమైన తాగునీరు, గౌరవప్రదమైన ఉపాధి, హింస లేని సమాజం... ఇవన్నీ సాధ్యమైనప్పుడే మానవాభివృద్ధి సూచిక ముందుకు వెళుతుంది.

> **కులాలు ఉన్నంతవరకు రిజర్వేషన్లు ఉండాల్సిందేనని ఎట్లా చెప్పుకుంటున్నామో, అలాగే పేదరికం ఉన్నంతకాలం క్రీమీలేయర్ ఉండాల్సిందే. రిజర్వేషన్లు లేకపోతే ధనిక కులాలు ఎలా ఎక్కువ లబ్ధి పొందుతాయో, అలాగే క్రీమీలేయర్ లేకపోతే రిజర్వేషన్ కులాలలో ఉన్న ధనవంతులు తమ కులాలలో ఉన్న పేదలను వెనక్కినెట్టి ఎక్కువ లబ్ధి పొందుతారు.**



కులాలు ఉన్నంతవరకు రిజర్వేషన్లు ఉండాల్సిందేనని ఎట్లా చెప్పుకుంటున్నామో అలాగే పేదరికం ఉన్నంతకాలం క్రీమీ లేయర్ ఉండాల్సిందే. రిజర్వేషన్లు లేకపోతే ధనిక కులాలు ఎలా ఎక్కువ లబ్ధి పొందుతాయో, అలాగే క్రీమీలేయర్ లేకపోతే రిజర్వేషన్ కులాలలో ఉన్న ధనవంతులు ఆ కులాలలో ఉన్న పేదలను వెనక్కినెట్టి ఎక్కువ లబ్ధి పొందుతారు.

క్రీమీలేయర్ లేకపోవడం వల్ల– ఒకే గేటెడ్ కమ్యూనిటీలో నివసించే ఇద్దరు అమ్మాయిలు ఎలా ఫీల్ అవుతారో చూద్దాం. ఒక ఎస్టీ అమ్మాయి, ఒక ఓసీ అమ్మాయి ఇద్దరి ఆర్థిక స్థాయి ఒక్కలాగే ఉంది. ఎస్టీ అమ్మాయికి తన కంటే పది మార్కులు తక్కువ వచ్చినా కానీ ఒక మంచి ప్రభుత్వ కళాశాలలో ఎంబీబీఎస్ సీటు వచ్చినప్పుడు ఆ ఓసీ అమ్మాయికి ఏమీ అర్థం కాదు. ఇదేమి అన్యాయం అనుకుంటుంది. రిజర్వేషన్ల చరిత్ర, నేపథ్యం తెలియదు కాబట్టి ఆ ఓసీ అమ్మాయి ఇక అప్పటి నుంచి రిజర్వేషన్లను వ్యతిరేకిస్తుంది. కింది కులాలను ద్వేషిస్తుంది. ఇందుకు భిన్నంగా– గ్రామీణ ప్రాంతంలో కానీ, పేదవాళ్లు ఉన్న బస్తీ నుంచి కానీ వచ్చిన అమ్మాయికి పది మార్కులు తక్కువ వచ్చినా, ఆ ఎంబీబీఎస్ సీటు వచ్చినప్పుడు అదే ఓసీ అమ్మాయి కొంతమేరకు అర్థం చేసుకుంటుంది. క్రీమీలేయర్ అనేది రిజర్వేషన్లలో రిజర్వేషన్ అని అర్థం చేసుకోవాలి. క్రీమీలేయర్ వద్దు అనే వాళ్ళు రిజర్వేషన్ వద్దు అనే వాళ్లతో సమానం.

క్రీమీలేయర్ విధానం ఉంటే విద్యలో రిజర్వేషన్ సీట్లు, ప్రభుత్వ రిజర్వుడు ఉద్యోగాలు నిండవనీ ఖాళీగా ఉండిపోతాయనీ చేసే వాదన చాలా తప్పు. ఇప్పుడు ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాల్లో కొన్ని కోట్లమంది అర్హులైన అభ్యర్థులు ఉన్నారు.

'మంచి కార్పొరేటు విద్యాసంస్థల్లో చదువు పొందిన ఉన్నత ఉద్యోగస్థుల పిల్లలనూ, నాణ్యతలేని ప్రభుత్వ/ బడ్జెట్ ప్రైవేటు పాఠశాలల్లో చదువు పొందిన పేదకూలీల, అల్పాదాయ వర్గాల పిల్లలనూ ఒకేలా చూడడం సరికాద'ని సుప్రీం మాజీ ప్రధాన న్యాయమూర్తి గవాయి వాదనతో నేను –విద్యను పొందిన మొదటి తరం ఉన్నత ఉద్యోగిగా– పూర్తిగా ఏకీభవిస్తున్నాను. క్రీమీలేయర్ విధానం ఉంటే అందరికీ సమాన అవకాశాలు వస్తాయి. ఈ విధానం అందరికీ సమానత్వం, అందరికీ సమన్యాయం అనే రాజ్యాంగ స్ఫూర్తికి అనుబంధంగానే ఉందని మనం తెలుసుకోవాలి. 'వాళ్లు వాళ్లు కొట్టుకొని చావనీ' అని పరిపాలన చేసే పెద్ద కులాల పాలకులకు ఇది ఒక పెద్ద సమస్యగా కనపడదు. సమాజంలో ప్రభావం చూపించగలిగే ఎస్సీ, ఎస్టీ, బీసీ ఉన్నత ఉద్యోగులతో మనకు ఎందుకు వివాదం అని రాజకీయ పార్టీలు ఈ సమస్యను పక్కన పడేస్తాయి. అందరికీ సమాన అవకాశాలు ఉండాలి, సమానత్వం సాధించాలి అనుకునే బుద్ధిజీవులే ఈ విషయంలో నిర్మొహమాటంగా మాట్లాడవలసిన అవసరం ఉంది.

▪ ఆకునూరి మురళి
రిటైర్డ్ ఐఏఎస్

హోం గార్డులకు త్వరలో ఉచిత వైద్యసేవలు



హోంగార్డుకు ప్రశంసాపత్రం అందజేస్తున్న సీపీ

- శాంతిభద్రతల పరిరక్షణలో వారి సేవలు ప్రశంసనీయం
- పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్

6



అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి ఇంట్లో లభ్యమైన నగదుతో ఏసీబీ అధికారులు

నోట్ల కట్టలు బట్టబయలు

- ఏసీబీకి పట్టుబడిన అదనపు కలెక్టర్‌పై రెండో రోజు విచారణ
- హనుమకొండ, హైదరాబాద్ నాగోల్‌లోని ఇళ్లల్లో సోదాలు
- ఆధారాల్లేని రూ.30 లక్షల నగదు సీజ్
- ఖమ్మం జైలుకు వెంకట్‌రెడ్డి సహా ముగ్గురి తరలింపు

వరంగల్ క్రైం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఓ ప్రైవేటు పాఠశాల అనుమతుల రెన్యూవల్ కోసం ఇన్‌చార్జి డీఈవో హోదాలో లంచం తీసుకొని శుక్రవారం సాయంత్రం ఏసీబీ అధికారులకు పట్టుబడ్డ హనుమకొండ జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డిపై అధికారులు విచారణ సాగిస్తున్నారు. ఈ క్రమంలో రెండో రోజైన శనివారం హనుమకొండ, హైదరాబాద్‌లో వెంకట్‌రెడ్డికి సంబంధించిన ఆస్తుల విషయంలో సోదాలు నిర్వహించారు. హైదరాబాద్‌లోని నాగోల్‌లో ఉన్న సొంత ఇంటితో పాటు హనుమకొండ నిట్ కళాశాల ఎదురుగా ఉన్న కిరాయి ఇంట్లో ఏసీబీ అధికారులు (మిగతా 6వ పేజీలో)



కలెక్టరేట్ ఎదుట గ్రీన్‌ఫీల్డ్ హైవే బాధిత రైతుల సంబరాలు

మా గోస తాకి ఏసీబీకి పట్టుబడ్డారు..

- అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డిపై గ్రీన్‌ఫీల్డ్ హైవే రైతుల ఫైర్
- కలెక్టరేట్ ఎదుట టపాసులు పేల్చి సంబరాలు

7

- మంత్రి, ఎమ్మెల్యేలు, కీలక నేతలు, ఇన్‌చార్జిల సహకారంపై అనుమానాలు
- అధ్యక్ష పీఠం దక్కని నేతల్లో అసంతృప్తిపై దృష్టిసారించని అధిష్ఠానం
- డీసీసీ అధ్యక్షులే అన్ని వర్గాలను కలుపుకుని వెళ్లాల్సిన పరిస్థితి
- బాధ్యతలు చేపట్టగానే ఎన్నికలు రావటంతో ఆందోళన
- సారథుల పనితీరుకు పంచాయతీ పరీక్ష



డీసీసీ చీఫ్‌లకు పంచాయతీ సవాల్

మెజారిటీ స్థానాల్లో గెలుపే తొలి టాస్క్

■ ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్

కాంగ్రెస్ పార్టీలో నూతన డీసీసీ అధ్యక్షుల సత్తాకు పంచాయతీ ఎన్నికలు పరీక్షగా మారాయి. బాధ్యతలు చేపట్టగానే సర్పంచ్ ఎన్నికలు రావటంతో మెజారిటీ స్థానాల్లో గెలుపు సాధించటంతో పాటు అన్ని వర్గాలను సమన్వయం చేయటం డీసీసీ చీఫ్‌లకు సవాల్‌గా మారింది. సీనియర్ నేతలు అనేకమంది డీసీసీ పదవిపై ఆశతో దరఖాస్తు చేసుకున్నప్పటికీ కొన్ని జిల్లాల్లో సామాజిక సమీకరణల పేరుతో ఊహించని నేతలకు పదవిని కట్టబెట్టారు. అయితే అధ్యక్ష పదవిని ఆశించిన నేతల్లోని అసంతృప్తిపై అధిష్ఠానం చర్చించకపోవటంతో పంచాయతీ ఎన్నికల్లో వారి సహకారంపై అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. పైగా మంత్రి, ఎమ్మెల్యేలు, సీనియర్ నేతలు డీసీసీ చీఫ్‌ల ఆధిపత్యాన్ని అంగీకరించి, వారితో కలిసి పని చేస్తారా? అనేది కూడా చర్చనీయాంశంగా మారింది.

కొత్త అధ్యక్షులకు తొలి పరీక్ష

అధికారంలోకి వచ్చిన తరువాత కాంగ్రెస్ పార్టీ జిల్లాలకు నూతన అధ్యక్షులను నియమించింది. డీసీసీ అధ్యక్ష పదవి కోసం ఉమ్మడి జిల్లాలోని ఆరు జిల్లాల నుంచి వందలాదిమంది దరఖాస్తులు చేసుకున్నారు. అయితే అధిష్ఠానం సామాజిక సమీకరణలను దృష్టిలో ఉంచుకునే జిల్లా అధ్యక్షులను నియమించిందనే వ్యాఖ్యలు వినబడుతున్నాయి. హనుమకొండ జిల్లా అధ్యక్షుడిగా 'కుడా' చైర్మన్ ఇనుగాల వెంకట్రామిరెడ్డి, వరంగల్ జిల్లా అధ్యక్షుడిగా అయూబ్, జనగామ జిల్లా అధ్యక్షురాలిగా జడ్పీ మాజీ చైర్‌పర్సన్ లకావత్ ధన్వంతి, మహబూబాబాద్ జిల్లా అధ్యక్షురాలిగా ఎమ్మెల్యే మురళీ నాయక్ సతీమణి ఉమా, భూపాలపల్లి జిల్లా అధ్యక్షుడిగా భట్టు కరుణాకర్, ములుగు జిల్లా అధ్యక్షుడిగా పైడాకుల అశోక్‌లను అధిష్ఠానం నియమించింది. ఒక్క ములుగు జిల్లాకు మాత్రం మంత్రి సీతక్క ఒత్తిడితో పైడాకుల అశోక్ మినహా మిగతా అన్ని జిల్లాలకు కొత్తవారికి అధ్యక్ష బాధ్యతలు అప్పగించింది. వీరంతా ఏఐసీసీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షినటరాజన్, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌గౌడ్ సమక్షంలో డిసెంబరు 2వ తేదీన గాంధీభవన్‌లో అధ్యక్షులుగా బాధ్యతలు స్వీకరించారు. పార్టీ అధికారంలో ఉండటంతో డీసీసీ అధ్యక్ష పదవికి (మిగతా 7వ పేజీలో)

ప్రచారంలో డీసీసీ చీఫ్‌లు ఎక్కడ..?

పంచాయతీ ప్రచారంలో జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు ఇంకా దిగలేదని తెలుస్తోంది. పంచాయతీ ఎన్నికల్లో తమ మార్కు రాజకీయాన్ని చూపించి, మెజారిటీ స్థానాల్లో గెలుపు దిశగా పయనించేలా కార్యాచరణ రూపొందించలేదనే చర్చ నడుస్తోంది. ఈ నెల 11వ తేదీన ఉమ్మడి జిల్లాలో 555గ్రామ పంచాయతీలకు ఎన్నికలు జరుగనున్నాయి. ఇప్పటి వీటిలో 39వరకు ఏకగ్రీవం కావటంతో మిగతా పంచాయతీల్లో అభ్యర్థులే ప్రచారం నిర్వహిస్తున్నారు. కాంగ్రెస్ నుంచి అయా నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలు బరువు, బాధ్యతలను భుజస్కందాలపై వేసుకుని ముందుకు వెళుతున్నారు. అయితే కొత్త అధ్యక్షులు ప్రచారంలో హుషారుగా పాల్గొన్న దాఖలాలు లేవనే చర్చ నడుస్తోంది. అధిష్ఠానం కూడా కొత్త అధ్యక్షుల పనితీరుపై ఆరునెలలు పరీక్షించాలని నిర్ణయించింది. పంచాయతీ, ఆ తరువాత వచ్చే పరిషత్తు ఎన్నికల్లో పనితీరు బాగాలేక పోతే డీసీసీ చీఫ్‌ల పీఠాలను కదిలించే అవకాశం లేకపోలేదనే చర్చ పార్టీ కేడర్‌లో జరుగుతోంది.



కొంప ముంచిన లాభాల ఆశ

- స్టాక్‌మార్కెట్ యాప్‌లో రూ.2.51 కోట్ల పెట్టుబడి పెట్టిన ఇద్దరు వైద్యులు
- అది బోగస్ అని తేలడంతో లబోదిబో

వరంగల్ మెడికల్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): స్టాక్ మార్కెట్ ట్రేడింగ్‌లో అధిక లాభాలు వస్తాయనే ప్రచారాన్ని నమ్మి ఇద్దరు వైద్యులు సైబర్ నేరగాళ్ల బారిన పడి మోసానికి గురయ్యారు. ఉన్నత విద్యావంతులు అయినప్పటికీ సైబర్ వలలో చిక్కుకొని రూ.2.51 కోట్లు పోగొట్టుకున్నారు. స్టాక్ మార్కెట్ యాప్‌లో హనుమకొండ జిల్లా పరకాలకు చెందిన ఇద్దరు యువ వైద్యులు రూ.2 కోట్ల 51 లక్షలు పెట్టుబడి పెట్టి పోగొట్టుకున్నారు. తమకు జరిగిన మోసంపై వారు ఈ నెల 3న పరకాల పోలీసులకు ఫిర్యాదు చేశారు. అయితే వెంటనే సైబర్ క్రైమ్‌కు ఫిర్యాదు చేయాలని పోలీసులు సూచించారు. పోగొట్టుకున్న డబ్బు పెద్దమొత్తం కావడంతో నేషనల్ సైబర్ సెక్యూరిటీ బ్యూరో కూడా రంగంలోకి దిగింది. వివరాలు ఇలా ఉన్నాయి...

హనుమకొండ జిల్లా పరకాలలో ప్రైవేట్ ప్రాక్టీస్ చేస్తున్న ఇద్దరు యువ వైద్యులు ఓ స్టాక్ మార్కెట్ యాప్‌లో క్యూఆర్ కోడ్ ద్వారా రూ.2కోట్ల 51 లక్షల ట్రాన్సాక్షన్ పూర్తి చేశారు. ఆ యాప్‌కు సంబంధించిన మహిళా ఉద్యోగి సదరు వైద్యులతో మాట్లాడి పెట్టుబడులు పెట్టేలా ప్రోత్సహించినట్టు తెలిసింది. ఇద్దరిలో ఒక వైద్యుడు రూ.1.40 కోట్లు, మరొక వైద్యుడు రూ.1.11 కోట్లుక్యూఆర్ కోడ్ ద్వారా పంపించారు. అయితే తాము పంపిన డబ్బులకు సంబంధించి ఎలాంటి రిప్లై రాకపోవడంతో మోసానికి గురయ్యామని, తాము లావాదేవీలు సాగించిన యాప్ బోగస్ అని భావించి ఈనెల 3న పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిసింది.నేషనల్ సైబర్ బ్యూరోకు సంబంధించిన అధికారులు తెలంగాణ సైబర్ అధికారులకు సమాచారం అందించారు. కేసు ప్రస్తుతం విచారణలో ఉంది.

పకడ్బందీగా ఎన్నికల నిర్వహణ

- ఎన్నికల సంఘం నిబంధనలను అమలు చేయాలి
- కలెక్టర్ స్నేహ శబరీష్
- ఐనవోలు మండలంలో నామినేషన్ కేంద్రాల తనిఖీ



ఐనవోలులో నామినేషన్ల ఉపసంహరణ ప్రక్రియను పరిశీలిస్తున్న కలెక్టర్ స్నేహ శబరీష్

ఐనవోలు, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): ఎన్నికల సంఘం నియమ నిబంధనలను అనుసరిస్తూ పంచాయతీ ఎన్నికల నిర్వహణను పకడ్బందీగా అమలు చేయాలని కలెక్టర్ స్నేహ శబరీష్ అధికారులకు సూచించారు. ఐనవోలు, పంథిని క్లస్టర్‌లను శనివారం క్షేత్రస్థాయిలో సందర్శించి సర్పంచ్, వార్డు స్థానాల ఉపసంహరణ ప్రక్రియను పరిశీలించారు. ఏకగ్రీవమైన వివరాలు, ఫారం 9ని ఎలా ప్రిపేర్ చేస్తున్నారని ఆర్‌వోలను అడిగి తెలుసుకున్నారు. పంచాయతీ ఎన్నికలకు సంబంధించిన నివేదికలను ఆలస్యం చేయకుండా పంపించాలని, నామినేషన్లు ఉపసంహరించుకున్న అభ్యర్థుల వివరాలను రిజిస్టర్‌లో నమోదు చేయాలని సూచించారు.

ఎస్ఎస్‌టీ చెక్ పోస్టు తనిఖీ

పున్నేలు క్రాస్ రోడ్డు వద్ద ఏర్పాటు చేసిన స్టాటిక్ సర్వైలెన్స్ (ఎస్ఎస్‌టీ) చెక్ పోస్టును కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎన్నికల నిబంధనలు, ఎంసీసీ అమలు, వాహనాల పర్యవేక్షణ, అనుమానస్పద రవాణా, నివారణపై అధికారులు సక్రమంగా పర్యవేక్షణ నిర్వహిస్తున్నారో లేదో స్వయంగా కలెక్టర్ పరిశీలించారు. ఎస్ఎస్‌టీ చెకపోస్టుకు సంబంధించిన రికార్డును పరిశీలించారు. ఎంతమంది సిబ్బంది తనిఖీలు నిర్వహిస్తున్నారు. రోజు వాహన తనిఖీలపై ఆరా తీశారు. ఎన్నికల విధులు నిర్వర్తించే సిబ్బంది మరింత అప్రమత్తంగా ఉండాలని ఎన్నికల నియమావళి ప్రకారం ప్రతీ వాహనాన్ని నిఖార్సుగా తనిఖీ చేసి ఎలాంటి అనుమానస్పద రవాణా జరుగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కలెక్టర్ వెంట నామినేషన్ కేంద్రాల్లో ఎంపీడీవో నర్మద, తహసీల్దార్ విక్రమ్‌కుమార్, ఎంపీవో రఘుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రిటైర్డ్ ప్రిన్సిపాల్ ర్యాష్ డ్రైవింగ్

- కుమార్‌పల్లిలో జనం పైకి దూసుకెళ్లిన కారు
- ఒకరి మృతి, 8 మందికి గాయాలు



ప్రమాదానికి కారణమైన కారును తీసుకెళుతున్న పోలీసులు

వరంగల్ క్రైం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): హనుమకొండలోని కుమార్‌పల్లి మార్కెట్ సమీపంలో ఓ రిటైర్డ్ ప్రిన్సిపాల్ నిర్లక్ష్యంతో డ్రైవింగ్ చేస్తూ భయానక వాతావరణం సృష్టించాడు. దీంతో 8 మందికి తీవ్రగాయాలు కాగా, ఒక వ్యక్తి మరణించాడు. హనుమకొండ పోలీసుల కథనం ప్రకారం.. రాంనగర్‌కు చెందిన రిటైర్డ్ ప్రిన్సిపాల్ బిల్లా మదన్‌మోహన్ (70) శనివారం మధ్యాహ్నం కుమార్‌పల్లి నుంచి రాంనగర్‌కు కారులో బయలుదేరాడు. ఈ క్రమంలో నిర్లక్ష్యంగా అతివేగంతో రోడ్డుపై ముందున్న వారిని ఢీకొట్టుకుంటూ వెళ్లి చివరికి ట్రాన్స్‌ఫార్మర్ ఫెన్సింగ్‌కు తాకి ఆగిపోయాడు. ఈ క్రమంలో ద్విచక్రవాహనంపై లష్కర్‌బజార్‌కు చెందిన అమ్జద్ పాషా(30)తీవ్రగాయాలు కాగా, స్థానికులు ఎంజీఎంకు తరలించారు. మెరుగైన వైద్యం కోసం హనుమకొండలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మరణించాడు. అదే విధంగా తన వాహనంపై ఉన్న రెండేళ్ల కుమారుడికి ముక్కులో నుంచి తీవ్ర రక్తస్రావం అవుతుండగా పిల్లల ఆస్పత్రిలో చేర్పించారు. అదే విధంగా అక్తర్‌పాషా అనే వ్యక్తి కాలు విరిగింది. వీరు కాక మరో ఐదుగురికి సైతం గాయాలు కాగా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నట్లు పోలీసులు తెలిపారు. మృతుడి తండ్రి యాకూబ్ పాషా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు.

ఒక్కతాటిపైకి వచ్చి...

- ఐదుగురు సర్పంచ్‌లు, 153 వార్డు సభ్యులు ఏకగ్రీవం
- మొదటి విడతలో తేలిన లెక్క

హనుమకొండ టౌన్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ జిల్లాలో గ్రామ పంచాయతీ సర్పంచ్, వార్డు స్థానాల ఎన్నికల మొదటి విడతలో ఐదు గ్రామాల సర్పంచ్ స్థానాలు ఏకగ్రీవమైనట్లు ఎన్నికల అధికారులు శనివారం తెలిపారు. జిల్లాలోని మొదటి విడతలో 69 గ్రామ పంచాయతీలకు ఐదు గ్రామాలు ఏకగ్రీవం కాగా, మిగతా 64 గ్రామ సర్పంచ్ స్థానాలకు 264 మంది అభ్యర్థులు బరిలో ఉన్నట్లు తెలిపారు. అలాగే మొదటి విడతలోని 658 వార్డు స్థానాలకుగాను 153 వార్డు స్థానాలు ఏకగ్రీవం కాగా, మిగతా 505 వార్డు స్థానాలకు 1,339 మంది అభ్యర్థులు బరిలో ఉన్నట్లు తెలిపారు. ఏకగ్రీవమైన గ్రామాల సర్పంచ్‌లు భీమదేవరపల్లి మండలంలోని వీర్లగడ్డ తండా సర్పంచ్‌గా గుగులోత్ పూర్ణిమ, ఎల్కతుర్తి మండలంలోని గుంటూర్‌పల్లి సర్పంచ్‌గా శ్రీరాం చౌదరి సుధీర్‌రెడ్డి, శాంతి నగర్ సర్పంచ్‌గా బాసాని వెలంగిని మేరి, కమలాపూర్ మండలంలోని కొత్తపల్లి గ్రామ సర్పంచ్‌గా పుల్లూరి రవీందర్‌రావులు ఏకగ్రీవం అయినట్లు తెలిపారు.

ఎన్నికలు పూర్తయ్యేవరకు కోడ్ అమలు

హనుమకొండ కలెక్టరేట్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో గ్రామపంచాయతీ ఎన్నికలు పూర్తయ్యే వరకు ఎన్నికల కోడ్ అమలులో ఉంటుందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ స్నేహ శబరీష్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో మూడు దశల్లో ఈ నెల 11, 14, 17 తేదీల్లో ఎన్నికలు నిర్వహిస్తున్నందున చివరి దశ ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యే వరకు ఎన్నికల కోడ్ అమలులో ఉంటుందన్నారు. ఏకగ్రీవ గ్రామపంచాయతీల్లోనూ ఎన్నికల కోడ్ యథాతథంగా అమలులోనే ఉంటుందన్నారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం చివరిదశ ఎన్నికల ప్రక్రియ వరకు ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ఎవరూ ఎన్నికల ప్రవర్తనా నియామవళి ఉల్లంఘించవద్దన్నారు. ఉల్లంఘించిన వారిపై చట్టప్రకారం చర్యలు ఉంటాయన్నారు. చివరిదశ ఎన్నికలు పూర్తయ్యే వరకు అధికారులు ఎన్నికల కోడ్‌ను పకడ్బందీగా అమలుచేయాలని సూచించారు.



సహజారెడ్డి (ఫైల్)

ఉన్నత విద్య కోసం వెళ్లి..

- అమెరికాలో అగ్నిప్రమాద ఘటనలో యువతి దుర్మరణం
- స్వస్థలం స్టేషన్‌ఘన్‌పూర్ మండలంలోని గుంటూరుపల్లి

6

కోచ్ ఫ్యాక్టరీలో కొలువులు దక్కేనా!?

- ప్రభుత్వం నుంచి స్పష్టత లేకపోవడంతో స్థానికుల్లో ఆందోళన
- పంజాబ్ తరహా జీవో జారీచేయాలని డిమాండ్
- ఇప్పటికే 80శాతం పూర్తయిన ఫ్యాక్టరీ నిర్మాణం
- వచ్చే ఏడాదిలో ప్రారంభానికి సన్నాహాలు



కోచ్ ఫ్యాక్టరీ

కాజీపేట, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : రైల్వే కోచ్ ఫ్యాక్టరీ స్థాపిస్తే స్థానికులకు ఉద్యోగ అవకాశాలు దక్కుతాయన్న ఆశలు అడియాసలుగానే కనిపిస్తున్నాయి. కోచ్ ఫ్యాక్టరీలో స్థానికులకు ఉద్యోగల కల్పన విషయంలో రైల్వే ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధుల నుంచి స్పష్టత కరువవుతోంది. ఇప్పటికే 80 శాతం ఫ్యాక్టరీ నిర్మాణం పూర్తయింది. ఫ్యాక్టరీ సందర్శన కోసం వస్తున్న రైల్వే జీఎంతోపాటు ఉన్నతాధికారులను, ఎమ్మెల్యేలు, ఎంపీలను కేంద్ర మంత్రులను భూ బాధితులు, స్థానిక నిరుద్యోగులు కలిసి వినతి పత్రాలు సమర్పిస్తూనే ఉన్నారు. ఉద్యోగాలు కల్పించాలని వినతులు సమర్పించి కాళ్లు మొక్కినా కనికరించడం లేదని స్థానికుల నుంచి విమర్శలు వస్తున్నాయి. ఉద్యోగాలు కల్పించాలని విన్నవించిన ప్రతీసారి రైల్వే అధికారులు, ప్రజాప్రతినిధులు.. 'చూద్దాం.. చేద్దాం..' అంటూ దాటవేస్తున్నారని నిరుద్యోగులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కోచ్ ఫ్యాక్టరీలో స్థానికులకు, భూ నిర్వాసితులకు శాశ్వత పద్ధతిలో ఉద్యోగాలివ్వకుంటే మరో ఉద్యమానికి సిద్ధం కాక తప్పదని వారు స్పష్టం చేస్తున్నారు.

పంజాబ్ తరహాలో నూతన జీవో

1985లో పంజాబ్‌లో సిక్కుల ఊచకోతతో జరిగిన అల్లర్లను తగ్గించడానికి, నిరుద్యోగ సమస్య తీర్చడానికి కాజీపేటకు మంజూరైన కోచ్ ఫ్యాక్టరీని పంజాబ్‌లోని కపూర్తలకు తరలించారు. అక్కడ ఏర్పాటు చేసిన కోచ్ ఫ్యాక్టరీలో ఆర్‌బీసీ 69/36ఏ/1988 ప్రత్యేక జీవో తీసుకువచ్చి పార్లమెంట్‌లో బిల్ పాస్ చేయించారు. ఈ జీవో ప్రకారం స్థానికులకు ఉద్యోగ అవకాశాలు కల్పించారని రైల్వే కార్మిక సంఘాల నేతలు గుర్తుచేస్తున్నారు. తెలంగాణ ఉద్యమం పుట్టిందే నీళ్ళ, (మిగతా 6వ పేజీలో)



అమ్మవారిని దర్శించుకున్న ట్రైబల్ వెల్ఫేర్ ప్రిన్సిపల్ సెక్రటరీ శరత్

అమ్మవారి సన్నిధిలో పలువురు ప్రముఖులు

వరంగల్ కల్చరల్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): వరంగల్ భద్రకాళి అమ్మవారిని శనివారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, కాళోజీ హెల్త్ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ రమేష్‌రెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. శనివారం రాత్రి ట్రైబల్ వెల్ఫేర్ ప్రిన్సిపల్ సెక్రటరీ, సీనియర్ ఐఏఎస్ అధికారి శరత్ కుటుంబ సమేతంగా అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రధానార్చకులు భద్రకాళి శేషు వారికి అమ్మవారి తీర్థ ప్రసాదాలు, శేషవస్త్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త తొనుపునూరి వీరన్న, సిబ్బంది పాల్గొన్నారు.

మహిళాశక్తి భవన నిర్మాణానికి చర్యలు చేపట్టండి

మేయర్ గుండు సుధారాణి



భవన నిర్మాణం కోసం భూపరిశీలన చేస్తున్న మేయర్

వరంగల్ కార్పొరేషన్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): బల్దియా ప్రధాన కార్యాలయ ఆవరణలో మహిళా శక్తి భవన నిర్మాణానికి చర్యలు చేపట్టాలని మేయర్ గుండు సుధారాణి అధికారులను ఆదేశించారు. శనివారం జీడబ్ల్యూఎంసీ ప్రధాన కార్యాలయ ఆవరణలో భవన నిర్మాణానికి స్థల పరిశీలన చేసి సమర్థవంతంగా పనులు చేపట్టేందుకు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. వనితనం సమీపంలో భవనం నిర్మాణం చేస్తే బాగుంటుందన్నారు. పక్కనే లోటస్ పాండ్ కూడాను కూడా ఏర్పాటు చేయాలన్నారు. ఈ ప్రాంతంలో నాలా ప్రవహిస్తున్న తీరును మేయర్ క్షేత్రస్థాయిలో పరిశీలించి ప్రజలకు ఇబ్బందులు ఏర్పడకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఈ సత్యనారాయణ, సీహెచ్‌వో పలాన రమేష్, ఎంహెచ్‌వో రాజేష్, హెచ్‌వో లక్ష్మారెడ్డి పాల్గొన్నారు.

సీఎం వచ్చారు.. వెళ్లారు

● ప్రజలకు ఒరిగిందేమిటి? ● మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి

నర్సంపేట, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): విజయోత్సవ సభ పేరుతో సీఎం రేవంత్‌రెడ్డి వచ్చి వెళ్లారే తప్ప ఆయన పర్యటన వల్ల నర్సంపేట నియోజకవర్గానికి చేకూరిన ప్రయోజనం శూన్యమని బీఆర్ఎస్ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి విమర్శించారు. పట్టణంలోని సర్వాపురంలో మునిసిపల్ మాజీ వైస్ చైర్మన్ మునుగాల వెంకట్‌రెడ్డి ఇంటి ఆవరణలో శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. నర్సంపేటకు ఏం చేశారని విజయోత్సవ సభ నిర్వహించారని ప్రశ్నించారు. కేవలం సర్పంచు, వార్డు సభ్యుల ఎన్నికల ప్రచారానికి వచ్చిన మొదటి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అని ఎద్దేవా చేశారు. సర్పంచ్ ఎన్నికలను ఎదుర్కొనే సత్తా కాంగ్రెస్ ఎమ్మెల్యేలకు లేదా అని ప్రశ్నించారు. సీఎం హెలికాప్టర్ ల్యాండ్ అయిన రాజుపేట గ్రామం ఎన్నికల పరిధిలో ఉందని, ఎన్నికల నియమావళిని ఉల్లంఘించినా తాము ఫిర్యాదు చేయలేదని అన్నారు. ఎన్నికల కమిషన్ రేవంత్‌రెడ్డికి ఏజెంటుగా పనిచేస్తున్నట్లు ఈ పర్యటన ద్వారా స్పష్టమైందని అన్నారు. సభ అంతా చీరలపైనే



నర్సంపేటలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి

సాగిందని, నియోజకవర్గ అభివృద్ధిపై సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టమైన హామీ ఇవ్వలేదని అన్నారు. కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ రాష్ట్ర మాజీ డైరెక్టర్ రాయిడి రవీందర్‌రెడ్డి, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు నాగెల్లి వెంకటనారాయణ, బీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు గోనెయువరాజ్, పార్టీ నాయకులు మచ్చిక నర్సయ్య, డాక్టర్ లెక్కల విద్యాసాగర్ రెడ్డి, నాగిశెట్టి ప్రసాద్, మండల శ్రీనివాస్, ఆబోతు రాజుయాదవ్, పెరుమాండ్ల రవి, దేవోజు సదానందం, గందె చంద్రమౌళి, మద్దెల సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

పీటీఐలకు ఇక పూర్తి విధులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

వరంగల్ ఎడ్యుకేషన్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): వరంగల్ జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న పార్ట్‌టైం ఇన్‌స్ట్రక్టర్ల (పీటీఐ)ల ఒక్క పూట విధులను నిలుపుదల చేస్తూ డీఈవో బి.రంగయ్యనాయుడు ఉత్తర్వులు జారీ చేశారు. పీటీఐలు ఒక్క పూట మాత్రమే విధులు నిర్వర్తించాలని జారీ చేసిన ఉత్తర్వులను నిలుపదల చేస్తూ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. డీఈవో జారీ చేసిన ఉత్తర్వులపై గత నెల 26న ఆంధ్రజ్యోతి జిల్లా పేజీలో 'ఒక్క పూట విధులు ఏల...?' కథనం వచ్చింది. దీంతో డీఈవో తన ఉత్తర్వులను మరోసారి పరిశీలించి ఆ ఉత్తర్వులను నిలుపుదల చేశారు.

దీంతో పీటీఐల సంఘం టీపీపీటా వ్యవస్థాపక అధ్యక్షుడు కె.కమలాకర్‌రావు, రాష్ట్ర అధ్యక్ష, ప్రధానకార్య దర్శులు కరుణ కుమారి, టి.శంకర్‌గౌడ్ తదితరులు ఆంధ్రజ్యోతికి కృతజ్ఞతలు తెలిపారు.

హోం గార్డులకు త్వరలో ఉచిత వైద్యసేవలు

● శాంతిభద్రతల పరిరక్షణలో వారి సేవలు ప్రశంసనీయం

● పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్

వరంగల్ క్రైం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): హోంగార్డులకు ఉచిత వైద్య సేవలందించేందుకు ప్రభుత్వం ఆలోచన చేస్తోందని పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ అన్నారు. 63వ హోంగార్డుల ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరేడ్‌గ్రౌండ్‌లో హోంగార్డులు పరేడ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. పోలీస్‌శాఖకు అందిస్తున్న సేవలకు తగ్గట్లుగానే హోంగార్డుల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం చొరవ చూపుతోందన్నారు. ట్రాఫిక్ పోలీసులతో సమానంగా ట్రాఫిక్‌విభాగంలో విధులు నిర్వర్తించే హోంగార్డులకు 30శాతం అదనపు వేతనం, పరేడ్ అలవెన్స్ రూ.వంద నుంచి రెండు వందల వరకు పెంచామన్నారు. వీటన్నింటితోపాటు ఉలన్ జాకెట్స్, రెయిన్ కోట్స్ అందించబడ్డాయన్నారు. అనంతరం విధి నిర్వహణలో ప్రతిభ కనబరిచిన హోంగార్డులకు ప్రశంసాపత్రాలు అందించడంతోపాటు రైజింగ్ డే సందర్భంగా నిర్వహించిన ఆటలపోటీల్లో గెలుపొందిన విజేతలకు సీపీ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఈస్ట్‌జోన్ డీసీపీ అంకిత్‌కుమార్, సెంట్రల్ జోన్ డీసీపీ కవిత, అదనపు డీసీపీలు రవి, సురేశ్‌కుమార్, శ్రీను వాస్, ప్రభాకర్, ఏసీపీలు మూల జితేందర్‌రెడ్డి, నాగయ్య, ఆర్ ఐలు చంద్రశేఖర్, సతీష్‌కుమార్, స్పర్జన్‌రాజ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పారదర్శకంగా హెల్త్ వర్సిటీ పాలన

● ర్యాగింగ్‌కు పాల్పడే వారిపై కఠిన చర్యలు ● వైస్ చాన్స్‌లర్ డాక్టర్ రమేశ్‌రెడ్డి

వరంగల్ మెడికల్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): కాళోజీ నారాయణరావు హెల్త్ యూనివర్సిటీలో పాలనను అత్యంత పారదర్శకంగా నిర్వహిస్తూ యూనివర్సిటీ ప్రతిష్ఠను పెంచడమే లక్ష్యంగా విధులు నిర్వహిస్తామని నూతన వైస్ చాన్స్‌లర్ డాక్టర్ రమేశ్‌రెడ్డి అన్నారు. శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. నాలుగు రోజుల్లో పీజీ సీట్ల కౌన్సెలింగ్ ప్రక్రియను ప్రణాళికతో ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. ప్రస్తుతం యూనివర్సిటీ పరిధిలో ఉన్న సీట్లతోపాటు నూతనంగా 420 పీజీ సీట్లు మంజూరు అయ్యాయన్నారు. ఈ కౌన్సెలింగ్ ప్రక్రియలో భాగంగా నేషనల్ మెడికల్ కౌన్సిలింగ్ వివిధ కళాశాలల్లో ఉన్న పాత పీజీ సీట్లతోపాటు కొత్తగా ఏ కళాశాల ఎన్ని సీట్లు మంజూరు అయ్యాయి అనే విషయాలు ఆన్‌లైన్‌లో స్పష్టంగా పేర్కొన్నామని తెలిపారు. ప్రస్తుతం ఎన్ఎంసీ పాత సీట్లతోపాటు నూతన సీట్లను సైతం ఆన్‌లైన్‌లో వెలువరించామన్నారు. పీజీ సీట్లకు అనుగుణంగా సీట్ మాట్రిక్స్ పద్ధతిలో కౌన్సెలింగ్ ప్రక్రియ నిర్వహించేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు.

ర్యాంగిగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు

వర్సిటీ పరిధిలోని మెడికల్ కళాశాలల్లో విద్యార్థులు ర్యాగింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ప్రతీ కళాశాలలో యాంటీ ర్యాగింగ్ కమిటీ ఉంటుందని, కళాశాల యాజమాన్యం ఎప్పటికప్పుడు ఇలాంటి విషయాలపై జాగ్రత్తగా ఉండాలని సూచించారు. సిబ్బంది కొరత విషయాన్ని గుర్తించి పూర్తిస్థాయి సిబ్బంది నియామకానికి కృషి చేస్తామని వీసీ పేర్కొన్నారు. సమావేశంలో రిజిస్ట్రార్ డాక్టర్ నాగార్జునరెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆరోగ్య వర్సిటీ వైస్ చాన్స్‌లర్ డాక్టర్ రమేశ్‌రెడ్డి

నగరంలో అక్రమ నిర్మాణాల తొలగింపు

వరంగల్ కార్పొరేషన్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): వరంగల్ పరిధిలోని ఆర్డీవో కార్యాలయం కూడలి నుంచి బెస్తం చెరువు మధ్య రోడ్లకు ఇరువైపులా అక్రమంగా నిర్మించిన అక్రమ కట్టడాలను శనివారం వరంగల్ బల్దియా టౌన్‌ప్లానింగ్ అధికారులు తొలగించారు. ఈ సందర్భంగా టౌన్ ప్లానింగ్ ఏసీపీ కలీమొద్దీం మాట్లాడుతూ.. ఆర్డీవో కార్యాలయం క్రాస్ రోడ్డు నుంచి బెస్తం చెరువు వరకు నిర్మించిన అక్రమ నిర్మాణాల కారణంగా చాలాప్రమాదాలు జరుగుతున్నాయని ఫిర్యాదులందాయన్నారు. వరంగల్ జిల్లా కలెక్టర్ సత్యశారదాదేవి, జీడబ్ల్యూఎంసీ కమిషనర్ చహత్ బాజ్‌పాయ్ ఆదేశాల మేరకు అక్రమ నిర్మాణాల తొలగింపు చేపట్టామన్నారు. ఇకపై నగరంలో ఎక్కడైనా ప్రభుత్వ స్థలాల్లోగానీ రోడ్లపైన గానీ అక్రమ నిర్మాణాలు చేపడితే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో టీపీఎస్ అవినాష్, టీపీబీవో రాజు పాల్గొన్నారు.



అక్రమ నిర్మాణాలను తొలగిస్తున్న అధికారులు

నోట్ల కట్టలు బట్టబయలు

(5వ పేజీ తరువాయి)

శనివారం సోదాలు చేశారు. అక్కడ ఎలాంటి ఆధారాలు లేనటువంటి రూ.30లక్షల నగదు లభ్యం కాగా, పలు కీలక డాక్యుమెంట్లు లభించాయని, వాటిని సీజ్ చేశామని ఏసీబీ డీఎస్పీ సాంబయ్య తెలిపారు.

ఖమ్మం జైలుకు తరలింపు

లంచం కేసులో శనివారం పట్టుబడ్డ అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డితో పాటు హనుమకొండ డీఈవో కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ గౌస్, జూనియర్ అసిస్టెంట్ మనోజ్‌ను అధికారులు కోర్టులో హాజరుపరిచారు. న్యాయమూర్తి ఆదేశాల మేరకు ముగ్గురినీ స్థానిక పోలీసుల సహకారంతో ఖమ్మం జైలుకు తరలించారు. వెంకట్‌రెడ్డి గతంలో నల్లగొండ తహసీల్దార్‌గా పనిచేస్తున్న సమయంలో ఆదాయానికి మించిన ఆస్తులు కేసు నమోదైందని, అది ఇంకా కొనసాగుతోందని అధికారులు వెల్లడించారు.

మొదటి నుంచీ ఆరోపణలే..

1995లో రెవెన్యూశాఖలో డిప్యూటీ తహసీల్దార్‌గా చేరిన వెంకట్‌రెడ్డి.. అంచెలంచెలుగా అదనపు కలెక్టర్ స్థాయికి ఎదిగారు. తనతో పాటే అవినీతిని సైతం అదే విధంగా పెంచుకుంటూ వస్తూ కోట్లు సంపాదించినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. జనగామ ఆర్డీవోగా చేస్తున్న సమయంలో భూసేకరణ విషయంలో భారీగా అవినీతికి పాల్పడ్డట్లు తెలుస్తోంది. అక్కడే ఓ గ్రామంలో తన కుటుంబసభ్యుల పేరిట వెంచర్ చేసి ప్లాట్లు విక్రయించి సొమ్ము చేసుకున్నట్లు వినికిడి. అంతకుముందు నల్గొండ తహసీల్దార్‌గా చేస్తున్న సమయంలో భారీగా అవినీతికి పాల్పడటంతో బాధితుల ఫిర్యాదు మేరకు ఏసీబీ అధికారులు ఆదాయానికి మించిన ఆస్తుల కేసు నమోదు చేసి అరెస్టు చేశారు. ఆ కేసు విచారణ కొనసాగుతున్నట్లు ఏసీబీ అధికారులు పేర్కొంటున్నారు.

ఇక హనుమకొండ అదనపు కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన తర్వాత భూ సేకరణ, నాలా కన్వర్షన్, రైస్ మిల్లర్ల విషయంలో భారీగా అవినీతికి పాల్పడి ఆస్తులు కూడబెట్టినట్లుగా ఆరోపణలున్నాయి. ఇటీవల శాయంపేటలో జరిగిన ఐకేపీలోని ధాన్యం స్కామ్‌లో అంతకముందే భారీగా ముడుపులు డిమాండ్ చేసినట్లుగా పోలీసుల విచారణలో తేలినట్లు సమాచారం. నెలన్నర కిందట హనుమకొండ జిల్లా ఇన్‌చార్జి విద్యాశాఖాధికారిగా బాధ్యతలు చేపట్టి.. అక్కడ కూడా ఇదే అవినీతి కొనసాగించినట్లు ఆరోపణలున్నాయి.

ఆ డబ్బు యూఎస్ఏ మిత్రుడు ఇచ్చాడు..

హనుమకొండలో అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి కిరాయి ఇంట్లో రూ.30లక్షల నగదు దొరికింది. దీనిపై ఏసీబీ అధికారులు ప్రశ్నించగా.. తన వ్యక్తిగత అవసరం కోసం యూఎస్ఏలో ఉంటున్న రియల్ ఎస్టేట్ వ్యాపారి గోపాల్‌రెడ్డి ద్వారా తెప్పించుకున్నానని సమాధానం ఇచ్చారు. ఆయన ఫోన్ నెంబర్ చెప్పండని ప్రశ్నించగా లేదని దాటేశాడు. 6 విదేశీ మద్యం బాటిళ్లు ఎక్కడివని ఆరా తీయగా.. విదేశాల్లో ఉన్న బంధువుల ద్వారా గిఫ్ట్ రూపంలో వచ్చాయన్నారు. కాగా, గోపాల్‌రెడ్డి ఎవరు అనే దానిపై ఏసీబీ అధికారులు దర్యాప్తు చేస్తున్నారు. కాగా, నగదుతో పాటు కీలకమైన డాక్యుమెంట్లను స్వాధీనం చేసుకొని పరిశీలిస్తున్నట్లుగా సమాచారం.

కోచ్ ఫ్యాక్టరీలో కొలువులు దక్కేనా!?

(5వ పేజీ తరువాయి)

నియామకాలు, నిధులు కోసం. ఈ ఉద్యమంలో కాజీపేటలో కోచ్‌ఫ్యాక్టరీ నిర్మించాలని, అందులో స్థానికులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలనే డిమాండ్ ప్రముఖంగా ఉంది. ఈ కోచ్ ఫ్యాక్టరీ అంశాన్ని రాష్ట్ర విభజన చట్టంలో సైతం పొందుపర్చారు. ఫ్యాక్టరీ వచ్చింది కానీ, స్థానికులు, భూ నిర్వాసితులకు ఉద్యోగ అవకాశాలు కల్పించే విషయమై రైల్వే అధికారులు, ప్రజాప్రతినిధులు నుంచి స్పష్టత రావడం లేదని స్థానికులు చెబుతున్నారు. ఇప్పటికైనా పంజాబ్ కోచ్ ఫ్యాక్టరీ తరహాలో నూతన జీవో తీసుకువచ్చి ఉద్యోగాలు భర్తీ చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

ఉద్యోగ అవకాశాలు కల్పించాలి...

దేవులపల్లి రాఘవేందర్, కన్వీనర్, టీ రైల్వే ఎంప్లాయీస్ జేఏసీ

రాష్ట్ర విభజన చట్టంలో కాజీపేటలో కోచ్‌ఫ్యాక్టరీ నెలకొల్పి స్థానికులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలన్న డిమాండ్ ఉంది. కాజీపేటలో నిర్మిస్తున్న కోచ్ ఫ్యాక్టరీ అతి పెద్ద పరిశ్ర మగా నిలుస్తుంది. అన్ని తరహా ఇంజన్‌లు, కోచ్‌లు తయారు చేసే కోచ్‌ఫ్యాక్టరీలో ఖచ్చితం గా భూ నిర్వాసితులు, స్థానికులు, జిల్లావాసులు, నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలి. పంజాబ్ తరహా ప్రత్యేక జీవో తీసుకరావాలి.

కోచ్‌ఫ్యాక్టరీ స్థాపనకోసం ఊరినే త్యాగం చేశాం..

దుప్పెల్లి లలిత, ఆయోధ్యపురం వాసి

కోచ్‌ఫ్యాక్టరీ స్థాపనకోసం భూములు ఇచ్చి ఊరినే త్యాగం చేశాం.. పెద్ద పరిశ్రమ వస్తే ఇంటికో ఉద్యోగం ఇస్తాం అన్నారు. కోచ్‌ఫ్యాక్టరీ నిర్మాణం పూర్తయింది కానీ, ఇప్పటివరకు మా పిల్లలకు ఉద్యోగాలు ఇచ్చే విషయంపై ఇప్పటికీ స్పష్టత ఇవ్వడం లేదు.. ప్రజా ప్రతినిధులు చొరవ చూపి గతంలో ఇచ్చిన హామీ మేరకు అర్హులైన ప్రతీ ఇంటికి ఒక ఉద్యోగం ఇవ్వాలి.

ఉద్యోగాలివ్వకుంటే ఉద్యమిస్తాం..

-గాదం యాదగిరి, మాజీ సర్పంచ్, అయోధ్యపురం

కోచ్‌ఫ్యాక్టరీకి భూములు ఇస్తే ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఫ్యాక్టరీ నిర్మాణం పూర్తయ్యింది కానీ ఉద్యోగాల కల్పనపై మాట మారుస్తున్నట్లు అనిపిస్తోంది. ఉద్యోగ అవకాశాలు కల్పించకుంటే పెద్దఎత్తున ఉద్యమిస్తాం. ఉద్యోగాలు కల్పించే వరకు ఆందోళనలు ఉధృతం చేస్తాం.



గోవాలో ప్రాసెసింగ్ యూనిట్‌ను పరిశీలిస్తున్న కమిషనర్

నగరంలో ఆర్‌ఆర్‌ఆర్ విధానం అమలు

జీడబ్ల్యూఎంసీ కమిషనర్ చహత్ బాజ్‌పాయ్

గోవాలో ఆధునిక ప్రాసెసింగ్ ప్లాంట్ పరిశీలన

వరంగల్ కార్పొరేషన్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): వరంగల్ నగరంలో రీయూజ్, రెడ్యూస్, రీసైకిల్ (ఆర్‌ఆర్‌ఆర్) విధానాన్ని ఏర్పాటు చేస్తే అందరికీ లాభంగా ఉంటుందని వరంగల్ నగర పాలక సంస్థ కమిషనర్ చహత్ బాజ్‌పాయ్ అన్నారు. శనివారం గోవాలో మునిసి పల్ కార్పొరేషన్‌ను సందర్శించి అక్కడ అమలువుతున్న విధానాలను అధ్యయనం చేశారు. ఘనవ్యర్థాల నిర్వహణలో అత్యాధునిక పద్ధతులు, శక్తి ఉత్పాదిత సాంకేతిక పర్యావరణ పరిరక్షణ సంబంధిత అంశాలపై కమిషనర్ క్షేత్రస్థాయిలో సందర్శించి అక్కడి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు.

ప్లాంట్ పని తీరు, రోజువారి ఘన వ్యర్థాల సేకరణ, వర్గీకరణ, ప్రాసెసింగ్ తయారీ, విద్యుత్ ఉత్పత్తి ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. వరంగల్ నగరం లో వెస్ట్ టూ ఎనర్జీ ప్లాంట్‌లను ఏర్పాటు చేస్తున్నందున వర్యావరణహిత వ్యర్థాల నిర్వహణలో వినూత్న మార్గాలను రూపొందిస్తామన్నారు. వరంగల్ నగరంలో అమలు చేస్తే ప్రజలకు ఉపయుక్తంగా ఉంటుందన్నారు. వ్యవస్థీకృత వ్యర్థాల ప్రా సెసింగ్ యూనిట్‌లను త్వరలో నగరంలో ఏర్పాటు చేస్తామని కమిషనర్ అన్నారు. వరంగల్ కమిషనర్ వెంట అక్కడి అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉన్నత విద్య కోసం వెళ్లి..

● అమెరికాలో అగ్నిప్రమాద ఘటనలో యువతి దుర్మరణం

● స్వస్థలం స్టేషన్‌ఘన్‌పూర్ మండలంలోని గుంటూరుపల్లి

● ప్రస్తుతం హైదరాబాద్‌లో నివాసం ఉంటున్న కుటుంబం

స్టేషన్‌ఘన్‌పూర్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఉన్నత విద్య కోసం అమెరికాలోని బర్మింగ్‌హామ్ వెళ్లిన విద్యార్థిని అక్కడ జరిగిన అగ్నిప్రమాదంలో మృత్యువాత పడడంతో స్వగ్రామం జనగామ జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్ మండలం సముద్రాల గ్రామ పరిధిలోని గుంటూరుపల్లి లో విషాదం నెలకొంది. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం... గుంటూరుపల్లికి చెందిన ఉడుముల జయాకర్ రెడ్డి- గోపు మరియా శైలజ దంపతులకు ఇద్దరు కుమార్తెలు. పెద్ద కుమార్తె సహజారెడ్డి (24)ఎంఎస్ చేయడానికి అమెరికాకు వెళ్లింది. జయాకర్ రెడ్డి హైదరాబాద్ హైటెక్ సిటీలో టీసీఎస్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. తల్లి గోపు మరియా శైలజ బచ్చన్నపేట మండలం పీఎస్‌లో ఎస్జీటీగా పని చేశారు. ఇటీవల డిప్యూటేషన్‌పై హైదరాబాద్ ఎస్‌సీఆర్టీకీ వెళ్లారు. కొన్నేళ్లుగా ఈ కుటుంబం హైదరాబాద్‌లోని మేడిపల్లిలో నివాసం ఉంటోంది.

సహజారెడ్డి బీటెక్ పూర్తి చేసిన తర్వాత 2021లో ఎంఎస్ చేయడానికి అమెరికాకు వెళ్లింది. బర్మింగ్‌హామ్‌లో ఓ అపార్ట్‌మెంట్‌లో నివాసం ఉంటోంది. పార్ట్ టైమ్ జాబ్ చేస్తూ చదువుకుంటోంది. భారత కాలమానం ప్రకారం గురువారం రాత్రి సహజారెడ్డి ఉంటున్న అపార్ట్‌మెంట్ పక్కన ఉన్న మరో అపార్ట్‌మెంట్‌లో అగ్నిప్రమాదం జరిగింది. దీంతో వేగంగా మంటలు వ్యాపించి సహజా రెడ్డి ఉంటున్న ఫ్లాట్‌కు అంటుకున్నాయి. ఫ్లాట్‌లో సహజారెడ్డితోపాటు మరో 13 మంది ఉంటున్నారు. మంటలు చెలరేగడంతో 10మంది తప్పించుకున్నారు. ప్రమాదం జరిగిన సమయంలో సహజారెడ్డితో పాటు మరో స్నేహితురాలు నిద్రమత్తులో ఉన్నారు.

అప్పటికే మంటలతో పాటు పొగలు వ్యాపించడంతో కిందకు పోయే పరిస్థితి లేకుండా పోయింది. ఇదే సమయంలో కాలుతున్న చెక్కలు ఆమెపై పడడంతో 80శాతం మేర శరీరం కాలిపోయింది. అక్కడ ఉన్నవారు ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. సహజారెడ్డి మరణ వార్త తెలియడంతో ఆమె స్వగ్రామమైన గుంటూరుపల్లిలో విషాదం అలుముకుంది. ఈ నెల 11న ఆమె మృతదేహం గుంటూరుపల్లికి చేరుకుంటుందని, అనంతరం అంత్యక్రియలు నిర్వహిస్తామని కుటుంబ సభ్యులు తెలిపారు.

'స్వచ్ఛ ఏవమ్'లో.. మెరిసిన పాఠశాలలు

- హనుమకొండ జిల్లా నుంచి 8 స్కూళ్లు ఎంపిక
- ఈ నెల 18న ప్రశంసాపత్రాల ప్రదానం
- త్వరలో జాతీయ స్థాయి ఎంపిక కసరత్తు



హనుమకొండ, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): పాఠశాలల్లో పచ్చదనం, పరిశుభ్రతను ప్రోత్సహించేందుకు కేంద్ర విద్యామంత్రిత్వ శాఖ ప్రవేశపెట్టిన స్వచ్ఛ ఏవమ్ హరిత విద్యాలయ రేటింగ్ (ఎస్‌హెచ్‌వీఆర్) కింద జిల్లాలో 8 పాఠశాలలు రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యాయి. హనుమకొండలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, కొత్తపల్లిలోని ఎపీపీఎస్, దామెరలోని ఎంపీపీఎస్, ముస్త్యాలపల్లిలోని ఎంపీయూపీఎస్, పోచారంలోని ఎంపీపీఎస్, అంబాలలోని జడ్పీహెచ్ఎస్, కమలాపూర్‌లోని సాకేత ఉన్నత పాఠశాల, ధర్మసాగర్‌లోని కేజీబీవీ వీటిలో ఉన్నాయి. ఈనెల 18వ తేదీన మూడు రోజులపాటు జరిగే జిల్లా స్థాయి సైన్స్‌ఫెయిర్ కార్యక్రమంలో కలెక్టర్ స్నేహ శబరీష్ వీటికి ప్రశంసాపత్రాలను ప్రదానం చేయనున్నట్లు సమాచారం.

రాష్ట్రస్థాయికి 8 స్కూళ్లు

జిల్లాలో మొత్తం 910 ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు ఉన్నాయి. ఎస్‌హెచ్‌వీఆర్ కింద 335 పాఠశాలలు దరఖాస్తు చేసుకున్నాయి. ఈ కార్యక్రమం కింద నిర్దేశించిన అంశాలను కచ్చితంగా అమలు చేస్తున్నందుకు మొదట 25 పాఠశాలలకు 5 స్టార్ రేటింగ్, 310 పాఠశాలలకు 4 స్టార్ రేటింగ్ వచ్చింది. ఆ తర్వాత 34 మంది సీనియర్ హెడ్మాస్టర్లతో ఏర్పాటు చేసిన కమిటీ మరోసారి జిల్లా వ్యాప్తంగా స్వచ్ఛ ఏవమ్ కింద దరఖాస్తు చేసుకున్న పాఠశాలలను సందర్శించగా 8 పాఠశాలలు రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యాయి. త్వరలోనే రాష్ట్రస్థాయిలో ఏర్పాటుచేసిన ఒక ప్రత్యేక బృందం జిల్లాను సందర్శించి రాష్ట్ర స్థాయిలో ఎంపికైన పాఠశాలలను సందర్శించి వీటిలో అర్హతలను బట్టి జాతీయ స్థాయికి ఎంపిక చేస్తుంది. జాతీయ స్థాయికి ఎంపికైన పాఠశాలలకు రూ.లక్ష చొప్పున పురస్కారం అందజేస్తారు.

రేటింగ్..

నీటి వసతి, పరిశుభ్రత, పారిశుధ్యం. పర్యావరణహిత పరిసరాలు, మొక్కలు, చెట్లతో పచ్చదనం విలసిల్లేలా స్కూల్ ప్రాంగణాలు మేటిగా ఉండేలా చూడడానికి ఈ స్వచ్ఛ ఏవమ్ కార్యక్రమాన్ని కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టింది. జిల్లా స్థాయికి 3 స్టార్ రేటింగ్‌కు ఆరు పాఠశాలను, రాష్ట్ర స్థాయి ఎంపికకు 4 స్టార్ రేటింగ్‌కు 20 పాఠశాలలను జాతీయ స్థాయిలో 5 స్టార్ రేటింగ్‌కు 200 పాఠశాలలను ఎంపిక చేస్తారు. ఈ కార్యక్రమం కింద ఈ విద్యాసంవత్సరానికి ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల ఆన్‌లైన్ నమోదు ప్రక్రియ జరిగింది. ఈ విధానాన్ని అన్ని యాజమాన్యాల్లోని 1 నుంచి 10వ తరగతి వరకు ఉంటే ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత స్కూళ్లకు వర్తిస్తుంది. జిల్లాలో 335 పాఠశాలల హెడ్‌మాస్టర్లు ఎస్‌హెచ్‌వీఆర్ వెబ్‌పోర్టల్‌లో ప్రతీ సూచికకు సంబంధించిన వివరాలను ఫొటోలతో సహా అప్‌లోడ్ చేశారు. మొత్తం 6 ప్రధాన కొలమానాలకు సంబంధించి 60 సూచికల ఆధారంగా రేటింగ్ ఒకటి నుంచి 5 స్టార్లను కేటాయించారు.

60 అంశాల్లో..

నీటి వసతి, టాయిలెట్లు, విద్యార్థులు చేతులు సబ్బుతో శుభ్రం చేసుకోవడం, ప్రవర్తన మార్పు, సామర్థ్యాల నిర్మాణం (కెపాసిటీ బిల్డింగ్), నిర్వహణ తదితర 60 అంశాలు నమోదు చేశారు. నమోదు విజయవంతంగా పూర్తి చేయగానే రేటింగ్ ప్రకారం ఫైవ్‌స్టార్ వస్తే అద్భుతం అని, ఫోర్ స్టార్ వస్తే చాలా బాగుంది అని, త్రీస్టార్ వస్తే బాగుంది అని, టూస్టార్ వస్తే సౌకర్యాలు మెరుగు పడాల్సిన అవసరం ఉందని, వన్ స్టార్ వస్తే అతి తక్కువ అనే రేటింగ్‌లు వచ్చాయి. దేశవ్యాప్తంగా ఉత్తమ స్కోర్‌ను సాధించి జాతీయ స్థాయిలో ఎంపికైన పాఠశాలలకు రూ.లక్ష చొప్పున నగదును అందజేస్తారు. నీటి వసతికి 22, మరుగుదొడ్ల నిర్వహణకు 27, చేతుల శుభ్రతకు 14, ప్రవర్తన మార్పులకు 21, విద్యార్థుల నడవడికకు 20, మిషన్ లైఫ్ కార్యకలాపాలకు 21 మార్కులు కేటాయించారు.



ఆధ్యాత్మిక గ్రంథాలను ఆవిష్కరిస్తున్న చినజీయర్‌స్వామి. చిత్రంలో వరదారెడ్డి, పలువురు పండితులు

సంస్కార విద్య అవసరం

- స్వధర్మం కోసం కలిసికట్టుగా పోరాడుదాం
- ధార్మిక సదస్సులో చినజీయర్‌స్వామి పిలుపు

హనుమకొండ కల్చరల్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): నేటి సమాజానికి మానవీయ విలువలు, ఉత్తమ సంస్కృతి ధార్మిక పరిరక్షణలాంటి వాటితో కూడిన సంస్కార విద్య అవసరమని, అది ప్రస్తుతం కొరవడుతోందని వేద విశ్వవిద్యాలయ వ్యవస్థాపకుడు, త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన్నజీయర్ స్వామి ఉద్బోధించారు. అన్నాసాగర్‌లో గల ఎస్ఆర్ విశ్వవిద్యాలయ ప్రాంగణంలో ఎస్ఆర్ విద్యాసంస్థల వ్యవస్థాపకుడు ఎ.వరదారెడ్డి 81 ఏళ్ల సహస్రచంద్ర దర్శనం వేడుకల్లో స్వామి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆధ్యాత్మిక ప్రముఖులైన 81 మంది దంపతులను లక్ష్మీనారాయణులుగా కొలుస్తూ ఘనంగా సత్కరింపజేశారు. సత్‌సంప్రదాయ పరిరక్షణ సభ కార్యదర్శి సముద్రాల శఠగోపాచార్య అధ్యక్షతన జరిగిన ధార్మిక సదస్సులో అనేక మంది ప్రముఖులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా చిన్నజీయర్ స్వామి అనుగ్రహ భాషణం చేస్తూ.. ప్రస్తుత చదువులను ఆయన రత్నాల విలువ లేకుండా బరువులు మోయడం లాంటిదేనని వ్యాఖ్యానించారు. ఎన్ని డిగ్రీలున్నా సంస్కారం లేని విద్య వ్యర్థమేనన్నారు. సనాతన ధర్మాన్ని, ఆధ్యాత్మిక వాతావరణాన్ని కలుషితం చేస్తూ కొందరు పని గట్టుకొని హేళన చేస్తున్నారంటూ.. దీన్ని కలిసికట్టుగా స్వధర్మం, సంస్కారాల కోసం ప్రతీ హిందువు పోరాటం చేయాల్సిందేనని పిలుపునిచ్చారు. విశ్వవిద్యాలయం స్థాపనతోపాటు విద్యాలయ ప్రాంగణంలో చక్కని రంగనాథస్వామి ఆలయాన్ని నిర్మింపజేసిన వరదారెడ్డి ధార్మిక సేవలను కొనియాడారు.

ఎస్ఆర్ విద్యాసంస్థల అధినేత ఎనగందుల వరదారెడ్డి మాట్లాడుతూ.. ఆధ్యాత్మిక గురువుగా మహా మహోపాధ్యాయ రఘునాథచార్యస్వామి నిలుస్తారని, వారి మార్గాన్నే అనుసరిస్తూ ఆధ్యాత్మిక బోధనలు హిందూ సంప్రదాయ పరిరక్షణకు నడుం బిగించిన చిన్నజీయర్‌స్వామి కూడా మార్గదర్శకులేనన్నారు.

ధార్మిక గ్రంథాల ఆవిష్కరణ

ఈ సందర్భంగా రఘునాథ వైజయంతి పేరిట అపూర్వ గ్రంథాన్ని చిన్నజీయర్ స్వామి ఆవిష్కరింపజేశారు. అదే విధంగా సత్ సంప్రదాయ పరిరక్షణ ట్రస్ట్ ద్వారా హైదరాబాద్‌కు చెందిన అళహ సింగరాచార్య రాసిన ఆచార్య వైభవం తెలుగు కృతికి వాసుదేవ తాతాచార్య రాసిన ఆంగ్ల అనువాద గ్రంథాన్ని స్వామివారు ఆవిష్కరించారు.

ఈ కార్యక్రమంలో మహా మహోపాధ్యాయ ఎస్‌వి రంగ రామానుజచార్య, భద్రాద్రి ఆలయ వేద పండితులు గుడిమెల్ల మురళీకృష్ణమాచార్య, భద్రాద్రి స్థలసాయిస్వామి, కేకే పరకాలన్‌స్వామి, వికాస తరంగిణి ఛైర్‌పర్సన్ డాక్టర్ బచ్చు రాధాకృష్ణ, ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, రంగనాయక స్వామి ఆలయ స్థానాచార్యుడు టీకే శ్రీనివాసాచార్య, ఆలయ ప్రధాన అర్చకుడు కె.రఘురామచార్యతోపాటు అర్చకులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా రాష్ట్రంలోని ఆలయాల అర్చకులు ఎదుర్కొంటున్న సమస్యలపై చినజీయర్ స్వామికి రాష్ట్ర అర్చక సమాఖ్య అధ్యక్షుడు గంగు ఉపేంద్ర శర్మ ప్రత్యేకంగా కలిసి వివరించారు.

అంబేద్కర్ ఆశయాలను కొనసాగించాలి

- వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి
- ప్రజా ప్రతినిధులు, ప్రజా సంఘాల ఘన నివాళి



అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యేలు రాజేందర్‌రెడ్డి, నాగరాజు, ఎర్రబెల్లి స్వర్ణ, వెంకట్రాంరెడ్డి, అజీజ్‌ఖాన్

వడ్డెపల్లి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ ఆశయాలను ప్రతిఒక్కరూ కొనసాగించాలని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్. నాగరాజు అన్నారు. హనుమకొండ పబ్లిక్ గార్డెన్ ప్రాంతంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద డాక్టర్ బాబా సాహెబ్ విగ్రహం వద్ద మహనీయుల జయంతి, వర్ధంతి ఉత్సవ కమిటీ చైర్మన్ అంకేశ్వరపు రాంచందర్‌రావు ఆధ్వర్యంలో డాక్టర్ బీఆర్. అంబేద్కర్ 69వ వర్ధంతిని శనివారం నిర్వహించారు. అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేలు మాట్లాడుతూ.. దేశ మొట్టమొదటి కేంద్ర న్యాయ శాఖ మంత్రిగా అంబేద్కర్ పనిచేస్తూ దేశంలోని బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, ఓసీ సబ్బండ వర్గాల ప్రజలకు హక్కులు కల్పించిన మహనీయుడని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కుడా ఛైర్మన్, డీసీసీ అధ్యక్షుడు ఇనగాల వెంకట్రాంరెడ్డి, మాజీ మేయర్ ఎర్రబెల్లి స్వర్ణ, జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ అజీజ్ ఖాన్, డీసీసీ ఎస్సీ సెల్ ఛైర్మన్ పెరుమాండ్ల రామకృష్ణ, జీడబ్ల్యూఎంసీ కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ తోట వెంకటేశ్వర్లు, కార్పొరేటర్లు మామిండ్ల రాజు, విజయశ్రీ రజాలి, మహిళా కాంగ్రెస్ హనుమకొండ జిల్లా అధ్యక్షురాలు బంక సరళా సంపత్ యాదవ్, హనుమకొండ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నాయిని లక్ష్మారెడ్డి, వీసీకే పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు జిలుకర శ్రీనివాస్, బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు అంబాల ప్రశాంత్, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు గద్దల సుకుమార్, మాల మహానాడు జాతీయ నేత మన్నె బాబురావు, ప్రజా సంఘాల నాయకులు పుట్ట రవి, చుంచు రాజేందర్, మధుపాక ఎల్లయ్య, బొమ్మల్ల అంబేద్కర్, యాడాల రవీందర్, చిట్యాల బాబు తదితరులు పాల్గొన్నారు.

మేడారం పనుల్లో వేగం పెంచాలి



మేడారం అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న ములుగు కలెక్టర్ దివాకర

నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలి : కలెక్టర్ దివాకర

ములుగు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా తాడ్వాయి మండలంలోని మేడారం సమ్మక్క- సారలమ్మ గద్దెల పునరుద్ధరణ పనులు, మహాజాతర అభివృద్ధి పనుల్లో వేగం పెంచి నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని అధికారులను కలెక్టర్ దివాకర ఆదే శించారు. మేడారంలో ఆయన శనివా రం పర్యటించారు. గద్దెల పునరుద్ధరణ తదితర అభి వృద్ధి పనులు, గోవిందరాజు, పగిడిద్ద రాజుల రాతి నిర్మాణాలు, ఆలయ ప్రాంగణ ఫ్లోరింగ్, ప్రధాన ద్వారం రాతి స్తంభాల నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సంద ర్భంగా అధికారులకు పలు సూచన లు చేశారు. అనంతరం మాట్లాడుతూ నిర్ణీత గడువు లోగా పనులు పూర్తి చేయాలని, అవసరమైతే అదనపు సిబ్బందిని నియమించుకోవాలని, విరివిగా యంత్రాల ను ఉపయో గించుకోవాలన్నారు. జాతర సమయంలో కోట్లాది మం ది భక్తులు వనదేవతలను దర్శించుకునేం దుకు వస్తార ని, వారికి ఎలాంటి ఇబ్బంది కలగకుండా నాణ్యతా ప్రమాణాలతో పనులు చేపట్టాలని అధికారు లు, కాం ట్రాక్టర్‌ను అదేశించారు. జాతర సమీపిస్తున్న నేపథ్యంలో రహదారుల నిర్మాణ పనుల్లో వేగం పెంచాలన్నారు. ఆయన వెంట ఆర్అండ్‌బీ, పీఆర్ ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

పర్యటించిన ఎస్పీ సుధీర్ రామ్‌నాథ్

మేడారంలో ములుగు ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకాన్ పర్యటించారు. వనదేవతలను దర్శించుకున్న ఆయన దేవాలయ పునర్నిర్మాణ పనులను పరిశీలించారు. మహాజాతరకు భక్తులు భారీ సంఖ్యలో తరలిరానున్న దృష్ట్యా దేవాలయం ఆవరణలో భద్రతా ఏర్పాట్లు, నిష్క్రమణ మార్గాలను, పోలీసింగ్ అవసరాలు, అత్యవసర సేవల సమన్వయం తదితర అంశాలపై సంబంధిత అధికారులతో చర్చించారు. జాతర సమయంలో పోలీసులు చేపట్టాల్సిన కార్యాచరణకు అనుగుణంగా పలు సూచనలు చేశారు. ఆయన వెంట డీఎస్పీ రవీందర్, పస్రా సీఐ దయాకర్ తదితరులు ఉన్నారు.

మా గోస తాకి ఏసీబీకి పట్టుబడ్డారు..

- అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డిపై గ్రీన్‌ఫీల్డ్ హైవే బాధిత రైతుల ఫైర్
- కలెక్టరేట్ ఎదుట బాణసంచా కాల్చి సంబరాలు

సుబేదారి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి ఏసీబీకి పట్టుబడడటంతో గ్రీన్‌ఫీల్డ్ హైవే బాధిత రైతులు సంబరాలు చేసుకున్నారు. శనివారం కలెక్టరేట్ ఎదుట టపాసులు కాల్చి ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గ్రీన్‌ఫీల్డ్ హైవే బాధిత రైతుల సంఘం అధ్యక్షుడు బూర్గుల రామ్‌చందర్‌రావు మాట్లాడుతూ.. దామెర మండలం ఊరుగొండ గ్రామానికి చెందిన బాధిత రైతులకు గ్రీన్‌ఫీల్డ్ హైవే చట్టం ప్రకారం భూములు తీసుకొని పరిహారం చెల్లించడంలో అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి అడ్డుపడ్డారని ఆరోపించారు. గతంలో ఆరెపల్లి, వంగపహాడ్ గ్రామస్థులకు మార్కెట్ ధర కంటే ఎక్కువే చెల్లించారని తెలిపారు. న్యాయబద్ధంగా రావాల్సిన పరిహారం ఇవ్వాలని కలెక్టర్, ప్రజాప్రతినిధులు, నేషనల్ హైవే అధికారులు చెప్పినా కూడా ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేశారని పేర్కొన్నారు. రైతుల గోస తాకి ఏసీబీకి పట్టుబడ్డాడని సంతోషం వ్యక్తం చేశారు. ఇలాంటి అవినీతి అధికారులను కఠిన శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రీన్‌ఫీల్డ్ హైవే బాధిత రైతుల సంఘం కార్యదర్శి బొల్లు రాజిరెడ్డి, నల్లల సతీష్, అడ్డూరి రాజేందర్, ఎరుకల రమేశ్, నల్లెల్ల దేవేందర్, శ్రీనివాస్, కమలాకర్, గంట సమ్మిరెడ్డి తదితర రైతులు పాల్గొన్నారు.

డీసీసీ చీఫ్‌లకు పంచాయతీ సవాల్

(5వ పేజీ తరువాయి)

ప్రాధాన్యత పెరిగింది. అయితే డీసీసీ చీఫ్‌లుగా బాధ్యతలు చేపట్టిన వెంటనే వీరికి పంచాయతీ ఎన్నికలు రావటంతో.. మెజారిటీ స్థానాల్లో గెలవటం సవాల్‌గా మారింది. ఈ నెల 11న మొదటి విడత పంచాయతీ ఎన్నికలు జరుగనున్నాయి. 14న రెండో విడత, 17న మూడో విడత ఎన్నికలు జరుగనున్నాయి. ఈ క్రమంలో అభ్యర్థులు ఎంపికతోపాటు గెలుపు బాట పట్టించే బాధ్యత నూతన డీసీసీ చీఫ్‌లపై ఉండటంతో వారికి అగ్నిపరీక్ష మారిందనే ప్రచారం ఉంది.

మంత్రి కొండా సురేఖ ప్రాతినిధ్యం వహిస్తున్న వరంగల్ జిల్లాలో అయూబ్‌ను అధిష్ఠానం డీసీసీ అధ్యక్షుడిగా నియమించింది. అయూబ్ నియామకాన్ని కొండా వర్గం తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. కొత్త అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన అయూబ్.. కొండా దంపతులను మినహా ఉమ్మడి వరంగల్ జిల్లాలోని కీలక నేతలందరినీ కలవటం కాంగ్రెస్‌లో చర్చనీయాంశంగా మారింది. ఇప్పటికే వరంగల్ జిల్లాలో సంగెం, గీసుకొండ మండలాల్లో కొండా వర్గీయులు సర్పంచ్‌లుగా పలు గ్రామాల్లో పోటీగా నామినేషన్లు దాఖాలు చేశారు. పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్‌రెడ్డి పార్టీ అభ్యర్థులను పోటీకి ఖరారు చేయగా, కొండా వర్గం నుంచి నేతలు బరిలో ఉండటంతో కేడర్‌లో అయోమయం నెలకొంది. డీసీసీ అధ్యక్షుడు అయూబ్ కొండా దంపతులతో చర్చించి, పోటీని తప్పించేంత సాహసం చేస్తారా? అనేది హాట్‌టాపిక్‌గా మారింది. ఇది వరంగల్ అధ్యక్షుడి సత్తాకు పరీక్షగా పరిశీలకులు భావిస్తున్నారు.

అలాగే హనుమకొండ జిల్లా పరకాల, ఆత్మకూరు, నడికూడ, శాయంపేట, దామెర మండలాల్లో కూడా ఇదే పరిస్థితి. డీసీసీ అధ్యక్షుడు ఇనుగాల వెంకట్రామిరెడ్డికి కూడా వర్గపోరును పరిష్కరించేందుకు మంత్రి కొండా సురేఖ వర్గం నేతలతో చర్చించి, పోటీ నుంచి తప్పిస్తారా..? లేక చేతులెత్తేస్తారా..? అనేది కాంగ్రెస్ శ్రేణుల్లో ఆసక్తికరంగా మారింది. ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్‌రెడ్డి, రేవూరి ప్రకాష్‌రెడ్డిలతో పాటు మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, కేఆర్ నాగరాజు నియోజకవర్గాల మండలాలు కూడా హనుమకొండ జిల్లాలో ఉన్నాయి. వీరందరినీ సమన్వయం చేసుకుంటే పార్టీని ముందుకు తీసుకెళ్లటం ఇనుగాల ముందున్న ప్రధాన సవాల్‌గా మారింది.

మరోవైపు జనగామ జిల్లాలో కాంగ్రెస్ పార్టీ అధ్యక్ష పదవిని మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి, ప్రశాంత్‌రెడ్డి, టీపీసీసీ ఉపాధ్యక్షురాలు ఝాన్సీరెడ్డిలు ఆశించారు. ఈ ముగ్గురిలో ఎవరికీ పదవి రాకపోవటంతో ఆ నేతల వర్గం డీసీసీ అధ్యక్షురాలు ధన్వంతి మాటకు ప్రాధాన్యత ఇస్తారా..? అనేది చర్చనీయాంశంగా మారింది.

ఇక భూపాలపల్లి జిల్లా అధక్ష్యడు భట్టు కరుణాకర్‌కు ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అభ్యర్థుల ఎంపికలో ఎంత ప్రాధాన్యత ఇస్తారా..? అనే చర్చ జరుగుతోంది. మహబూబాబాద్‌లో బలమైన నేతగా ఉన్న వెన్నం శ్రీకాంత్‌రెడ్డిని కాదని అధిష్ఠానం ఎమ్మెల్యే సతీమణి ఉమకు బాధ్యతలు అప్పగించింది. దీంతో వెన్నం వర్గం అసంతృప్తిగా ఉంది. సీఎం సలహాదారుడు వేం నరేందర్‌రెడ్డి సొంత జిల్లాలో కాంగ్రెస్‌లో అసంతృప్తిపై అధిష్ఠానం దృష్టి పెట్టడం లేదనే చర్చ జరుగుతోంది. డీసీసీ అధ్యక్షులకు పార్టీపరంగా మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ కీలక నేతలు ప్రాధాన్యత ఇస్తారా..? లేదా అనేది పంచాయతీ ఎన్నికల్లో అభ్యర్థుల ఎంపికలో వీరికి లభించే ప్రాధాన్యతను బట్టి తెలుస్తుందని పలువురు చర్చించుకుంటున్నారు.

సమన్వయమే సవాల్

కాంగ్రెస్ పార్టీలో డీసీసీ అధ్యక్ష పదవిని ఆశించిన నేతలను సమన్వయం చేసుకోవటం కొత్త చీఫ్‌లకు పరీక్ష మారింది. ఒక్కొక్క జిల్లా నుంచి ఆర డజనుకు పైగా కీలక నేతలు డీసీసీ అధ్యక్ష పదవిని ఆశించారు. పదవి రాకపోవడంతో పాటు అధిష్ఠానం బుజ్జగింపులు కూడా చేయకపోవటంతో చాలామంది కూరలో కరివేపాకుగా మారామా..? అనే అసంతృప్తిలో ఉన్నారు. ఇలాంటి నేతలను సమన్వయం చేసుకోవటం నూతన డీసీసీ అధ్యక్షుల ముందున్న ప్రధాన సవాల్.

పేరుకే మండల కేంద్రం

- పంచాయతీ హోదా లేని 'కన్నాయిగూడెం'
- రాజన్నపేట జీపీలో కొనసాగింపు



రాజన్నపేట గ్రామ పంచాయతీ భవనం

కన్నాయిగూడెం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ హోదాలేని మండల కేంద్రంగా కన్నాయిగూడెం చరిత్రలో నిలిచి పోయింది. పేరుకే మండల కేంద్రమైనా పక్క గ్రామ పంచాయతీలో ఒక అమ్లెట్ విలేజ్‌గా ఉంది. తెలంగాణ ఆవిర్భావం అనంతరం అప్పటి ప్రభుత్వం ప్రజలకు ఇబ్బందులు లేకుండా కొత్త జిల్లాలు, మండలాలను ఏర్పాటు చేసిన విషయం విదితమే. ఇందులో భాగంగా 2016 అక్టోబరులో కొత్తగా కన్నాయిగూడెం మండలాన్ని ఏర్పాటు చేసింది. అయితే.. మండల కేంద్రమైనా నాలుగు కిలో మీటర్ల దూరంలో ఉన్న రాజన్నపేట గ్రామ పంచాయతీలో ఇది అంతర్భాగంగా ఉంది. ఈ గ్రామ పంచాయతీ పరిధిలో కన్నాయిగూడెంతో పాటు రాజన్న పేట, వెంకట్రావుపల్లి, గంగగూడెం ఉన్నాయి. మండల కేంద్రమైనా కన్నాయిగూడేనికి గ్రామ పంచాయతీ హోదా లేకపోవడంతో ఇక్కడ నివసిస్తున్న ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఏ చిన్న పనికైనా రాజన్నపేట పంచాయతీ కార్యాలయానికి వెళ్లాల్సి వస్తోందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కన్నాయిగూడెం అనేది పూర్తిగా ఏజెన్సీ గ్రామం. ఇక్కడ 1990 వరకు పోలీస్‌స్టేషన్, బ్యాంకు, ప్రభుత్వాస్పత్రి ఉండేవి. భద్రత దృష్ట్యా అప్పట్లో వీటిని ఏటూరునాగారం తరలించారు. కొత్తగా మండలం ఆవిర్భావం తర్వాత ఇదే మండలంలోని తుపాకుల గూడెంలో పోలీస్‌స్టేషన్‌ను ఏర్పాటు చేశారు. మండల కేంద్రమైనా కన్నాయిగూడేనికి పరిపాలన పరమైన ప్రాధాన్యం ఇవ్వకపోవడంపై విమర్శలు వస్తున్నాయి. ముఖ్యంగా గ్రామ పంచాయతీ హోదా లేక పోవడంపై మండలంలోని పలువురు మేధావులు, ఉద్యోగులు, ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వం గిరిజన గూడాలని, తండాలను గ్రామ పంచాయతీలుగా ఏర్పాటు చేసింది కానీ మండల కేంద్రమైన కన్నాయిగూడేన్ని మాత్రం విస్మరించిందని విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా యంత్రాంగం చొరవ తీసుకుని ప్రత్యేక గ్రామ పంచాయతీగా ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

ఊరు-పోరు VOORU - PORU

నోటా గెలిస్తే ?



రెండోస్థానంలో ఉన్న అభ్యర్థి విజేత

వెంకటాపూర్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికల్లో ఈసారి ఎన్నికల సంఘం నోటాను ప్రవేశపెట్టింది. ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థులెవరూ నచ్చకపోతే నోటామీద నొక్కొచ్చు. మరి బరిలో నిలిచిన అభ్యర్థుల కన్నా ఎక్కువ ఓట్లు నోటాకు వచ్చినా ఎన్నిక రద్దయ్యే అవకాశం లేదు. ప్రస్తుత ఎన్నికల నిబంధనల ప్రకారం నోటాకు ఎక్కువ ఓట్లు వచ్చినా రెండోస్థానంలో ఉన్న అభ్యర్థిని విజేతగా ప్రకటిస్తారు. నోటాకు అత్యధికంగా ఓట్లు వస్తే ఆ ఎన్నిక ఫలితాన్ని రద్దుచేసి మళ్లీ పోలింగ్ నిర్వహించాలని గతంలో సుప్రీంకోర్టులో ఓ పిటిషన్ దాఖలు అయింది. 19కన్నా తక్కువ ఓట్లు సాధించిన అభ్యర్థులను తదుపరి ఐదేళ్లపాటు అన్ని ఎన్నికల్లో పోటీ చేయకుండా చూసేలా నిబంధనలు రూపొందించాలని పేర్కొన్నారు. ఈ అంశాన్ని పరిశీలించిన కోర్టు ఎన్నికల సంఘానికి నోటీసులు జారీ చేసింది. అయినా ఇప్పటివరకు సదరు అంశాలపై ఎన్నికల సంఘం ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు.

బల నిరూపణ పర్వం

వెంకటాపూర్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికల్లో నామినేషన్ల పర్వం ముగిసింది. ప్రచారానికి తెరలేసింది. తమ బలాన్ని నిరూపించుకునే పనిలో అభ్యర్థులు ఉన్నారు. వెంకటాపూర్ మండలంలో 23 గ్రామపంచాయతీలు ఉండగా సర్పంచ్ అభ్యర్థులు పోటాపోటీగా బల నిరూపణకు సిద్ధమయ్యారు. ఓటర్లకు తాయిలాలు ప్రకటిస్తూ ముందు విందు వినోదాలతోపాటు రోజువారీ కూలి డబ్బులు ఇస్తూ గ్రామాల్లో ఓటర్లను కూడగట్టే ప్రయత్నం చేస్తున్నారు.

పీడీ యాక్ట్‌పై జైలులో ఉన్నవారికీ ఓటు

- కేంద్ర సర్వీస్ ఉద్యోగులు, ఎన్నికల సిబ్బందికి పోస్టల్ బ్యాలెట్



కేసముద్రం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ముందస్తు నేర నిరోధక చట్టం(పీడీ) కింద అరెస్టు అయిన వారు కూడా జైలు నుంచే ఓటు హక్కు వినియోగించుకునే అవకాశాన్ని ఎన్నికల సంఘం కల్పిస్తోంది. తెలంగాణ పంచాయతీరాజ్ చట్టం ప్రకారం ఇందుకోసం పోస్టల్ బ్యాలెట్ విధానాన్ని వినియోగించనున్నారు. ఈ అవకాశం జైలులో ఉన్న పీడీ యాక్ట్ కింద అరెస్టు అయిన వారికి మాత్రమేనని, రిమాండ్, శిక్ష పడిన ఖైదీలకు లేదని పంచాయతీరాజ్ చట్టం చెబుతోంది. ముందస్తు నేర నిరోధక చట్టంలో అరెస్టు అయిన ఓటరును జాబితాలో ముందుగానే అధికారులు గుర్తిస్తారు. వారు ఏ జైలులో ఉన్నారో వారికి పోస్టల్ బ్యాలెట్ పేపర్‌ను పోస్టు ద్వారా పంపిస్తారు. జైలు అధికారుల ద్వారా సదరు ఓటరు పోస్టల్ బ్యాలెట్‌లో రహస్యంగా ఓటు వేసి కవర్‌ను సీల్ చేసి తిరిగి పోస్టులో ఆ గ్రామ పంచాయతీ రిటర్నింగ్ అధికారికి పంపిస్తారు.

ఇదే తరహాలో సర్వీస్ ఓటర్లు అనగా సైన్యం, కేంద్ర దళాలు, ప్రత్యేక సర్వీసుల్లో ఉన్నవారికి ఓటు హక్కు వినియోగించుకునే అవకాశం ఉంది. వారు పనిచేస్తున్న చిరునామాకు పోస్టల్ బ్యాలెట్లు పంపిస్తారు. ఎన్నికల లెక్కింపు కంటే ముందుగా పోస్టల్ బ్యాలెట్ కవర్లు పోస్టు ద్వారా గ్రామ పంచాయతీ ఎన్నికల రిటర్నింగ్ అధికారికి చేరాల్సి ఉంటుంది. ఈ ఓట్లతో పాటు ఎన్నికల విధుల్లో పాల్గొనే రెవెన్యూ, పోలీసు, రవాణా, ఇంజనీరింగ్, పంచాయతీ తదితర శాఖల అధికారులు, సిబ్బంది తమ సొంత మండలంలో పోస్టల్ బ్యాలెట్ ద్వారా గ్రామ పంచాయతీ ఎన్నికల ఓటు హక్కును వినియోగించుకుంటారు. ఇందుకోసం సంబంధిత ఎంపీడీవో కార్యాలయాల్లో ఉద్యోగులు ఓటు వేసేందుకు పోస్టల్ బ్యాలెట్లు, వాటిని వేసేందుకు గ్రామానికో బాక్సు చొప్పున ఏర్పాటు చేస్తారు. ఇలా పీడీ యాక్ట్ కింద అరెస్టయిన వారు, సర్వీస్ ఓటర్లు, ఎన్నికల సిబ్బంది వేసిన పోస్టల్ బ్యాలెట్ ఓట్లను ఎన్నికల లెక్కింపులో సాధారణ ఓట్ల కంటే ముందే లెక్కిస్తుండడంతో వాటికి ప్రాధాన్యతను కల్పించినట్లవుతోంది. దీంతో పోస్టల్ బ్యాలెట్ ఓటర్లను కూడా అభ్యర్థులు ఫోన్లలో సంప్రదిస్తూ తమకు ఓటు వేయాలని ప్రచారం చేస్తున్నారు.

పలు కాలనీల్లో అంబేద్కర్ వర్ధంతి

వడ్డెపల్లి: బీఆర్ అంబేద్కర్ వర్ధంతిని శనివారం హనుమకొండ 56వ డివిజన్ గోపాల్‌పూర్‌లోని అంబేద్కర్ విగ్రహం వద్ద నిర్వహించారు. విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్పొరేటర్ సిరంగి సునీల్‌కుమార్, టీపీసీసీ ఎస్సీ సెల్ జనరల్ సెక్రటరి కె. పూర్ణచందర్, టీపీసీసీ లీగల్ సెల్ కన్వీనర్ కె.రజినీకాంత్, సీనియర్ కాంగ్రెస్ నేత భీరం రవీందర్‌రెడ్డి, ప్రజా సంఘాల నాయకులు నివాళులర్పించారు. హనుమకొండ వడ్డెపల్లిలోని దళిత సంక్షేమ సంఘం కార్యాలయంలో అధ్యక్షుడు తాళ్లపెల్లి రవీందర్ (జేకే) ఆధ్వర్యంలో అంబేద్కర్ వర్ధంతిని నిర్వహించారు. అంబేద్కర్ చిత్రపటానికి ఆయనతో పాటు డీసీసీ ఎస్సీ సెల్ చైర్మన్ పెరుమాండ్ల రామకృష్ణ, దళిత సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి టి.ప్రవీణ్, కోశాధికారి ఆశీర్వాదం, 58వ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు తాళ్లపెల్లి సుధాకర్, మహి ళా అధ్యక్షురాలు తాళ్లపెల్లి మేరి, చీఫ్ అడ్వయిజర్ తాళ్లపెల్లి ప్రభాకర్, తాళ్లపెల్లి చార్లెస్, తాళ్లపెల్లి జయపాల్ తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. హనుమకొండ గోకుల్ జంక్షన్ ప్రాంతంలోని హౌసింగ్ బోర్డు కాలనీలో హనుమకొండ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నాయిని లక్ష్మారెడ్డి, డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు కొండా నాగరాజు, కాంగ్రెస్ శ్రేణులు అంబేద్కర్ వర్ధంతిని నిర్వహించారు. చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

అంబేద్కర్ ప్రపంచానికే మార్గదర్శకుడు

» వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి

» రాజ్యాంగ నిర్మాతకు ఘన నివాళులర్పించిన ప్రజా ప్రతినిధులు, నాయకులు, వివిధ సంఘాలు

హనుమకొండ సిటీ, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేద్కర్ ప్రపంచానికే మార్గదర్శకుడిగా నిలిచారని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి కొనియాడారు. అంబేద్కర్ వర్ధంతిని శనివారం హనుమకొండలోని కాంగ్రెస్ జిల్లా కార్యాలయంలో డీసీసీ అధ్యక్షుడు ఇనుగాల వెంకట్రాంరెడ్డి అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన రాజేందర్‌రెడ్డి అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. అంబేద్కర్ ఆశయాలను నెరవేర్చేందుకు శ్రేణులు కృషి చేయాలని సూచించారు. దేశానికి ఆయన చేసిన సేవలు మరువలేనివన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, జీడబ్ల్యూఎంసీ ఫ్లోర్ లీడర్ తోట వెంకటేశ్వర్లు, మాజీ మేయర్ ఎర్రబెల్లి స్వర్ణ, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అజీజ్ ఖాన్, కార్పొరేటర్లు రవీందర్ యాదవ్, విజయశ్రీ రజాలీ, మామిండ్ల రాజు, వీసం సురేందర్‌రెడ్డి, టి.మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

మడికొండ : అంబేద్కర్ వర్ధంతిని మడికొండలోని అంబేద్కర్ విగ్రహం వద్ద స్థానిక అంబేద్కర్ సంఘం ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. మడికొండ ఇన్‌స్పెక్టర్ పుల్యాల కిషన్ ముఖ్య అతిథిగా హాజరై అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అంబేద్కర్ సంఘం నాయకులు, అభిమానులు పాల్గొన్నారు.

న్యూశాయంపేట: బలహీనవర్గాల ఆశాజ్యోతి అంబేద్కర్ అని ఆల్ ఇండియా హ్యూమన్‌రైట్స్ అసోసియేషన్ రాష్ట్ర కో-ఆర్డినేటర్ మేరుగు రమేష్ అన్నారు. హనుమకొండ హంటర్‌రోడ్‌లోని ఆల్ ఇండియా హ్యూమన్ రైట్స్ అసోసియేషన్ జిల్లా కార్యాలయంలో శనివారం ఘనంగా అంబేద్కర్ 69వ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర కోఆర్డినేటర్ మేరుగు రమేష్, అడ్వకేసి అడ్వైజర్ సత్యప్రకాశ్‌లు అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఆల్ ఇండియా హ్యూమన్ రైట్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బక్కి వంశీ, నాయకులు పాల్గొన్నారు. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ 69వ వర్ధంతి కార్యక్రమం శనివారం నిర్వహించారు. హనుమకొండ హంటర్‌రోడ్ నందిహిల్స్‌కాలనీలో శాసనమండలి డిప్యూటీ చైర్మన్ డాక్టర్ బండా ప్రకాశ్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అలాగే 31వ డివిజన్ సుర్జిత్‌నగర్ కాలనీలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఎం.చుక్కయ్య అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా నాయకులు కారు ఉపేందర్‌తో పాటు వివిధ కుల సంఘాల నాయకులు పాల్గొన్నారు.



నందిహిల్స్ కాలనీలో అంబేద్కర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బండా ప్రకాశ్ తదితరులు

కాజీపేట: కాజీపేటలో వివిధ కాలనీలలో శనివారం అంబేద్కర్ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. రైల్వే జనరల్ ఇనిస్టిట్యూట్‌లో దేవులపల్లి రాఘవేందర్ ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. 47 డివిజన్ బోడగుట్టలో అంబేద్కర్ విగ్రహానికి విగ్రహ కమిటీ చైర్మన్ గూడపు కుమారస్వామి ఆధ్వర్యంలో పూలమాలవేసి నివాళులు అర్పించారు. డీజిల్ కాలనీ చౌరస్తాలో పసునూరి మనోహర్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసినివాళులు అర్పించారు. బాపూజీనగర్ చౌరస్తాలో డివిజన్ అధ్యక్షుడు షేక్ అజ్గర్, మైసారపు సిరిల్ లారెన్స్, ఇప్ప శ్రీకాంత్‌లు అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. రైల్వేస్టేషన్ ఎదురుగా మజ్దూర్ యూనియన్ రేల్ మజ్దూర్ యూనియన్ డివిజన్ ప్రెసిడెంట్ కుర్సపల్లి రవీందర్ మిత్రమండలి ఆధ్వర్యంలో అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం జరిగిన అన్నదాన కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మార్తినేని ధర్మారావు హాజరై అన్నదానం చేశారు. కార్యక్రమంలో రైల్వే కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

గ్రేటర్ వరంగల్ నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో..

వరంగల్ కార్పొరేషన్: గ్రేటర్ వరంగల్ నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో శనివారం అంబేద్కర్ 69వ వర్ధంతి నిర్వహించారు. బల్దియా అధికారులు, ఉద్యోగులు వివిధ ఉద్యోగ, కుల సంఘాల నాయకులు అంబేద్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ సమ్మయ్య, ఎంహెచ్‌వో రాజేశ్, నాయకులు బాకం సంతోష్, రామకృష్ణ, బాలునాయక్, బాబు, పాశం రవి, సింగారపు బాబు, దేవరాజు, శ్రీనివాస్‌తో పాటు పలువురు విశ్రాంత ఉద్యోగులు పాల్గొన్నారు.

కాకతీయ యూనివర్సిటీలో..

కేయూ క్యాంపస్ : అంబేద్కర్ వర్ధంతిని పురస్కరించుకుని శనివారం కేయూ క్యాంపస్‌లో అంబేద్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. సుబేదారిలోని వర్సిటీ న్యాయ కళాశాలల, ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలలోనూ నివాళులర్పించారు. కార్యక్రమంలో కేయూ వీసీ ప్రొఫెసర్ కె.ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ వల్లూరి రామచంద్రం, పాలక మండలి సభ్యులు, ప్రొఫెసర్లు పాల్గొన్నారు.

వరంగల్ లీగల్: అంబేద్కర్ 69వ వర్ధంతిని పురస్కరించుకొని హనుమకొండ బార్ అసోసియేషన్ హాల్‌లో అంబేద్కర్ చిత్రపటానికి అధ్యక్షుడు పులి సత్యనారాయణ పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి కొత్త రవి, బార్ ప్రతినిధులు అంబేద్కర్, వెంకట్, సాంబశివరావు, రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యులు బైరపాక జయాకర్, దుస్స జనార్దన్, న్యాయవాదులు ఎం. సహోదర్‌రెడ్డి, గుడిమళ్ల రవికుమార్, డాక్టర్ జిలుకర శ్రీనివాస్, అల్లం నాగరాజు, సూరం నర్సింహస్వామి, కృష్ణ స్వామి, దండు మోహన్, కార్తీక్, శ్రీనివాస్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



హంటర్‌రోడ్‌లో అంబేద్కర్ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న హ్యూమన్ రైట్స్ అసోసియేషన్ నాయకులు

బీఆర్ఎస్ కార్యాలయంలో..

హనుమకొండ టౌన్: హనుమకొండ బాలసముద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో అంబేద్కర్ వర్ధంతిని శనివారం నిర్వహించారు. మాజీ కార్పొరేటర్ జోరిక రమేష్, బీఆర్ఎస్ పార్టీ 4వ డివిజన్ అధ్యక్షుడు కంజర్ల మనోజ్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మహ్మద్ నయీమొద్దీన్, సల్వాజీ రవీందర్‌రావు, మహేష్, ఖలీల్, విక్రమ్, ఇస్మాయిల్, వినయ్, రఘు, రమేష్, లలిత, దేవమ్మ, సారిక, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

న్యూశాయంపేటను పట్టణంగా తీర్చిదిద్దాం..

వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి

న్యూశాయంపేట, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): జీడబ్ల్యూఎంసీ పరిధిలోని 31వ డివిజన్ న్యూశాయంపేటలో గతంలో పల్లెటూరి వాతావరణం ఉండేదని, తాను ఎమ్మెల్యే అయినప్పటి నుంచి రోడ్లు, డ్రైనేజీలు వేయించి అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తూ పట్టణ వాతావరణంగా మార్చామని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. 31వ డివిజన్‌లోని శ్రీరామ గాయత్రి కాలనీలో శనివారం రూ.40లక్షలతో నిర్మించే రోడ్లు, డ్రెయినేజీకి సంబంధించిన పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. 31వ డివిజన్‌ను రానున్న రోజుల్లో ఇంకా అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానన్నారు. న్యూశాయంపేటలోని ఎస్సీ కాలనీకి గత ఎమ్మెల్యేలు ఏ ఒక్క రోజు కూడా రాలేదని, తాను ఎమ్మెల్యేగా గెలిచినప్పటి నుంచి అన్ని వర్గాలను కలుపుకుని పోతూ న్యూశాయంపేటను అభివృద్ధిలో ఆదర్శంగా తీర్చిదిద్దుతామన్నారు. అనంతరం గాయత్రీ కాలనీ ప్రజలు కాలనీని అభివృద్ధి చేస్తున్నందున కార్పొరేటర్ మామిండ్ల రాజుయాదవ్‌ను సన్మానించారు. కార్యక్రమంలో 31వ డివిజన్ కార్పొరేటర్ మామిండ్ల రాజుయాదవ్, మాజీ కార్పొరేటర్ వేల్పుల మోహన్‌రావు, పెద్ద సంఖ్యలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఈనెల 15 నుంచి ఆన్‌లైన్ సదస్సు

కేయూ క్యాంపస్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): డిసెంబరు 15 నుంచి 24 వరకు కేయూ, ఢిల్లీలోని మాలవీయ మిషన్ టీచర్ ట్రైనింగ్ సెంటర్ సంయుక్తంగా ఎన్‌ఈపీ ఓరియంటేషన్, సెన్సిటైజేషన్ ప్రోగ్రాం ఆన్‌లైన్‌లో నిర్వహిస్తామని కేయూ కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి బి.రమ, అసిస్టెంట్ ప్రొఫెసర్ డి.రమేశ్ తెలిపారు. శుక్రవారం కేయూ పరిపాలన భవనంలో ఆన్‌లైన్ సదస్సు పోస్టర్‌ను వీసీ కె.ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం, అకూట్ అధ్యక్షుడు ప్రొఫెసర్ బైరు వెంకట్రామిరెడ్డి ఆవిష్కరించారు. జాతీయ స్థాయి నిపుణులు అకాడమిక్, లీడర్‌షిప్, రిసెర్చ్ డెవలప్‌మెంట్, స్టూడెంట్ ఎడ్యుకేషన్ స్కిల్ డెవలప్‌మెంట్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, ఇండియన్ నాలెడ్జ్ సిస్టమ్ తదితర అంశాలపై ప్రతిరోజు ప్రత్యేక సెషన్లు నిర్వహిస్తామని తెలిపారు. ఢిల్లీ వర్సిటీ ప్రొఫెసర్లు గుర్ మహేందర్‌సింగ్, విమల్ రార్హాలు హాజరై మాట్లాడుతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉన్నత విద్యాధికారులు, అధ్యాపకులు, పరిశోధకులు సదస్సులో పాల్గొనాలని తెలిపారు. కేయూ వెబ్‌సైట్ లింక్‌లో వివరాలను నమోదు చేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో వర్సిటీ అధ్యాపకులు పాల్గొన్నారు.

సందడిగా జోనల్ వార్షిక క్రీడలు



వాలీబాల్ పోటీలో తలపడుతున్న విద్యార్థులు

వరంగల్ స్పోర్ట్స్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ శ్రీచైతన్య విద్యా సంస్థల (వరంగల్ జోన్) ఆధ్వర్యంలో జోనల్‌స్థాయి క్రీడా పోటీలు సందడిగా ప్రారంభం అయ్యాయి. శనివారం కాజీపేటలోని శ్రీచైతన్య సీబీఎస్ఈ పాఠశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన జోనల్ స్థాయి క్రీడా పోటీలను మడికొండ ఎస్ఐ రాజ్‌కుమార్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. విశిష్ట అతిథులు శ్రీచైతన్య విద్యాసంస్థల చైర్మన్ మల్లంపాటి శ్రీధర్, డైరెక్టర్ శ్రీవిద్య మాట్లాడారు. ఈ కార్యక్రమంలో డీజీఎం శ్రీచేతన్ మాధుర్, అకడమిక్ కోఆర్డినేటర్ శివ కోటేశ్వర్‌రావు, కాజీపేట శ్రీచైతన్య పాఠశాల ప్రిన్సిపాల్ అనితారెడ్డి, వరంగల్‌జోన్‌లోని వివిధ బ్రాంచ్‌ల ప్రిన్సిపాళ్లు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

'ఈశ్వరాచారి బలిదానానికి ప్రభుత్వానిదే బాధ్యత'

వడ్డెపల్లి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): బీసీ రిజర్వేషన్ల సాధన పోరాటంలో అనుముల సాయి ఈశ్వరాచారి బలిదానానికి ప్రభుత్వమే బాధ్యత వహించాలని రాష్ట్ర విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ మాతృ సంఘం అధ్యక్షుడు డాక్టర్ వేములవాడ మదన్‌మోహన్, రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు డాక్టర్ లాలుకోట వెంకటాచారి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చొల్లేటి కృష్ణమాచారి, కోశాధికారి రాగిఫణి రవీంద్రాచారిలు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. సాయి ఈశ్వరాచారి కుటుంబానికి రూ. కోటి ఎక్స్‌గ్రేషియా ఇవ్వడంతో పాటు కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా విశ్వబ్రాహ్మణ సమాజం పాలకుల వైఖరిని నిరసిస్తూ నిరసనలు తెలుపాలని కోరారు. శ్రద్ధాంజలి కార్యక్రమాలను చేపట్టాలని పిలుపునిచ్చారు.

ఐజేయూ నేతలకు సన్మానం

వడ్డెపల్లి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఇండియన్ జర్నలిస్టు యూనియన్ (ఐజేయూ) జాతీయ కౌన్సిల్ మెంబర్లుగా సీనియర్ జర్నలిస్టులు గడ్డం రాజిరెడ్డి, వల్లాల వెంకటరమణ, తోట సుధాకర్, సంగోజు రవి, టీయూడబ్ల్యూజే - ఐజేయూ వరంగల్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులుగా శ్రీరాం రాంచందర్, మట్ట దుర్గాప్రసాద్‌లు ఇటీవల ఎన్నికయ్యారు. వీరిని హనుమ కొండ బాలసముద్రంలోని గ్రేటర్ వరంగల్ ప్రెస్‌క్లబ్‌లో ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు వేముల నాగరాజు, ప్రధాన కార్యదర్శి బొల్లారపు సదయ్య, కోశాధికారి బోళ్ల అమర్ ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ బాధ్యులు కొడిపెల్లి దుర్గాప్రసాద్ రావు, వలిశెట్టి సుధాకర్, పొడిశెట్టి విష్ణువర్ధన్, సీనియర్ జర్నలిస్టులు గాడిపెల్లి మధు, ఎండి నయీంపాషా, విజయరాజ్, గడ్డం కేశవమూర్తి, సోమ నర్సయ్య, రాజేంద్రప్రసాద్, సంపత్‌రావు, పాష తదితరులు పాల్గొన్నారు. నేషనల్ కౌన్సిల్ సభ్యుడిగా పదవీకాలం పూర్తి చేసుకున్న నల్లాల బుచ్చిరెడ్డిని ప్రత్యేకంగా సన్మానించారు.



ఐజేయూ నేతలను సన్మానిస్తున్న ప్రెస్ క్లబ్ బాధ్యులు

పల్లెపల్లెన కాంగ్రెస్ జెండా ఎగరడం ఖాయం

వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు

హసన్‌పర్తి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో పల్లెపల్లెన కాంగ్రెస్ జెండా ఎగరడం ఖాయమని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు అన్నారు. శనివారం మండల పరిధిలో ఏకగ్రీవంగా ఎన్నికైన మల్లారెడ్డిపల్లి క్లస్టర్ పరిధిలోని అర్వపల్లి గ్రామ పంచాయతీ సర్పంచ్ అంబాల ప్రభాకర్, కొత్తపల్లి గ్రామ పంచాయతీ సర్పంచ్ దండ్రి సాంబయ్యలకు ఎమ్మెల్యే పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సత్కరించి అభినందించి మాట్లాడారు. గ్రామ స్వరాజ్యమే లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు ఏకగ్రీవంగా ఎన్నికవుతున్నారని, ఇది కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజాపాలనకు నిదర్శనమన్నారు. కాంగ్రెస్ పాలనలోనే అభివృద్ధి సాధ్యమని ప్రజలు నమ్ముతున్నారని అన్నారు. అందుకే రాబోయే రోజుల్లో స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రతీ గ్రామంలో కాంగ్రెస్ జెండా ఎగురుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పోరెడ్డి మహేందర్‌రెడ్డి, ఆత్మకూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ తంగెళ్లపల్లి తిరుపతితో పాటు కాంగ్రెస్ నాయకులు, స్థానిక సంస్థల ఎన్నికల పోటీ అభ్యర్థులు పాల్గొన్నారు.



అర్వపల్లి ఏకగ్రీవ సర్పంచ్ అంబాల ప్రభాకర్‌కు పుష్పగుచ్ఛం అందజేసి అభినందిస్తున్న ఎమ్మెల్యే నాగరాజు తదితరులు



పోలీస్ అధికారులకు సూచనలిస్తున్న సీపీ సన్‌ప్రీత్‌సింగ్

పంచాయతీ ఎన్నికలు

సజావుగా నిర్వహించాలి

వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్

వరంగల్ క్రైం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ ఎన్నికలు సజావుగా ప్రశాంతమైన వాతావరణంలో నిర్వహించాలని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ పోలీస్ అధికారులను ఆదేశించారు. వార్షిక తనిఖీల్లో భాగంగా శనివారం కాజీపేట ఏసీపీ కార్యాలయాన్ని సీపీ తనిఖీ చేశారు. తనిఖీల్లో భాగంగా స్పెషల్ గ్రేవ్, ఎస్సీ, ఎస్టీ కేసులు, పెండింగ్ కేసులతో పాటు కార్యాలయంలోని పలు రికార్డులను పరిశీలించారు. అనంతరం కాజీపేట డివిజన్‌లోని అధికారులతో మాట్లాడుతూ.. రాబోవు పంచాయతీ ఎన్నికల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందుస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ తనిఖీల్లో సెంట్రల్ జోన్ డీసీపీ కవిత, కాజీపేట ఏసీపీ ప్రశాంత్‌రెడ్డి, ఇన్‌స్పెక్టర్లు పుల్యాల కిషన్, పులి రమేశ్, సుధాకర్ రెడ్డి, చేరాలు, శ్రీధర్‌రావు పాల్గొన్నారు.

నేడు నగరంలో నీటి సరఫరా బంద్

వరంగల్ కార్పొరేషన్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): వరంగల్ నగరంలోని 34, 38 డివిజన్‌లలో ఆదివారం నీటి సరఫరా నిలిపివేస్తున్నట్టు ఇంజనీరింగ్ ఈఈ సంతోష్‌కుమార్ శని వారం ఒక ప్రకటనలో తెలిపారు. శివనగర్, చింతల్, పుప్పా లగుట్ట, ఖిలావరంగల్, తూర్పు, మధ్యకోట, విద్యానగర్, ఏక శిల నగర్, నాగేంద్రరావు నగర్, కాశికుంట, రుద్రమాంబనగర్, మైసయ్యనగర్‌లలో నీటి సరఫరా జరుగదని తెలిపారు. కాగా, ఈ రెండు డివిజన్‌లలో లీకేజీ పనులు జరుగుతున్న నేపథ్యం లో 24 గంటల పాటు నీటి జరఫరా జరగదని తెలిపారు. ప్రజ లు గమనించి బల్దియా అధికారులకు సహకరించాలని సంతో ష్‌బాబు విజ్ఞప్తి చేశారు.

రేపు ఐటీఐలో

జాతీయ అప్రెంటిషిప్ మేళా

కాజీపేట, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): కాజీపేట కూరగాయల మార్కెట్‌లోని ఐటీఐలో ఈ నెల 8న ఉదయం 10 గంటలకు ఐటీఐ పూర్తి చేసిన అభ్యర్థులకు జాతీయ అప్రెంటిషిప్ మేళా నిర్వహిస్తున్నట్లు ఐటీఐ ప్రిన్సిపాల్ పి.వెంకటేశ్వర్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, ఎలక్ట్రానిక్ మెకానిక్ తదితర ట్రేడ్‌లలో ఐటీఐ పూర్తిచేసిన అభ్యర్థులు పాల్గొనాలని సూచించారు. ఆసక్తిగల అభ్యర్థులు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ. అప్రెంటిషిప్ ఇండియా. కవ్. ఇన్ అనే వెబ్‌సైట్‌లో పేర్లు నమోదు చేసుకుని హాజరుకావాలన్నారు.

అభ్యర్థులు తమ బయో - డాటా, అప్రెంటిషిప్ రిజిస్ట్రేషన్ కాపీ, ఎస్ఎస్ సీ, ఐటీఐ మేమో, ఎన్‌టీసీ సర్టిఫికెట్, కుల ధృవీకరణ పత్రం, రెండు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు తీసుకురావాలని చెప్పారు. ఈ మేళాకు అన్ని ట్రేడ్‌లు పూర్తి చేసిన అభ్యర్థులు హాజరుకావచ్చని తెలిపారు.

రెయిలింగ్ పైపుల అపహరణ

హసన్‌పర్తి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ 66వ డివిజన్ కేంద్రం హసన్‌పర్తి పెద్ద చెరువు కట్టను ట్యాంకు బండ్ చేసేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. మిషన్ కాకతీయ పథకంలో భాగంగా చెరువు కట్ట ట్యాంక్ బండ్ నిర్మాణ పనుల కాంట్రాక్టర్ సగం పనులు చేసి చేతులు దులుపుకున్నట్లు ఆరోపణలున్నాయి. సదరు కాంట్రాక్టర్ చెరువు కట్ట రెయిలింగ్ పైపులు నాసిరకంగా చేసినట్లు ఆరోపణలున్నాయి. సదరు కాంట్రాక్టర్ నాసిరకం పనులు చేపట్టడం వల్లనే రెయిలింగ్ పైపులు ఊడిపోయి రోజుకో పైపు చొప్పున అపహరణకు గురవుతున్నా.. సంబంధిత కాంట్రాక్టర్, అధికారులు పట్టించుకోవడం లేదని స్థానిక వాకర్స్ ఆరోపిస్తున్నారు. ఈ విషయంపై సంబంధిత ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి సదరు కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకొని అపహరణకు గురవుతున్న రెయిలింగ్ పైపులను కాపాడాలని స్థానికులు కోరుతున్నారు.

మెడికల్ స్పోర్ట్స్ మీట్ వాయిదా

వరంగల్ మెడికల్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): వైద్య విద్యార్థుల ఇంటర్ మెడికల్ స్పోర్ట్స్ గేమ్స్ మీట్‌ను వాయిదా వేస్తున్నట్లు కాళోజీ నారాయణరావు ఆరోగ్య విశ్వవిద్యాలయం స్పోర్ట్స్ బోర్డు కార్యదర్శి డాక్టర్ రామ్‌కుమార్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. కొన్ని అనివార్య కారణాల వల్ల వాయిదా వేస్తున్నట్లు తెలిపారు. ఈ మీట్ తదుపరి తేదీలను త్వరలో ప్రకటిస్తామన్నారు. వైద్య కళాశాల ఫిజికల్ డైరెక్టర్లు, వైద్య విద్యార్థులు ఈ మార్పును గమనించాలని ఆయన కోరారు.

ఎన్టీఆర్ జయంతి సందర్భంగా క్రీడా పోటీలు



క్రీడా పోటీల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న టీడీపీ నాయకులు

వడ్డెపల్లి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మాజీ సీఎం ఎన్టీఆర్ జయంతి సందర్భంగా వరంగల్ ఉమ్మడి జిల్లాలో క్రీడా పోటీలను నిర్వహిస్తున్నట్లు టీడీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రమావత్ నరేష్ నాయక్ తెలిపారు. శనివారం రంగారెడ్డి జిల్లాలోని షాద్‌నగర్‌లో ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి క్రికెట్, కబడ్డీ పోటీల పోస్టర్‌ను మాజీ ఎమ్మెల్యే, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు బక్కని నర్సింహులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నరేష్‌నాయక్ మాట్లాడుతూ హను మకొండలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల మైదానంలో జనవరి 5 నుంచి క్రీడా పోటీలు ప్రారంభమవుతాయని తెలిపారు. టీడీపీ రాష్ట్ర, జిల్లా నాయకులు పిట్టల శ్రీనివాస్, చల్లా వెంకటేశ్వర్‌రెడ్డి, భాస్కర్ గౌడ్, అనంతయ్య, భూపాల్ తదితరులు పాల్గొన్నారు.

ఫార్మసీ అధికారుల పాత్ర కీలకం

హనుమకొండ డీఎంహెచ్‌వో అప్పయ్య

వరంగల్ మెడికల్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): వైద్య, ఆరోగ్యశాఖలో ఫార్మసీ ఆఫీసర్ల పాత్ర ఎంతో కీలకమని హనుమకొండ డీఎంహెచ్‌వో డాక్టర్ అప్పయ్య అన్నారు. శనివారం చీఫ్ ఫార్మసీ ఆఫీసర్ వి.పద్మజాదేవి ఉద్యోగ విరమణ సన్మాన కార్యక్రమాన్ని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ కాన్ఫరెన్స్ హాల్‌లో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ.. డాక్టర్ తరువాత ఫార్మసీ అధికారులు కీలకమన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పని చేస్తున్న ఫార్మసీ అధికారులకు మెడిసిన్స్ ట్రాన్స్‌పోర్ట్ ఖర్చుల కింద ఏటా రూ.15వేలు ఇస్తామని హామీ ఇచ్చారు. స్టేట్ ప్రెసిడెంట్ బత్తిని సుదర్శన్‌గౌడ్ మాట్లాడుతూ.. ఫార్మసీ ఆఫీసర్స్‌కు అడహక్ ప్రమోషన్స్ ఇప్పించేందుకు కృషి చేస్తున్నామని, ప్రతీ పీహెచ్‌సీలో కూడా ముగ్గురు ఫార్మసీ ఆఫీసర్ పోస్టులను మంజూరు చేసేందుకు ఫైల్ రాష్ట్ర అధికారుల వద్ద ప్రాసెస్‌లో ఉందని తెలిపారు. అంతకుముందు ఉద్యోగ విరమణ పొందిన పద్మజాదేవిని ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో కందకట్ల శరత్‌బాబు, ఉప్పు భాస్కర్‌రావు, నార్ల వేణు, వి.సుధాకర్‌రెడ్డి, వల్లాల రాజేందర్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో అప్పయ్య

చలి కాలంలో జాగ్రత్తలు తీసుకోవాలి

చలి తీవ్రతకు వృద్ధులు, చిన్న పిల్లల విషయంలో తగు జాగ్రత్తలు తీసుకోవడం అవరమని హనుమకొండ డీఎంహెచ్‌వో డాక్టర్ ఎ.అప్పయ్య సూచించారు. చలి తీవ్రత క్రమంగా పెరగడం, ఉష్ణోగ్రతలు పడిపోవడం వల్ల రానున్న రోజుల్లో చలి తీవ్రత మరింత పెరిగే అవకాశం ఉండటంతో ఆరోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉందని డీఎంహెచ్ఓ పేర్కొన్నారు. ముఖ్యంగా చిన్న పిల్లలకు స్వెటర్లు, కాళ్లు, చేతులకు సాక్సులు, గ్లౌసులు వేయాలి. నెలల వయసుగల చిన్నారులను తల్లి పొత్తిళ్లలో పడుకోబెట్టాలి. ఉదయం పూట ఎండలో కాసుపు పట్టుకొని ఉండాలి. చిన్నారులతో ఉదయం, రాత్రి ప్రయాణాలు చేయొద్దు. పిల్లలకు అవసరమైన టీకాలు ఇప్పించాలి. పిల్లలను చలిలో ఎలాంటి జాగ్రత్తలు తీసుకోకుండా ఆటలు ఆడనీయొద్దు. ముఖ్యంగా అస్తమా ఉన్న వారు చలిగాలిలో గల తేమకు గురికాకుండా జాగ్రత్త పడాలి. రాత్రివేళల్లో చల్లగాలి రాకుండా ఇంట్లో కిటికీలు, తలుపులు మూసి ఉంచాలి. వాకింగ్‌కు వెళ్లేవారు చలి ఎక్కువగా ఉన్నప్పుడు చెవులను కప్పి ఉంచేలా తలకు మంకీ క్యాప్ లేదా మఫ్లర్ లాంటివి వాడాలి. ద్విచక్ర వాహనదారులు చలి ఎక్కువగా ఉన్నప్పుడు ప్రయాణం చేస్తే చేతులకు గ్లౌసులు, హెల్మెట్ ధరించాలి. వేడి వేడి ఆహారం తీసుకోవాలి అని డీఎంహెచ్‌వో అప్పయ్య సూచించారు.



భార్గవి కూనం... సెలబ్రిటీ డిజైనర్. ఫ్యాషన్ రంగంలో భార్గవి లేబుల్‌కు ఒక ప్రత్యేకత ఉంది. సీఎం రేవంత్‌రెడ్డి భార్య గీత నుంచి మెగా కృష్ణారెడ్డి భార్య సుధ దాకా... నయనతార నుంచి శ్రీలీల దాకా అందరూ భార్గవి దగ్గర దుస్తులు డిజైన్ చేయించుకొనే వారే! భార్గవిని 'నవ్య' పలకరించినప్పుడు తన అనుభవాలను పంచుకున్నారు.

అతిథి





> చాలామంది సెలబ్రిటీలతో పనిచేయటం కష్టం కదా... అని అడుగుతూ ఉంటారు. కానీ నా ఉద్దేశంలో అంత కష్టం కాదు. గీత గారికి (రేవంత్‌రెడ్డి భార్య), సుధ గారికి (మెగా కృష్ణరెడ్డి భార్య), సమంత.. నయనతార.. రకుల్.. శ్రీలీల.. ఇలా చాలామంది సెలబ్రిటీలకు ఏం కావాలో నాకు తెలుసు. వారితో చాలా కాలంగా కలిసి పని చేస్తున్నాను కాబట్టి వారి ఇష్టాలు నాకు తెలుసు. వాళ్లకు ఏం కావాలో తెలిసినప్పుడు డిజైనింగ్ సులభమవుతుంది కదా! ఇతర కస్టమర్లకు మూడు ప్రత్యామ్నాయాలు చూపిస్తే- వీరికి పది చూపిస్తాను. అయితే కొన్నిసార్లు ఒత్తిడి ఉంటుంది. ఫ్రస్ట్రేషన్ కూడా వస్తుంది. కానీ వాటిని నేను పట్టించుకోను. ఎందుకంటే వాటన్నిటినీ దాటితేనే వృత్తిపరంగా మనం ఎదగగలుగుతాం.

ప్రతి చేనేత వెనక ఒక కథ ఉంటుంది

"మాది ఆళ్లగడ్డ. మధ్యతరగతి కుటుంబం. డాక్టర్ల కుటుంబం. మా నాన్నగారు డాక్టర్. మా అన్నయ్య డాక్టర్. నేను ఇంటర్ పూర్తి చేసిన తర్వాత నిఫ్ట్‌లో ఫ్యాషన్ డిజైనింగ్ కోర్సు చేయాలనుకున్నా. కానీ ఆ రోజుల్లో ఫ్యాషన్ డిజైనింగ్ కోర్సును చిన్నచూపు చూసేవారు. నేను నిఫ్ట్‌లో చేరటానికి నాన్నగారు ఒప్పుకోలేదు. నేను క్రియేటివ్ కోర్సు చేయాలనుకున్నా. ఆర్కిటెక్చర్‌కు వెళ్తానని పట్టుపట్టా. నాన్నగారు ఒప్పుకున్నారు. ఆర్కిటెక్చర్ చదివాను కానీ నా దృష్టి. శ్రద్ధ అంతా బట్టలపైనే ఉండేది. ఎందుకో నాకు తెలియదు.. ఒక మంచి చీరనో.. డ్రస్సునో చూసినప్పుడు.. దానిని ఎంపిక చేసుకున్నప్పుడు ఇతరులలో వచ్చే చిరునవ్వును చూడటం నాకు చాలా ఇష్టం.

ఒక కంపెనీలో ఆరు నెలలు పనిచేసి బయటకు వచ్చేసి సొంతంగా ఒక లేబుల్ పెట్టుకున్నా. నేను నా సొంత డిజైనింగ్ కంపెనీని ప్రారంభించినప్పుడు నా దగ్గర ముగ్గురు పని చేసేవారు. 18 ఏళ్ల తర్వాత 200 మంది నా దగ్గర పనిచేస్తున్నారు. ఈ 18 ఏళ్ల ప్రస్థానంలో ఎన్నో అనుభవాలు. వాటి నుంచి నేర్చుకున్న ఎన్నో పాఠాలు. వాటిని వెనక్కి తిరిగి చూసుకుంటే- ఆనందంగా అనిపిస్తుంది. సంతృప్తిగా అనిపిస్తుంది.

ఎవరూ తెలియని దశ నుంచి...

నేను హైదరాబాద్‌కు తొలిసారి వచ్చినప్పుడు- నాకు వృత్తి కొత్త. నాకు ఇక్కడ ఎవరూ తెలియదు. ఇప్పుడు ఇక్కడ అందరూ తెలుసు. ఎవరైనా నన్ను మీ 18 ఏళ్ల గురించి చెప్పండి అని అడిగితే- "అప్పుడు ఎవరూ తెలియదు.. ఇప్పుడు అందరూ తెలుసు" అని చెబుతాను. ప్రారంభించినప్పుడు ఇద్దరు ఎంబ్రాయిడరీ పని వాళ్లు ఉండేవారు. ఒక టైలర్ ఉండేవారు. నేను తొలిసారి లంగా.. ఓణీ డిజైన్ చేసి ఒక క్లయింట్‌కు ఇవ్వటం నాకు ఇంకా గుర్తుంది. నేను ప్రారంభించిన రోజుల్లో బొటిక్‌లు ఉండేవి. వాటిలో కొన్ని డిజైనర్ వేర్ ఉండేది. అక్కడకు వెళ్లి మనకు నచ్చింది కొనుక్కోవాల్సి వచ్చేది. మనకు నచ్చింది కొనుక్కోవటం కాకుండా మనకు ఏది నప్పితే అది కుట్టించుకుంటే బావుంటుందని నేను భావించాను. అలా నా కస్టమర్లకు వాళ్లకు ఏది నప్పుతుందో సూచించేదాన్ని.

> దక్షిణ భారత మహిళలు చాలా బావుంటారు. వాళ్లు వేసుకొనే ఓణీలు, చీరలు వాళ్లను భిన్నంగా మారుస్తాయి. ఒక పెళ్లికి వెళ్లే ప్రతి అమ్మాయి, ప్రతి మహిళా చాలా అందంగా కనిపిస్తుంది. తెలుగు, కన్నడ, తమిళులు అని వేర్వేరుగా అనిపించవచ్చు. కానీ అందరూ చాలా అందంగా ఉంటారు. తమిళులు చాలా సంప్రదాయబద్ధంగా ఉంటారు. తెలుగు వారు కొత్త కొత్త ఎక్స్‌పెరిమెంట్స్ చేస్తుంటారు.

> మనం ఎంత ఆధునికంగా ఉన్నా పెళ్లిళ్లకు, పండగలకు సంప్రదాయబద్ధంగా బట్టలు ధరించాల్సిందే! వీటిలో నాకు అనుభవం ఉంది. నేను రకరకాల చేనేతలను కలిపి కుడతాను. కాంచీవరం లెహంగాకు.. కలంకారి దుప్పట్టా వేసి.. దానిపై ఎంబ్రాయిడరీ బ్లౌజ్ వేస్తాను. ఇలా రకరకాల చేనేతలను కలపటంవల్ల మొత్తం డ్రస్సుకు మంచి అందం వస్తుంది. ఒక డ్రస్సులో అనేక పొరలు వేస్తా. ప్రతిసారి వేర్వేరు రంగులు వాడతాను.

మలుపు తిప్పిన సందర్భం...

కొందరు కొన్ని రకాల బట్టలు వేసుకోవటానికి ఇష్టపడరు. వారికి తగినట్లుగా బట్టలు కుట్టేదాన్ని. వాళ్లు పార్టీలకు వెళ్లినప్పుడు అవి భిన్నంగా ఉన్నాయని అందరూ గమనించేవారు. వారు మళ్లీ నాకు చెప్పేవారు. నా అనుభవసారమంతా కస్టమర్ల నుంచి వచ్చినదే! వాళ్లు నేర్పినదే. పదేళ్ల పాటు నేను ఎటువంటి ఫలితాన్ని ఆశించకుండా పనిచేశా. ఆ తర్వాత 'భార్గవి కూనం' కోసం వచ్చేవారు. 15 ఏళ్ల క్రితం ఒక ఇంగ్లీషు దినపత్రిక కోసం నోవాటెల్‌లో ఒక డిజైనర్ ఫ్యాషన్ షో నిర్వహించాను. హైదరాబాద్‌లో అలాంటి ఫ్యాషన్ షో జరగటం అదే తొలిసారి. ఆ ఫ్యాషన్ షో తర్వాత నాకు మంచి గుర్తింపు వచ్చింది. అదే సమయంలో కృష్ణవంశీ గారి 'మొగుడు' సినిమాలో 36 మందికి బట్టలు.. నగలు నేనే డిజైన్ చేశాను. ఆ సినిమాలో హీరోయిన్ తాప్సీ పన్ను, హీరో గోపీచంద్‌లకు డిజైన్ చేసిన బట్టలు బాగా ప్రసిద్ధి పొందాయి. ఈ సినిమాలో అనేక తరాలకు కావాల్సిన బట్టలు డిజైన్ చేయాల్సి వచ్చింది. ఈ సినిమావల్ల ఒక పెద్ద వివాదంలో చిక్కుకోవాల్సి వచ్చింది. ఈ సినిమాకు నేను డిజైనర్‌ని. క్రెడిట్స్‌లో కూడా నా పేరే ఉంటుంది. అయితే ఈ కాస్ట్యూమ్ డిజైన్స్‌ను ఆ సినిమా నిర్మాతలు కళామందిర్‌కు 50 లక్షల రూపాయలకు విక్రయించారు. కళామందిర్ వారు వెడ్డింగ్ కలెక్షన్‌గా ప్రచారం చేసుకున్నారు. నేను ఆ సమయంలో నా ఆవేదనను ఫేస్‌బుక్‌లో పెట్టాను. ఆ సమయంలోనే 'నేను ఎప్పుడూ సినిమాలకు పని చేయకూడదు' అనుకున్నా. 'రారండో.. వేడుక చేద్దాం' సహా 20 సినిమాలకు పనిచేసి ఉంటా! ఈ సినిమాలో మొత్తం 25 లంగా, ఓణీలు డిజైన్ చేశాను. కానీ ఏ రోజూ డైరక్టర్‌ని కానీ.. హీరో హీరోయిన్లను కానీ కలవలేదు. స్టైలిస్ట్‌తోనే కలిసి పనిచేశా! వాళ్లు డబ్బులు ఇచ్చారు. నేను డిజైన్స్ ఇచ్చా. ఈ సినిమాల్లో కాస్ట్యూమ్ డిజైనర్‌గా పేరు వేస్తే నాకు మరింత పేరు వచ్చేదేమో! కానీ సినిమాలకు నాకు పడదని అర్థమయిపోయింది కాబట్టి నేను క్రెడిట్ కోసం ఎప్పుడూ పట్టించుకోలేదు.

నేసేవారందరూ మహిళలే

నేను బ్రాండ్ ప్రారంభించినప్పుడు వేర్వేరు ప్రాంతాల నుంచి వస్త్రాలు కొనేదాన్ని. పదేళ్ల తర్వాత దానిని కూడా నేనే తయారుచేయించుకుంటే బావుండుననిపించింది. 8 ఏళ్ల క్రితం నాకు అవసరమైన బట్టలు నేను నేయించుకోవటం మొదలుపెట్టాను. ఒక మగ్గంతో ప్రారంభించా. ఇప్పుడు నా దగ్గర 45 మగ్గాలు ఉన్నాయి. వీటిని నేసేవారందరూ మహిళలే! వాళ్లకు ఇంట్లో పని అయిపోయిన తర్వాత నేయటం మొదలుపెడతారు. వారికి డబ్బులు కూడా వస్తాయి. నా బట్టలన్నీ వీళ్లు నేసినవే! కొన్ని చీరలు చాలా బావుంటాయి. కొన్ని అంతగా బావుండవు. దీనికి కారణం- నేసేవారి భావోద్వేగాలు. ప్రతి చీర వెనక ఒక నేత కథ ఉంటుంది. అందుకే చీరలకు ఆత్మ ఉంటుందని నేను నమ్ముతాను. చీరలు వాటిని నేసేవారి కథలను ప్రతిబింబిస్తాయి. చీరకు వారికి మధ్య ఒక అనుబంధం ఉంటుంది. ఇప్పటికీ కాంచీపురంలో చీర నేసిన వెంటనే కామాక్షి దేవి ఆలయానికి తీసుకువెళ్లి పూజ చేయిస్తారు. అమ్మవారి ఆశీస్సులు పొందుతారు."

• సీవీఎల్ఎన్ ప్రసాద్





> నా బలం నా వర్క్. నా క్లయింట్స్ ఇప్పుడు వెడ్డింగ్స్‌లో వేర్వేరు డిజైజర్స్‌ను వాడుతున్నారు. ఆరేళ్ల క్రితం అన్నీ ఒక్కళ్లకే ఇచ్చేవారు. ఇప్పుడు వేర్వేరు ఫంక్షన్లకు వేర్వేరు డిజైనర్లను పెట్టుకుంటున్నారు. గాలి జనార్దన్‌రెడ్డి కూతురు పెళ్లిలో 12 ఈవెంట్స్‌కు నేనే కాస్ట్యూమ్స్ డిజైన్ చేశా! వారి కుటుంబంలో నలుగురు ఉంటే, వారందరికీ ప్రతి ఫంక్షన్‌కూ పది భిన్నమైన డిజైన్స్ చేసి చూపించాల్సి వచ్చింది. అది నిజంగా ఒక ఛాలెంజ్ అని చెప్పాల్సిందే!

ఈ వారమే విడుదల

ఈ ఆదివారం నుంచి వచ్చే శనివారంలోగా విడుదలవుతున్న సినిమాలు, వెబ్‌సిరీస్‌ల వివరాలు



ఓటీటీ వేదిక	సినిమా/సిరీస్	విడుదల తేదీ
నెట్‌ఫ్లిక్స్		
మాన్ వర్సెస్ బేబీ	వెబ్‌సిరీస్	డిసెంబర్ 11
గుడ్‌బై జూన్	హాలీవుడ్ మూవీ	డిసెంబర్ 12
సింగిల్ పాపా	హిందీ సిరీస్	డిసెంబర్ 12
వేక్ అప్ డెడ్ మాన్	హాలీవుడ్ మూవీ	డిసెంబర్ 12
అమెజాన్ ప్రైమ్		
మెర్సీ	ఒరిజినల్ మూవీ	డిసెంబర్ 10
టెల్ మీ సాఫ్ట్లీ	హాలీవుడ్ మూవీ	డిసెంబర్ 12
జియో హాట్‌స్టార్		
సూపర్‌మ్యాన్	హాలీవుడ్‌మూవీ (తెలుగులో)	డిసెంబర్ 11
ది గ్రేట్ షంషుద్దీన్ ఫ్యామిలీ	హిందీ చిత్రం	డిసెంబర్ 12
ఆహా...		
త్రీ రోజెస్	తెలుగు సిరీస్	డిసెంబర్ 12
జీ 5		
సాలీ మొహబ్బత్	హిందీ చిత్రం	డిసెంబర్ 12

ఈ ఏడాది విడుదలైన 'హురున్ ఇండియా ఆర్ట్ లిస్ట్ 2025' జాబితాలో మునుపెన్నడూ లేని విధంగా ఏకంగా 17 మంది మహిళలు స్థానం సంపాదించి చరిత్ర సృష్టించారు. భారత ఆర్ట్ మార్కెట్ గతిని మార్చేస్తున్న ఈ శుభపరిణామానికి గ్యాలరీలు, కళారాధకులు, వేలం సంస్థలు బ్రహ్మరథం పడుతున్నాయి. మహిళల సృజనకు, వారి విభిన్నమైన ఆలోచనా సరళికి ఎట్టకేలకు సరైన గుర్తింపు, ఆర్థిక విలువ లభిస్తున్నాయనడానికి ఇదే నిదర్శనం.

కళా ప్రపంచంపై వారి ముద్ర



అగ్రపీఠంపై 85 ఏళ్ల మేధావి

ఈ మహిళా శక్తికి మకుటంగా నిలిచారు 85 ఏళ్ల దిగ్గజ కళాకారిణి, పద్మశ్రీ అవార్డు గ్రహీత అంజోలి ఎలా మేనన్. వయసు కేవలం ఒక సంఖ్య మాత్రమేనని నిరూపిస్తూ ఆమె తన కళతో ఇప్పటికీ మార్కెట్‌ను శాసిస్తున్నారు. గడిచిన సంవత్సరంలో ఏకంగా రూ. 8.7 కోట్ల టర్నోవర్‌తో ఈ జాబితాలోని మహిళల్లో అగ్రస్థానాన్ని అధిష్ఠించారు. మొత్తం 32 కళాఖండాలు విక్రయించగా, అందులో ఒక చిత్రం గరిష్ఠంగా రూ. 1.4 కోట్లకు అమ్ముడు కావడం ఆమె కళకు ఉన్న డిమాండ్‌కు అద్దంపడుతోంది. దశాబ్దాలుగా తనదైన శైలితో కళాభిమానులను మంత్రముగ్ధులను చేస్తున్న మేనన్ విజయం నేటి యువ కళాకారులకు స్ఫూర్తిదాయకం.

ఒకరిద్దరు కాదు...





ఈ విజయం కేవలం ఒకరిద్దరిది కాదు. మేనన్ తర్వాత ఢిల్లీకి చెందిన సీనియర్ ఆర్టిస్ట్ అర్పితా సింగ్ (రూ. 5.7 కోట్లు), ముంబైకి చెందిన నళిని మలాని (రూ. 4.9 కోట్లు) వరుసగా రెండుమూడు స్థానాల్లో నిలిచి సత్తాచాటారు. ముఖ్యంగా అర్పితాసింగ్ గీసిన ఒక కళాఖండం రూ. 3.9 కోట్లకు అమ్ముడై రికార్డు సృష్టించింది. టాప్-10 జాబితాను పరిశీలిస్తే మహిళల ఆధిపత్యం స్పష్టంగా కనిపిస్తుంది. జయశ్రీ బర్మన్ (రూ.4.3 కోట్లు), భారతీ ఖేర్ (రూ.4 కోట్లు) వంటి ప్రముఖులతోపాటు మాధ్వి పరేఖ్, అర్పణాకౌర్, శోభా బ్రూటా, సెలియాపాల్, అంజు డోడియా వంటి ప్రతిభావంతులు కోటి రూపాయలకుపైగా టర్నోవర్‌తో ఈ జాబితాలో సగర్వంగా నిలిచారు.

మారిన దృక్పథం.. పెరిగిన ఆదరణ

ఒకప్పుడు పురుషాధిక్య రంగంగా భావించిన కళా ప్రపంచంలో ఈ మార్పు ఆకస్మికంగా వచ్చింది కాదు. ఎందరో మహిళలు తమ జీవితాలను కళకే అంకితం చేసి నిశ్శబ్దంగా తమ పని తాము చేసుకుపోయారు. వారి కళలోని లోతు, సామాజిక స్పృహ, ప్రత్యేక భావవ్యక్తీకరణ ఇప్పుడు ప్రపంచం దృష్టిని ఆకర్షిస్తున్నాయి. కళను కేవలం అలంకార వస్తువుగా కాకుండా, ఒక శక్తిమంతమైన ఆయుధంగా, పెట్టుబడిగా చూసే ధోరణి పెరగడంతో కళాకారిణుల కృతులకు విపరీతమైన ఆదరణ లభిస్తోంది. మొత్తం మీద హురున్ ఆర్ట్‌లిస్ట్ 2025 భారత కళారంగంలో ఒక కొత్త శకానికి నాంది పలికింది. అది కేవలం గణాంకాల నివేదిక కాదు. పట్టుదల, ప్రతిభ, సృజనాత్మకతతో కాన్వాసుపైనే కాదు, మార్కెట్‌లోనూ తమదైన ముద్రవేస్తున్న మహిళల విజయ పతాక.

నల్లని పట్టీలే నయా ట్రెండ్..!

వెండి పట్టీల స్థానంలో ఆక్సిడైజ్డ్ పట్టీలు ట్రెండింగ్‌లోకి వచ్చేశాయి. ఒకింత నలుపుదనాన్ని మేళవించినట్లుండే ఈ పట్టీలు.. ఎన్నేళ్లు పెట్టుకున్నా చెక్కు చెదరకుండా ఉంటాయి. అందుకే మహిళలంతా వీటివైపే మొగ్గు చూపుతున్నారు. ఆధునిక పోకడలకు అనుగుణంగా విభిన్నమైన డిజైన్లలో సరికొత్త హంగులతో వీటిని రూపొందిస్తున్నారు. నేటి యువతులు ఎక్కువగా ఇష్టపడుతున్న ఈ ఆక్సిడైజ్డ్ పట్టీలపై ఓ లుక్కేద్దామా...

కడా మోడల్



ఈ పట్టీలు రాజస్థాన్, గుజరాత్ సంస్కృతులను ప్రతిబింబిస్తూ నల్లగా గుండ్రంగా ఉంటాయి. కడా బ్రేస్‌లెట్‌ను తలపిస్తాయి. పాదాల మీదుగా జాలువారకుండా చీలమండకు అంటి పెట్టుకుని ఉంటాయి. వీటికి స్క్రూ లేదా స్నాప్ క్లోజర్‌ను అమరుస్తారు. క్లాసీగా ఉండేలా చిన్న చిన్న మువ్వలు చేర్చి రత్నాలు పొదిగిన కడా స్టయిల్ పట్టీలు ఇప్పుడు ట్రెండింగ్‌లో ఉన్నాయి.

స్టోన్ వర్క్ పట్టీలు



సున్నితమైన గొలుసుకు రంగురంగుల రాళ్లు, పూసలు, చిన్న సైజు రత్నాలు జతచేసి తయారుచేసిన ఈ పట్టీలు.. అమ్మాయిలను బాగా ఆకర్షిస్తున్నాయి. నల్లగా మెరిసే వెడల్పాటి గొలుసు మీద చిన్న మోటిఫ్‌లు, పూలు, లతలు తీర్చి వాటి మధ్యలో మెరిసే రాళ్లు, కుందనాలు పొదిగి ఆకర్షణీయమైన పట్టీలను రూపొందిస్తున్నారు.

గుత్తి స్టయిల్



నల్లగా మెరిసే వెడల్పాటి పట్టీలకు చిన్న చిన్న మువ్వలను గుత్తులు గుత్తులుగా జోడిస్తారు. ఈ మువ్వలు శబ్దం చేయవు. పట్టు చీరలు, పరికిణీలు, లెహంగాల మీద గ్రాండ్ లుక్‌నిస్తాయి. మహిళలు వివాహాది శుభ కార్యాల్లో వీటిని ఎక్కువగా ధరిస్తుంటారు. చిన్న పిల్లల నుంచి మధ్య వయసు మహిళల వరకు అందరూ ఇష్టపడే మోడల్ ఇది.

ఫ్లవర్ డిజైన్



పువ్వులను వరుసగా పేర్చినట్లు కనిపించే ఈ డిజైనర్ పట్టీలకు కూడా డిమాండ్ అధికంగా ఉంది. తేలికపాటి నలుపు రంగులో సింపుల్‌గా కనిపించే విభిన్నమైన డిజైన్లలో ఇవి లభ్యమవుతున్నాయి. ఇవి రోజువారీ పెట్టుకోడానికి బాగుంటాయి.

ఎలా తయారుచేస్తారంటే...

వెండి పట్టీలను సల్ఫైడ్ సమ్మేళనాల్లో ముంచి నల్లబరిచి ఆక్సిడైజ్డ్ పట్టీలను తయారు చేస్తున్నారు. ఈ ఆక్సిడైజ్డ్ పట్టీలు.. దుమ్ము, ధూళిని ఆకర్షించకుండా అందంగా మెరుస్తూ కనిపిస్తాయి. డిజైన్‌ను అనుసరించి వాటికి అరుదైన గ్రాండ్ లుక్ కూడా వస్తుంది. చీరలు, లెహంగాలు, సల్వార్ సూట్లు లాంటి సంప్రదాయ దుస్తులతోపాటు డెనిమ్, బోహేమియన్, ఫ్యూజన్ తదితర మోడరన్ డ్రెస్‌ల మీద కూడా ఇవి చక్కగా సూటవుతాయి.

మిర్రర్ మోడల్



గుండ్రని లేదా జ్యామితి ఆకృతుల్లో ఉన్న చిన్న, పెద్ద అద్దాలను చక్కని డిజైన్ ప్రకారం చేర్చి ఈ మిర్రర్ మోడల్ ఆక్సిడైజ్డ్ పట్టీలను తయారు చేస్తారు. ఇవి రాజస్థానీ కచ్ సంప్రదాయాన్ని గుర్తుకు తెస్తాయి. ఈ పట్టీలకు చిన్న మువ్వలను కూడా జోడించడంతో నడిచేటప్పుడు శ్రావ్యమైన ధ్వని వస్తుంటుంది. వీటిని యువతులు ఎక్కువగా ఇష్టపడుతున్నారు.

రత్నాల పట్టీలు



అక్కడక్కడా నల్లగా మెరిసే ఆక్సిడైజ్డ్ వెండి గొలుసుకు రంగురంగుల రత్నాలను జతచేసి ఈ రత్నాల పట్టీలను రూపొందిస్తున్నారు. పూలు, కొమ్మల డిజైన్లలో ఇవి ఎక్కువగా లభిస్తుంటాయి. వీటికి పెద్ద సైజు మువ్వలను లేదంటే చిన్న మువ్వల గుత్తులను జోడించి వింటేజ్ లుక్ తెస్తున్నారు. వివాహాది శుభకార్యాల్లో, పండుగలప్పుడు పెట్టుకోడానికి మహిళలు ఎక్కువగా ఈ రత్నాల పట్టీలనే ఎంచుకుంటున్నారు.

చిట్కా

కడాయి మాడిందా..?

నల్లగా మాడిన కడాయిలో బేకింగ్ సోడా చల్లాలి. దీని మీద కొద్దిగా వెనిగర్‌ను చిలకరించాలి. రెండూ కలిసి నురుగులా పొంగు వస్తుంది. దీన్ని అలాగే అరగంటసేపు ఉంచాలి. తరువాత స్క్రబ్బర్‌తో రుద్ది నీళ్లు పోసి కడిగితే కడాయి తళతళా మెరుస్తుంది. స్టీల్ లేదా ఇనుప కడాయిని తోమడానికి స్టీల్ స్క్రబ్బర్‌ను ఉపయోగించాలి. నాన్‌స్టిక్ కడాయికి మాత్రం మృదువైన స్పాంజ్ స్క్రబ్బర్‌ను వాడాలి.

చిత్రజ్యోతి
★ SINCE 1965 ★

తెలుగు నేర్చుకుంటా.. డబ్బింగ్ నేనే చెబుతా

- శివ రాజ్‌కుమార్



పేదల పక్షపాతి, సైకిల్ పై అసెంబ్లీకి వెళ్లిన ఇల్లందు మాజీ శాసన సభ్యుడు గుమ్మడి నర్సయ్య జీవిత కథను అదే పేరుతో సినిమాగా తీస్తున్నారు ఎన్.సురేశ్‌రెడ్డి. కన్నడ హీరో శివ రాజ్‌కుమార్ టైటిల్ పాత్రను పోషిస్తున్న ఈ చిత్రం షూటింగ్ శనివారం పాల్వంచలో మొదలైంది. తెలంగాణ ఉప ముఖ్యమంత్రి సతీమణి నందిని దర్శకుడు పరమేశ్వర్ హివ్రాలేకు స్క్రిప్ట్‌ను అందించారు. ఈ సందర్భంగా తెలంగాణ సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి మాట్లాడుతూ ఈ చిత్రాన్ని ప్రధాని నరేంద్రమోదీకి చూపిస్తామని అన్నారు. శివ రాజ్‌కుమార్ మాట్లాడుతూ 'ఒక మంచి వ్యక్తి పాత్రను పోషిస్తున్నందుకు ఆనందంగా, గర్వంగా ఉంది. ఈ సినిమా కోసం తెలుగు నేర్చుకుంటా.. నేనే డబ్బింగ్ చెబుతా' అని అన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న గుమ్మడి నర్సయ్య మాట్లాడుతూ 'వ్యవస్థలో మార్పు రావాలంటే ముందు మనలో మార్పు రావాలి. నేనేం గొప్ప నాయకుడిని కాదు.. అందరిలా సామాన్యుడినే. నన్ను గొప్పగా కాకుండా నా భావాలను మాత్రమే ఈ సినిమాలో చూపించాలని, చూపిస్తారని ఆశిస్తున్నా' అని అన్నారు. ఉద్యమగడ్డ అయిన పాల్వంచ నుంచి ఈ సినిమా షూటింగ్ మొదలుపెట్టామనీ, 'గుమ్మడి నర్సయ్య' చిత్రం రాజకీయాల్లో కచ్చితంగా మార్పు తెస్తుందని భావిస్తున్నామనీ నిర్మాత సురేశ్‌రెడ్డి చెప్పారు.

పాల్వంచ రూరల్ (ఆంధ్రజ్యోతి)

ప్రేమకథతో..



సంజూస్ తగరం హీరోగా నటిస్తూ దర్శకత్వం వహించే 'మై లవ్' చిత్రం షూటింగ్ శనివారం హైదరాబాద్‌లో ప్రారంభమైంది. హర్షిత హీరోయిన్. శాసన సభ్యుడు నవీన్ యాదవ్ కెమెరా స్విచ్చాన్ చేయగా, తెలంగాణ ఐ.టి. మినిస్టర్ శ్రీధర్‌బాబు తొలి క్లాప్ ఇచ్చారు. నేటి యువతకు మంచి సందేశం అందించే ప్రేమ కథాచిత్రం ఇదనీ, నటుడిగా, సంగీత దర్శకుడిగా, దర్శకుడిగా తనకు మంచి గుర్తింపు వస్తుందనే నమ్మకం ఉందని సంజూస్ చెప్పారు. మంచి కథ, కథనాలతో వినోదాత్మకంగా చిత్రం ఉంటుందని నిర్మాత శ్రీనివాసరావు తెలిపారు.



పాత్రే తప్ప సావిత్రి కనపడేవారు కాదు

- ఎం.వెంకయ్య నాయుడు

'మహానటికి మరణం లేదు, సావిత్రి గారు నవరస అద్భుత నటనా కౌశలంతో ప్రేక్షకులను మైమరపించే వారు, తన నట జీవితంలో ప్రతి చిత్రంలోనూ కేవలం పాత్ర మాత్రమే కనిపించేది. సావిత్రి గారు కనపడేవారు కాదు' అని అన్నారు భారత మాజీ ఉప రాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్య నాయుడు. మహానటి సావిత్రి 90వ జయంతి సందర్భంగా ఆమె కుమార్తె విజయ చాముండేశ్వరి ఆధ్వర్యంలో 'సంగమం ఫౌండేషన్' చైర్మన్ సంజయ్ కిశోర్ నిర్వహణలో హైదరాబాద్‌లో సావిత్రి మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. వెంకయ్య నాయుడు జ్యోతి ప్రజ్వలన గావించారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన శాసనసభ్యులు మండలి బుద్ధప్రసాద్ మాట్లాడుతూ 'చిత్ర పరిశ్రమలో ఎంత మంది కథానాయికలున్నా మహానటి మాత్రం సావిత్రి గారే' అని కొనియాడారు. నటుడు, నిర్మాత మురళీమోహన్, తనికెళ్ల భరణి, నన్నపనేని రాజకుమారి, రోజా రమణి, శివపార్వతి, నాగ సుశీల తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా 'మహానటి' చిత్ర నిర్మాతలు ప్రియాంక దత్, స్వప్న దత్, రచయిత సంజయ్ కిశోర్, ప్రచురణ కర్త బొల్లినేని కృష్ణయ్యను ఘనంగా సత్కరించారు.

రవీంద్రభారతి (ఆంధ్రజ్యోతి)

భయపెడుతూనే వాస్తవాన్ని చూపిస్తుంది

- కేఎల్ దామోదర ప్రసాద్



'సాధారణంగా హారర్ థ్రిల్లర్ సినిమాల్లో డ్రామా ఎక్కువగా ఉంటుంది. సినిమాటిక్ లిబర్టీ ఎక్కువ తీసుకుంటారు. మా 'ఈషా'లో కూడా ఆ లిబర్టీ ఉన్నప్పటికీ సినిమా పూర్తయ్యేసరికి ప్రేక్షకులు ఒక పర్సనల్ ఫీల్‌తో బయటకు వస్తారు. భయపెడుతూనే రియాలిటీ చూపించే చిత్రమిది' అని నిర్మాత కేఎల్ దామోదర ప్రసాద్ అన్నారు. ఆయన సమర్పణలో హేమ వెంకటేశ్వరరావు నిర్మించిన చిత్రమిది. శ్రీనివాస్ మన్నె దర్శకుడు. బన్నీ వాసు, వంశీ నందిపాటి ఈ నెల 12న విడుదల చేస్తున్నారు. ఈ సందర్భంగా దామోదర ప్రసాద్ మీడియాతో మాట్లాడారు. మంచి కథ కోసం చూస్తున్నప్పుడు శ్రీనివాస్ చెప్పిన ఈషా పాయింట్ చాలా ఆసక్తికరంగా అనిపించి, ఈ ప్రాజెక్ట్ మొదలుపెట్టాం. ఈ సినిమా బాధ్యతనంతా దర్శకుడు తన భుజాలపై వేసుకున్నాడు. నా నమ్మకాన్ని నిలబెట్టాడు. అవుట్‌పుట్ చాలా బాగా వచ్చింది. హెబ్బాపటేల్, త్రిగుణ్, అఖిల్ రాజ్ తమ పాత్రల్లో ఒదిగిపోయారు' అని చెప్పారు.

ఆ ఖ్యాతి ఘంటసాలదే!



మధుర గాయకుడు ఘంటసాల జీవిత కథ ఆధారంగా రూపుదిద్దుకున్న 'ఘంటసాల ది గ్రేట్' చిత్రం ఈ నెల 12న విడుదల కానుంది. గాయకుడు కృష్ణచైతన్య ఘంటసాలగా నటించిన ఈ చిత్రాన్ని సిహెచ్ రామారావు దర్శకత్వంలో సిహెచ్ ఫణి నిర్మించారు. ఇటీవల నిర్వహించిన ప్రీ రిలీజ్ ఫంక్షన్‌లో కృష్ణ చైతన్య మాట్లాడుతూ 'ఘంటసాల పాటలు వింటూ పెరిగిన నాకు ఈ సినిమాలో నటించే అవకాశం దక్కడం ఓ వరం. పాటలు పాడుకొనే నాతో పట్టుబట్టి ఈ వేషం వేయించారు రామారావుగారు' అని అన్నారు. 'భారతదేశ చరిత్రలోనే ఒక గాయకుడి బయోపిక్ రావడం ఇదే ప్రథమం. ఆ ఖ్యాతి ఘంటసాలకే దక్కింది. దాన్ని తీసే అదృష్టం నన్ను వరించింది' అని రామారావు అన్నారు. ఘంటసాల బయోపిక్ విడుదల చేసే అవకాశం రావడం అదృష్టంగా భావిస్తున్నానని నిర్మాత శోభారాణి చెప్పారు. ఈ సినిమా మొదటి టికెట్‌ను లక్ష రూపాయలకు నిర్మాత చదలవాడ శ్రీనివాసరావు కొనడం విశేషం.


అమెరికాలో అగ్నిప్రమాదం.. తెలంగాణ విద్యార్థిని మృతి

» అపార్టుమెంట్‌కు మంటలు అంటుకొని మరణించిన ఉడుముల సహజారెడ్డి
» 11న స్వగ్రామానికి సహజ మృతదేహం రాక

ఘట్‌కేసర్ రూరల్/స్టేషన్‌ఘన్‌పూర్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): అమెరికాలోని బర్మింగ్‌హామ్ నగరంలో అగ్నిప్రమాదం సంభవించి తెలంగాణకు చెందిన ఉడుముల సహజారెడ్డి(24) అనే విద్యార్థిని ప్రాణాలు కోల్పోయారు. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా చౌదరిగూడలోని శ్రీనివాసనగర్‌లో నివాసముండే ఉడుముల జయాకర్‌రెడ్డి, మరియా శైలజ దంపతుల కుమార్తె అయిన సహజారెడ్డి.. ఎంఎస్ అభ్యసించేందుకు నాలుగేళ్ల క్రితం అలబామా ప్రాంతంలోని బర్మింగ్‌హామ్‌కు వెళ్లారు. అక్కడ పార్ట్ టైమ్ జాబ్ చేస్తూ చదువుకుంటున్నారు. మరో ముగ్గురు స్నేహితులతో కలిసి ఓ అపార్ట్‌మెంట్‌లో నివాసం ఉంటున్నారు. కాగా, భారత కాలమానం ప్రకారం గురువారం రాత్రి సహజారెడ్డి నిద్రలో ఉన్న సమయంలో వీరి అపార్టుమెంట్ పక్కనున్న భవనంలో మంటలు చెలరేగాయి. ఆపై మంటలు వీరి అపార్టుమెంట్‌కూ వ్యాపించాయి. అపార్టుమెంట్‌లో మొత్తం 13 మంది ఉండగా.. మంటలను గమనించిన 10 మంది తప్పించుకున్నారు. నిద్రలో ఉన్న సహజ సహా ముగ్గురు మంటలను గుర్తించకపోవడంతో అందులో చిక్కుకున్నారు. మంటలకు తోడు పొగ వ్యాపించడంతో తప్పించుకునే పరిస్థితి లేకుండాపోయింది. అదే సమయంలో కాలుతున్న చెక్కలు సహజపై పడడంతో ఆమె తీవ్రంగా గాయపడ్డారు. అగ్నిమాపక సిబ్బంది రంగంలోకి దిగి.. సహజను బయటకు తీసుకొచ్చి ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ మృతి చెందారు. కాగా, అధికారుల ద్వారా కూతురి మరణ వార్త తెలుసుకున్న తల్లిదండ్రులు హతాశులయ్యారు. చదువు పూర్తి చేసుకొని త్వరలో ఇంటికి వస్తుందని ఎదురు చూస్తూ.. ప్రతి రోజూ వీడియో కాల్‌లో మాట్లాడే తమ కూతురు ఇక తిరిగి రాదన్న విషయం తెలిసి గుండెలవిసేలా రోదిస్తున్నారు. సహజ తండ్రి జయాకర్‌రెడ్డి స్వస్థలం జనగామ జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్ మండలంలోని గుంటూరుపల్లి కాగా, ఆయన హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తున్నారు. తల్లి శైలజ జనగామ జిల్లా బచ్చన్నపేట మండలంలో టీచర్‌గా పనిచేసి.. ఇటీవల డిప్యుటేషన్‌పై హైదరాబాద్‌కు వెళ్లారు. సహజ మరణవార్త విని ఇటు చౌదరిగూడ, అటు గుంటూరుపల్లిలో విషాదం అలముకుంది. సహజ మృతిపై అమెరికాలోని భారత ఎంబసీ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసింది. సహజ మృతదేహం ఈ నెల 11న గుంటూరుపల్లికి చేరుకుంటుందని, అక్కడే అంత్యక్రియలు నిర్వహిస్తామని కుటుంబ సభ్యులు తెలిపారు.

యూకేలోని ఆర్‌సీపీఎస్‌జీ గవర్నింగ్ కౌన్సిల్ సభ్యుడిగా డాక్టర్ రఘురామ్

» కిమ్స్ ఉషాలక్ష్మి సెంటర్ ఫర్ బ్రెస్ట్ డిసీజెస్ వ్యవస్థాపక డైరెక్టర్‌కు అరుదైన గౌరవం
» ఈ కౌన్సిల్‌కు ఎంపికైన తొలి భారతీయుడిగా ఘనత



హైదరాబాద్ సిటీ, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): కిమ్స్ ఉషాలక్ష్మి సెంటర్ ఫర్ బ్రెస్ట్ డిసీజెస్ వ్యవస్థాపక డైరెక్టర్ డాక్టర్ రఘురామ్‌కు అరుదైన గౌరవం దక్కింది. యూకేలోని ప్రముఖ రాయల్ కాలేజ్ ఆఫ్ ఫిజీషియన్స్ అండ్ సర్జన్స్ ఆఫ్ గ్లాస్గో (ఆర్‌సీపీఎస్‌జీ) అత్యున్నత గవర్నింగ్ కౌన్సిల్ సభ్యుడిగా డాక్టర్ రఘురామ్ ఎన్నికయ్యారు. భారతదేశంలో పని చేస్తూ ఆర్‌సీపీఎస్‌జీ గవర్నింగ్ కౌన్సిల్‌కు ఎంపికైన తొలి భారతీయ సర్జన్‌గా చరిత్ర సృష్టించారు. 425ఏళ్ల సుదీర్ఘ చరిత్ర కలిగిన ఆర్‌సీపీఎస్‌జీ.. శస్త్ర చికిత్స నిపుణులు, ఫిజీషియన్స్, దంతవైద్యులు, పొడియాట్రిస్టులు, ట్రావెల్ మెడిసిన్, తదితర విభాగాల సభ్యులతో ప్రపంచ వ్యాప్తంగా 97దేశాలకు ప్రాతినిధ్యం వహిస్తుంది. ఆర్‌సీపీఎస్‌జీ గవర్నింగ్ కౌన్సిల్‌లో యూకే వెలుపల పనిచేసే శస్త్ర చికిత్స నిపుణులు కేవలం ఒకే ప్రత్యేక సభ్యునికి స్థానం ఉంటుంది. ఈ స్థానానికి ప్రపంచం నలుమూలల నుంచి 26మంది వైద్యులు పోటీ చేయగా డాక్టర్ రఘురామ్ ఎన్నికయ్యారు. 2025-28 కాలానికి గవర్నింగ్ కౌన్సిల్ సభ్యునిగా డాక్టర్ రఘురామ్ యూకే వెలుపల ఉన్న దేశాల్లో ఆర్‌సీపీఎస్‌జీకి ప్రాతినిధ్యం వహిస్తారు. కాగా, తన దక్కిన ఈ గౌరవాన్ని తన గురువులు, కుటుంబసభ్యులు, తన వద్ద చికిత్స పొందిన రొమ్ము క్యాన్సర్ బాధితులు, సహచరులు, మాతృభూమికి అంకితం చేస్తున్నానని డాక్టర్ రఘురామ్ పేర్కొన్నారు.



మాట్లాడుతున్న ఆరోగ్య వర్సిటీ వైస్ చాన్స్‌లర్ డాక్టర్ రమేశ్‌రెడ్డి

ఆరోగ్య వర్సిటీ ప్రతిష్ఠను పెంచుతాం

» కళాశాలల్లో ర్యాగింగ్‌పై కఠిన చర్యలు
» ఆరోగ్య వర్సిటీ వైస్ చాన్స్‌లర్ డాక్టర్ రమేశ్‌రెడ్డి

వరంగల్ మెడికల్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): కాళోజీ నారాయణ రావు ఆరోగ్య వర్సిటీ ప్రతిష్ఠను పెంచడమే లక్ష్యంగా విధులు నిర్వహిస్తామని ఆరోగ్య వర్సిటీ వైస్ చాన్స్‌లర్ డాక్టర్ రమేశ్‌రెడ్డి అన్నారు. శనివారం ఇక్కడ మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. వైద్య విద్యార్థుల కోసం ఆరోగ్య వర్సిటీ నాలుగు రోజుల్లోనే పీజీ సీట్ల కౌన్సెలింగ్ ప్రక్రియను ప్రణాళికతో ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. ప్రస్తుతం యూనివర్సిటీ పరిధిలో ఉన్న సీట్లతోపాటు నూతనంగా 420 పీజీ సీట్లు మంజూరయ్యాయని పేర్కొన్నారు. ప్రస్తుతం ఎన్ఎంసీ పాత పీజీ సీట్లతోపాటు నూతన సీట్లను సైతం ఆన్‌లైన్‌లో పేర్కొన్నామన్నారు. పీజీ సీట్లకు అనుగుణంగా సీట్ మ్యాట్రిక్స్ పద్ధతిలో కౌన్సెలింగ్ ప్రక్రియ సజావుగా నిర్వహించేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఆరోగ్య వర్సిటీ పరిధిలోని మెడికల్ కళాశాల్లో విద్యార్థులు ర్యాగింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఔట్ సోర్సింగ్ సిబ్బంది ఎంత మంది ఉన్నారు..? ఏ మేరకు సిబ్బంది కొరత ఉందనే విషయాన్ని గుర్తించి పూర్తిస్థాయి సిబ్బంది నియమానికి కృషి చేస్తానని పేర్కొన్నారు. యూనివర్సిటీ క్యాంపు కార్యాలయం నుంచే పూర్తిస్థాయి కార్యకలాపాలు కొనసాగిస్తామని ఆయన తెలిపారు. ఈ సమావేశంలో రిజిస్ట్రార్ డాక్టర్ నాగార్జునరెడ్డి పాల్గొన్నారు.

PARAS

టాస్ గెలిచారోచ్..

ఒకటా.. రెండా వరుసగా 20 వన్డేల్లో టాస్ ఓడిన భారత జట్టుకు ఈసారి అదృష్టం వరించింది. 2023 వన్డే వరల్డ్ కప్ సెమీస్ తర్వాత తిరిగి ఇన్నాళ్లకు టీమిండియా టాస్ గెలవడం విశేషం. సిరీస్‌లో అన్ని మ్యాచ్‌లకు మంచు ప్రభావం ఉండడంతో టాస్ గెలిచిన జట్టుకు ప్రయోజనం ఎక్కువగా ఉంటోంది. మరోవైపు అనలిస్ట్ హరి సూచన మేరకు తానీసారి ఎడమ చేత్తో నాణేన్ని ఎగరేసి ఫలితం రాబట్టినట్టు కెప్టెన్ రాహుల్ తెలిపాడు.





టీ20 సిరీస్ బరిలో గిల్

న్యూఢిల్లీ: భారత వన్డే కెప్టెన్ శుభ్‌మన్ గిల్ గాయం నుంచి పూర్తిగా కోలుకున్నాడు. ఈమేరకు సెంటర్ ఆఫ్ ఎక్సెలెన్సీ (సీఓఈ)లో నిర్వహించిన ఫిట్‌నెస్ టెస్టులో తను పాస్ అయ్యాడు. దీంతో దక్షిణాఫ్రికాతో జరిగే ఐదు టీ20ల సిరీస్ ఆడనున్నాడు. ఇంతకుముందే ఈ సిరీస్‌కు అతడిని ఎంపిక చేసినా.. ఫిట్‌నెస్ ఉంటేనే ఆడతాడని ప్రకటించారు. కోల్‌కతా టెస్టులో గాయపడ్డాక గిల్ సీఓఈలో పునరావాస శిబిరంలో చేరాడు.

సురుచికి పసిడి

షూటింగ్ వరల్డ్ కప్ ఫైనల్



దోహా: ఐఎస్ఎస్ఎఫ్ వరల్డ్ కప్ ఫైనల్ టోర్నీలో తొలి రోజే భారత షూటర్లు పతకాల పంట పండించారు. శనివారం ఇక్కడ జరిగిన మహిళల 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ ఈవెంట్‌లో సురుచి సింగ్ స్వర్ణం, సైన్యామ్ రజతం సాధించారు. మనూ భాకర్ ఐదోస్థానానికి పరిమితమైంది. పురుషుల 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ ఈవెంట్‌లో సమ్రాట్ మూడోస్థానంతో కాంస్యం దక్కించుకున్నాడు.

బిహార్‌పై హైదరాబాద్ గెలుపు

జాదవ్‌పూర్: ఓపెనర్ తన్మయ్ అగర్వాల్ (67 నాటౌట్) హాఫ్ సెంచరీతో సత్తా చాటడంతో సయ్యద్ ముస్తాక్ అలీ టీ20 టోర్నీలో హైదరాబాద్ మరో విజయం సాధించింది. శనివారం ఇక్కడ జరిగిన గ్రూప్ 'బి' మ్యాచ్‌లో ఏడు వికెట్లతో బిహార్‌ను చిత్తు చేసింది. మొదట బిహార్ 20 ఓవర్లలో 132/8 స్కోరుకే పరిమితమైంది. వైభవ్ సూర్యవంశీ (11) స్వల్ప స్కోరుకే వెనుదిరిగాడు. పియూష్ (34), బిపిన్ (31 నాటౌట్) ఆదుకున్నారు. తనయ్ త్యాగరాజన్ 3, మిలింద్ 2 వికెట్లు పడగొట్టారు. ఛేదనను 12.5 ఓవర్లలో 134/3 స్కోరుతో హైదరాబాద్ సునాయాసంగా పూర్తి చేసింది.

గ్రీవ్స్ అజేయ డబుల్

కివీస్-విండీస్ తొలి టెస్ట్ డ్రా



క్రైస్ట్‌చర్చ్: జస్టిన్ గ్రీవ్స్ (202 నాటౌట్) ద్విశతక పోరాటంతో.. న్యూజిలాండ్‌తో తొలి టెస్ట్‌లో వెస్టిండీస్ డ్రాతో గట్టెక్కింది. 531 పరుగుల లక్ష్య ఛేదనలో.. ఆటకు ఐదో, ఆఖరి రోజు ఓవర్‌నైట్ స్కోరు 212/4 స్కోరుతో రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన విండీస్ 6 వికెట్లకు 457 పరుగులు సాధించింది. షాయ్ హోప్ (140), కీమర్ రోచ్ (58 నాటౌట్) రాణించారు. జాకబ్ డఫీ మూడు వికెట్లు పడగొట్టాడు. కివీస్ 231, 466/8 డిక్లేర్ చేయగా.. విండీస్ తొలి ఇన్నింగ్స్‌లో 167 పరుగులకు ఆలౌటైంది. కాగా, ఐదు రోజుల టెస్ట్‌ల్లో నాలుగో ఇన్నింగ్స్‌లో విండీస్ చేసిన 457 పరుగులే అత్యధిక స్కోరు కావడం విశేషం.

ఓటమి దిశగా ఇంగ్లండ్

ఆసీస్‌తో యాషెస్ రెండో టెస్ట్

బ్రిస్బేన్: యాషెస్ సిరీస్‌లో ఆస్ట్రేలియా వెటరన్ పేసర్ మిచెల్ స్టార్క్ ఆల్‌రౌండ్ షోతో అదరగొడుతున్నాడు. తొలి టెస్ట్‌లో పది వికెట్లతో ఇంగ్లండ్‌ను దెబ్బ కొట్టిన మిచెల్.. రెండో టెస్ట్‌లో అటు బౌలింగ్‌తోపాటు ఇటు బ్యాటింగ్‌లోనూ ఇంగ్లండ్‌ను వణికించాడు. ఇక్కడ జరుగుతున్న డే/నైట్ టెస్ట్ తొలి ఇన్నింగ్స్‌లో 6 వికెట్లు తీసిన స్టార్క్..అర్ధ సెంచరీతో బ్యాటింగ్‌లోనూ సత్తా చాటాడు. రెండో ఇన్నింగ్స్‌లోనూ 2 కీలక వికెట్లు పడగొట్టాడు. దాంతో ఈ టెస్ట్‌లోనూ ఇంగ్లండ్ ఓటమి దిశగా పయనిస్తోంది. 177 పరుగుల మొదటి ఇన్నింగ్స్ లోటుతో..రెండో ఇన్నింగ్స్ చేపట్టిన ఇంగ్లండ్ మూడోరోజు ఆఖరికి 134/6 స్కోరుతో పీకల్లోతు కష్టాల్లో కూరుకుపోయింది. అంతకుముందు ఓవర్‌నైట్ స్కోరు 378/6తో శనివారం తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన కంగారూలు 511 రన్స్ చేశారు. స్టార్క్ (77), బోలాండ్ (21 బ్యాటింగ్) తొమ్మిదో వికెట్‌కు 75 రన్స్ జోడించారు. ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్‌లో 334 రన్స్ చేసింది.

రాహుల్‌కు ట్రోఫీ అందజేస్తున్న చాముండి



విశాఖలో విజయ గర్జన

ఆఖరి వన్డేలో సఫారీలపై ఘన విజయం

2-1తో భారత్‌దే సిరీస్

జైస్వాల్ అజేయ శతకం

డికాక్ సెంచరీ వృథా

బౌలింగ్‌లో భళా అనిపించారు.. బ్యాటింగ్‌లో బెదరగొట్టారు. వెరసి సిరీస్ నిర్ణాయక వన్డేలో టీమిండియా చెలరేగింది. పేసర్ ప్రసిద్ధ్ విమర్శకులకు సమాధానమిస్తూ పదునైన బంతులతో కీలక వికెట్లు తీసి సఫారీల భారీ స్కోరుకు కళ్లెం వేశాడు. అటు స్పిన్ మాంత్రికుడు కుల్దీప్ ఉచ్చులో టెయిలెండర్లు విలవిల్లాడారు. ఇక ఓ మాదిరి ఛేదనలో ఓపెనర్ జైస్వాల్ వన్డేల్లో తొలి శతకంతో మెరవగా.. వెటరన్లు రోహిత్, విరాట్ మరోసారి చెలరేగారు. ఫలితంగా సఫారీలను 9 వికెట్లతో చిత్తుచేసిన టీమిండియా 2-1తో సిరీస్‌ను సొంతం చేసుకుంది.



1 వన్డేల్లో ఎక్కువ శతకాలు (23) చేసిన వికెట్ కీపర్‌గా సంగక్కరతో కలిసి టాప్‌లో నిలిచిన డికాక్. అలాగే భారత్‌పై జయసూర్యతో కలిసి ఎక్కువ సెంచరీలు (7) చేసిన బ్యాటర్ కూడా డికాకే.

విశాఖపట్నం స్పోర్ట్స్ (ఆంధ్రజ్యోతి): దక్షిణాఫ్రికాతో ముగిసిన మూడు వన్డేల సిరీస్‌ను భారత జట్టు 2-1తో గెల్చుకుంది. శనివారం జరిగిన ఆఖరి మ్యాచ్‌లో ఆల్‌రౌండ్‌షో కనబర్చిన రాహుల్ సేన 9 వికెట్ల తేడాతో ఘనవిజయం సాధించింది. ఓపెనర్ యశస్వీ జైస్వాల్ (121 బంతుల్లో 12 ఫోర్లు, 2 సిక్సర్లతో 116 నాటౌట్) అజేయ శతకంతో రాణించాడు. ముందుగా దక్షిణాఫ్రికా 47.5 ఓవర్లలో 270 పరుగులకు ఆలౌటైంది. డికాక్ (89 బంతుల్లో 8 ఫోర్లు, 6 సిక్సర్లతో 106) సెంచరీ సాధించగా, కెప్టెన్ బవుమా (48), బ్రెవిస్ (29) పర్వాలేదనిపించారు. స్పిన్నర్ కుల్దీప్, పేసర్ ప్రసిద్ధ్‌లకు నాలుగేసి వికెట్లు దక్కాయి. ఛేదనలో భారత్ 39.5 ఓవర్లలో వికెట్ నష్టానికి 271 రన్స్ చేసి గెలిచింది. రోహిత్ (73 బంతుల్లో 7 ఫోర్లు, 3 సిక్సర్లతో 75), విరాట్ (45 బంతుల్లో 6 ఫోర్లు, 3 సిక్సర్లతో 65 నాటౌట్) అర్ధసెంచరీలతో ఆకట్టుకున్నారు. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'గా జైస్వాల్.. 'ప్లేయర్ ఆఫ్ ద సిరీస్'గా కోహ్లీ నిలిచారు.

టాపార్డర్ అదుర్స్: భారీ ఛేదన కాకపోవడంతో భారత్ ఎలాంటి ఒత్తిడి లేకుండా ఆడింది. ఓపెనర్లు రోహిత్, జైస్వాల్ తొలి వికెట్‌కు 155 పరుగుల భాగస్వామ్యం అందించగా.. విరాట్ ఫినిషింగ్ టచ్ ఇచ్చాడు. ఆరంభంలో పిచ్ పేసర్లకు సహకరించడంతో ఓపెనర్లు నిదానంగానే ఆడారు. జైస్వాల్ లెఫ్టామ్ పేసర్లను ఎదుర్కోవడంలో ఇబ్బందిపడినా ఈసారి పట్టుదలగా క్రీజులో నిలిచాడు. అయితే స్ట్రయిక్‌ను రొటేట్ చేయడంలో విఫలమయ్యాడు. రోహిత్ మాత్రం ధాటిని చూపుతూ అడపాదడపా బౌండరీలతో స్కోరులో కదలిక తెచ్చాడు. కాస్త కుదురుకున్నాక జైస్వాల్ ఆటతీరులోనూ మార్పు కనిపించింది. దీనికి తోడు మంచు ప్రభావం చూపడంతో బ్యాటర్లకు ఇబ్బందిలేకపోయింది. జైస్వాల్ అర్ధసెంచరీ పూర్తయ్యాక ఆటలో వేగం పెంచాడు. పేసర్లను దీటుగా ఎదుర్కొంటూ ఫోర్లు సాధించాడు. అయితే సెంచరీ వైపు సాగుతున్న రోహిత్ స్లాగ్‌స్వీప్‌నకు వెళ్లి కేశవ్ ఓవర్‌లో అవుటయ్యాడు. ఆ తర్వాత జైస్వాల్ కెరీర్‌లో తొలి శతకం పూర్తి చేయగా.. విరాట్ సూపర్ ఫామ్‌తో ప్రేక్షకులను అలరించాడు. బాష్ ఓవర్‌లో 6,4 ఆ వెంటనే బార్ట్‌మన్ ఓవర్‌లో 4,6తో అదరగొట్టాడు. ఈ ఊపుతో విరాట్ 40 బంతుల్లోనే ఫిఫ్టీ అందుకున్నాడు. 40వ ఓవర్‌లో అతను మరో 2 ఫోర్లతో 61 బంతులుండగానే మ్యాచ్‌ను ముగించాడు.



యశస్వీ జైస్వాల్ (116 నాటౌట్)

6 మూడు ఫార్మాట్లలోనూ శతకాలు బాదిన ఆరో భారత బ్యాటర్‌గా జైస్వాల్. రైనా, రాహుల్, విరాట్, రోహిత్, గిల్ ముందున్నారు.



ప్లేయర్ ఆఫ్ ది సిరీస్ ట్రోఫీతో కోహ్లీ

అటు ప్రసిద్ధ్, ఇటు కుల్దీప్: టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన సఫారీలకు ఆరంభం బాగానే ఉన్నా మధ్య ఓవర్ల నుంచి కష్టాలు మొదలయ్యాయి. ప్రసిద్ధ్ టాప్, మిడిలార్డర్‌ను దెబ్బతీయగా.. చివర్లో కుల్దీప్ హవా చూపాడు. తొలి ఓవర్‌లోనే ఓపెనర్ రికెల్టన్‌ను అర్ష్‌దీప్ డకౌట్ చేశాడు. ఈ దశలో ఓపెనర్ డికాక్ జట్టుకు అండగా నిలిచాడు. సిరీస్‌లో తొలిసారిగా బ్యాట్‌ను ఝుళిపించిన అతను కెరీర్‌లో 23వ శతకంతో ఆకట్టుకున్నాడు. అతడికి బవుమా సహకరించడంతో రెండో వికెట్‌కు 113 రన్స్ జత చేరాయి. ప్రసిద్ధ్ రెండో ఓవర్‌లో డికాక్ 6,6,4తో 18 రన్స్ రాబట్టాడు. ఈ జోరుతో డికాక్ 42 బంతుల్లో ఫిఫ్టీ పూర్తి చేశాక, మరింత ధాటిని కనబర్చిన అతను 79 బంతుల్లోనే సెంచరీ చేశాడు. అయితే బవుమాను జడేజా అవుట్ చేయడంతో ఈ జోడీకి బ్రేక్ పడింది. కానీ డికాక్‌కు బ్రీట్జ్‌కే (24) జత కలవడంతో మూడో వికెట్‌కు 54 రన్స్ చేరాయి. తిలక్‌ను బ్రీట్జ్‌కే లక్ష్యం చేసుకోవడంతో కెప్టెన్ రాహుల్ తిరిగి ప్రసిద్ధ్‌కు బంతినిచ్చాడు. ఇక్కడే మ్యాచ్ టర్న్ అయ్యింది. తన తొలి స్పెల్‌లో రెండు ఓవర్లకే 27 రన్స్ ఇచ్చుకున్న ప్రసిద్ధ్ ఈసారి మిడిలార్డర్ భరతం పడుతూ.. వరుస 4 ఓవర్లలో 3 వికెట్లతో సఫారీల వెన్ను విరిచాడు. ముందుగా 29వ ఓవర్‌లో బ్రీట్జ్‌కే, మార్‌క్రమ్ (1)లను పెవిలియన్‌కు చేర్చాడు. ఆ తర్వాత కాసేపటికే ఫుల్ లెంగ్త్ డెలివరీకి డికాక్‌ను బౌల్డ్ చేయడంతో జట్టు ఇబ్బందుల్లో పడింది. ఇక టెయిలండర్లను స్పిన్నర్ కుల్దీప్ కుదురుకోనీయకుండా చకచకా 4 వికెట్లతో సఫారీ ఇన్నింగ్స్‌కు ముగింపు పలికాడు.

స్కోరుబోర్డు


దక్షిణాఫ్రికా: డికాక్ (బి) ప్రసిద్ధ్ 106, రికెల్టన్ (సి) రాహుల్ (బి) అర్ష్‌దీప్ 0, బవుమా (సి) కోహ్లీ (బి) జడేజా 48, బ్రీట్జ్‌కే (ఎల్బీ) ప్రసిద్ధ్ 24, మార్‌క్రమ్ (సి) కోహ్లీ (బి) ప్రసిద్ధ్ 1, బ్రేవిస్ (సి) రోహిత్ (బి) కుల్దీప్ 29, యాన్సెన్ (సి) జడేజా (బి) కుల్దీప్ 17, బాష్ (సి అండ్ బి) కుల్దీప్ 9, కేశవ్ (నాటౌట్) 20, ఎన్‌గిడి (ఎల్బీ) కుల్దీప్ 1, బార్ట్‌మన్ (బి) ప్రసిద్ధ్ 3, **ఎక్స్‌ట్రాలు: 12; మొత్తం: 47.5 ఓవర్లలో 270 ఆలౌట్; వికెట్ల పతనం:** 1-1, 2-114, 3-168, 4-170, 5-199, 6-234, 7-235, 8-252, 9-258, 10-270; **బౌలింగ్:** అర్ష్‌దీప్ 8-1-36-1, హర్షిత్ 8-2-44-0, ప్రసిద్ధ్ 9.5-0-66-4, జడేజా 9-0-50-1, కుల్దీప్ 10-1-41-4, తిలక్ 3-0-29-0.

భారత్: జైస్వాల్ (నాటౌట్) 116, రోహిత్ (సి) బ్రీట్జ్‌కే (బి) కేశవ్ 75, కోహ్లీ (నాటౌట్) 65, **ఎక్స్‌ట్రాలు: 15; మొత్తం: 39.5 ఓవర్లలో 271/1; వికెట్ పతనం:** 1-155; **బౌలింగ్:** యాన్సెన్ 8-1-39-0, ఎన్‌గిడి 6.5-0-56-0, కేశవ్ మహరాజ్ 10-0-44-1, బార్ట్‌మన్ 7-0-60-0, బాష్ 6-0-53-0, మార్‌క్రమ్ 2-0-17-0.

బిజినెస్ ప్లస్

ఫిక్స్‌డ్ డిపాజిట్లపై వడ్డీ రేట్లు డౌన్

ప్రత్యామ్నాయాలు బోలెడు.. దిగులెందుకు దండగ



దేశంలో వడ్డీ రేట్లు పడిపోతున్నాయి. గత ఏడాది కాలంలో భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) కీలక రెపో వడ్డీ రేటు 1.25 శాతం తగ్గించింది. తాజాగా శుక్రవారం వెలువరించిన ద్రవ్య పరపతి విధానంలోనూ ఆర్‌బీఐ ఎంపీసీ రెపో రేటు పావు శాతం తగ్గించింది. ధరల సెగ అదుపులో ఉన్నందున ఫిబ్రవలో జరిగే భేటీలోనూ ఎంపీసీ రెపో రేటు మరో పావు శాతం తగ్గిస్తుందనే అంచనాలు వినిపిస్తున్నాయి. రెపో రేటు తగ్గడంతో బ్యాంకులు ఫిక్స్‌డ్ డిపాజిట్ల (ఎఫ్‌డీ)పై చెల్లించే వడ్డీ రేట్లలోనూ కోత పెడుతున్నాయి. ప్రస్తుతం పదేళ్ల కాలపరిమితి ఉండే ఎఫ్‌డీని తీసుకున్నా ఏ బ్యాంకూ 8 శాతానికి మించి వడ్డీ చెల్లించడం లేదు. దీంతో కేవలం వడ్డీ ఆదాయంపై మాత్రమే ఆధారపడే పదవీ విరమణ చేసిన ఉద్యోగులు, వృద్ధులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. అయితే ఆలోచిస్తే ఎఫ్‌డీలకూ మంచి ప్రత్యామ్నాయాలు ఉన్నాయంటున్నారు ఆర్థిక నిపుణులు. అవేమిటో తెలుసుకుందాం.

డెట్ మ్యూచువల్ ఫండ్స్

పెట్టుబడుల విషయంలో జాగ్రత్తగా ఉండే మదుపరులకు ముఖ్యంగా సీనియర్ సిటిజన్లు, రిటైరీలు.. మ్యూచువల్ ఫండ్స్ (ఎంఎఫ్) అందించే రుణ పథకాలపై దృష్టి పెట్టవచ్చు. ఈ పథకాల ద్వారా సమీకరించే నిధులను ఎంఎఫ్‌లు ప్రభుత్వ రుణ పత్రాలు, మంచి పరపతి రేటింగ్ ఉన్న కంపెనీల రుణ పత్రాలు, ఇతర స్థిర ఆదాయ పథకాల్లో మదుపు చేస్తాయి. ఈ రుణ పథకాలపై రాబడులు స్థిరంగా 6 నుంచి 8.5 శాతం వరకు ఉంటుంది. ప్రస్తుతం ఎఫ్‌డీలపై లభించే రాబడుల కంటే ఇది ఎక్కువే. ఫిక్స్‌డ్ డిపాజిట్ల తరహాలోనే ఈ డెట్ పథకాల్లో పెట్టుబడులకు లాక్-ఇన్ పీరియడ్ అంటూ ఉండదు. ఎప్పుడు డబ్బులు అవసరమైతే అప్పుడు యూనిట్లను ఆ రోజు అమ్ముకుని సొమ్ము చేసుకోవచ్చు. స్వల్ప, మధ్యకాలిక మదుపరులకు ఇవి అత్యంత అనువైనవి. దీర్ఘకాలిక మదుపరులైతే ఈ డెట్ ఫండ్స్ రాబడులపై ఇండెక్సేషన్ ప్రయోజనంతో పన్ను పోటు కూడా తగ్గించుకోవచ్చు. అయితే ఈ ఫండ్స్‌ను ఎంపిక చేసుకునేటప్పుడు జాగ్రత్తగా ఉండాలి. స్థిరమైన రాబడులు అందిస్తూ, మంచి పరపతి రేటింగ్ ఉన్న రుణ పత్రాలను తన పోర్టుఫోలియోలో కలిగి ఉన్న ఎంఎఫ్ రుణ పథకాలను మాత్రమే ఎంచుకోవాలి. పెద్దగా రిస్క్ లేని ఈ పథకాలను రిటైరీలు, సీనియర్ సిటిజన్లు ఎంచుకోవచ్చు.

కంపెనీల ఎఫ్‌డీలు

కార్పొరేట్ కంపెనీలు అందించే ఫిక్స్‌డ్ డిపాజిట్లు (ఎఫ్‌డీ) కూడా బ్యాంకుల ఎఫ్‌డీలకు ప్రత్యామ్నాయం. ఈ ఎఫ్‌డీలపై కంపెనీలు.. బ్యాంకులు తమ ఎఫ్‌డీలపై చెల్లించే వడ్డీ కంటే 2 నుంచి 3 శాతం అధికంగానే చెల్లిస్తాయి. కాకపోతే ఇక్కడ పరపతి రేటింగ్ సంస్థలు ఆ ఎఫ్‌డీలకు ఇచ్చిన రేటింగ్ ఆధారంగా మాత్రమే వీటిని ఎంచుకోవాలి. ట్రిపుల్ ఏ లేదా కనీసం డబుల్ ఏ రేటింగ్ ఉన్న కంపెనీల ఎఫ్‌డీలను మాత్రమే ఎంచుకోవాలి. లేకపోతే జేబుకు చిల్లు పడే ప్రమాదం ఉంది. సీనియర్ సిటిజన్లు, రిటైరీలు ఈ విషయంలో మరింత అప్రమత్తంగా ఉండాలి.

నేషనల్ సేవింగ్ సర్టిఫికెట్

ఏ మాత్రం నష్ట భయం గానీ, మార్కెట్ ఆటుపోట్ల ప్రభావం గానీ లేకుండా హామీతో కూడిన స్థిర ఆదాయం కోరుకునే వ్యక్తులు నేషనల్ సేవింగ్స్ సర్టిఫికెట్ (ఎన్ఎస్‌సీ)ని ఎంచుకోవడం మంచిది. ప్రస్తుతం ఈ పథకంపై 7.7 శాతం వడ్డీ లభిస్తోంది. ఐదేళ్ల కాలపరిమితి ఉండే ఈ పథకంపై చెల్లింపులకు కేంద్ర ప్రభుత్వ హామీ కూడా ఉంది. ఈ పథకంపై ఏడాదికి ఒకసారి వడ్డీ లెక్క కట్టి మెచ్యూరిటీ సమయంలో చెల్లిస్తారు. సెక్షన్ 80సీ కింద ఈ పథకంలో పెట్టుబడులకు ఆదాయ పన్ను ప్రయోజనాలూ లభిస్తాయి. పన్ను ప్రయోజనాల కోసం చూసే సంప్రదాయ మదుపరులకు ఎన్ఎస్‌సీ చక్కటి ప్రత్యామ్నాయం.

ఈక్విటీ పథకాలు

దీర్ఘకాలిక మదుపరులు ముఖ్యంగా ఐదేళ్లు అంతకంటే ఎక్కువ కాలం వేచి చూడగలిగే మదుపరులు బ్యాంకు ఎఫ్‌డీలకు బదులు ఈక్విటీ పథకాలపైనా దృష్టి పెట్టవచ్చు. కొద్దిగా రిస్క్ ఉన్నా దీర్ఘకాలంగా చూస్తే ఈ పథకాలు మదుపరులకు ఎంత లేదన్నా 12 నుంచి 14 శాతానికి పైగా రాబడులు పంచుతున్నాయి. కాకపోతే ఫండ్‌తో పాటు ఫండ్ మేనేజర్ ట్రాక్ రికార్డు చూసి మరీ ఈ పథకాలను ఎంచుకోవాలి. ఆస్తుల కల్పన కోసం చూసే యువత బ్యాంకు ఎఫ్‌డీల కంటే మంచి ట్రాక్ రికార్డ్ ఉన్న ఈక్విటీ పథకాలను ఎంచుకోవడం మంచిది. వీటిపై సరైన అవగాహన లేకపోతే సరైన ఇన్వెస్ట్‌మెంట్ అడ్వైజర్ సలహా తీసుకుని మదుపు చేయడం మంచిది. రిస్క్ తీసుకోలేని సీనియర్ సిటిజన్లు కూడా లార్జ్ క్యాప్ ఫండ్స్‌ను ఎంచుకోవడం మంచిది.

బులియన్ పెట్టుబడులు

బంగారం, వెండి కూడా ఎఫ్‌డీలకు చక్కటి ప్రత్యామ్నాయం. ఈ సంవత్సరం ఈ రెండు లోహాలు ఇచ్చినంత లాభం మరే ఆస్తులు ఇవ్వలేదు. వచ్చే ఏడాది కూడా బంగారం, వెండి ధరలు మరింత పరుగు తీస్తాయే తప్ప వెనకడుగు వేయవని నిపుణులు చెబుతున్నారు. పెద్దగా రిస్క్ లేకుండా సురక్షితమైన దీర్ఘకాలిక పెట్టుబడుల కోసం చూసే మదుపరులు బ్యాంకు ఎఫ్‌డీలకు బదులు గోల్డ్ ఈటీఎఫ్‌లు లేదా డిజిటల్ గోల్డ్‌ను ఆశ్రయించడం మంచిది. కొత్తగా సావరిన్ గోల్డ్ బాండ్స్ జారీ చేయడాన్ని ప్రభుత్వం ఆపేసింది. అయితే ఆసక్తి ఉన్న మదుపరులు సెకండరీ మార్కెట్ నుంచి వీటికి కొనుగోలు చేసి తమ అదృష్టాన్ని పరీక్షించుకోవచ్చు.

కిసాన్ వికాస్ పత్ర

ప్రస్తుతం ఈ పథకంపై 7.5 శాతం వడ్డీ లభిస్తోంది. ఈ పథకంలో పెట్టుబడి 115 నెలల్లో రెట్టింపు అవుతుంది. ఈ పథకం చెల్లింపులకు ప్రభుత్వ హామీ ఉంటుంది. ఎలాంటి ఆటుపోట్లు లేకుండా స్థిరమైన ఆదాయం కోరుకునే సంప్రదాయ మదుపరులు, సీనియర్ సిటిజన్లకు 'కిసాన్ వికాస్ పత్ర' అత్యంత అనువైంది.

బ్యాంకు ఎఫ్‌డీలపై వడ్డీ రేట్లు తగ్గిపోతున్నాయని గాభరా పడకుండా సంప్రదాయ మదుపరులు, సీనియర్ సిటిజన్లు పై పథకాలను ఎంచుకోవడం మంచిది.

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	1,30,150 ▲	1,19,300 ▲	1,95,900 ▼
విజయవాడ	1,32,000 ▲	1,23,000 ▲	1,84,000 ▲
విశాఖపట్నం	1,29,930 ▼	1,19,100 ▲	1,95,900 ▼
రాజమండ్రి	1,30,150 ▼	1,19,300 ▼	1,82,000 ▲
ప్రొద్దుటూరు	1,27,400 ▼	1,17,210 ▼	1,78,000 ▲
ముంబై	1,28,592 ▲	1,17,790 ▲	1,78,210 ▲

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

7వ తేదీ			
హైదరాబాద్	651	విజయవాడ	670
వరంగల్	653	గోదావరి	650
చిత్తూరు	663	విశాఖపట్నం	640
		డజను గుడ్లు రూ.	90

ఈ టర్మ్ లైఫ్ పాలసీల ప్రీమియం తిరిగిచ్చేస్తారు..

జీవిత బీమా కవరేజీతో పాటు ప్రీమియం రిఫండ్ కోరుకునే వారి కోసం టీఆర్ఓపీ



జీవితం క్షణ భంగురం. మరణం ఎన్నటికైనా తథ్యం. కానీ, నూరేళ్ల ఆయువు అర్ధాంతరంగా ముగియడం దురదృష్టకరం. పాలసీదారు అకాలంగా మరణించిన సందర్భంలో అతడు లేదా ఆమె కుటుంబ సభ్యులకు ఆర్థిక భద్రత కల్పించేదే జీవిత బీమా. అందులో టర్మ్ లైఫ్ ఇన్సూరెన్స్ అత్యంత సరళమైన, అందుబాటు ధరలో లభించే పాలసీ. మిగతా లైఫ్ పాలసీలతో పోలిస్తే ప్రీమియం తక్కువ. బీమా కవరేజీ ఎక్కువ. కానీ, పథకం గడువు తీరే నాటికి పాలసీదారు బ్రతికి ఉన్న పక్షంలో చెల్లించిన ప్రీమియం మాత్రం తిరిగి రాదు. పాలసీ గడువు ముగిశాక రిఫండ్ కోరుకునే వారి కోసం బీమా కంపెనీలు రిటర్న్ ఆఫ్ ప్రీమియం ఆప్షన్‌తో కూడిన టర్మ్ ప్లాన్లను (టీఆర్ఓపీ) కూడా అందుబాటులోకి తెచ్చాయి. కాకపోతే, వీటి ప్రీమియం కాస్త అధికం. సంప్రదాయ టర్మ్ పాలసీలతో పోలిస్తే రెండింతల వరకు ప్రీమియం చెల్లించాల్సి రావచ్చు. జీవిత బీమా కవరేజీతోపాటు ప్రీమియం రిఫండ్‌నూ కోరుకునేవారు ఈ పాలసీలను ఎంచుకోవచ్చు. రిటర్న్ ఆఫ్ ప్రీమియం (ఆర్ఓపీ) ఆప్షన్‌తో కూడిన టర్మ్ లైఫ్ ప్లాన్‌ను ఎంచుకునే వారు గమనించాల్సిన అంశాలు..

- రిఫండ్ చేయాల్సిన ప్రీమియం మొత్తం నుంచి బీమా కంపెనీ రుసుముల పేరుతో ఏమైనా మినహాయించుకోనుందా అని పాలసీ కొనుగోలుకు ముందే డాక్యుమెంట్లోని వివరాలను పరిశీలించాలి. లేని పక్షంలో బీమా కంపెనీ ప్రతినిధిని స్పష్టత కోరండి.
- బీమా కంపెనీ క్లెయిమ్ సెటిల్‌మెంట్ల గత చరిత్రను కూడా పరిశీలించాలి. కంపెనీ విశ్వసనీయతకు ఇది ప్రతీక.
- ప్రీమియం చెల్లింపుల్లో వెసులుబాట్లను తెలుసుకోవాలి. సాధారణంగా కంపెనీ వార్షిక, అర్ధ సంవత్సరం, త్రైమాసిక, నెలవారీ చెల్లింపు అవకాశాలను కల్పిస్తాయి. మీ ఆదాయానికి అనుగుణమైన ఆప్షన్‌ను ఎంచుకోండి.
- ప్రీమియం రిఫండ్‌తోపాటు క్రిటికల్ ఇల్‌నెస్, యాక్సిడెంటల్ డెత్, డిసేబిలిటీ బెనిఫిట్ వంటి రైడర్ ఆప్షన్లు కూడా ఉన్న ప్లాన్లను ఎంచుకోవడం ఉత్తమం. అయితే, ఈ రైడర్లకు అదనంగా చెల్లించాల్సి ఉంటుంది.

12 నుంచి ఐసీఐసీఐ ప్రు ఏఎంసీ ఐపీఓ

ఇష్యూ ధర రూ.2,061-2,165

న్యూఢిల్లీ: ఐసీఐసీఐ అనుబంధ సంస్థ ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ ఏఎంసీ పబ్లిక్ ఇష్యూ (ఐపీఓ) ఈ నెల 12న ప్రారంభమై 16న ముగియనుంది. ఇష్యూ పరిమాణం రూ.10,000 కోట్ల వరకు ఉండొచ్చని అంచనా. ఈ ఇష్యూ పూర్తిగా ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్ఎస్) రూపంలో ఉండనుంది. ఓఎఫ్ఎస్‌లో భాగంగా సంస్థ ప్రమోటర్ యూకేకు చెందిన ప్రుడెన్షియల్ కార్పొరేషన్ హోల్డింగ్స్ 10 శాతం వాటాకు సమానమైన 4.89 కోట్ల ఈక్విటీ షేర్లను విక్రయించనుంది. కంపెనీ మార్కెట్ విలువను రూ.1.07 లక్షల కోట్లుగా లెక్కకట్టారు. కాగా ఇష్యూలో భాగంగా ఒక్కో షేరు ధరను రూ.2,061-2,165గా కంపెనీ ఖరారు చేసింది. ఐసీఐసీఐ గ్రూప్ నుంచి మార్కెట్లోకి అడుగుపెడుతున్న ఐదో సంస్థ ఇది. కొత్తగా ఈక్విటీ షేర్లు జారీ లేకపోవటంతో సంస్థకు ఎలాంటి మూలధనం సమకూరే అవకాశం లేదు. ప్రస్తుతం ఐసీఐసీఐ ప్రు ఏఎంసీలో ఐసీఐసీఐ బ్యాంక్‌కు 51 శాతం వాటా ఉండగా ప్రుడెన్షియల్ కార్పొరేషన్‌కు 49 శాతం వాటా ఉంది. ఈ ఐపీఓతో ఐసీఐసీఐ ప్రు.. భారత స్టాక్ మార్కెట్లో లిస్టయిన హెచ్‌డీఎఫ్‌సీ ఏఎంసీ, యూటీఐ ఏఎంసీ, ఆదిత్య బిర్లా సన్‌లైఫ్ ఏఎంసీ, శ్రీరామ్ ఏఎంసీ, నిప్పాన్ ఇండియా ఏఎంసీ సరసన చేరనుంది.

ఫామ్‌గేట్ ధర		వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్	
హైదరాబాద్	129	విజయవాడ	130
వరంగల్	129	గుంటూరు	135
కరీంనగర్	129	ఒంగోలు	135
మహబూబ్‌నగర్	129	చిత్తూరు	125
కర్నూలు	129	నెల్లూరు	130
విశాఖపట్నం	126	అనంతపురం	130
గోదావరి	130		

భగవద్గీత అనంతమైన తత్వశాస్త్రం

» గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ


కన్హాశాంతివనంలో విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న గవర్నర్ జిష్ణుదేవ్

నందిగామ, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): భగవద్గీత అనంతమైన తత్వశాస్త్రమని తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ చెప్పారు. రంగారెడ్డి జిల్లా నందిగామ మండల పరిధిలోని కన్హా శాంతివనంలో జరిగిన గీతోపదేశ్ వార్షిక సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. భగవద్గీత సత్యాన్ని బోధిస్తుందని, లక్ష్య సాధనకు అవసరమైన జ్ఞానాన్ని అందిస్తుందన్నారు. రామచంద్ర మిషన్ హార్ట్‌ఫుల్‌నెస్ సంస్థ చేపడుతున్న సేవా కార్యక్రమాలకు ప్రభుత్వం సహకరిస్తుందని చెప్పారు. ప్రపంచవ్యాప్తంగా 150 పాఠశాలల నుంచి వచ్చిన 5వేల మంది, తెలంగాణలోని 30 పాఠశాలల నుంచి 2500 మంది విద్యార్థులు గీతా శ్లోకాలు పఠించారు. ఉత్తమ ప్రతిభ కనబరచిన వారికి గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ, రామచంద్ర మిషన్ గురూజీ కమలేష్ డి పటేల్ బహుమతులు అందజేశారు.

10 లక్షల టన్నుల పారా బాయిల్డ్ రైస్ ఇవ్వండి

» ఎఫ్‌సీఐ చైర్మన్‌ను కోరిన మంత్రి ఉత్తమ్

హైదరాబాద్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): తెలంగాణకు అదనంగా 10 లక్షల టన్నుల పారా బాయిల్డ్ రైస్ ఇవ్వాలని ఎఫ్‌సీఐ చైర్మన్ అశుతోష్ అగ్నిహోత్రికి మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. 2024-25 రబీకి సంబంధించి ఈ కేటాయింపులు చేయాలని కోరారు. శనివారం సచివాలయంలోని తన కార్యాలయంలో ఎఫ్‌సీఐ చైర్మన్‌తో మంత్రి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన పలు అంశాలపై చర్చించారు. 2024-25 (ఖరీఫ్, రబీ) కోసం కేంద్రం 30 లక్షల టన్నుల బాయిల్డ్ రైస్ లక్ష్యాన్ని కేటాయించిందని తెలిపారు. అయితే 2024-25 రబీ నుంచి ఇప్పటి వరకు 17.06%పారా బాయిల్డ్, 0.87%ముడి బియ్యం సరఫరా చేసినట్లు వివరించారు. ఇంకా 2.34%పారా బాయిల్డ్ 14.26% ముడిబియ్యం సరఫరా చేయాల్సి ఉందని ఉత్తమ్ తెలిపారు.

21న జాతీయ లోక్ అదాలత్

» హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ శ్యాం కోషీ ఆదేశం

హైదరాబాద్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 21న జరిగే జాతీయ లోక్ ఆదాలత్‌ను జయప్రదం చేయాలని హైకోర్టు న్యాయమూర్తి, తెలంగాణ రాష్ట్ర లీగల్ సర్వీసెస్ అథారిటీ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ జస్టిస్ పి.శ్యాం కోషీ పిలుపునిచ్చారు. ఎక్కువగా పెండింగ్ కేసుల పరిష్కారానికి ప్రణాళిక రూపొందించాలని పోలీసుశాఖ ఉన్నతాధికారులను ఆదేశించారు. పోలీసు అధికారులతో శనివారం ఆయన సమావేశమయ్యారు. జరిమానాతో పరిష్కరించ తగ్గ కేసులతోపాటు సెటిల్‌మెంట్ కోరుకునే బాధితుల కేసులను ఎంపిక చేసుకోవాలన్నారు.

నైటా కొత్త అధ్యక్షుడిగా రవీందర్ కోడెల

హైదరాబాద్, న్యూయార్క్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): న్యూయార్క్ తెలంగాణ తెలుగు సంఘం(నైటా)నూతన అధ్యక్షుడిగా రవీందర్ కోడెల ఎంపికయ్యారు. ఏడాది పాటు కొత్త కార్యవర్గం నైటాకు నాయకత్వం వహించనుంది. న్యూయార్క్‌లో స్థిరపడిన తెలంగాణ తెలుగు వారు ఆరేళ్ల కిందట నైటాను ఏర్పాటు చేసుకున్నారు. నాటి నుంచి ఎన్నికవుతున్న కార్యవర్గాలు తమ ప్రాంత సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకుంటున్నారు. అమెరికాలోనే పుట్టిపెరిగిన తమ పిల్లలకు తెలుగు, తెలంగాణ పండుగల ప్రాధాన్యత తెలిసేలా కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ఇదే సంప్రదాయాన్ని కొనసాగిస్తూ కొత్త కార్యవర్గం సహకారంతో సామాజిక కార్యక్రమాలు నిర్వహిస్తామని రవీందర్ తెలిపారు.

కేంద్ర విత్తన చట్ట ముసాయిదాకు 13 సవరణలు

» వ్యవసాయ వర్సిటీ వీసీ అల్దాస్ జానయ్య

హైదరాబాద్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): కేంద్ర నూతన విత్తన చట్టం ముసాయిదాకు 13 సవరణలు ప్రతిపాదించామని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉపకులపతి ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య తెలిపారు. విత్తన చట్టం ముసాయిదాపై కేంద్రానికి ఈనెల 11 లోపు పది లక్షల మంది తెలుగు రాష్ట్రాల రైతులు తమ అభిప్రాయాలను ఈ-మెయిల్‌లో పంపాలని విజ్ఞప్తి చేశారు. శనివారం కమ్యూనిటీ సైన్స్ కళాశాలలో జానయ్య మాట్లాడుతూ.. రైతుల ప్రయోజనాల పరిరక్షణకు అన్ని వర్గాల ప్రజలు అభిప్రాయాలు పంచుకోవడంతో వచ్చే 50 ఏళ్లలో జరిగే నష్టాన్ని నివారించవచ్చునన్నారు.

రైతులకు ఆమోదయోగ్యం కాదు: కోదండరెడ్డి

కేంద్రం ప్రతిపాదిత విత్తన చట్టం రైతులకు ఆమోదయోగ్యంగా లేదని రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి తెలిపారు. కేంద్ర విత్తన చట్టం-2025 ముసాయిదాపై విత్తన కంపెనీల ప్రతినిధులతో ఆయన శనివారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కోదండ రెడ్డి మాట్లాడుతూ.. బహుళ జాతి విత్తన సంస్థల కోసమే కేంద్రం విత్తన చట్టం తీసుకొస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు.

కష్టాల్లో ఉన్నామని అడిగితే
తీన్మార్ మల్లన్న రూ.20వేలు ఇచ్చారు

» ఆపై సాయం గురించి ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్టు చేశారు
» అది చూసి మమ్మల్ని బంధువులు హీనంగా చూశారు
» సాయి ఈశ్వరాచారి భార్య కవిత ఆడియో వైరల్
» బీసీ ఉద్యమానికి ముడిపెట్టడం బాధాకరం: ఆది శ్రీనివాస్
» బీసీ రిజర్వేషన్ల కోసమే ప్రాణాలర్పించాడు: మహేశ్ గౌడ్

హైదరాబాద్ సిటీ, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): తీన్మార్ మల్లన్న కార్యాలయం ఎదుట ఒంటికి నిప్పంటించుకొని ఆత్మహత్య చేసుకున్న సాయి ఈశ్వరాచారికి సంబంధించి ఆయన భార్య కవిత మాట్లాడినట్లుగా ఉన్న ఆడియో శనివారం రాత్రి నుంచి సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతోంది. తమ కుటుంబం పుట్టెడు కష్టాల్లో ఉండటంతో భర్త ఈశ్వరాచారి గత నెల 30న తీన్మార్ మల్లన్న కార్యాలయానికి వెళ్లాడని ఆమె చెప్పినట్లుగా ఆ ఆడియోలో ఉంది. తాము పుట్టెడు కష్టాల్లో ఉన్నట్టు తీన్మార్ మల్లన్నకు ఈశ్వరాచారి చెబితే రూ.20వేల ఆర్థిక సాయం చేశారని కవిత ఆడియోలో వెల్లడించారు. అయితే ఈ సాయం గురించి తీన్మార్ మల్లన్న సిబ్బంది ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్టు చేశారని, ఇది చూసి బంధువులు, ఇరుగు పొరుగు వాళ్లు హీనంగా మాట్లాడారని ఆమె వాపోయారు. ఈశ్వరాచారి ఆత్మహత్య ఘటన అత్యంత బాధాకరం అని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. మృతుడి కుటుంబానికి సంతాపం తెలిపారు. ఈశ్వరాచారి కుటుంబాన్ని ఆదుకునే ప్రయత్నం చేస్తామన్నారు. ఈశ్వరాచారి ఆత్మహత్యను కొందరు రాజకీయం చేయడానికి ప్రయత్నించడం దురదృష్టకరం అని, అందులోనూ బీసీ ఉద్యమానికి ముడిపెట్టడం అత్యంత బాధాకం అని పేర్కొన్నారు. ఈశ్వరాచారి ఆత్మహత్య వెనుక కారణాలు వేరే ఉన్నాయని స్వయంగా అతడి భార్యే ఆవేదన వ్యక్తంచేసిందని చెప్పారు. ఈశ్వరాచారి ఆత్మహత్యను తీన్మార్ మల్లన్న తన రాజకీయం కోసం ఉపయోగించుకునే ప్రయత్నం చేయడం దురదృష్టకరం అన్నారు. కాగా సాయి ఈశ్వరాచారి, 'బీసీ రిజర్వేషన్ల సాధన' కోసమే ప్రాణాలర్పించాడని, అతడి ఆశయాల అమలు కోసం కాంగ్రెస్ ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు. కాగా జగద్గిరిగుట్టలో ఈశ్వరాచారి మృతదేహం వద్ద కోదండరాం నివాళులర్పించారు. ఈశ్వరాచారి కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం వచ్చేలా కృషిచేస్తానన్నారు. ఈశ్వరాచారి మృతదేహం వద్ద బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య నివాళులర్పించారు.మృతుడి కుటుంబానికి రూ.2కోట్ల పరిహారం, 500గజాల ఇంటి స్థలం, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈశ్వరాచారి కుటుంబానికి దిల్‌సుఖ్‌నగర్ స్వర్ణకారసంఘం రూ.30వేల ఆర్థికసాయం ప్రకటించింది.

కేసీఆర్‌తో మంచి రోజులు కాదు..
ముంచే రోజులొస్తాయి

(మొదటిపేజీ తరువాయి)

కట్టుకోండి, కాంగ్రెస్ అభ్యర్థికి ఓటేయండి అని వ్యాఖ్యానించారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఎక్కడైనా సన్నబియ్యం పథకం అమలైతే చూపించాలని ముఖ్యమంత్రి ఆ పార్టీ నేతలకు సవాలు విసిరారు. ఒక్క ఇందిరమ్మ పాలనలోనే ఈ పథకం అమలవుతోందని వ్యాఖ్యానించారు. 4.50 కోట్ల మంది తెలంగాణ బిడ్డలకు ఈ వేదిక మీద ఉన్న వండుతున్న సన్నబియ్యాన్నే ఉచితంగా అందిస్తున్నామని చెప్పారు. బీఆర్ఎస్ పాలనలో కొత్తగా పెళ్లయి అత్తింటికి వచ్చిన కోడళ్ల పేర్లను సైతం కార్డుల్లో చేర్చలేదని విమర్శించారు. ఈటల రాజేందర్, మహమూద్ అలీ వంటి మంత్రులను సైతం కేసీఆర్ ఇంటి బయట గార్డులు మెడబట్టి గెంటేశారని ఆరోపించారు. అలాంటి కేసీఆర్ నిన్న ఇద్దరు సర్పంచులు, నలుగురు వార్డు సభ్యులను పక్కన బెట్టుకొని మనకీ మంచిరోజులు వస్తాయని చెబుతున్నారని, వారిని నమ్మితే వచ్చేవి 'ముంచే' రోజులని వ్యాఖ్యానించారు. పదేళ్ల అధికారమిస్తే కేసీఆర్, ఆయన కొడుకు, కూతురు, అల్లుడు కలిసి రాష్ట్రాన్ని పీక్కుతిన్నారని, రూ.8లక్షల కోట్ల అప్పులు చేశారని, అయినా ఇంకా ఆశ చావలేదని రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. కేసీఆర్ పక్కనున్న కొడుకే ఆయనకు గుదిబండ అని చెప్పారు. ప్రజలు ఎప్పటికీ వారిద్దరినీ పట్టించుకోరని అన్నారు. నిలువనీడనిచ్చి పార్టీకి తనింట్లో ఆశ్రయమిచ్చిన కొండా లక్ష్మణ్ బాపూజీ చనిపోతే కనీసం కేసీఆర్ పరామర్శించ లేదన్నారు. దేవరకొండ సభకు వచ్చిన 50 వేల మందిలో ఏ ఒక్కరికైనా డబుల్ బెడ్‌రూం ఇల్లు వచ్చిందా? అని సీఎం ప్రశ్నించారు. ఇందిరమ్మ ఇళ్లిచ్చిన ఊర్లల్లో తాము ఓట్లు అడుగుతామని, డబుల్ బెడ్రూం ఇచ్చిన ఊర్లల్లోనే బీఆర్ఎస్ ఓట్లు అడగాలని తాను సవాల్ విసిరితే కేసీఆర్ స్పందించలేదని ఎద్దేవా చేశారు. కేసీఆర్‌కు చిత్తశుద్ధి ఉంటే పదేళ్లలో 20 లక్షల ఇళ్లు కట్టే అవకాశం ఉందని, పేదలపై ఏ మాత్రం అభిమానం లేకనే ఇల్లు కట్టలేదని చెప్పారు. రాష్ట్రంలో 22,500 కోట్లతో 4.50 లక్షల ఇందిరమ్మ ఇళ్ల నిర్మిస్తున్నామని తెలిపారు. చెంచులకు ఐటీడీఏల పరిధిలో మరో 25వేల ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేశామని తెలిపారు. ఫ్లోరైడ్ ప్రభావిత నల్లగొండ జిల్లాలో 3.60 లక్షల ఎకరాల భూమికి సాగునీరిచ్చే ఉద్దేశ్యంతో జానారెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి 2005లో ఎస్ఎల్‌బీసీని రూ.2 వేల కోట్లతో చేపట్టారని, అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలోనే 30 కిలోమీటర్ల సొరంగం తవ్వారని తెలిపారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో నల్లగొండపై కక్షగట్టి, సొరంగాన్ని పడావు పడేశారని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక తామే ఈ పనులు మొదలుపెడతే దురదృష్టవశాత్తు ప్రమాదం జరిగి, 8 మంది చనిపోయారని కేసీఆర్, హరీష్ డ్యాన్సులు వేశారని దుయ్యబట్టారు. కేసీఆర్, హరీష్‌రావు బండ కట్టుకొని శ్రీశైలం, నాగార్జునసాగర్‌లో దూకినా ఎస్ఎల్‌బీసీని, డిండి ప్రాజెక్టుని తమ హయాంలోనే కట్టితీరుతామని ఉద్ఘాటించారు. జైపాల్‌రెడ్డి దేవరకొండలో చదువుకొన్న పాఠశాల, కళాశాలను అభివృద్ధి చేసేందుకు రూ.6 కోట్లు మంజూరు చేస్తామని ప్రకటించారు. సేవాలాల్ మహారాజ్ అతిపెద్ద విగ్రహాన్ని మద్దిమడుగు వద్ద ఏర్పాటు చేస్తామని, ప్రసిద్ధ పుణ్యక్షేత్రంగా అభివృద్ధి చేస్తామని చెప్పారు. దేవరకొండలో నర్సింగ్ కాలేజీ ఏర్పాటుకు అవసరమైన ప్రతిపాదనలు పంపాలని కలెక్టర్‌ను ఆదేశించారు.


దేవరకొండలో సమభావన సంఘం మహిళలకు చెక్కును అందజేస్తున్న సీఎం రేవంత్, మంత్రి కోమటిరెడ్డి

ఎస్ఎల్‌బీసీ టన్నెల్ పూర్తి చేస్తాం: ఉత్తమ్

వచ్చే అసెంబ్లీ ఎన్నికల లోపే ఎస్ఎల్‌బీసీ టన్నెల్‌ని పూర్తిచేసి నల్లగొండ జిల్లాలో 3.60లక్షల ఎకరాలకు సాగు నీరందిస్తామని మంత్రి ఉత్తమ్ అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాకే డిండి ఎత్తిపోతల పనులు రూ.1800కోట్లతో చేపట్టామని చెప్పారు. హైలెవల్ కెనాల్‌కు రూ.482కోట్లు మంజూరు చేశామన్నారు. రాష్ట్రంలో పేదలందరికీ ఉచితంగా ఆరు కిలోల సన్నబియ్యం ఇస్తున్నామని వివరించారు.

మరో ఐదేళ్లూ రేవంతే సీఎం

మంత్రి కోమటిరెడ్డి

ఈ మూడేళ్లే కాదు, మరో అయిదేళ్లూ రేవంత్‌రెడ్డే ముఖ్యమంత్రిగా కొనసాగుతారని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. దేవరకొండ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేయడానికి తాము ఎస్ఎల్‌బీసీ సొరంగం ప్రాజెక్టు చేపడితే, గత ప్రభుత్వ హయాంలో కేసీఆర్ కుర్చీ వేసుకొని కూర్చొని పనులు పూర్తి చేయిస్తానని చెప్పారే తప్ప పనులు ఒక్క అడుగు కూడా ముందుకు వేయలేదని విమర్శించారు. మళ్లీ తామొచ్చాకే ఈ పనులు మొదలయ్యాయని తెలిపారు. రాష్ట్రంలో హ్యామ్ రోడ్ల కింద రూ.11 వేల కోట్లతో టెండర్లు పిలిచామని, త్వరలో అన్ని ప్రాంతాల్లో రోడ్ల నిర్మాణాలు చేపడతామని ప్రకటించారు. దేవరకొండను రెండో కొడంగల్ మాదిరిగా సీఎం అభివృద్ధి చేయాలని వెంకట్‌రెడ్డి కోరారు. దేవరకొండ సమగ్ర అభివృద్ధికి సహకరించాలని ఎమ్మెల్యే బాలూనాయక్ కోరారు. మహిళలు ఇందిరమ్మ చీరలు ధరించి సభకు రావడం ఆకర్షణగా నిలిచింది.


నల్లగొండ జిల్లా దేవరకొండలో నిర్వహించిన బహిరంగ సభకు హాజరైన ప్రజలు



రయ్.. రయ్

» ఉర్రూతలూగించిన ఇండియన్ సూపర్ క్రాస్ రేసింగ్
» అబ్బురపరిచిన బైకర్ల విన్యాసాలు
» రేసును ప్రారంభించిన సీఎం రేవంత్
» మైదానంలో సల్మాన్‌ఖాన్ సందడి



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): రయ్ రయ్‌మంటూ గాల్లో దూసుకెళ్లిన డర్ట్ బైక్‌ల మోత.. మెరుపు వేగంతో దూసుకెళ్తూ బైకర్లు చేసిన విన్యాసాలు.. బాలీవుడ్ స్టార్ హీరో సందడి వెరసి ఇండియన్ సూపర్‌క్రాస్ రేసింగ్ (ఐఎస్ఆర్ఎల్) రెండో రౌండ్ పోటీలు హైదరాబాదీలను ఉర్రూతలూగించాయి. బైక్ రేసింగ్ మజాను అందించాయి. గచ్చిబౌలిలోని జీఎంసీ బాలయోగి ప్రధాన స్టేడియంలో శనివారం జరిగిన ఈ పోటీలను జెండా ఊపి ప్రారంభించిన సీఎం రేవంత్ రెడ్డి.. బాలీవుడ్ నటుడు సల్మాన్ ఖాన్‌తో కలిసి రేస్‌ను ఆసక్తిగా తిలకించారు. 450 సీసీ, 250 సీసీ ఇంటర్నేషనల్, 250 సీసీ ఆసియా-ఇండియా విభాగాల్లో రేసులు జరిగాయి. ఇందులో బైక్ జంప్స్, రిథమ్ జంప్స్, ట్రిపుల్ జంప్స్, వూప్ సెక్షన్స్, ఫ్రీస్టయిల్ మోటర్‌క్రాస్ కేటగిరీల్లో పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను చూసేందుకు 18 వేల మంది హాజర్యగా.. బైకర్ల మోత, అభిమానుల హోరుతో స్టేడియం మార్మోగిపోయింది. పోటీల ప్రారంభానికి ముందు, చివరిలో నిర్వహించిన లేజర్ షో అభిమానులను అలరించింది. సీఎం రేవంత్ రెడ్డితో పాటు ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబు, ప్రభుత్వ క్రీడాశాఖ సలహాదారు ఏపీ జితేందర్ రెడ్డి, శాట్ చైర్మన్ శివసేనారెడ్డి తదితరుల ఈ పోటీలను వీక్షించారు. కాగా, రెండో రౌండ్ పోటీల్లో టీమ్ గుజరాత్ ట్రయల్ బ్లేజర్స్ విజేతగా నిలిచి, మొత్తంగా 212 పాయింట్లతో లీగ్‌లో అగ్రస్థానంలో నిలిచింది. ఇండీ వీలర్స్ జట్టు 210 పాయింట్లతో ద్వితీయ స్థానంలో, బిగ్‌రాక్ జట్టు 202 పాయింట్లతో తృతీయ స్థానంలో నిలిచాయి. ఆఖరిదైన మూడో రౌండ్ పోటీలు ఈనెల 20, 21 తేదీల్లో కేరళలోని కాలికట్‌లో జరగనున్నాయి.

నెహ్రూపై మోదీ చెప్పేవన్నీ అబద్ధాలే

చరిత్ర మార్చేందుకు కుట్ర.. తీవ్రంగా ఖండించిన సోనియా

- నెహ్రూ ఆలోచనలకు అనుగుణంగానే సోనియా నేతృత్వంలోని పదేళ్ల యూపీఏ పాలన
- స్వాతంత్ర్యానికి మునుపు దేశ ప్రజలకు సరిపడా తిండి గింజలు పండేవి కావు
- నెహ్రూ ఆధ్వర్యంలో 200 దేశాలకు ధాన్యం ఎగుమతి చేసే స్థాయికి దేశం
- శ్రీరాముని ఆలోచన, ఆదర్శాలకు అనుగుణంగా పరిపాలించిన చరిత్ర నెహ్రూది..
- రాముడిని ముందు పెట్టి ఓట్లేయించుకుని ప్రధాని అయిన చరిత్ర మోదీది: తూర్పు జగ్గారెడ్డి



హైదరాబాబాద్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): దివంగత మాజీ ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూపై అబద్ధాలు చెబుతూ చరిత్రను మార్చేందుకు ప్రధాని మోదీ కుట్ర చేస్తున్నారని టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు తూర్పు జగ్గారెడ్డి ఆరోపించారు. ఆ కుట్రలను సోనియాగాంధీ తీవ్రంగా ఖండించారన్నారు. సోనియగా, రాహుల్‌గాంధీల నాయకత్వంలో తాము సైనికుల్లా పనిచేస్తామని, వారి ఆదర్శాలను గాంధీ భావజాలాన్ని తమ భుజాన మోస్తూనే ఉంటామని స్పష్టం చేశారు. నెహ్రూ పాలనలో జరిగిన మంచిని.. మంచి అని చెప్పే గుణం బీజేపీకి లేకపోవడం దురదృష్టకరమన్నారు.శనివారం గాంధీభవన్‌లో మీడియా సమావేశంలో జగ్గారెడ్డి మాట్లాడుతూ.. గాంధీ, నెహ్రూలు స్వాతంత్ర్యోద్యమం నడిపారని, దేశ ప్రజలు బానిసలుగా ఉండొద్దన్నదే సింగిల్ అజెండాగా చేసుకుని ముందుకు సాగారని పేర్కొన్నారు. మోదీ ఎన్ని అబద్ధాలు చెప్పినా నెహ్రూ చరిత్ర మార్చలేరన్నారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత పుట్టిన పార్టీ బీజేపీ అని చెప్పారు. మోదీ తన రాజకీయ జీవితంలో ప్రధాని కావాలన్న లక్ష్యంతోనే పని చేశారన్నారు. మోదీ మాదిరిగా ప్రధాని అవ్వాలన్న లక్ష్యాలు పెట్టుకుని స్వాతంత్ర ఉద్యమాల్లో పాల్గొన్న వ్యక్తి నెహ్రూ కాదని తెలిపారు. దేశ చరిత్రలో నెహ్రూ, గాంధీ కటుంబాలు చేసిన త్యాగాలూ ఉండొద్దని కుట్ర చేస్తున్నారన్నారు. ప్రజల మద్దతుతో ఆయన దేశానికి తొలి ప్రధాని అయ్యారని చెప్పారు. స్వాతంత్ర్యానికి ముందు దేశంలో ప్రజలకు సరిపడా తిండి గింజలు పండేవి కావన్నారు. ఆ స్థాయి నుంచి ప్రజలకు తిండి గింజలు దొరకడమే కాకుండా పొరుగున 200 దేశాలకు ధాన్యం ఎగుమతి చేసే స్థాయికి మన వ్యవసాయం అభివద్ధి సాధించిందంటే అది నెహ్రూ ఘనతేనని కొనియాడారు. స్వాతంత్ర్యోద్యమంలో బీజేపీ, మోదీల పాత్ర ఏముందని ప్రశ్నించారు. ఆ పార్టీ సింగిల్ అజెండా రామాలయమేనన్నారు. శ్రీరాముని ఆలోచనలు, ఆదర్శాలను పరిగణనలోకి తీసుకుని నెహ్రూ పరిపాలించారని తెలిపారు. రాముని విగ్రహం ముందు పెట్టి ఓట్లేయించుకుని ప్రధాని అయిన చరిత్ర మోదీదని విమర్శించారు. 56 ఏళ్ల కాంగ్రెస్ పాలనలో చేసిన అభివృద్ధి కార్యక్రమాలను వందల సంఖ్యలో చెప్పగలమని, గడిచిన 11 ఏళ్లలో అయోధ్యలో రామాలయం కట్టామని చెప్పడం తప్ప మోదీ ఏం చేశారో చెప్పగలరా అని నిలదీశారు.

పల్లె నుంచి పట్నం.. రయ్!

'హ్యామ్'తో రూ.11,399కోట్లతో రోడ్ల అభివృద్ధి

» మొత్తం 6617కోట్ల విలువైన పనులకు అనుమతి
» శ్రీశైలానికి ఎలివేటెడ్ కారిడార్.. రోడ్లకు మహర్దశ
» కొత్తగా కోటి చదరపు అడుగుల భవన నిర్మాణాలు
» రెండేళ్లలోనే రోడ్లు, భవనాల శాఖ రికార్డు



హైదరాబాద్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రోడ్లు, భవనాల శాఖ సరికొత్త రికార్డులను సృష్టిస్తోంది. కొత్త ప్రాజెక్టుల నిర్మాణంలో వేగంగా దూసుకుపోతోంది. రవాణా వ్యవస్థను మెరుగుపరచడంపై ప్రత్యేకంగా దృష్టి సారించిన కాంగ్రెస్ ప్రభుత్వం.. తెలంగాణను దేశంలోనే లాజిస్టిక్స్ హబ్‌గా మార్చేందుకు వేల కోట్ల రూపాయలతో భారీ ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టింది. ఇందులోభాగంగానే రూ. 6617.86 కోట్ల విలువైన 239 పనులకు అనుమతులు వచ్చాయి. ఇందులో 1659 కి.మీ రహదారులు, 62 వంతెనలను నిర్మించడంతోపాటు 1383 కి.మీ రోడ్లను సింగిల్ లేన్ నుంచి డబుల్ లేన్‌గా, 242 కి.మీ రహదారులను ఫోర్ లేన్‌గా విస్తరించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇందులో 514.80 కి.మీ రహదారి విస్తరణ పనులు ఇప్పటికే పూర్తయ్యాయి. మౌలిక సదుపాయాల పెంపులో భాగంగా రూ. 60,799 కోట్లతో ప్రకటించిన భారీ ప్రాజెక్టులు రోడ్ల అభివృద్ధికి కొత్త ఊపిరి పోశాయి. ప్రపంచ స్థాయి ప్రమాణాలతో "మిర్రర్ స్మూత్" రోడ్లు, ప్రమాద రహిత రోడ్ల నిర్మాణంపై ప్రభుత్వం దృష్టి సారించింది. హైబ్రిడ్ యాన్యుటీ మోడల్ (హెచ్ఏఎం) కింద రూ.11,399 కోట్లతో 419 రోడ్లను 32 ప్యాకేజీల ద్వారా అభివృద్ధి చేయనున్నారు. హైదరాబాద్ - విజయవాడ హైవేను రూ. 10,400 కోట్లతో 8 లేన్లుగా విస్తరించేందుకు డీపీఆర్ సిద్ధమవుతోంది. తెలంగాణకు మణిహారంగా మారనున్న రీజినల్ రింగ్ రోడ్ (ఆర్ఆర్ఆర్) పనులు అతి త్వరలో ప్రారంభం కానున్నాయి. హైదరాబాద్ - అమరావతి- మచిలీపట్నం గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్‌వే డీపీఆర్ తయారీకి టెండర్లు పిలిచారు. హైదరాబాద్-శ్రీశైలం ఎలివేటెడ్ కారిడార్‌ను మన్ననూర్ నుంచి శ్రీశైలం వరకు సుమారు రూ. 8 వేల కోట్లతో నిర్మించనున్నారు. వరంగల్, ఆదిలాబాద్, రామగుండం కొత్త విమానాశ్రయాలకు మార్గం సుగమమైంది. వచ్చే ఏడాది చివరి నాటికి వరంగల్ విమానాశ్రయంలో కార్గో సేవలు ప్రారంభం కానున్నాయి. రెండేళ్లలోనే రూ. 7వేల కోట్ల వ్యయంతో ఒక కోటి చదరపు అడుగులకుపైగా విస్తీర్ణంలో భవన నిర్మాణాలు చేపట్టింది. గత ప్రభుత్వం పదేళ్లలో కోటి చదరపు అడుగుల విస్తీర్ణంలో నిర్మాణాలు చేపడితే.. కేవలం రెండేళ్లలోనే ఆ రికార్డును కాంగ్రెస్ సర్కారు బ్రేక్ చేసింది. రూ.2583 కోట్లతో రాజేంద్ర నగర్‌లో కొత్త హైకోర్టు కాంప్లెక్స్ నిర్మిస్తున్నారు. గోషామహల్‌లో ఉస్మానియా ఆస్పత్రి భవనాన్ని రూ.2700 కోట్లతో చేపట్టనున్నారు. సనత్ నగర్, అల్వాల్, ఎల్బీనగర్ టిమ్స్ ఆస్పత్రులు, వరంగల్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి త్వరలోనే అందుబాటులోకి రానున్నాయి.

పాఠశాల స్థాయిలోనే
సాంకేతిక విద్య

గతంలో ఎన్నడూ లేని విధంగా
టీచర్ల నియామకాలు, పదోన్నతులు, బదిలీలు

» కొత్త వర్సిటీలు.. అత్యాధునిక వసతులు
» రెండేళ్లలో విద్యా శాఖ విజయాలు ఇవీ..



హైదరాబాద్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): విద్యా రంగాన్ని బలోపేతం చేయడంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం కీలక సంస్కరణలను అమలు చేసింది. డీఎస్సీ-2024 ద్వారా 10 వేలకు పైగా ఉపాధ్యాయ నియామకాలు చేపట్టింది. 34,706 మంది టీచర్లకు బదిలీలు, 21వేలపైగా ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించింది. ఏడాదికి రూ.140 కోట్ల వ్యయంతో అన్ని ప్రభుత్వ పాఠశాలలకు ఉచిత విద్యుత్ అందిస్తోంది. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ద్వారా పాఠశాలల్లో మౌలిక వసతులకు రూ.642 కోట్లు, తరగతి గదుల మరమ్మతులకు 146 కోట్లు కేటాయించింది. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 495 కేజీబీవీల్లో 283 పాఠశాలలను ఇంటర్ స్థాయికి అప్‌గ్రేడ్ చేసి, మరో 93 కేజీబీవీలను యంగ్ ఇండియా ఇన్‌స్టిట్యూట్స్ ఆఫ్ ఎక్సలెన్స్‌గా తీర్చిదిద్దింది. పేద, గ్రామీణ బాలికలకు ఇంజనీరింగ్, మెడిసిన్, లా ప్రవేశ పరీక్షల ఉచిత కోచింగ్ అందిస్తోంది. చిన్నారుల కోసం ప్రీ-ప్రైమరీ సెక్షన్ల విస్తరణ, 1-9 తరగతుల సిలబస్‌లోనే కృత్రిమ మేధస్సు, డిజిటల్ లిటరసీని చేర్చి పాఠశాల స్థాయిలోనే సాంకేతిక విద్యను అందుబాటులోకి తెచ్చింది. ఖాన్ అకాడమీ, ఫిజిక్స్‌వాలా వంటి జాతీయ స్థాయి డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లతో భాగస్వామ్యమై నాణ్యమైన విద్యను అందించేందుకు చర్యలు చేపట్టింది. చాకలి ఐలమ్మ మహిళా విశ్వవిద్యాలయం, మన్మోహన్ ఎర్త్ సైన్సెస్ వర్సిటీలను ఏర్పాటు చేసింది. పాలమూరు, శాతవాహన, తెలంగాణ విశ్వవిద్యాలయాల్లో లా, ఇంజనీరింగ్ కళాశాలల స్థాపనతో ఉన్నత విద్యను మరింత చేరువ చేసింది.

TELANGANA RISING 2047

500 ఎకరాల్లో సమ్మిట్!



ఫ్యూచర్ సిటీలో గ్లోబల్ సమ్మిట్ ఏర్పాట్లను పరిశీలిస్తున్న మంత్రి పొంగులేటి

అభివృద్ధి చెందిన దేశాలతో తెలంగాణ పోటీ

» రోల్ మోడల్‌గా గ్లోబల్ సమ్మిట్: పొంగులేటి

హైదరాబాద్ సిటీ/రంగారెడ్డి అర్బన్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధి చెందిన దేశాలతో తెలంగాణ పోటీ పడుతోందని, గ్లోబల్ సమ్మిట్ ప్రపంచానికే రోల్‌మోడల్ కానుందని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. ఫ్యూచర్ సిటీలో గ్లోబల్ సమ్మిట్ ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. గ్లోబల్ సమ్మిట్‌కు అనేక రంగాల్లో విశేష గుర్తింపు పొందిన వందలాది మంది దిగ్గజాలను ఆహ్వానించినట్లు తెలిపారు. రెండేళ్లలో కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ఈ వేదికగా వివరిస్తామన్నారు. 2035 నాటికి తెలంగాణ ఆర్థిక వ్యవస్థను ఒక ట్రిలియన్ డాలర్లకు చేర్చడమే లక్ష్యంగా పని చేస్తున్నామన్నారు. 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థను సృష్టించడానికి ప్రభుత్వం ప్రణాళికలు రూపొందిస్తుందన్నారు. దేశవిదేశాలకు చెందిన అతిథులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా స్వయంగా సీఎం రేవంత్‌రెడ్డి పర్యవేక్షిస్తున్నారని, చెప్పారు. సీఎం సూచనల మేరకు గడువులోగా అన్ని ఏర్పాట్లు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

ఎక్కడా లేని విధంగా.. ఫ్యూచర్ సిటీ

» టీజీఐఐసీ చైర్మన్ నిర్మలా జగ్గారెడ్డి

హైదరాబాద్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): దేశంలో ఎక్కడా లేని విధంగా.. ఫ్యూచర్ సిటీ నిర్మాణం జరుగుతోందని టీజీఐఐసీ చైర్మన్ నిర్మలా జగ్గారెడ్డి తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు తామంతా ఫ్యూచర్‌సిటీ నిర్మాణంలో పాలుపంచుకుంటున్నామని పేర్కొన్నారు. దేశంలో కనీవినీ ఎరుగని రీతిలో విజన్-2047 ప్రణాళికతో ముందుకెళ్తున్నామని చెప్పారు. గ్లోబల్ సమ్మిట్‌కు 2000 మంది ప్రతినిధులు హాజరయ్యే అవకాశం ఉందని, వారందరికీ ఘన స్వాగతం పలకడానికి తాము సిద్ధంగా ఉన్నామని తెలిపారు. సుమారు 70 ఎకరాల ప్రాంగణంలో సమ్మిట్‌ను నిర్వహిస్తున్నామన్నారు. ఫ్యూచర్‌సిటీ నిర్మాణంలో భాగంగా ఇప్పటి వరకు టీజీఐఐసీ 11,000 ఎకరాలను సమీకరించిందన్నారు.

గ్లోబల్ సమ్మిట్‌లో 'మెట్రో' స్టాల్



హైదరాబాద్ సిటీ, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): గ్లోబల్ సమ్మిట్ మెట్రో రైల్ స్టాల్‌ను ఏర్పాటు చేస్తున్నారు. హైదరాబాద్‌కు కీలకంగా నిలవనున్న రెండో దశ మెట్రో విస్తరణ గురించి అందరికీ వివరించేందుకు హెచ్ఎండీఏ, హైదరాబాద్ మెట్రో రైల్ సంయుక్తంగా ఈ స్టాల్‌ను ఏర్పాటు చేస్తున్నాయి. రెండో దశ విస్తరణలో భాగంగా మొత్తం 8 కారిడార్లను రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించిన విషయం తెలిసిందే. మొత్తం 162.9 కిలోమీటర్లకు రూ.43,847.22 కోట్లు ఖర్చవుతుందని అంచనా వేశారు. సమ్మిట్ ద్వారా మెట్రో రైలు విస్తరణకు పెట్టుబడులను ఆకర్షించాలని ప్రభుత్వం భావిస్తోంది.



సమ్మిట్‌కు వచ్చే అతిథులకు స్వాగతం పలకనున్న రోబో



సమ్మిట్ జరిగే ప్రధాన ప్రవేశద్వారం

2వేల మంది సీటింగ్ కెపాసిటీతో ప్రారంభ వేదిక

- » ప్యానల్ చర్చల కోసం 6 బ్రేక్ అవుట్ సెషన్ హాళ్లు
- » సీఎం, మంత్రులు, ప్రముఖుల కోసం ఎంఐపీ హాల్
- » వివిధ శాఖల పథకాల ప్రదర్శనకు వీడియో టన్నెల్
- » గాలాడిన్‌లో కీరవాణి కచేరి, సాంస్కృతిక కార్యక్రమాలు
- » తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్‌కు భారీ ఏర్పాట్లు
- » 10 వేల మంది పోలీసులతో భారీగా భద్రత

హైదరాబాద్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): భారత్ ఫ్యూచర్ సిటీలో పండగ వాతావరణం నెలకొంది. ఎక్కడ చూసినా డిజిటల్ స్క్రీన్‌లు, అందమైన లాన్‌లు, రకరకాల పూలమొక్కలతో ఆకర్షణీయంగా కనిపిస్తోంది. తెలంగాణ ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించనున్న రైజింగ్ గ్లోబల్ సమ్మిట్‌కు ఫ్యూచర్ సిటీలో భారీ ఏర్పాట్లు చేస్తోంది. వంద ఎకరాల్లో సదస్సు ఏర్పాట్లు జరుగుతున్నాయి. నాలుగు చోట్ల పార్కింగ్ స్లాట్లను కూడా కలుపుకొంటే మొత్తం 500 ఎకరాల భూమిని సమ్మిట్ కోసం వినియోగిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ నెల 8న మధ్యాహ్నం వరకల్లా ఏర్పాట్లన్నీ పూర్తవుతాయని అధికారులు చెబుతున్నారు. దానికంటే ముందుగా 7న ఏర్పాట్లను పరిశీలించడానికి డ్రై రన్‌ను నిర్వహించనున్నారు. దేశ విదేశాల నుంచి 2వేల మందికి పైగా ప్రముఖులు, ప్రతినిధులు, దేశాల రాయబారులు, పారిశ్రామికవేత్తలు, కంపెనీల చైర్మన్లు, ఎండీలు, సీఈవోలు, మంత్రులు, అధికారులు, వివిధ రంగాల నిపుణులు హాజరవుతున్నందున.. ప్రభుత్వం పకడ్బందీ ఏర్పాట్లు చేస్తోంది. ప్రారంభ వేదికపై 2వేల మందికి పైగా ప్రతినిధులు కూర్చునేలా సీటింగ్ ఏర్పాట్లు చేశారు. సీఎం, మంత్రులు, విదేశీ ప్రతినిధులు, ప్రముఖ పారిశ్రామికవేత్తలు వంటి వీఐపీలకు డిన్నర్ కోసం, సేదదీరేందుకు మోస్ట్ ఇంపార్టెంట్ పర్సన్స్(ఎంఐపీ)' హాల్‌ను ఏర్పాటు చేశారు. ఇక్కడ భారీ భద్రతా ఏర్పాట్లు చేశారు.

వీడియో టన్నెల్... వీడియో టవర్లు..

ప్రధాన వేదిక వద్ద వీడియో టన్నెల్ ఏర్పాటు చేశారు. టన్నెల్‌లోకి ప్రవేశిస్తుండగా.. ఇరు వైపులా భారీ స్క్రీన్లు కనిపిస్తాయి. వీటిపై ప్రభుత్వ, ప్రైవేటు ప్రాజెక్టులు, స్కీములు, ఇతర కార్యక్రమాలు ప్రదర్శితమవుతాయి. దీని పక్కనే వీడియో టవర్లను ఏర్పాటు చేశారు. వీటిపై ఉన్న స్క్రీన్లపై కూడా ప్రభుత్వ పథకాలు, ఇతర ప్రాజెక్టుల వివరాలను ప్రదర్శిస్తారు. భారీ ఎగ్జిబిషన్‌ను ఏర్పాటు చేస్తారు. 22 ప్రభుత్వ శాఖల స్టాళ్లు, ప్రైవేటు సంస్థల స్టాళ్లను కూడా ఏర్పాటు చేస్తున్నారు. 9న సదస్సు ముగిసిన తర్వాత.. 10 నుంచి 13వ తేదీ వరకు సాధారణ ప్రజలు ఎగ్జిబిషన్‌ను వీక్షించడానికి అనుమతిస్తారు. ప్రధాన వేదిక వెనుక 'గాలాడిన్'ను ఏర్పాటు చేస్తున్నారు. ఇక్కడే ప్రముఖ సంగీత దర్శకుడు కీరవాణి సంగీత కచేరితోపాటు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయి. ఇంటర్నెట్, వైఫై సౌకర్యం కూడా కల్పిస్తున్నారు.



మూడంచెల భద్రతా వలయం

సమ్మిట్‌కు హాజరవుతున్న ప్రతినిధుల భద్రత పట్ల పోలీసు శాఖ ప్రత్యేక దృష్టి సారించింది. సమ్మిట్ జరుగనున్న ప్రదేశంలో మూడంచెల భద్రతా వలయాన్ని ఏర్పాటు చేస్తున్నారు. 44 దేశాల నుంచి వస్తున్న విదేశీ ప్రతినిధులు, దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి వస్తున్న ప్రతినిధులు బస చేస్తున్న హోటళ్లు, అతిథిగృహాల వద్ద సాయుధ పోలీసు బలగాలను మోహరిస్తున్నారు. ఆదివారం సాయంత్రం నుంచి ప్రతినిధులు బస చేసే ప్రదేశాలు, వారు ఫ్యూచర్ సిటికి వెళ్లే మార్గాల్లో డ్రెస్ రిహార్సల్ నిర్వహిస్తున్నారు. అతిథులు హైదరాబాద్‌కు వచ్చినప్పటి నుంచి వారు బస చేసిన ప్రదేశాలు, ఫ్యూచర్ సిటికి వెళ్లే రహదారుల్లో పూర్తిగా సీసీ కెమేరాల నిఘా ఏర్పాటు చేశారు. కేవలం ఫ్యూచర్ సిటీలోనే వెయ్యికి పైగా కెమెరాలను కంట్రోల్ రూంతో అనుసంధానం చేశారు. హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ కమిషనరేట్లకు చెందిన సీనియర్ పోలీసు అధికారులకు కీలక బాధ్యతలు అప్పగించారు. భద్రతా ఏర్పాట్లను సమన్వయం చేస్తూ అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అనుక్షణం పర్యవేక్షించడానికి మాస్టర్ కంట్రోల్ రూం ఏర్పాటు చేశారు.

సమ్మిట్‌లో 27 అంశాలపై చర్చ: ఎఫ్‌సీడీఏ కమిషనర్ శశాంక

తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్‌లో రాష్ట్ర భవిష్యత్తుకు సంబంధించి మొత్తం 27 అంశాలపై చర్చ జరుగుతుందని ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ(ఎఫ్‌సీడీఏ) కమిషనర్ కె.శశాంక తెలిపారు. సదస్సు జరిగే భారత్ ఫ్యూచర్ సిటీలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. సదస్సు నిర్వహణ కోసం 20 రోజుల నుంచి పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నామని, రానున్న 22 ఏళ్లలో రాష్ట్రంలో ఏం సాధించనున్నామన్నదే సదస్సు ప్రధాన ఉద్దేశమని అన్నారు. వివిధ దేశాలు, రాష్ట్రాల నుంచి 500-600 మంది వీఐపీలు, 1500 మంది ప్రతినిధులు హాజరవుతున్నారని, అతిథులకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నామని, ఆదివారం డ్రై రన్ నిర్వహిస్తామని తెలిపారు. మొత్తం నాలుగు వేదికలపై చర్చలు జరుగుతాయని, రాష్ట్రంలోని వివిధ శాఖలకు సంబంధించిన స్టాళ్ల ఎగ్జిబిషన్ ఉంటుందని చెప్పారు.

భద్రత విధుల్లో 10 వేల మంది పోలీసులు..

దాదాపు 10 వేల మంది పోలీసులు సమ్మిట్‌కు సంబంధించిన భద్రతా విధుల్లో నిమగ్నమవుతారని, వీరికి అదనంగా మరో వెయ్యి మంది ట్రాఫిక్ పోలీసులు పనిచేస్తారని, ట్రాఫిక్ మార్షల్స్‌తో పాటు గ్రేహౌండ్స్, క్విక్ రెస్పాన్స్ టీం, తెలంగాణ ప్రత్యేక పోలీసు బలగాలు మూడవ భద్రతా వలయంలో ఉంటారని డీజీపీ శివధర్‌రెడ్డి తెలిపారు. రెండో వలయంలో సీనియర్ ఇన్‌స్పెక్టర్లు, సబ్ ఇన్‌స్పెక్టర్లు, క్రైం బృందాలు, సాయుధ పోలీసులు ఉంటారని చెప్పారు. తొలి వలయంలో సాయుధ పోలీసులు అడుగడుగునా మోహరిస్తారని, సీసీ కెమెరాల నిఘా ఉంటుందని, సీనియర్ అధికారులంతా అక్కడే ఉంటారని పేర్కొన్నారు. భద్రతా ఏర్పాట్లను కట్టుదిట్టం చేశామని అనుక్షణం పర్యవేక్షణ కొనసాగుతుందని వివరించారు. సాధారణ ప్రజలు, చుట్టుపక్కల గ్రామాల ప్రజల రాకపోకలకు ఇబ్బందుల్లేకుండా ప్రత్యామ్నాయ మార్గాలను సూచిస్తూ సిబ్బందిని, గమనిక బోర్డులను ఏర్పాటు చేశామని, పార్కింగ్‌కు విస్తృత ఏర్పాట్లు చేశామని తెలిపారు.

ఆరంభ వేడుకలో ఆర్థిక, పారిశ్రామిక వేత్తల ప్రసంగం

తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ ఆరంభ వేడుకలో ప్రముఖ ఆర్థిక, పారిశ్రామిక వేత్తలు ప్రసంగించనున్నారు. నోబెల్ బహుమతి గ్రహీత, ప్రముఖ ఆర్థికవేత్త అభిజిత్ బెనర్జీ, వరల్డ్ ఎకనామిక్ సమ్మిట్ సీఈవో జెరెమీ జుర్గెన్స్, నోబెల్ శాంతి బహుమతి గ్రహీత కైలాష్ సత్యార్థి, ట్రంప్ మీడియా టెక్నాలజీ గ్రూప్ సీఈవో ఎరిక్ స్వైడర్, బయోకాన్ లిమిటెడ్ ఎగ్జిక్యూటివ్ చైర్‌పర్సన్ కిరణ్ మజుందార్ షా... సమ్మిట్ ఆరంభ వేడుకలో ప్రసంగించనున్నారు.

సమ్మిట్ ప్రాంగణంలో..

తెలంగాణ తల్లి విగ్రహం

ఏర్పాటు చేయాలని సీఎం రేవంత్ ఆదేశం

సదస్సు ఏర్పాట్లను పరిశీలించిన ముఖ్యమంత్రి

హైదరాబాద్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ పెట్టుబడుల ఆకర్షణ, తెలంగాణ విజన్ డాక్యుమెంట్ ఆవిష్కరణకు వేదిక కానున్న తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్‌కు పూర్తిస్థాయి ఏర్పాట్లు ఉండాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. సమ్మిట్ జరగనున్న ప్రాంగణాన్ని సీఎం శనివారం సాయంత్రం సందర్శించారు. తొలుత హెలికాప్టర్ నుంచి ఏరియల్ వ్యూ ద్వారా ప్రాంగణాన్ని పరిశీలించారు. అనంతరం ప్రాంగణానికి చేరుకున్న ముఖ్యమంత్రి ప్రతి హాల్‌ను పరిశీలించారు. మూసీ పునరుజ్జీవం, ఇతర కార్యక్రమాలకు సంబంధించి ప్రదర్శించనున్న డిజిటల్ స్క్రీనింగ్‌ను వీక్షించారు. సమ్మిట్ ప్రాంగణంలో తెలంగాణ తల్లి విగ్రహం ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. అంతర్జాతీయ కంపెనీలకు చెందిన ప్రతినిధులు, కేంద్ర మంత్రులు, పలు రాష్ట్రాల ముఖ్యమంత్రులు, మంత్రులు, వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు సమ్మిట్‌కు హాజరవుతున్నందున వారికి స్వాగత ఏర్పాట్లు, వసతి, ఇతర సదుపాయాల విషయంలో తగిన జాగ్రత్తలు వహించాలని సూచించారు. ప్రతి అంశంలో తీసుకున్న జాగ్రత్తలపై అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ప్రాంగణం మొత్తాన్ని గంటకుపైగా కలియ తిరిగారు.



సమ్మిట్ ప్రాంగణాన్ని పరిశీలిస్తున్న సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి పొంగులేటి, ఎమ్మెల్యే జయవీర్

అతిథులకు రోబోలతో స్వాగతం..

గ్లోబల్ సమ్మిట్‌లో సాంకేతికతకు ప్రభుత్వం పెద్దపీట వేసింది. సమ్మిట్ లోపలకు వెళ్లే ప్రధాన ద్వారం వద్ద స్కానర్లు ఏర్పాటు చేశారు. అతిథులతో పాటు అధికారులంతా తమ వద్ద ఉన్న క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి లోపలకు వెళ్లాల్సి ఉంటుంది. అతిథులు లోపలకు రాగానే రోబోలు స్వాగతం పలకనున్నాయి. సమ్మిట్ ఏర్పాట్లను పరిశీలించేందుకు వచ్చిన సీఎం రేవంత్‌రెడ్డి రోబోయే స్వాగతం పలికి ఆయనను తోడుకుని కొంత దూరం వెళ్లింది. ఇలా ప్రముఖులకు స్వాగతం పలికేందుకు అక్కడ మూడో రోబోలను సిద్ధం చేసినట్లు అధికారులు తెలిపారు.

ప్రపంచ దృష్టిని ఆకర్షించేలా సమ్మిట్

- » 44 దేశాల నుంచి ప్రతినిధుల రాక
- » 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థే లక్ష్యం
- » రేపు మధ్యాహ్నం సదస్సును ప్రారంభించనున్న గవర్నర్
- » రెండు రోజుల్లో వివిధ అంశాలపై 27 సెషన్లలో చర్చలు: భట్టి విక్రమార్క

హైదరాబాద్, డిసెంబరు 6 (ఆంధ్ర జ్యోతి): తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్-2025కు 44 దేశాల నుంచి 154 మంది ప్రతినిధులు వస్తున్నారని, ఒక్క అమెరికా నుంచే 46 మంది రానున్నారని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. ఫ్యూచర్ సిటీలో ప్రపంచ దేశాల దృష్టిని ఆకర్షించేలా గ్లోబల్ సమ్మిట్‌ను నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ప్రజాభవన్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇది పూర్తిగా ఆర్థికపరమైన సదస్సు అని స్పష్టం చేశారు. 2047 నాటికి తెలంగాణలో 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థను సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. తెలంగాణ భవిష్యత్తు ప్రణాళికలతో కూడిన దార్శనిక పత్రాన్ని (విజన్ డాక్యుమెంట్‌ను) నీతి ఆయోగ్, ఇండియన్ బిజినెస్ స్కూల్, ప్రభుత్వ అధికారుల సలహాలు, సూచనలతో రూపొందించామన్నారు. ప్రభుత్వ లక్ష్యాలు, వాటిని సాధించే మార్గాలను ఇందులో పొందుపరిచామని వెల్లడించారు. గ్లోబల్ సమ్మిట్‌ను సోమవారం మధ్యాహ్నం 1:30 గంటలకు గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ప్రారంభిస్తారని తెలిపారు. మంగళవారం సాయంత్రం వరకు 27 సెషన్లలో పలు అంశాలపై ఆర్థిక వేత్తలు, మేధావులతో చర్చలు ఉంటాయని చెప్పారు. తొలి రోజు అభిజిత్ బెనర్జీ, ట్రంప్ డైరెక్టర్ ఆఫ్ ట్రంప్ మీడియా అండ్ టెక్నాలజీ గ్రూప్ నుంచి ఎరిక్ స్వేడర్, నోబెల్ బహుమంతి గ్రహీత కైలాస్ సత్యార్థి, కిరణ్ మజుందార్, కర్ణాటక ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, వర్చువల్‌గా వరల్డ్ ఎకనమిక్ ఫోరం సీఈవో, టీవీఎస్ చైర్మన్ ప్రసంగిస్తారని తెలిపారు. ఆయా సెషన్లకు సంబంధించిన సమావేశాల్లో సంబంధిత మంత్రి, ముఖ్యకార్యదర్శి పాల్గొంటారని తెలిపారు. సమ్మిట్‌ను ఉద్దేశించి మధ్యాహ్నం 2:30 గంటలకు సీఎం రేవంత్‌రెడ్డి కీలక ప్రసంగం చేస్తారని తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో క్యాబినెట్ ఆమోదించిన దార్శనిక పత్రాన్ని మంగళవారం సాయంత్రం ఆవిష్కరిస్తామన్నారు. సమ్మిట్‌కు ప్రధాని మోదీతోపాటు పలు రాష్ట్రాల సీఎంలు, మాజీ సీఎం కేసీఆర్‌తోపాటు రాష్ట్రంలోని అన్ని రాజకీయ పార్టీలను ఆహ్వానించినట్లు తెలిపారు. పెట్టుబడుదారులు రాష్ట్రానికి రావాలనే సదుద్దేశంతో దీన్ని నిర్వహిస్తున్నామని, అందరూ సహకరించి సమ్మిట్‌ను విజయవంతం చేయాలని కోరారు. ఇండిగో విమానాల నిలిపివేత వల్ల ప్రముఖుల రాకపోకలకు ఇబ్బందులు ఎదురైతే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తామన్నారు. అత్యంత ప్రముఖులైన వారికి ప్రత్యేక విమానం అందుబాటులో ఉంచామన్నారు. మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ గ్లోబల్ సమ్మిట్.. తెలంగాణ భవిష్యత్తుకు దిశానిర్దేశం చేయనుందని తెలిపారు. సమ్మిట్‌లో ఎవరైనా పెట్టుబడులు పెట్టేందుకు ముందుకొస్తే.. వారితో ఒప్పందాలు చేసుకుని ఆహ్వానిస్తామన్నారు.



సమ్మిట్‌కు గవర్నర్‌ను ఆహ్వానిస్తున్న డిప్యూటీ సీఎం భట్టి, మంత్రి శ్రీధర్‌బాబు

గ్లోబల్ సమ్మిట్ షెడ్యూల్ ఇలా..

రెండు రోజుల పాటు జరగనున్న కార్యక్రమాలు, సదస్సులు..

రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 8, 9 తేదీల్లో భారత్ ఫ్యూచర్ సిటీలో నిర్వహించే 'తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్'కు పలువురు ప్రముఖులు హాజరు కానున్నారు. ఈ నెల 8న మధ్యాహ్నం ఒంటిగంటకు గ్లోబల్ సమ్మిట్ ప్రారంభం కానుంది. 8, 9 తేదీల్లో ఉదయం నుంచి సాయంత్రం వరకు వివిధ రకాల సదస్సులను నిర్వహిస్తారు. వీటిలో రాష్ట్ర మంత్రులు, ఐఏఎస్ అధికారులు, ఆయా రంగాల నిపుణులు పాల్గొని చర్చిస్తారు.

8వ తేదీ	3 నుంచి 4 గంటల వరకు పవరింగ్ తెలంగాణ-2047: ఎనర్జీ ట్రాన్సిషన్ అంశంపై సదస్సు గ్రీన్ మొబిలిటీ-2047: జీరో ఎమిషన్ వెహికల్స్.. టెక్ తెలంగాణ-2047: సెమీ కండక్టర్స్, ఫ్రాంటియర్ టెక్నాలజీస్.. తెలంగాణ యాజ్ ఎ గ్లోబల్ ఎడ్యుకేషన్ హబ్ అంశాలపై సదస్సులు.	4.10 నుంచి 4.50 గంటల వరకు కొరియా సెషన్	4.15 నుంచి 5.15 గంటల వరకు తెలంగాణ ఫ్లయింగ్ హై: ది రైజ్ ఆఫ్ ఏరో స్పేస్ అండ్ డిఫెన్స్.. తెలంగాణ రైజింగ్: యాక్సెసబుల్ అఫర్డబుల్, ఈక్విటబుల్ హెల్త్‌కేర్ ఫర్ ఆల్.. ట్యాలెంట్ మొబిలిటీ(టామ్‌కామ్) అంశాలపై సదస్సులు.	4.50 నుంచి 5.30 గంటల వరకు ఆస్ట్రేలియా సెషన్	5.30 నుంచి 6.30 గంటల వరకు తెలంగాణ పార్టనరింగ్ విత్ ఏషియన్ టైగర్స్.. గిగ్ ఎకానమీ: రైజ్ ఆఫ్ ఫ్లూయిడ్ కెరియర్స్.. ది రేర్ స్ట్రాటజీ: ఇన్‌క్రీజింగ్ ఫార్మర్స్ ఇన్‌కమ్ అంశాలపై సదస్సులు.	5.30 నుంచి 6.15 వరకు కెనడా సెషన్ .	6.15 నుంచి 7.15 గంటల వరకు ఫాస్టరింగ్ ఆంత్రప్రెన్యూర్‌షిప్ ఇన్ ఉమెన్ అంశంపై సదస్సు.

9వ తేదీ	ఉదయం 10 నుంచి 11 గంటల వరకు జీనోమ్ వ్యాలీ అండ్ బియాండ్: యాక్సిలరేటింగ్ ఇన్నోవేషన్ ఇన్ లైఫ్ సైన్సెస్.. తెలంగాణ ఒలింపిక్ గోల్డ్ క్వెస్ట్.. ఎక్స్‌పీరియన్స్ తెలంగాణ: హెరిటేజ్, కల్చర్, ఫ్యూచర్ రెడీ టూరిజం అంశాలపై సదస్సులు.	11 గంటలకు 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ దిశగా ఉత్పత్తి.	11.15 నుంచి 1.15 గంటల వరకు ఇన్వెస్టింగ్ ఇన్ ఇంక్లూజన్: ప్రాస్పెక్ట్స్ ఇన్ అఫర్డబుల్ హౌజింగ్ సెక్టార్.. మూసీ పునరుజ్జీవం, బ్లూ గ్రీన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్ హైదరాబాద్ అంశాలపై సదస్సులు.	11.45 నుంచి 11.15 వరకు కనెక్టెడ్ తెలంగాణ: ఇంటిగ్రేటెడ్ ట్రాన్స్‌పోర్ట్ అండ్ అర్బన్ రూరల్ కనెక్టివిటీ..	2.15 నుంచి 3.45 గంటల వరకు భారత్ ఫ్యూచర్ సిటీ యాజ్ ఎ మ్యాగ్నెట్ ఫర్ 3 ట్రిలియన్ డాలర్స్ తెలంగాణ.. క్యాపిటల్ గ్రోత్, ఇన్వెస్ట్‌మెంట్ పాత్‌వేస్, ఫైనాన్షియల్ హబ్ స్ట్రాటజీ.. ఇన్నోవేటివ్ పీపీపీస్: హర్నెసింగ్ ప్రైవేట్ క్యాపిటల్ టువార్డ్స్ పబ్లిక్ గూడ్స్ అంశాలపై సదస్సులు.	4 నుంచి 5.30 వరకు స్టార్టప్స్ ఫర్ 2047.. ఇంక్లూజివ్ ప్రాస్పారిటీ: ఎక్స్‌పాండింగ్ ఆపర్చునిటీస్ ఫర్ ఎవ్రీ వన్.. గ్లోబల్ కేపబిలిటీ సెంటర్స్ ఇన్ తెలంగాణ అంశాలపై సదస్సులు. సాయంత్రం 6 గంటలకు ముగింపు కార్యక్రమం.



తెలంగాణకు సాంకేతిక హంగులు

» చార్మినార్, సచివాలయం వద్ద 3డీ ప్రాజెక్షన్ మ్యాపింగ్

హైదరాబాద్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్‌కు దేశ విదేశాల నుంచి వచ్చే ప్రతినిధులను ఆకట్టుకునేలా హైదరాబాద్‌ను అందంగా ముస్తాబు చేసేందుకు ప్రభుత్వం భారీ ఏర్పాట్లు చేసింది. ప్రముఖ ప్రదేశాలు, చెరువులు, రహదారులు, సమ్మిట్ వేదిక ఇలా అన్ని చోట్లా హైటెక్ ప్రాజెక్టర్ల ద్వారా డిజిటల్ రూపంలో ప్రదర్శనలతో పండగ వాతావరణం సృష్టించనున్నారు. చార్మినార్‌తో పాటు కాచిగూడ రైల్వే స్టేషన్ భవనంపై ప్రత్యేక లైటింగ్ ప్రాజెక్షన్ ఏర్పాటు చేసి తెలంగాణ సాంస్కృతిక వైభవాన్ని చూపించనున్నారు. సచివాలయం వద్ద త్రీడీ ప్రాజెక్షన్ మ్యాపింగ్‌తో రాష్ట్ర అభివృద్ధి తీరును, భవిష్యత్ ప్రణాళిక లక్ష్యాలను చూపించేలా ఏర్పాట్లు చేశారు. దుర్గం చెరువులో ప్రత్యేక ఆకర్షణగా గ్లోబ్ ఆకారంలో తేలియాడే ప్రాజెక్షన్ ఏర్పాటు చేస్తున్నారు. హుస్సేన్‌సాగర్‌లో వాటర్ థీమ్‌లో భాగంగా వాటర్ ప్రాజెక్షన్ ద్వారా ప్రభుత్వం చేపట్టిన భారత్ ఫ్యూచర్ సిటీ, మహిళా సాధికారత, యువత, రైతు ప్రధాన కార్యక్రమాలు మూడు ట్రిలియన్ ఎకానమీ లక్ష్యం లాంటి ప్రధాన అంశాలను ప్రదర్శించనున్నారు. శంషాబాద్ విమానాశ్రయం నుంచి సమ్మిట్ వరకు వెళ్లే అప్రోచ్ రోడ్‌పై భారీ డిజిటల్ ఎల్ఈడీ స్క్రీన్లు ఏర్పాటు చేస్తున్నారు. సమ్మిట్ వేదిక వద్ద లోపలికి వెళ్లే మార్గం మొత్తం ఆధునిక త్రీడీ ఎనీమార్ఫిక్ డిజైన్లు రూపొందిస్తున్నారు. 50 మీటర్ల పొడవుతో డిజిటల్ టన్నెల్‌ను డిస్ ప్లే రూపంలో ఏర్పాటు చేసి మూసీ ప్రక్షాళన ప్రాజెక్టు పురోగతి విజువల్స్ ద్వారా చూపించనున్నారు.

గుత్తాధిపత్యమే దెబ్బతీసిందా?

2014, ప్రస్తుత విమానయాన వాటాలను పోలుస్తూ విమర్శలు

న్యూఢిల్లీ, డిసెంబరు 6: దేశవ్యాప్తంగా లక్షలాది మంది విమాన ప్రయాణికులు అల్లాడుతుండటానికి గుత్తాధిపత్యమే కారణమైందా? మూడింట రెండొంతుల వాటా కేవలం ఒక్క సంస్థ చేతిలోనే ఉండటం ఇబ్బందికరంగా మారిందా? ప్రైవేటు విమానయానంలో పోటీ తగ్గి సమస్యకు దారితీసిందా.. దేశంలో పౌర విమానయానం అతలాకుతలం కావడానికి ఇవే కారణమనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. 2014లో దేశ పౌర విమానయాన రంగంలో నాలుగు సంస్థలు ప్రధాన వాటాను పంచుకోగా, మరో మూడు సంస్థలూ భాగస్వామ్యం అయ్యాయి. ఇప్పుడు పరిస్థితి మారిపోయింది. కొన్నేళ్ల క్రితం జెట్ ఎయిర్‌వేస్ సంస్థ తీవ్ర ఇబ్బందుల్లో పడి విమాన సర్వీసులను నిలిపివేసింది. విమానయానంలో దాని వాటా 21.7 శాతమే కావడంతో తీవ్ర ఇబ్బందులేమీ ఎదురుకాలేదు. ఇతర సంస్థల విమానాలతో సర్దుబాటు అయింది. ప్రయాణికులు అవస్థలు పడటం, విమాన చార్జీలు చుక్కలను తాకడం వంటివేమీ పెద్దగా జరగలేదు. ఇప్పుడు ఒక్క ఇండిగో చేతిలోనే 63% వాటా ఉండటంతో.. ఆ సంస్థ విమానాలు రద్దవడంతో విమానయానం గందరగోళంలో పడింది. తక్కువగా విమానాలున్న ఇతర సంస్థలు ఒక్కసారిగా చార్జీలను పదింతలు పెంచాయి. మరిన్ని సంస్థలు రంగంలో ఉంటే ఇలాంటి పరిస్థితి తలెత్తేది కాదని ప్రయాణికుల నుంచి ఆగ్రహం వ్యక్తమవుతోంది.

2014 డిసెంబరులో..	
సంస్థ	వాటా(%)
ఇండిగో	31.8
జెట్ ఎయిర్‌వేస్	21.7
ఎయిరిండియా	18.4
స్పైస్‌జెట్	17.4
గో ఎయిర్	9.2
ఎయిర్‌కోస్టా	0.9
ఎయిర్‌ఆసియా	0.5
2025 నవంబరులో..	
ఇండిగో	63.0
ఎయిరిండియా	19.9
విస్తారా	5.7
ఆకాశ ఎయిర్	4.6
స్పైస్‌జెట్	3.2
ఇతరులు	3.6

లండన్, కువైత్‌ల నుంచి శంషాబాద్‌కు వచ్చే విమానాలకు బాంబు బెదిరింపులు

శంషాబాద్ రూరల్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు వస్తున్న విమానాలకు బాంబు బెదిరింపులు కొనసాగుతున్నాయి. నాలుగు రోజులుగా వరుసగా ఎయిర్‌పోర్ట్‌కు బాంబు బెదిరింపు మెయిల్స్ వస్తున్నాయి. శనివారం రెండు బెదిరింపు మెయిల్స్ వచ్చాయి. లండన్‌లోని హీత్రూ నుంచి శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు వస్తున్న బీఏ 277 విమానాన్ని పేల్చేస్తామంటూ ఉదయం జీఎంఆర్ కస్టమర్ ఐడీకి మెయిల్ రాగా సిబ్బంది భద్రతాధికారులకు సమాచారమిచ్చారు. విమానం శంషాబాద్ ఎయిర్‌పోర్టులో ఉదయం 5.30గంటలకు ల్యాండైన తర్వాత తనిఖీలు నిర్వహించారు. విమానంలో ఎలాంటి బాంబులేదని తేల్చారు. విమానం తిరిగి లండన్‌కు వెళ్లింది. అలాగే కువైత్ నుంచి శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌కు వస్తున్న కేయూ 373 విమానాన్ని బాంబులతో పేల్చేస్తామంటూ గుర్తు తెలియని వ్యక్తుల నుంచి శనివారం తెల్లవారుజామున జీఎంఆర్ కస్టమర్ ఐడీకి మెయిల్ వచ్చింది.

విమాన టికెట్ ధరలకు కళ్లెం!

(మొదటి పేజీ తరువాయి)

తెలిపింది. ఈ మేరకు కేంద్ర పౌర విమానయాన శాఖ శనివారం ఆదేశాలు జారీ చేసింది. విమానయాన సంస్థలు అంతరాయాల సమయంలో అసాధారణంగా చార్జీలు పెంచేయడం అవకాశవాదమని, దీనిని సీరియస్‌గా తీసుకుంటున్నామని పేర్కొంది. చార్జీలు సాధారణ స్థితికి వచ్చే వరకు లేదా తిరిగి సమీక్షించి నిర్ణయించే వరకు ఈ నియంత్రణలు అమల్లో ఉంటాయని.. అన్ని విమానయాన సంస్థలు తప్పనిసరిగా ఈ పరిమితులను పాటించాలని స్పష్టం చేసింది. ఆదేశాలను ఉల్లంఘించే సంస్థలపై వెంటనే కఠిన చర్యలు చేపడతామని హెచ్చరించింది. అయితే ఈ ధరలు బిజినెస్ క్లాస్, ఉడాన్ సీట్లకు వర్తించవు. ఇండిగో విమానాల రద్దుతో ఎయిరిండియా, స్పైస్‌జెట్ సంస్థల చార్జీలు ఒక్కసారిగా పెరిగిపోయాయి. అప్పటికప్పుడు కొనుగోలు చేసే టికెట్ల ధరలను చూస్తే.. సాధారణ సమయంలో హైదరాబాద్-ముంబై (630 కి.మీ) విమాన చార్జీ రూ.20వేల వరకు ఉంటే.. ఇప్పుడు రూ.70వేలకుపైగా వసూలు చేస్తున్నారు. హైదరాబాద్-ఢిల్లీ (1,300 కి.మీ) ప్రయాణానికి రూ.90 వేలకుపైన తీసుకుంటున్నారు.

మరో 800కుపైగా విమాన సర్వీసులు రద్దు

ఇండిగో శనివారం దేశవ్యాప్తంగా ప్రధాన విమానాశ్రయాల నుంచి నడిచే 800కుపైగా సర్వీసులను రద్దు చేసింది. అందులో బెంగళూరు నుంచి 124 సర్వీసులు, ముంబై నుంచి 109, ఢిల్లీ నుంచి 106, హైదరాబాద్ నుంచి 144 సర్వీసులు ఉన్నట్టు విమానయాన వర్గాలు తెలిపాయి. ఇండిగో రోజూ సుమారు 2,300 సర్వీసులు నిర్వహిస్తుంది. శుక్రవారం కేవలం 700 సర్వీసులు మాత్రమే నిర్వహించి, 1,600కిపైగా సర్వీసులను రద్దు చేసింది. పైలట్లకు ఫ్లైట్‌డ్యూటీ, విశ్రాంతికి సంబంధించిన రెండో దశ నిబంధనల (ఎఫ్‌డీటీఎల్) అమలు నుంచి ప్రభుత్వం ఇండిగోకు తాత్కాలికంగా వెసులుబాటు ఇవ్వడంతో.. శనివారం విమానాల రద్దు సంఖ్య తగ్గింది. అయితే, ఈ వెసులుబాటుపై ఎయిర్‌లైన్ పైలట్స్ అసోసియేషన్(అల్పా) తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. ఇది లక్షలాది మంది ప్రయాణికులకు ప్రమాదకరంగా మారుతుందని పేర్కొంది. ఈ క్రమంలో 'ఎఫ్‌డీటీఎల్' నిబంధనల నుంచి ఇచ్చిన ఉపశమనం పరిమితం, తాత్కాలికమేనని.. ఇది ఇండిగో ఏ320 విమానాలకు మాత్రమే వర్తిస్తుందని పౌర విమానయాన శాఖ వర్గాలు తెలిపాయి. మరోవైపు, ఇండిగో విమానాల రద్దుతో దేశవ్యాప్తంగా విమానాశ్రయాల్లో అలజడి నెలకొంది. వేలాది మంది ప్రయాణికులతోపాటు ఎక్కడ చూసినా లగేజీ బ్యాగులే కనిపిస్తున్నాయి. పలుచోట్ల ప్రయాణికులు ఇండిగో సిబ్బందిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేయడం కనిపించింది. ఇక, బెంగళూరు నుంచి హైదరాబాద్‌కు వచ్చే ప్రైవేటు ట్రావెల్స్ బస్సులు కూడా అడ్డగోలుగా చార్జీలు పెంచాయి. రూ.1,500 లోపు ఉండే చార్జీని.. రూ.5వేల దాక వసూలు చేస్తున్నారు.


ముంబై ఎయిర్‌పోర్టులో సిబ్బందితో ప్రయాణికుల వాగ్వాదం


వారాణసీ ఎయిర్‌పోర్టులో చిక్కుకుపోయిన ప్రయాణికులు

ఎకానమీ క్లాస్‌లో దేశీయ ప్రయాణాలకు ప్రభుత్వం నిర్దేశించిన గరిష్ఠ విమాన చార్జీలు

- 500 కి.మీ. దూరం వరకు రూ.7,500
- 500-1000 కి.మీ. మధ్య రూ.12 వేలు
- 1000-1,500 కి.మీ. మధ్య రూ.15 వేలు
- 1,500 కి.మీ. దూరం దాటితే రూ.18 వేలు

ఇండిగో సీఈవోకు షోకాజ్ నోటీసులు

విమానాలు రద్దయిన ప్రయాణికులకు టికెట్ చార్జీల రీఫండ్‌ను ఆదివారం రాత్రి 8 గంటలకల్లా పూర్తి చేయాలని ఇండిగోను పౌర విమానయాన శాఖ ఆదేశించింది. ఒకవేళ సదరు ప్రయాణికులు రీషెడ్యూల్ చేసుకుంటే ఎలాంటి చార్జీలు విధించవద్దని స్పష్టం చేసింది. దీనికి సంబంధించి ప్రత్యేకంగా సహాయక కేంద్రాలను ఏర్పాటు చేయాలని సూచించింది. ప్రయాణికుల లగేజీని 48గంటల్లో వారికి అప్పగించాలని ఆదేశించింది. కాగా, విమానయాన సంక్షోభం నేపథ్యంలో ఇండిగో సీఈవో పీటర్ ఎల్బర్‌కు డీజీసీఏ షోకాజ్ నోటీసులు జారీ చేసింది. ప్రణాళిక మేరకు విమాన సర్వీసుల నిర్వహణలో ఇండిగో పూర్తిస్థాయిలో విఫలమైందని, దీనిపై 24 గంటల్లోగా సమాధానం ఇవ్వాలని ఆదేశించింది.

శంషాబాద్ నుంచి ఏపీ, బెంగళూరుకు బస్సులు

శంషాబాద్ రూరల్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఇండిగో సంక్షోభంతో చిక్కుకుపోయిన వారిని స్వస్థలాలకు తరలించేందుకు శంషాబాద్ విమానాశ్రయం నిర్వహణ సంస్థ జీఎంఆర్ చర్యలు చేపట్టింది. తెలంగాణ ఆర్టీసీ సహకారంతో విమానాశ్రయంలోని పిల్లర్ నంబర్ 8 వద్ద నుంచి ప్రత్యేక స్లీపర్ బస్సులను నడుపుతున్నట్టు తెలిపింది. ఒక్కొక్కరికి చెన్నైకు రూ.2,110, బెంగళూరుకు రూ.1,670, రాజమండ్రి, వైజాగ్, కాకినాడ వంటి ప్రాంతాలకు రూ.1,800 చార్జీ చేస్తున్నట్లు ప్రకటించింది. ఇండిగో విమానాల రద్దు నేపథ్యంలో దేశవ్యాప్తంగా రైళ్లకు రద్దీ పెరిగింది. ఈ క్రమంలో ప్రధాన ప్రాంతాల మధ్య ప్రత్యేక రైళ్లను ఏర్పాటు చేశారు. ఇప్పటికే నడుస్తున్న రైళ్లకు అదనపు బోగీలను జత చేస్తున్నారు. మొత్తంగా 84 ప్రత్యేక రైళ్లను ఏర్పాటు చేశామని, 37 రైళ్లకు 116 అదనపు కోచ్‌లను జత చేశామని రైల్వేశాఖ శనివారం ప్రకటించింది.

ఇండిగో సంక్షోభం.. బాధ్యులెవరో తేలుస్తాం

» 'ఆంధ్రజ్యోతి'తో పౌర విమానయాన శాఖ మంత్రి కింజారపు రామ్మోహన్‌నాయుడు



న్యూఢిల్లీ, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా భారీ స్థాయిలో ఇండిగో విమానాల రద్దుకు బాధ్యులెవరో తేలుస్తామని పౌర విమానయాన శాఖ మంత్రి కింజారపు రామ్మోహన్‌నాయుడు తెలిపారు. డీజీసీఏ కొత్త నిబంధనలు వచ్చి నెల రోజులు దాటిపోయింది. మరి ఇన్ని రోజులు లేని సమస్య ఇప్పుడు ఒక్కసారిగా ఎందుకు వచ్చింది? అంత భారీ స్థాయిలో విమానాలు ఎందుకు రద్దయ్యాయి? దీనికి కారణమేంటి? ఎవరు బాధ్యులు?' అనేది తేల్చేందుకు పకడ్బందీగా దర్యాప్తు చేస్తున్నామని చెప్పారు. దీనిపై వారం రోజుల్లో నివేదిక ఇవ్వాలని డీజీసీఏను ఆదేశించామని, ఆ నివేదిక అందాక బాధ్యులపై కఠిన చర్యలు చేపడతామని తెలిపారు. ఇండిగో సంక్షోభం నేపథ్యంలో రామ్మోహన్‌నాయుడు శనివారం ఢిల్లీలో 'ఆంధ్రజ్యోతి'తో ప్రత్యేకంగా మాట్లాడారు. సోమవారానికల్లా ఇండిగో విమాన సర్వీసులు యథాతథంగా నడిచేలా స్పష్టమైన ఆదేశాలు ఇచ్చామని తెలిపారు. విమానాశ్రయాల్లో చిక్కుకున్న ప్రయాణికులను గమ్యస్థానాలకు చేర్చేలా ఏర్పాట్లు చేశామని వెల్లడించారు. ఇండిగో సంక్షోభాన్ని సొమ్ము చేసుకునేందుకు ఇతర విమానయాన సంస్థలు చార్జీలు పెంచకుండా నియంత్రణలు విధించామని చెప్పారు. మన దేశంలో కేవలం రెండు విమానయాన సంస్థల ఆధిపత్యమే ఉందని, టికెట్ల ధరల తగ్గింపులో పోటీతత్వం లేదని రామ్మోహన్‌నాయుడు పేర్కొన్నారు. ఈ ఆధిపత్యాన్ని సరిచేసేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపడుతోందని.. మరిన్ని ప్రైవేటు సంస్థలు ఈ రంగంలోకి రావాలని ఆహ్వానిస్తున్నామని వివరించారు. అంతిమంగా ప్రయాణికులకు లబ్ధి దక్కేలా చూడటమే తమ కర్తవ్యమని చెప్పారు. తాను మంత్రిగా బాధ్యతలు చేపట్టాక కొత్తగా మూడు ఎయిర్‌లైన్స్ సంస్థలకు అనుమతి ఇచ్చామన్నారు.

ఢిల్లీ పోలీసుల నోటీసుపై న్యాయపోరాటం: డీకే

బెంగళూరు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): నేషనల్ హెరాల్డ్ వివాదానికి సంబంధించి ఢిల్లీ పోలీసులు నోటీసులు ఇవ్వడంతో ఆందోళన చెందానని కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ తెలిపారు. శనివారం బెంగళూరులో మీడియాతో మాట్లాడుతూ.. ఈ అంశంపై న్యాయపోరాటం చేస్తానన్నారు. నోటీసులతో షాక్ అయ్యానని.. తనతోపాటు తన తమ్ముడు మాజీ ఎంపీ డీకే సురేశ్‌కు గతంలోనే ఈడీ సమన్లు జారీ చేసిందని చెప్పారు. పార్టీ క్లిష్ట సమయంలో ఉన్నపుడు తమ లాంటి కాంగ్రెస్ నేతలు ట్రస్టుల ద్వారా సాయం చేశామన్నారు. తమ పార్టీకే కాకుండా ఇతరులకూ నిధులు ఇస్తామని.. ఈ వివాదంలో పోలీసు కేసులు, నోటీసులు అవసరం లేదని అభిప్రాయపడ్డారు. ఢిల్లీ పోలీసుల నోటీసును వేధింపులుగా భావిస్తున్నానన్నారు.

నెహ్రూపై పథకం ప్రకారమే దుష్ప్రచారం: సోనియా

న్యూఢిల్లీ, డిసెంబరు 6 : భారత తొలి ప్రధాని నెహ్రూ అందించిన సేవలను విశ్లేషించడం, విమర్శించడంలో తప్పులేదుగానీ, ఆయన చెప్పినవాటిని, రాసిన వాటిని కావాలని వక్రీకరించడం బీజేపీకి తగదని కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ చైర్‌పర్సన్ సోనియాగాంధీ విమర్శించారు. నెహ్రూను దూషించడాన్నే కేంద్రంలోని అధికార పార్టీ ప్రధాన లక్ష్యంగా చేసుకున్నదని ఆరోపించారు. నెహ్రూ ఘనతలను తుడిచిపెట్టడమే కాకుండా, ఈ దేశ నిర్మాణం కోసం ఆయన వేసిన సామాజిక, రాజకీయ, ఆర్థిక పునాదులను ధ్వంసం చేయడమే బీజేపీ లక్ష్యమని సోనియా మండిపడ్డారు. ఢిల్లీలోని జవహర్ భవన్‌లో నూతనంగా ఏర్పాటుచేసిన నెహ్రూ సెంటర్‌ను ఆమె ప్రారంభించారు.

పట్నాలో 10.11 ఎకరాల్లో టీటీడీ ఆలయం

తిరుమల, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): బిహార్ రాజధాని పట్నాలో శ్రీవారి ఆలయం నిర్మించేందుకు 10.11 ఎకరాల స్థలాన్ని టీటీడీకి ఆ రాష్ట్ర ప్రభుత్వం కేటాయించింది. మోకామా ఖాస్ ప్రాంతంలో ఈ స్థలాన్ని కేటాయించినట్టు టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడుకు బిహార్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ప్రత్యయ అమృత్ లేఖ రాశారు. 99 సంవత్సరాల పాటు రూ.1 టోకెన్ లీజ్ రెంట్‌తో ఈ స్థలాన్ని కేటాయించారు. దీనిపై టీటీడీతో ఎంవోయూ చేసుకునేందుకు బిహార్ రాష్ట్ర పర్యాటకశాఖ అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్‌ను ఆ రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. స్థల కేటాయింపుపై ఏపీ సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ కూడా అభినందించినట్టు బీఆర్ నాయుడు తెలిపారు.

బెంగాల్‌లో 'బాబ్రీ మసీదు' నిర్మాణం ప్రారంభం

కోల్‌కతా, డిసెంబరు 6: పశ్చిమబెంగాల్‌లో బాబ్రీ మసీదును పోలి ఉన్న మసీదు నిర్మాణ పనులు ప్రారంభం కావడం ఉద్రిక్తతకు దారితీసింది. తృణమూల్ కాంగ్రెస్ నుంచి సస్పెండ్ అయిన ఎమ్మెల్యే హుమయూన్ కబీర్ ఆధ్వర్యంలో ముర్షిదాబాద్ జిల్లా రేజినగర్‌లో ముస్లిం మతపెద్దలు రిబ్బన్ కత్తిరించి ఈ నిర్మాణ పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా అవాంఛనీయ ఘటనలు జరగకుండా పెద్ద ఎత్తున పోలీసులను, కేంద్ర బలగాలను మోహరించారు. రూ.300 కోట్లతో ఈ మసీదు నిర్మాణం కానుందని, ఇదే ప్రాంగణంలో మెడికల్ కాలేజీ, ఆసుపత్రి, యూనివర్సిటీ, హెలిప్యాడ్ నిర్మిస్తామని కబీర్ తెలిపారు. పశ్చిమబెంగాల్‌లో వచ్చే ఏడాది అసెంబ్లీ ఎన్నికలు జరగాల్సి ఉన్న తరుణంలో తాజా పరిణామాలతో రాజకీయాలు వేడెక్కాయి. 1992లో అయోధ్యలో బాబ్రీ మసీదు విధ్వంసమైన డిసెంబరు ఆరును దృష్టిలో పెట్టుకుని బెంగాల్ రేజినగర్‌లో ఈ నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టడం ప్రకంపనలు సృష్టించింది. ఇటు అయోధ్యలో భద్రతను కట్టుదిట్టం చేశారు.

'పినాకా' రాకెట్ వ్యవస్థ బలోపేతం

» ఎంకే-4 వేరియంట్ అభివృద్ధిని ప్రారంభించిన డీఆర్‌డీవో

» 300 కి.మీ దూరంలోని లక్ష్యాలను ఛేదించే సామర్థ్యం



న్యూఢిల్లీ, డిసెంబరు 6: అత్యాధునిక రాకెట్ లాంచర్ వ్యవస్థ 'పినాకా'ను మరింత బలోపేతం చేసే దిశగా కేంద్రం చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా డీఆర్‌డీవో పినాకా ఎంకే-4 గైడెడ్ రాకెట్ వేరియంట్ అభివృద్ధిని ప్రారంభించింది. 300 కిలోమీటర్ల దూరంలోని లక్ష్యాలను ఛేదించే సామర్థ్యంతో దీన్ని రూపొందిస్తున్నారు. ఇది 250 కిలోల వార్‌హెడ్‌లను మోసుకెళ్లగలదు. ఈ వ్యవస్థలో డీఆర్‌డీవోకు చెందిన రిసెర్చ్ సెంటర్ ఇమ్రాత్ (ఆర్‌సీఐ) అభివృద్ధి చేసిన అత్యాధునిక గైడెన్స్, నావిగేషన్, కంట్రోల్ సిస్టమ్‌ను ఉపయోగించారు. పినాకా ఎంకే-4ను గైడెడ్ రాకెట్‌గా వర్గీకరించినప్పటికీ.. అత్యాధునిక క్రూయిజ్ క్షిపణులతో పోల్చదగిన కచ్చితత్వంతో టార్గెట్‌పై విరుచుకుపడుతుందని, వాటి ఉత్పత్తి వ్యయంలో 25% మాత్రమే ఉంటుందని డీఆర్‌డీవో అధికారి ఒకరు వెల్లడించారు. సాధారణంగా సాంప్రదాయ గైడెడ్ రాకెట్లు లక్ష్య ఛేదనలో ప్రోగ్రామ్‌డ్ గైడెన్స్ వ్యవస్థపై ఆధారపడి పనిచేస్తాయి. పినాకా ఎంకే-4ను అత్యాధునిక ఫీచర్లతో తయారు చేస్తున్నారని, అనూహ్యమైన విన్యాసాలు చేసేలా ఈ రాకెట్‌ను రూపొందిస్తున్నామని డీఆర్‌డీవో వర్గాలు పేర్కొన్నాయి.

భారత్‌కు ఇజ్రాయెల్ లైట్ మెషిన్ గన్స్!

వచ్చే ఏడాది ప్రారంభంలో లైట్ మెషిన్ గన్స్ (ఎల్‌ఎంజీ) మొదటి బ్యాచ్‌ను భారత్‌కు సరఫరా చేయనున్నట్లు ఇజ్రాయెల్‌కు చెందిన రక్షణ పరికరాల సంస్థ ఇజ్రాయెల్ వెపన్ ఇండస్ట్రీస్ (ఐడబ్ల్యూఐ) వెల్లడించింది. దీంతో పాటుగా దాదాపు 1.70 లక్షల కొత్త తరం కార్బైన్ల సరఫరాకు సంబంధించిన ఒప్పందం తుది దశలో ఉందని సీఈవో షుకి స్క్వార్జ్ తెలిపారు.

కొన ఊపిరితో ఇండి కూటమి!

» అంతర్గత కుమ్ములాటలతో బీజేపీని ఎదుర్కోవడంలో విఫలం: ఒమర్ అబ్దుల్లా



న్యూఢిల్లీ, డిసెంబరు 6: ప్రతిపక్ష ఇండి కూటమి ప్రస్తుతం కొనఊపిరితో కొట్టుమిట్టాడుతోందని జమ్మూకశ్మీర్ సీఎం, నేషనల్ కాన్ఫరెన్స్(ఎన్‌సీ) పార్టీ నాయకుడు ఒమర్ అబ్దుల్లా వ్యాఖ్యానించారు. అంతర్గత కుమ్ములాటలు, బీజేపీకి చెందిన 24 గంటల ఎన్నికల యంత్రాంగాన్ని ఎదుర్కోవడంలో వైఫల్యం వల్ల ఇండి కూటమిని ఐసీయూలోకి తీసుకెళ్లాల్సిన ముప్పు ఏర్పడిందన్నారు. ఇండి కూటమిలో ఎన్‌సీ కూడా భాగస్వామిగా ఉంది. తమ కూటమి సంస్థాగత, వ్యూహాత్మక వైఫల్యాలను శనివారం ఢిల్లీలో ఒక ఆంగ్ల పత్రిక నిర్వహించిన నాయకత్వ సదస్సులో ఆయన వివరించారు. ప్రత్యేకించి బిహార్ ఎన్నికల తర్వాత పరిస్థితి గురించి ఆయన మాట్లాడుతూ 'మేం లైఫ్ సపోర్టు మీద ఉన్నాం. ప్రతిసారీ ఎవరో ఒకరు మాకు షాక్ ఇస్తూనే ఉన్నారు. మేం మళ్లీ లేస్తున్నాం. దురదృష్టవశాత్తూ బిహార్‌లాంటి ఫలితాలు వస్తుండటంతో మేం మళ్లీ పడిపోతున్నాం. అప్పుడు ఎవరైనా మమ్మల్ని ఐసీయూలోకి తీసుకెళ్లాల్సి ఉంటుంది' అన్నారు. బిహార్ సీఎం నితీశ్ కుమార్ తిరిగి బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే కూటమిలోకి వెళ్లడానికి ఇండి కూటమే కారణమని ఆయన నిందించారు. అధికార పార్టీలో ఉన్నంత క్రమశిక్షణ వైఖరి నిర్మాణాత్మకంగా ప్రతిపక్ష కూటమిలో లేదని చెప్పారు. అయితే, బీజేపీని బలంగా ఎదుర్కోడానికి తమ ముందున్న ఏకైక మార్గం కూటమిలోని అతిపెద్ద భాగస్వామి అయిన కాంగ్రెస్ చుట్టూ చేరడమేనని చెప్పారు. కూటమిలో దేశవ్యాప్తంగా ఉన్న ఏకైక పార్టీ అదేనన్నారు. ఈవీఎంల వల్లే ఎన్నికల్లో గెలుస్తున్నారనే వాదనను తానెప్పుడూ సమర్థించలేదని, అయితే.. ఓటర్ల జాబితా, నియోజకవర్గాల పునర్విభజనతో ఎన్నికలను తారుమారు చేయొచ్చన్నారు.

సైన్యానికి త్రీడీ బంకర్లు!

» రూపొందించిన హైదరాబాద్ ఐఐటీ స్టార్టప్



న్యూఢిల్లీ, డిసెంబరు 6: భారత సైన్యం, హైదరాబాద్ ఐఐటీ కలిసి సరిహద్దుల్లో త్రీడీ కాంక్రీట్ ప్రింటింగ్ టెక్నాలజీతో మిలిటరీ బంకర్లను నిర్మించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టాయి. బంకర్ నిర్మించదలచుకున్న సైట్ వద్దకే నేరుగా రోబోటిక్ ప్రింటర్‌ను తీసుకెళ్లారు. అక్కడి భౌగోళిక పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని అప్పటికప్పుడు అక్కడ నిర్మించాల్సిన బంకర్లను డిజైన్ చేస్తారు. వెంటనే త్రీడీ కాంక్రీట్ ప్రింటింగ్ టెక్నాలజీతో బంకర్‌ను సైట్‌లోనే బ్లాక్‌లుగా ప్రింట్ చేస్తారు. అక్కడే క్యూరింగ్ చేసి, బ్లాక్‌లను జతచేసి బంకర్‌ను నిర్మిస్తారు. 14 గంటల్లో బ్లాక్‌ల ప్రింటింగ్ పూర్తవుతుంది. 5 రోజుల్లో వాటిని క్యూరింగ్ చేసి, బంకర్ నిర్మాణం కూడా పూర్తి చేస్తారు. లద్దాఖ్‌లోని లేహ్ ప్రాంతంలో సముద్రమట్టానికి 11 వేల అడుగుల ఎత్తున త్రీడీ బంకర్‌ను కాంక్రీట్ ప్రింటింగ్ చేసి, బ్లాక్‌లను అసెంబుల్ చేశారు. ఇది ప్రపంచంలోనే అత్యంత ఎత్తులో జరిగిన త్రీడీ ప్రింటింగ్ బంకర్ నిర్మాణం. ఐఐటీలో భాగంగా ఉన్న స్టార్టప్ సింప్లిఫోర్జ్ క్రియేషన్స్, మిలిటరీలో భాగంగా ఉన్న త్రిశక్తి కోర్ కలిసి తొలి త్రీడీ ప్రింటింగ్ బంకర్‌ను నిర్మించాయి.

స్థానిక మెటీరియల్‌తోనే

త్రీడీ ప్రింటింగ్‌కు ఉద్దేశించిన యంత్రాన్ని వాహనం మీద అమర్చారు. దాంతో దాన్ని నేరుగా నిర్మాణ స్థలానికే తీసుకెళ్లి అక్కడే బ్లాక్‌లుగా త్రీడీ ప్రింటింగ్ చేయవచ్చు. ప్రతీ బ్లాక్‌ను కంప్యూటర్‌లో నిర్దేశించిన డిజైన్ ప్రకారం యంత్రంలోని రోబోటిక్ హస్తం పొరలు పొరలుగా కాంక్రీట్ మెటీరియల్‌తో పోస్తుంది. బ్లాక్‌లు జత చేస్తే గోడలు, పైకప్పు పూర్తవుతుంది. కొండల్లో కూడా నిర్విఘ్నంగా చేయగలగడం ఈ పోర్టబుల్ యంత్రం గొప్పదనం. అత్యంత ఎత్తులో, ఆక్సిజన్ తక్కువగా, జీరో కన్నా తక్కువ డిగ్రీల వాతావరణంలోనూ నిర్విఘ్నంగా ఈ యంత్రంతో పని చేయించవచ్చు. గతంలో బంకర్ల నిర్మాణానికి వారాలు పట్టేది. అవి, అంత సౌకర్యంగా కూడా ఉండేవి కాదు. ప్రీకాస్ట్ బ్లాక్‌లను కిందనుంచి కొండ మీదకు తీసుకెళ్లడం సవాలుతో కూడుకున్న వ్యవహారం. త్రీడీ ప్రింటింగ్ అవడం వల్ల బంకర్ మొత్తం ఒకే మందంతో దృఢంగా ఉంటోంది. స్థానికంగా దొరికే సిమెంట్ కంకరనే వాడతారు. దాంతో ఖర్చు బాగా తగ్గిపోతోంది. త్రీడీ బంకర్ల దృఢత్వాన్ని ఇప్పటికే పేలుడు పదార్థాల ద్వారా పరీక్షించారు. తక్కువ కాలంలో ఎక్కువ బంకర్లను నిర్మించే అవకాశం ఉండటం వల్ల భారత సైనికులకు మునుపటి కన్నా మెరుగైన రక్షణ లభిస్తుంది. ఈ టెక్నాలజీతో విపత్తుల సమయంలో బాధితులకు వేగంగా ఇళ్లు నిర్మించి ఇవ్వడం వీలు కుదురుతుంది.

నన్ను చంపండి!

» మరణావస్థలో శిశు చీమల సంకేతం

» గమనించి వాటికి విషమిచ్చే పెద్ద చీమలు

» పుట్ట మొత్తం ఇన్ఫెక్షన్ల బారిన పడొద్దనే



న్యూయార్క్, డిసెంబరు 6: శిశు దశలో ఉన్న చీమలు (వీటిని ప్యూపా అంటారు) ఏదైనా ఆరోగ్య సమస్యతో మరణావస్థలో ఉన్నప్పుడు తమను చంపమని (కిల్ మీ) పెద్ద చీమలకు ఒక సంకేతం పంపుతాయని, తద్వారా చీమల పుట్ట ఇన్ఫెక్షన్ల బారిన పడకుండా కాపాడుతాయని శాస్త్రవేత్తలు గుర్తించారు. చీమలు ఆహారం కోసం పుట్ట బయటకు వచ్చి మళ్లీ లోనకు వెళ్లే క్రమంలో వాటితోపాటు అనేకమైన సూక్ష్మక్రిములు పుట్టలోకి ప్రవేశిస్తుంటాయి. వీటి బారిన పడి ఏదైనా పెద్ద చీమ తీవ్ర అనారోగ్యం పాలై.. ఇక జీవించే అవకాశం లేదనకున్నప్పుడు.. పుట్ట బయటకు వచ్చి ప్రాణాలు వదులుతుంది. తద్వారా ఇతర చీమలకు ఇన్ఫెక్షన్లు సోకకుండా జాగ్రత్త తీసుకుంటుంది. కానీ, పెరిగే దశలోనే ఉన్న శిశు చీమలు.. ఆహారం సేకరించే సామర్థ్యం వచ్చే వరకూ పుట్టలోనే ఉంటాయి. అవి ఎన్నడైనా ఇన్ఫెక్షన్లకు గురై చనిపోయే స్థితిలో ఉన్నప్పుడు.. తమ శరీరం నుంచి ఒక ఘాటైన వాసన వెదజల్లుతున్నాయని ఆస్ట్రియా శాస్త్రవేత్తలు పరిశోధనల్లో గుర్తించారు. ఈ ఘాటైన వాసన ఒక సంకేతమని, అది రాగానే.. పుట్టలోని పెద్ద చీమలు అనారోగ్యంపాలైన శిశు చీమ ఉన్న గూడును తెంపివేసి, దాని శరీరంలోకి విషాన్ని పంపుతాయని వెల్లడైంది. ఈ విషంతో శిశు చీమ మరణించటమేగాక, దానికి సోకిన సూక్ష్మక్రిములు కూడా నాశనమై పుట్ట మొత్తం ఇన్ఫెక్షన్ బారిన పడకుండా రక్షణ లభిస్తుందని పరిశోధకులు వెల్లడించారు. చీమల్లో కనిపిస్తున్న ఈ ప్రక్రియ.. వాటిలోని సమష్టితత్వాన్ని వెల్లడిస్తుందని, తమ కాలనీని, ఉమ్మడి జన్యువులను కాపాడుకోవటం కోసం అవి వ్యక్తికన్నా సమష్టికి ప్రాధాన్యతనిస్తాయని మరోసారి రుజువైందని శాస్త్రవేత్తలు పేర్కొన్నారు.

*Printed and Published by **Koganti Venkata Seshagiri Rao** on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Andhrajyothi Building, Madikonda Village, Khazipet Mandal, Hanamkonda (Dist), Pin. 506142, Editor: **N.Rahul Kumar.** Ph. No. (0870) 2100480/84, RNI No:APTEL/2003/9741, **Managing Director : Vemuri Radha Krishna** Founder: K.L.N.Prasad.*